తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM విజయవాడ fb.com/vaartha
PUBLISHED FROM VIJAYAWADA, HYDERABAD, VISAKHAPATNAM, RAJAHMUNDRY, KADAPA, NIZAMABAD, ONGOLE, WARANGAL, TIRUPATHI, ANANTAPUR, KURNOOL, KARIMNAGAR, MAHABUBNAGAR, KHAMMAM, NELLORE, NALGONDA, GUNTUR, TADEPALLIGUDEM, SRIKAKULAM
31-1-2018 బుధవారం సంపుటి :23 సంచిక : 360 పేజీలు :12 వెల : 5.00

నవయుగ చేతికి పోలవరం



కేంద్రమంత్రి గడ్కరీ కీలక నిర్ణయం

అమరావతి, జనవరి30 ప్రభాతవార్త: పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి ఒక్కొక్కటిగా అడ్డంకులు తొలగిపోతున్నాయి. స్పిల్‌వే కాంట్రాక్టు పనులను నవయుగకు అప్పగించేందుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. స్పిల్‌వే కాంక్రీట్, స్పిల్‌వే ఛానల్ పనులను ఇక నవయుగ సంస్థే చేపట్టనుంది. పాత ధరలకే ఈ పనులను చేయనుంది. మంగళవారం ఢిల్లీలో ఏపీ అధికారులతో జరిగిన సమావేశంలో కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ పోలవరం పనులకు సమీక్షించారు. పోలవరం పనులకు గాను ఏపీ ప్రభుత్వం టెండర్లను పిలవగా పాత ధరలకే పనులు చేస్తామని నవయుగ ముందుకు రాగా, ప్రభుత్వం టెండర్లను నిలిపివేసింది. ఇవాళ ఏపీ అధికారులతో సమావేశమైన గడ్కరీ ఈ మేరకు ఆమోదం తెలిపారు. పోలవరం ప్రాజెక్టుపై ఢిల్లీలోని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ వద్ద కీలక భేటీ ముగిసింది. ప్రాజెక్టులో స్పిల్‌వే కాంక్రీట్, స్పిల్ ఛానల్ పనులను కొత్త గుత్తేదారుకు అప్పగించే అంశంపై ఈ సమావేశంలో ఓ స్పష్టత వచ్చింది. దీనిపై రెండు గంటలపాటు కేంద్ర, రాష్ట్ర జలవనరులశాఖ, జలసంఘం అధికారులతో భేటీ అనంతరం మంత్రి గుత్తేదార్లతో కాసేపు సమావేశయ్యారు.

నవయుగ, ట్రాన్స్ ట్రాయ్ గుత్తేదారు సంస్థల్లో వేటికి ఈ పనులు అప్పగించే అంశంపై చర్చించారు. పోలవరం ప్రధాన గుత్తేదారుగా ఉన్న ట్రాన్స్‌ట్రాయ్ సంస్థ ఇప్పటివరకు అనుకున్న విధంగా నిర్ధిష్ట సమ యంలో పనులు పూర్తిచేయని నేపథ్యంలో ఈ పనులను నవయుగకు అప్పగించాలని నిర్ణయించారు. అలాగే ఎట్టి పరిస్థితుల్లోనూ 2019నాటికి పాత ధరలతోనే పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసేందుకు నవయుగతో అంగీకారం కుదిరింది. నవయుగ కంపెనీకి స్పిల్‌వే, ఛానల్ పనుల్ని పూర్తి చేసేందుకు నిర్ణీత గడువును ఇవ్వడంతో పాటు అధికారిక కార్యక్రమాలు పూర్తి చేసుకోనేందుకు అవగాహన ఒప్పందం కుదరనుంది. దీని ప్రకారం స్పిల్‌వే, స్పిల్‌ఛానల్ పనుల్ని నవయుగ సంస్థ వారం రోజుల తర్వాత చేపట్టే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.

సుప్రీం, హైకోర్టు జడ్జీల జీతాలు పెంపు

2లో

రహదార్లకు కొత్తరూపు

బెంజ్‌సర్కిల్ ఫ్లైఓవర్‌నిర్మాణం పొడిగింపు
విజయవాడ బెంజ్‌సర్కిల్ నుంచి నిడమానూరు వరకు
అమరావతి బాహ్యవలయ రహదారికి రూ.17,762కోట్ల అంచనా
డ్రోన్లు ఉపయోగించి రహదారుల నిర్మాణం
కనకదుర్గ ఫ్లైఓవర్ నిర్మాణం ఆలస్యంపై సిఎం చంద్రబాబు ఆగ్రహం
13 పిల్లర్ వరకు మార్చినాటికి పూర్తి చేయాలని ఆదేశం



మంగళవారం సచివాలయంలో జాతీయ రహదారులపై సమీక్ష నిర్వహిస్తున్న సిఎం చంద్రబాబు

అమరావతి, జనవరి30 ప్రభాతవార్త: విజయవాడ బెంజ్ సర్కిల్ ఫ్లైఓవర్‌ను నిడమానూరు వరకు పొడిగించే అంశాన్ని పరిశీలించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ పీవీ ఎక్స్‌ప్రెస్ ఫ్లైఓవర్ తరహాలో విజయవాడ నగరంలో కీలకమైన ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాల్సి ఉందని మంగళవారంరాత్రి సచివాలయంలో జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన చెప్పారు. చెన్నై-కోల్‌కత్తా ఐదవ నెంబర్ జాతీయ రహదారి మార్గంలోని 1025 కిలోమీటర్ల మేర జరుగుతున్న రహదారి అభివృద్ధి పనుల పురోగతిపై జాతీయ రహదారులశాఖ ఉన్నతాధికారులు ఈ సమావేశంలో ముఖ్యమంత్రికి వివరాలు అందించారు. విజయవాడ బెంజ్ సర్కిల్ ఫ్లైఓవర్ నిర్మాణం నవంబర్ నాటికి పూర్తవుతుందన్నారు. విజయవాడ నగర అవసరాల దృష్ట్యా ప్రస్తుత ప్రతిపాదన మార్గాన్ని మరికొంత దూరం పొడిగించాలని ముఖ్యమంత్రి వారికి చెప్పారు. రాజమహేంద్రవరం-విజయవాడ మధ్య దెబ్బతిన్న రహదారికి మరమ్మతులు వెంటనే చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. రహదారి సక్రమంగా లేక పోవడంతో ఈ మార్గంలో ప్రయాణం చేసే వారంతా అనేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఏప్రిల్ నాటికి మరమ్మతు పనులు పూర్తిచేస్తామని జాతీయ రహదారులశాఖ అధికారులు చెప్పగా, పనులలోపురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ముఖ్యమంత్రి సీఎంఒ అధికారులను ఆదేశించారు. విజయవాడ-గుండుగొలను, గుండుగొలను-రాజమహేంద్రవరం రెండుదశలలో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. నెల్లూరు-తడ మార్గాన్ని 6వరుసలుగా మార్చాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ మార్గంలో కృష్ణపట్నం ఓడరేవు, శ్రీసిటీ, స్పెషల్ ఎంప్లాయిమెంట్ జోన్ ఇతర పెరిగిన అవసరాల దృష్ట్యా 6వరుసల విస్తరణ అవసరమన్నారు.

విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారి పనులు 38శాతం పూర్తి: విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారి మార్గం 38 శాతం పూర్తయ్యిందని, నిర్ధేశించిన సమయానికి పూర్తి చేస్తామని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. నందిగామ-కంచికచర్ల బైపాస్ రహదారి పనులను ఫిబ్రవరిలో ప్రారంభిస్తామని చెప్పారు. తిరుపతి-చిత్తూరు రహదారి పనులను ఫిబ్రవరిలో ప్రారంభిస్తామని చెప్పారు. తిరుపతి-చిత్తూరు రహదారి పనులను ఫిబ్రవరిలో ప్రారంభిస్తామన్నారు. అలాగే ఇచ్ఛాపురం నుంచి నరసన్నపేట నుంచి 6వరుసలు చేయాలని ముఖ్యమంత్రి సూచించగా, ఆ మార్గంలో రాకపోకలు పెద్దగా లేకపోవడం వల్ల ప్రస్తుతం దాన్ని 4వరుసలకే పరిమితం చేశామని జాతీయ రహదారులశాఖ అధికారులు వివరించారు. వైకుంఠమాల రహదారిని నాయుడుపేట, చిత్తూరు, మదనపల్లి తదితర ప్రాంతాలకు అనుసంధానం అయ్యేలా చూడాలన్నారు. దీనికి సంబంధించిన సమగ్ర ప్రతిపాదనలను వచ్చే సమావేశంలోగా రూపొందించి తీసుకురావాలని ఆదేశించారు. కృష్ణపట్నం నుంచి సత్యవేడు మీదుగా తిరుపతికి ఒంపులు లేని రహదారిని నిర్మించే అంశాన్ని పరిశీలించాలని ముఖ్యమంత్రి సూచించారు. విశాఖపట్నం రాయపూర్ రహదారి నిర్మాణానికి సంబంధించి అక్టోబర్ నాటికి డీపీఆర్ సిద్ధం చేస్తామని అధికారులు చెప్పారు. ఈ మార్గంలో సాలూరు నుంచి విజయనగరం వరకు 70కిలోమీటర్లు మాత్రమే ఏపీ భాగమని, మిగిలినదంతా ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర పరిధిలోకి వస్తుందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించగా, ఆ రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, సంబంధిత మంత్రతో మాట్లాడి సాధ్యమైనంత వేగంగా ఈ ప్రాజెక్టును పూర్తి చేసేలా చూడాలని ముఖ్యమంత్రి సూచించారు. అమరావతి-అనంతపురం ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణానికి సంబంధించి పనులలో వేగం పుంజుకోవాలని ముఖ్యమంత్రి చెప్పారు. జూన్ నాటికి భూ సేకరణ ప్రక్రియ పూర్తి చేయాలని అన్నారు. తన కలల ప్రాజెక్టును పూర్తి చేయడంలో ఇప్పటికే జాప్యం జరగడం విచారకరమన్నారు. సవరించిన అలైన్‌మెంట్ ప్రకారం 189కిలోమీటర్ల మేర అమరావతి బాహ్యవలయ రహదారిని రూ.17,762కోట్ల అంచనాతో నిర్మాణాన్ని చేపడుతున్నామని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. దీనికోసం 3,404హెక్టార్ల మేర భూమి అవసరం ఉంటుందని చెప్పగా,సాధ్యమైన మేరకు భూ సమీకరణ

≫2



నేడే సంపూర్ణ చంద్రగ్రహణం

హైదరాబాద్, జనవరి 30, ప్రభాతవార్త : నేడు పాక్షిక చంద్రగ్రహణం ఏర్పడనుంది. ఈ గ్రహణం ప్రారంభ కాలం బుధవారం సాయంత్రం 5:18 ని.లు కాగా, మూడు గంటల పాటు అంటే రాత్రి 8:41 వరకు కొనసాగుతుంది. సాయంత్రం 6:22 సంపూర్ణ స్థాయిలోకి రాత్రి 8:41కి గ్రహణ అంత్యకాలం వరకు మొత్తం 3 గంటల 23 ని.లు దీని ప్రభావం కనిపించనుంది. ఈ గ్రహణ కారణంగా ధనస్సు, మేషం, కర్కాటకం, సింహ రాశుల వారికి అథమ ఫలం, వృశ్చిక, మకర, మీన, మిధున రాశుల వారికి మధ్యమ ఫలం, కన్య, తుల, కుంభ, వృషభ రాశుల వారికి శుభ ఫలితాలు ఉంటాయని పండితులు పేర్కొంటున్నారు. అలాగే, గ్రహణంవేళ ఆహార పానీయాలు ముందుగానే తీసుకోవాలనీ, గ్రహణానికి గంటన్నర ముందు వరకు పాలు, పండ్ల రసాలు తీసుకోవచ్చుని చెబుతున్నారు. గ్రహణ సమయంలో నిలువ ఉన్న

≫2

స్టార్టప్ కంపెనీలా పనిచేస్తున్నాం

- అమెరికా పర్యటనలో పలు కంపెనీల సిఇఓలతో మంత్రి లోకేష్ భేటీ
- ఎపి అభివృద్ధికి సహకారమందిస్తామని ప్రముఖ సంస్థల హామీ



విఎం వేర్ సిఓఓ రఘు రఘురాంతో మంత్రి నారా లోకేష్ భేటీ అయిన దృశ్యం

అమరావతి (విజయవాడ సిటీ), జనవరి 30, ప్రభాతవార్త: రాష్ట్ర విభజన తరువాత స్టార్టప్ కంపెనీలా పనిచేస్తున్నాం, స్టార్టప్ కంపెనీలకు కనీసం పనిచేయడానికి ఒక షెడ్డు అయినా వుంటుంది. కానీ పరిపాలన చేయడానికి ఆమాత్రం షెడ్డు కూడా లేని పరిస్థితిలో పాలన ప్రారంభించాం. కానీ 2022 కల్లా దేశంలో అభివృద్ధి చెందిన మొదటి మూడు రాష్ట్రాల్లో ఒకటిగా నిలపుతాం అని మంత్రి నారా లోకేష్ అన్నారు. రాష్ట్రంలో పెట్టుబడుల సాధన ధ్యేయంగా రాష్ట్ర ఐటి మంత్రి నారా లోకేష్ మెరికా పర్యటనలో భాగంగా శాన్‌ఫ్రాన్సిస్కోలో పలు సంస్థల ప్రతినిధులతో భేటీ అయ్యి రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టి వారి సంస్థలను స్థాపించాలని సూచించారు. మంగళవారం డేటా సెంటర్, క్లౌడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, నెట్‌వర్కింగ్, స్టోరేజ్, క్లౌడ్ మేనేజ్‌మెంట్, డిజిటల్ వర్క్ షాప్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ సేవలందిస్తున్న ప్రముఖ సంస్థ విఎం వేర్ సిఓఓ రఘు రఘురాంతో మంత్రి నారా లోకేష్ భేటీ అయ్యారు. ఇప్పటికే బెంగుళూరు, పూనేలో కార్యకలాపాలు నిర్వహిస్తున్నామని త్వరలో ఏపికి తమ బృందాలను పంపిస్తామని ఈ సందర్భంగా రఘురాం మంత్రికి హామీ ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్‌లో స్టార్ ఆఫ్ కంపెనీలకు ప్రోత్సాహమందించేందుకు ఫాల్కన్ ఎక్స్‌ను ఎన్‌ఆర్ఐలు ఏర్పాటు చేశారు. శాన్‌ఫ్రాన్సిస్కోలో ప్రముఖ సంస్థలైన ఫాల్కన్ ఎక్స్ ఇంక్యూబేటర్‌ను నారా లోకేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి వీడియో కాన్ఫరెన్సు ద్వారా ఎన్‌ఆర్ఐలతో మాట్లాడుతూ ఏపిలో ప్రతి వ్యక్తి ఆంధ్రాప్రెన్యూర్‌గా మార్చడానికి ఫాల్కన్ ఎక్స్ ఇంక్యూబేటర్ దోహదపడాలని మంత్రి ఆకాంక్షించారు. ఏపిని ఇన్నోవేషన్ వ్యాలీగా తీర్చిదిద్దటానికి జిటెన్ గ్రూప్ ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రజల సౌకర్యార్థం ఫైబర్ నెట్‌ను ఏర్పాటు చేశామని వివరించారు. ఏపిలో స్టార్టప్ కంపెనీలకు ప్రోత్సాహం ఇచ్చి సిలికాన్ వ్యాలీలో కంపెనీలు ఏర్పాటు చేసేలా ఫాల్కన్ ఎక్స్ పూర్తి సహకారం అందిస్తుందని ఎన్‌ఆర్ఐలు హామీ ఇచ్చారు. అనంతరం మంత్రి స్పార్క్ ల్యాబ్స్ ఫౌండర్ అండ్ మేనేజింగ్ పార్టనర్ బెర్నార్డ్ మూన్‌తో భేటీ అయ్యారు. ఆయన ఏపికి రావడానికి తాము సిద్దంగా వున్నామని తెలిపారు. అనంతరం మంత్రి సైబర్ సెక్యూరిటీ, క్లౌడ్ సెక్యూరిటీ, డేటా బేస్ సెక్యూరిటీ సర్వీసెస్ లో పేరెన్నికగన్న కలర్ టోకెన్స్ సంస్థ వైస్ ప్రెసిడెంట్ రాజేష్ కాజాంచితో భేటీ అయ్యారు. ఆయన రాష్ట్ర ప్రభుత్వానికి పూర్తి సహకారం అందిస్తామన్నారు. గ్లోబల్ ఫౌండరీస్ సిఇఓ సంజయ్ జాహ్‌తో జరిగిన భేటీలో మంత్రి మాట్లాడుతూ ఏపిని చిప్ డిజైనర్ హబ్‌గా రూపొందించడమే లక్ష్యమన్నారు. సెమీకండక్టర్ పార్కు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా సంజయ్ జాహ్ మాట్లాడుతూ ఏపికి చిప్ డిజైనింగ్ లో శిక్షణ అందిస్తామని, రాష్ట్రంలో సెమికండక్టర్స్ పార్క్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. మంత్రి ఆర్మ్ సిఇఓ సైమెన్‌తో భేటీ అయ్యారు. హెల్త్‌కేర్, అగ్రిటెక్ ఐఓటి వినియోగంపై ఏపి ప్రభుత్వానికి సహకారం అందించాలని సూచించారు. విద్యుత్ సరఫరాకు మెరుగైన సహకారమందించాలన్నారు. ఈ సందర్భంగా ఇండియాలో త్వరలో తమ కార్యకలాపాలు విస్తరిస్తామని, ఏపిలో కంపెనీ ఏర్పాటుకుచర్యలు తీసుకుంటామని ఆర్మ్ సిఇఓ సైమెన్ నారా లోకేష్‌కు హామీ ఇచ్చారు. ఏపిలో స్మార్ట్ మీటర్లతో పైలట్ ప్రాజెక్టు ను త్వరలో ప్రారంభిస్తామన్నారు. తదనంతరం

≫2



పొత్తు యధాతథం

రాష్ట్రాభివృద్ధే బిజెపి, టిడిపి లక్ష్యం
ప్రభాతవార్తతో విశాఖ ఎంపి కంభంపాటి హరిబాబు

ఉత్తరాంధ్ర ప్రతినిధి, ప్రభాతవార్త: తెలుగుదేశం భారతీయ జనతా పార్టీల మధ్య పొత్తుకు ఎలాంటి సమస్యా లేదని రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు, విశాఖ లోక్‌సభ సభ్యుడు కంభంపాటి హరిబాబు స్పష్టం చేశారు. రెండు పార్టీల మధ్య ఉన్నమైత్రిని ఎవ్వరూ శంకించాల్సిన అవసరం లేదని ఆయన అన్నారు. కేంద్రంలో తెలుగుదేశం పార్టీకి

≫2

కబ్జాకోరల్లో రాజధాని!

రూ.3వందల కోట్ల విలువైన భూమి కబ్జాకు యత్నం
విజయవాడలో భారీ భూకుంభకోణం
వరుసగా వెలుగుచూస్తున్న కబ్జాలు
రోడ్డెక్కిన విద్యార్థులు



మంగళవారం విజయవాడలో ఆందోళన చేస్తున్న విద్యార్థులు

విజయవాడ సిటీ, జనవరి 29, ప్రభాతవార్త: రాజధానిగా మారిన విజయవాడలో భూకబ్జాల పర్వం కలకలం రేపుతోంది. రెండు రోజుల క్రితం అధికార పార్టీకి చెందిన నగర ఎమ్మెల్యే బోండా ఉమా మహేశ్వరరావుపై తమ భూమిని కబ్జా చేశారంటూ అభియోగం మరువక ముందే మరో కబ్జా బాగోతం బయటపడింది. స్వాతంత్ర్య సమరయోధులకు ప్రభుత్వం ఇచ్చిన భూమిని కబ్జా చేశారంటూ సదరు సమరయోధుని వారసులు విజయవాడ సిపి గౌతం సవాంగ్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సంఘటనపై రాష్ట్ర వ్యాప్తంగా పెను దుమారం రేగింది. రాష్ట్ర ముఖ్యమంత్రి స్వయంగా రంగంలోకి దిగి పోలీసు అధికారులను పూర్తిస్థాయి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఈ ఘటన జరిగి రెండు రోజులైంది. ఈ లోపే విజయవాడలోని ప్రభుత్వ కాలేజ్ అయిన ఎస్ఆర్ఆర్ అండ్ సివిఆర్ కాలేజ్‌కు చెందిన భూమిని ఎమ్మెల్యే బోండా ఉమా మహేశ్వరరావు అనుచరులు కబ్జాకు పాల్పడుతున్నారంటూ కళాశాలకు చెందిన ప్రస్తుత విద్యార్థులు, పూర్వ విద్యార్దులు ఆరోపిస్తూ ఆందోళనకు దిగారు. గులాబి తోట ప్రాంతంలో వున్న రు.3వందల కోట్ల 7.6 ఎకరాల స్థలాన్ని సివి రెడ్డి కళాశాల కోసం దానంగా 40 ఏళ్ల క్రితం ఇచ్చారు. ఆయన తదనంతరం సదరు స్థలాన్ని కళాశాల గడ్డి కోసుకోవడానికి నరసింహారావు అనే వ్యక్తికి లీజుకిచ్చారు. ఈ స్థలాన్ని ప్రస్తుతం నరసింహారావు వారసులు కొన్నాళ్ల క్రితం ప్లాట్లుగా విడగొట్టి అక్రమంగా అమ్ముకున్నారు. దీనికోసం దొంగ పత్రాలను సృష్టించి ఆ ప్లాట్లను పలువురికి అమ్మేశారంటూ కళాశాల పూర్వ, ప్రస్తుత విద్యార్థులు ఆరోపిస్తూ ఆందోళనకు దిగారు. అక్కడ ఇప్పటికే పలు భవనాలు వెలిశాయి. ఈ ఉదంతంపై ఇప్పటికే కోర్టులో కేసు నడుస్తుందని, ఈ సమయంలో ఇలా ప్లాట్లుగా అమ్మేయడం, భవనాలు నిర్మించడం అక్రమమంటూ విద్యార్థులు ఆరోపిస్తున్నారు. నూతనంగా ఒక భవనానికి పునాదులు నిర్మిస్తుండగా వారంతా ఏకమై ఆ పునాదులను,గోడను కూల్చేయడంతో ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. విద్యార్థులంతా అక్కడే టెంట్లు వేసుకుని, సదరు భూమిని ప్రొక్లెయిన్లతో చదును

≫2



టిడిపి సమన్వయ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న సిఎం చంద్రబాబు

జన్మభూమి కమిటీల వల్ల పార్టీకి చెడ్డపేరు వస్తే
సహించేదిలేదు
పార్లమెంట్ స్థానాలపై దృష్టి పెట్టాలి

దళిత తేజం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి: పార్టీ నేతలకు చంద్రబాబు సూచన

అమరావతి, జనవరి30 ప్రభాతవార్త: జన్మభూమి కమిటీల వల్ల పార్టీకి చెడ్డపేరు వస్తే సహించబోమని తెలుగుదేశం పార్టీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్పష్టం చేశారు. మంగళవారం వెలగపూడి సచివాలయంలో టీడీపీ సమన్వయ కమిటీ సమావేశం వాడీవేడీగా జరిగింది. జన్మభూమి కమిటీలోని సభ్యులు తప్పుచేస్తే వెంటనే వారిని తప్పించాలని ఆదేశించారు. ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమం నిర్వహించిన విధంగానే దళిత తేజం కార్యక్రమం కూడా విజయవంతం చేయాలని పార్టీ నేతలకు సీఎం దిశానిర్ధేశం చేశారు. దళితతేజం కార్యక్రమం ఎలా జరుగుతుందో నిత్యం తాను పర్యవేక్షణ చేస్తాన్నారు. దళిత తేజం విజయవంతం ద్వారా 2019ఎన్నికలు ఏకపక్షం కావాలని చంద్రబాబు స్పష్టం చేశారు.ప్రభుత్వంపై సానుకూలత ఉందని, దాన్ని సద్వినియోగం చేసుకుని పార్టీ పట్ల సానుకూలతగా దానిని మార్చుకోవాలని సూచించారు. ప్రతి ఊరు పార్టీకి కంచుకోట కావాలని, గ్రామం అభివృద్ధి చెందాలని, పార్టీ అభివృద్ధి చెందాలని సీఎం తెలిపారు.నెలకు నాలుగైదు రోజులు జిల్లా ఇంఛార్జి మంత్రులు పార్లమెంట్ స్థానంపై దృష్టిసారించి పార్టీని బలోపేతం చేసేందుకు కృషిచేయాలని సూ చించారు. క్రమశిక్షణ భంగం కలిగిస్తే సహిం చనని చంద్రబాబు తేల్చిచెప్పారు. మీరు మారాలి,మీ మార్పును ప్రజలు గుర్తించాలని చంద్రబాబు పేర్కొన్నారు. ప్రభుత్వంపై

≫2

పొత్తు యథాతథం

≫ చెందిన వారు రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీకి చెందిన వారు మంత్రులుగా కొనసాగినంత కాలం రెండు పార్టీలకు మధ్య ఉన్న మైత్రిపై అనుమానాలు పెట్టుకోవాల్సిన అవసరం లేదని హరిబాబు స్పష్టం చేశారు. మంగళవారం హరిబాబు ప్రభాతవార్త ప్రతినిధితో ప్రత్యేకంగా మట్లాడుతూ రెండు పార్టీల మధ్య పొత్తు కొనసాగింపే విషయంపై అధిష్టానవర్గాలు నిర్ణయం తీసుకుంటాయని వ్యక్తులు కాదన్నారు. కొంత మంది వ్యక్తులు చేస్తున్న ప్రకటనల వల్ల పొత్తుకు ఎలాంటి ముప్పు ఉండబోదన్నారు. పొత్తుల గురించి పార్టీల అభిప్రాయం ప్రధానమన్నారు. వ్యక్తుల అభిప్రాయం కాదన్నారు. ఇది తెలుగు దేశం, బిజెపిలకు సమానంగా వర్తిస్తుందన్నారు. తెలుగు రాష్ట్రాల విభజన తరువాత ఆవిర్భవించిన ఏపీ రాష్ట్రాభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పని చేస్తున్నాయన్నారు. ప్రస్తుత పార్లమెంటు సమావేశాల్లో రాష్ట్రాభివృద్ధికి అవసరమైన నిధులు సాధించడానికి కృషి చేస్తున్నామని కేంద్రం రాష్ట్రానికి అవసరమైన నిధులను మంజూరు చేయడానికిసానుకూలంగా ఉందని వెల్లడించారు. ఇప్పటికే విభజన హామీల్లో మెజార్టీ హామీలను కేంద్రం నెరవేర్చిందన్నారు. విశాఖకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయడానికి అవసరమైన నిధులు విడుదలయ్యేలా చూడాలని కేంద్రాన్ని కోరతామన్నారు. విశాఖలో 150 కోట్ల రూపాయలతో రైల్వే వీల్ రిపేర్ వర్క్‌షాపు, డీజిల్ లోకోమోటివ్ వర్క్‌షాపు విస్తరణ కార్యక్రమాలకు ఇప్పటే శంకుస్థాపన జరిగిందని ఈ బడ్జెట్‌లో దీనికి అవసరమైన నిధులను కేటాయించే అవకాశాలు ఉన్నాయన్నారు. దీంతోపాటు విశాఖలో 80 కోట్ల రూపాయల ఖర్చుతో నిర్మించనున్న సమీర్‌కు ఇప్పటికే 50 కోట్ల రూపాయలు విడుదలయ్యాయని మిగిలిన నిధులను ఈ బడ్జెట్‌లో కేటాయించే అవకాశాలున్నాయన్నారు. రాష్ట్రానికి సంబంధించి కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించడానికి తెలుగుదేశంతో కలిసి పని చేస్తున్నామని హరిబాబు వివరించారు.

నేడే సంపూర్ణ చంద్రగ్రహణం

≫ పదార్థాలు విష ప్రభావం కలిగి ఉంటాయని, అందువల్ల వాటిని భుజించరాదని అవి తింటే వెంటనే వాటి స్వభావాన్ని మానవకోయనా నిదానంగా శరీరానికి హాని కలిగిస్తాయని, అందుకే వాటిని తినకూడదని సూచిస్తున్నారు. గ్రహణం పూర్తయిన తరువాత ఇంట్లో దేవుడిని శుద్ది చేసుకోవాలని, విగ్రహాలు, యంత్రాలు ఉన్న వారు పంచామృతంతో సంప్రోక్షణ చేసుకోవాలని, శక్తికొద్ది గ్రహదోష నివారణ జపాలు, పూజలు చేయించుకున్న తరువాత ఆవుకు తోటకూర, బెల్లం తినిపించి ప్రదక్షిణం చేయాలని పేర్కొంటున్నారు. కాగా, చంద్రగ్రహణం సందర్భంగా తెలంగాణ,ఏపీ రాష్ట్రాల్లోని ప్రముఖ దేవాలయాలను మూసి ఉంచనున్నారు. ఏపీ లోని తిరుమల శ్రీవారి ఆలయంతో పాటు విజయవాడ కనకదుర్గ, సింహాచలం అప్పన్న దేవాలయాలు, తెలంగాణలోని ప్రసిద్ధ క్షేత్రాలైన యాదాద్రి, భద్రాద్రి వంటి ఆలయాలను గ్రహణం సమయంలో మూసివేసి విడిచిన అనంతరం శాస్త్రోక్తంగా సంప్రోక్షణ చేసి తెరవనున్నారు. ఇప్పటి వరకు దర్శనాలను నిలిపివేస్తామని ఆయా ఆలయాల అధికారులు తెలిపారు.

వారం - వర్జ్యం

31-1-2018 బుధవారం
హేవళంబి నామ సంవత్సరం ఉత్తరాయణం
మాఘమాసం శుక్లపక్షం
పౌర్ణమి సా. 6.56
పుష్యమి సా 5.36
రా. మ. 12.00-1.30
యమ. ఉ. 7.30-9.00
వ. తె 5.04-6.30



మంగళవారం మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా న్యూఢిల్లీలో రాజ్‌ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న రాష్ట్రపతి కోవింద్, ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, ప్రధాని మోడీ, యుపిఏ ఛైర్‌పర్సన్ సోనియా గాంధీ తదితరులు

సుప్రీం, హైకోర్టు న్యాయమూర్తుల జీతాలు పెంపు

న్యూఢిల్లీ,జనవరి 30: సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తుల జీతాలు రెండురెట్లు పెరుగుతున్నాయి. పార్లమెంటు ఆమోదించిన ఈ జీతాలపెంపు బిల్లుకు రాష్ట్రపతి రామ్‌నాథ్‌కోవింద్ ఆమోదముద్రవేసారు. ఇకపై సుప్రీం ప్రధానన్యాయమూర్తి నెలసరి జీతం రూ.2.80 లక్షలుగా ఉంటుంది. ప్రస్తుతం లక్ష రూపాయలనుంచి వేతనాలు భారీగా పెరుగుతున్నాయి. అలాగే సుప్రీంకోర్టు, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులజీతాలు ప్రస్తుతం ఉన్నరూ.90వేలనుంచి రూ.2.50 లక్షలరూపాయలకు పెరుగుతాయి. హైకోర్టు న్యాయమూర్తుల జీతాలు ప్రస్తుతం ఉన్నరూ.80వేలనుంచి రూ.2.25 లక్షల రూపాయలకు పెరుగుతాయని ఈ బిల్లు స్పష్టంచేస్తోంది. అఖిలభారత సర్వీసు అధికారులకు ఏడో వేతనసంఘం చేసిన సిఫారసులకు అనుగుణంగానే ఈ వేతనాలుపెంచినట్లు న్యాయనిపుణులు చెపుతున్నారు. 2016 జనవరి ఒకటవ తేదీనుంచి ఈపెంపు అమలులోనికి వస్తుంది. సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తుల జీతాలు,సేవా నిబంధనలు సవరణ చట్టం 2018 ప్రకారం సవరించిన ఇంటి అద్దెభత్యాలు కూడా 2017 జులైఒకటవ తేదీనుంచి అమలులోనికి వస్తుంది.ఇతర ప్రత్యేకభత్యం 2017 సెప్టెంబరు 22వ తేదీనుంచి అమలుకువస్తుంది. 2016లో సుప్రీం ప్రధాన న్యాయమూర్తి టిఎస్ ఠాకూర్‌ప్రభుత్వానికి లేఖరాస్తు సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తుల జీతాలను పెంచాలని ప్రతిపాదించారు. సుప్రీంకోర్టులో ఉండాల్సిన 31 మంది న్యాయమూర్తులకుగాను ప్రస్తుతం 25 మంది న్యాయమూర్తులున్నారు. 24 హైకోర్టుల్లో 1079 మంది న్యాయమూర్తులు ఉండాల్సి ఉండగా ప్రస్తుతం 682 మంది న్యాయమూర్తులు పనిచేస్తున్నారు.

ప్రస్తుత వేతన పెంపువల్ల 2500 మందికిపైగా పదవీవిరమణ చేసిన న్యాయమూర్తులకుసైతం ప్రయోజనం కలుగుతుంది. ఏడోవేతన సంఘం సిఫారసులు అమలును అందుకుంటున్న అధికారుల జీతభత్యాలకు సమాంతరంగా ఇకపై సుప్రీం, హైకోర్టు న్యాయమూర్తుల జీతభత్యాలు ఉంటాయి.

సహించేదిలేదు

≫ సానుకూలత ఉందని, దానిని పార్టీ పట్ల సానుకూలత మార్చుకోవాలన్నారు. అలాగే గ్రామం అభివృద్ధి చెందాలి, పార్టీ అభివృద్ధి చెందాలని, పంచాయితీ సభ్యులు ,జన్మభూమి కమిటీ సభ్యులు, సేవామిత్ర, సాధికార మిత్ర అందరూ ఊరు బాగుకోసం కృషి చేయాలన్నారు. నెలకోసారి గ్రామాభివృద్ధిపై సమావేశం జరపాలని, ప్రతి గ్రామంలో దళితవాడకు వెళ్లాలని, దళిత యువతతో మమేకం కావాలని చంద్రబాబు అన్నారు. అలాగే బీసీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలతోనూ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. నెలలో నాలుగైదు రోజులు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రులు పార్లమెంట్ స్థానంపై దృష్టిపెట్టిన పార్టీని బలోపేతం చేయాలన్నారు. కాగా ప్రజల్లో సంతృప్తి డిసెంబర్‌లో 57శాతం ఉందని,జనవరిలో 62శాతానికి పెరిగిందన్నారు. పెళ్లి కానుకలు ఇస్తున్నామని, దీంతో ఫిబ్రవరిలో మరో 4శాతం, మార్చిలో 4 శాతం సంతృప్తి స్థాయి పెరగాలన్నారు. నిరుద్యోగభృతి, అన్న క్యాంటిన్లతో మరో 10శాతం సంతృప్తి స్థాయి పెరుగుతుందని, మొత్తం 80శాతం సంతృప్తి లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. పనులన్నీ చేశాం. మన ప్రవర్తనలోనే మార్పు రావాల్సి ఉందన్నారు. క్రమశిక్షణను ఉల్లంఘిస్తే సహించనని, మన రెండంకెల వృద్ధిరేటును ఎకనామిక్ సర్వే నిర్ధారించిందని, ఏపీలో పెరిగిన జీవన ప్రమాణాలను ఎకనామిక్ సర్వే గుర్తించిందని, పర్యాటక రంగంలో ఏపీ 3వస్థానంలో ఉండటం మనం సాధించిన ప్రగతి అని చంద్రబాబు పేర్కొన్నారు. 175నియోజకవర్గాల్లో పార్టీ పరిస్థితిపై సమీక్షిస్తానని, నియోజకవర్గాలకు ఏబీసీడీ కేటగిరీలు ఇచ్చామన్నారు. అలాగే, సి,డి కేటగిరి నియోజకవర్గాలపై ఎక్కువ దృష్టి పెడతానన్నారు. మండలస్థాయి నేతలను నియోజకవర్గ సమావేశాలకు ఆహ్వానిస్తామని, పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయ కమిటీలు ఈ సమావేశాలకు హాజరు కావాల్సిందేనన్నారు. ఎన్నికల ఏడాదిలో ఉన్నామని ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని, జన్మభూమి కమిటీలను పున ఃనిర్మాంచాలని, ఫిబ్రవరి 2న జరిగే పార్టీ సమన్వయ కమిటీలో రాజకీయాలపై చర్చిద్దామని చంద్రబాబు అన్నారు. ఈ సమావేశంలో మంత్రులు, పార్టీ ముఖ్యనాయకులు పాల్గొన్నారు.

రహదార్లకు కొత్తరూపు

≫ విధానంలోనే భూములను తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. ఈ బాహ్యవలయ రహదారి మార్గంలో జి కొండూరులో 5.5కిలోమీటర్లు పేరేచర్లలో 800మీటర్ల మేర టన్నల్స్ నిర్మాణం జరగాల్సి వుంటుందని అధికారులు చెప్పారు. 87గ్రామాలు ఈ రహదారి పరిధిలోకి వస్తాయని వివరించారు. కత్తిపూడి నుంచి ఒగోలు వరకు 435కిలోమీటర్ల మేర ఎన్‌హెచ్ 216,221 అప్‌గ్రెడేషన్ పనులలో పురోగతిని ముఖ్యమంత్రి అధికారులను అడిగి తెలుసుకున్నారు. జాతీయ రహదారికి ప్రత్యామ్నాయంగా ఉంటుందని, భవిష్యత్ అవసరాల దృష్ట్యా దీని నిర్మాణాన్ని శరవేగంగా చేపట్టే 2019మార్చి నాటికి పూర్తి చేయాలని ముఖ్యమంత్రి చెప్పారు. 'సేతుభారతం'లో భాగంగా ఏపీలో 32రోడ్ ఓవర్‌బ్రిడ్జి(ఆర్‌వోబీ)ల నిర్మాణం చేపట్టామని, అందులో రూ.474.21కోట్ల అంచనాతో తలపెట్టిన 7ఆర్వోబీలకు ఇప్పటికే డీసీఆర్‌లను సిద్ధం చేశామని అధికారులు చెప్పారు. రాష్ట్ర రహదారులకు సంబంధించి చిత్తూరు, పుత్తూరు, మైదుకూరు, జమ్మలమడుగు రహదారుల పనులను ఇప్పటికే పూర్తి చేశామని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. పెడన,నూజివీడు, విస్సన్నపేట, కర్నూలు-దేవనకొండ రహదారులను మార్చి నాటికి సిద్ధం చేస్తామని తెలిపారు.

డ్రోన్ల వినియోగంతో రహదారుల నిర్వహణ: ఏపీఆర్ఎంఎస్ క్రింద 42వేల కిలోమీటర్ల మేర వున్న రాష్ట్ర రోడ్ నెట్‌వర్క్‌కు సంబంధించిన సమాచారాన్ని ఆర్‌డీబీఎంస్ సాఫ్ట్‌వేర్‌లో క్రోడీకరించామని అధికారులు చెప్పారు. డ్రోన్లను వినియోగించుకుని రహదారుల నిర్వహణ ఎలా ఉందో ఎప్పటికప్పుడు తెలుసుకోవాలన్నారు. రాష్ట్రంలో ఫిబ్రవరి నాటికి ఎక్కడా గుంతలు కనిపించకూడదని, తన పరిశీలనలో గుంతలు కనిపిస్తే సంబంధిత జేఈ, ఏఈలను అసమర్ధులుగా జమకట్టి సస్పెండ్ చేయడానికి కూడా వెనుకాడనని ముఖ్యమంత్రి హెచ్చరించారు. ప్రమాదాలకు అస్కారంలేని రహదారులుగా రాష్ట్ర రహదారులు ఉండాలని, ఈ అంశంపై ప్రభుత్వానికి సహకరించేందుకు డస్సాల్ట్ అనే సంస్థ త్వరలో రాష్ట్రానికి రానున్నదని ముఖ్యమంత్రి చెప్పారు. రాష్ట్రంలోని రహదారులు స్థితిగతులను వివరించి ఎలాంటి చర్యలు తీసుకోవాలో ఈ సంస్థ మార్గదర్శనం చేస్తుందన్నారు. రాష్ట్రంలో 6401కిలోమీటర్ల మేర జాతీయ రహదారులు, 14,722కిలోమీటర్ల రాష్ట్ర రహదారులు, 32,240కిలోమీటర్ల మేర మేజర్ డి స్ట్రిక్ట్‌రోడ్లు వున్నాయని, వాటిన్నింటి నిర్వహణ అత్యంత సమర్ధంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి కోరారు. 2014నుంచి 2017డిసెంబర్ వరకు మొత్తం 2033,58కిలోమీటర్ల రహదారిని జాతీయ రహదారులుగా ప్రకటించామని ఆర్‌అండ్‌బీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ వివరించారు. విశాఖ-చెన్నయ్ పారిశ్రామిక నడవాలో భాగంగా చేపట్టిన రహదారి ప్రాజెక్టులను అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. మేజర్ డిస్ట్రిక్ రోడ్ పనులకు సంబంధించి నాబార్డ్ ద్వారా 2017-18లో రూ.556కోట్ల అంచనాతో 260 కిలోమీటర్ల మేర 197పనులు మంజూరు కాగా, అందులో 108పనులను పూర్తి చేశామని అధికారులు వివరించారు. మార్కెట్ సెస్ నిధులతో ఆర్డీఎఫ్ కింద చేపట్టిన 293పనులలో 221 పనులను పూర్తి చేశామని తెలిపారు. 320కిలోమీటర్ల మేర రూ.455కోట్ల అంచనాతో ఈ పనులను చేపట్టినట్లు పేర్కొన్నారు. నేషనల్ సైక్లోన్ రిస్క్ మిటిగేషన్ ప్రాజెక్టు కింద రూ.347.55 కోట్ల వ్యయంతో 44.66కిలోమీటర్ల పనులను పూర్తి చేశామని అధికారులు తెలిపారు. రూ.232.08కోట్ల వ్యయంతో 30వంతెనల నిర్మాణాన్ని చేపట్టగా, అందులో 19వంతెనల నిర్మాణాన్ని పూర్తి చేశామని చెప్పారు. 2001 నుంచి 122రైల్ వోవర్ బ్రిడ్జిలు మంజూరు కాగా, అందులో ఇప్పటికి 60పూర్తయ్యాయని చెప్పారు. మిగిలిన వంతెలను ఈ ఏడాదిలోనే పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని, అవసరమైతే రైల్వే మంత్రితో మాట్లాడతానని ముఖ్యమంత్రి చెప్పారు.మొత్తం 5,975కిలోమీటర్ల పంచాయితీరాజ్ రహదారులను ఆర్‌అండ్‌బీకి బదలాయించామని, అందులో 1789కిలోమీటర్ల రహదారులు రహదారిభవనాలశాఖ ప్రమాణాలకు అనుగుణంగా అభివృద్ధి చేశామని వివరించారు. పంచాయితీరాజ్‌శాఖకు చెందన మిగిలిన 4186కిలోమీటర్ల మేర నాన్ బీటిరోడ్లను బీటీరోడ్లుగా మార్చడానికి రూ.2,660కోట్లు అవసరం అవుతాయని ముఖ్యమంత్రి చెప్పారు.

ప్రభుత్వం పరువు తీస్తున్నారు: నిర్మాణ సంస్థపై సీఎం ఆగ్రహం: విజయవాడలో నిర్మిస్తున్న కనకదర్గమ్మ వారధి నిర్మాణానికి సంబంధించి కాలువ ప్రవాహాన్ని ఆపడానికి జలవనరులశాఖతో మాట్లాడామని, రేపటి నుంచి సంబంధిత పనులను ఆరంభిస్తామని అధికారులు చెప్పారు. నిర్మాణ సంస్థ చేతకానితనం, అసమర్ధత వల్ల రాష్ట్ర ప్రభుత్వ పరువు పోతోందని ముఖ్యమంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వంతెన పై భాగాన్ని 13వ పిల్లర్ వరకు పూర్తి చేసి మార్చి నాటికి ప్రధాన రహదారిపై రాకపోకలు పునరుద్ధరించకపోతే తీవ్ర చర్యలు తీసుకోవల్సి వస్తుందని హెచ్చరించారు. నిర్మాణ సంస్థ కోరినట్టుగా రూ.10కోట్ల ఇవ్వడానికి ముఖ్యమంత్రి అంగీకరించారు. సమావేశంలో మంత్రి అయ్యన్న పాత్రుడు, ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శి సాయిప్రసాద్, కార్యదర్శి ఏవీ రాజమౌళి, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుండి వనదేవతల జనజాతర

నేడు సారలమ్మ రాకతో జాతర తొలిఘట్టం ఆరంభం

2న తెలంగాణ సీఎం కేసిఆర్ కుటుంబ సమేతంగా మేడారం రాక

ప్రభాతవార్త ప్రతినిధి-వరంగల్/ జఫర్‌గడ్: ఆసియా ఖండంలోనే అతి పెద్ద జాతరగా.. తెలంగాణ కుంభమేళాగా ప్రసిద్ధి గాంచిన తెలంగాణలోని మేడారం మహాజాతర నేటి నుండి ప్రారంభం కాబోతున్నది. విగ్రహాలు లేని శ్రీసమ్మక్క- సారలమ్మ జాతర పూర్తిగా గిరిజన సంస్కృతి, సంప్రదాయాలతో ప్రతిబింబిస్తుంది. ప్రతి రెండేళ్లకోసారి జరిగే ఈ జాతర మాఘ శుద్ధ పౌర్ణమి రోజున ఆరంభమై నాలుగు రోజుల పాటు కొనసాగుతుంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని భూపాలపల్లి జయశంకర్ జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో జరిగే ఈ మహాజాతరకు నేడు అంకురార్పణ జరగనుంది. ఈ ఉత్సవాల్లో భాగంగా 31న బుధవారం సాయంత్రం సాలరమ్మ గద్దెపైకి చేరుకుంటుంది. ఫిబ్రవరి 1న గురువారం చిలకలగుట్ట నుండి తల్లి సమ్మక్క రాక, 2న గద్దెలపై కొలువుదీరిన తల్లులకు భక్తజనులు మొక్కులు చెల్లిస్తారు. 3వ తేదీన శనివారం వనదేవతలు తిరిగి వనప్రవేశం చేరడంతో జాతర ఉత్సవాలు పరిసమాప్తమవుతాయి.

జన సంద్రంగా మారుతున్న మేడారం: కాగా, జాతర ఆరంభానికి ముందే మేడారం ప్రాంతం భక్త జనులచే జనస ంద్రంగా మారుతోంది. తల్లులను దర్శించుకుని తరించేందుకు వివిధ ప్రాంతాల నుండి అశేష సంఖ్యలో భక్తులు తరలివస్తున్నారు. జాతర ప్రాంగణం చుట్టూ కొన్ని కిలోమీటర్ల దూరం వరకు ఎటు చూసినా భక్తజనులే కనిపిస్తున్నారు. చెట్టూ పుట్టా.. మైదానం.. డేరాలు.. గుడారాలు ఎక్కడ చూసిని భక్తజనులే కనిపిస్తున్నారు. తొలిఘట్టాన్ని కనులారా వీక్షించడానికి భక్తజనులు వేయికళ్లతో ఎదురు చూస్తున్నారు. లక్షలాది మంది వివిధ ప్రాంతాల నుండి భక్తులు మేడారం ప్రాంతానికి చేరడంతో కుగ్రామం.. మహానగరంగా మారిపోయింది. జంపన్న వాగులో భక్తుల పుణ్యస్నానాలు, భండారి పూసు కుని చేతిలో వరికోళ్లతో మహిళలు, పురుషుల శివసత్తులు, పూనకాలు, కోయదొరల సందడి వంటి అపురూప భక్తి పారవశ్య దృశ్యాలో జాతరలో గోచరిస్తున్నాయి. 2016లో జరిగిన మేడారం జాతర ఉత్సవాలకు కోటి మంది వరకు భక్తులు రాగా.. ఈసారి ఆ సంఖ్య కోటి యాభై లక్షల వరకు చేరుకుంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

సారలమ్మ రాకతో తొలిఘట్టం ఆరంభం: మాఘశుద్ధ పౌర్ణమి రోజున మేడారం సమ్మక్క-సారలమ్మ జాతర ప్రారంభం కానుంది. 31వ తేదీ బుధవారం సాయంత్రం సమ్మక్క కూతరు సారలమ్మ, గోవిందరాజు, పగిడిద్దరాజులు మేడారంలోని గద్దెలకు చేరడంతో మహాజాతర తొలి ఘట్టం ఆరంభమవుతుంది. కన్నెపల్లి నుండి సారలమ్మను గద్దెకు చేర్చడంతో పాటు ఇదే రోజున ఏటూరునాగారం మండలం కొండాయి నుండి గోవిందరాజును, పునుగొండ్ల నుండి పగిడిద్దరాజులను గద్దెపైకి తీసుకురానున్నారు.

2న సీఎం కేసీఆర్, ఉపరా ష్ట్రపతి మేడారానికి రాక: కాగా, తెలంగాణ కుంభమేళాగా ప్రసిద్ధి గాంచిన మేడారం మహాజాతరను వీక్షించి తల్లులను దర్శించుకునేందుకు ఈనెల 2వ తేదీన తెలంగాణ సీఎం కేసీఆర్‌తో పాటు భారత ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు మేడారానికి విచ్చేస్తున్నారు. సీఎం కేసీఆర్ కుటుంబ సమేతంగా శుక్రవారం శ్రీసమ్మక్క-సారలమ్మలను దర్శించుకుని మొక్కులు చెల్లించనున్నారు. అదేవిధంగా పలువురు కేంద్రమంత్రులు, రాష్ట్ర మంత్రులు సైతం మేడారానికి చేరుకుని వనదేవతలను దర్శించుకోనున్నారు. ఈ నేపథ్యంలో పోలీసు అధికారులు తగు భద్రతా ఏర్పాట్లు చేపడుతున్నారు.

ఆ ఆవు అమ్మ ప్రేమ!

హాసన్(కర్ణాటక),జనవరి30,ప్రభాతవార్త: కన్న పేగు బంధం ఎవ్వరికైనా ఒక్కటే. ఇటీవల కార్నాటకలోని హాసన్ ప్రాంతంలో రెండు నెలల లేగదూడకు ప్రమాదవశాత్తు కాలుకు దెబ్బతగిలి ఫ్యాక్చర్ అయింది. దానికి చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తేసుకు వెళ్లే ప్రయత్నం చేసాడు యజమాని. దూడను వదలలేక తాను పక్కన లేకుండా తన బిడ్డకు ఏం జరుగుతుందోనని ఆ గోమాత విలవిల లాడిపోయింది. యజమాని వాహనంలో తీసుకువెళతుంటే వెంట దీనంగా అరుస్తూ.. పరిగెడటం చూపరులకు కన్నీటిని తెప్పించింది. జనవరి 25న యజమాని లేగదూడను అసుపత్రిలో చేర్చగా చికిత్స జరిగి తిరిగి వచ్చే వరకూ గోమాత ప్రాణం గిలగిల లాడిందని యజమాని చెప్పాడు. చివరకు తన బిడ్డ ఆరోగ్యంతో తిరిగి రావటంతో గోమాత మనసు శాంతించిందట.



చికిత్సకోసం ఆసుపత్రికి తీసుకు వెళుతున్న లేగదూడను దీనంగా అరుస్తూ వెంబడిస్తున్న ఆవు

కబ్జాకోరల్లో రాజధాని!

≫ చేయడం ప్రారంభించారు. బుధవారం నుండి ఆ స్థలంలో కళాశాల యాజమాన్యం క్లాసులు కూడా నిర్వహిస్తుందని తెలిపారు. టెంట్లు వేసి మరి క్లాసులు నిర్వహిస్తామని పట్టుదలగా వున్నారు. దీంతో పోలీసులు రంగప్రవేశం చేశారు. కొద్ది రోజుల క్రితం సాక్షాత్తూ రాష్ట్ర మంత్రి దేవినేని ఉమా మహేశ్వరరావు ఈ భూమి కబ్జాకు గురికాదని స్పష్టంగా హామీ ఇచ్చారని అయినా అక్రమనిర్మాణాలు ప్రారంభమవుతున్నాయని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. దీంతో ఆ స్థలంలో భవన నిర్మాణానికి పూనుకున్నవారు తోకముడిచారు. ఈ ఉదంతంపై విద్యాశాఖను ఇప్పటికే కోర్టు ఎంక్వైరీ చేసి నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. నగర సిపిఐ నేత దోనేపూడి శంకర్ విద్యార్థుల ఆందోళనకు మద్దతు తెలిపారు. దీని వెనుక ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు హస్తముందని పూర్వ విద్యార్థులు, ప్రస్తుత విద్యార్థులు ఆరోపిస్తున్నారు. ఈ భూభాగోతాలపై సిబిసిఐడితో ఎంక్వయిరీ చేయించాలని కళాశాల పూర్వ విద్యార్థులు వెంకటేశ్వరరావు, పి రాజశేఖర్‌లు డిమాండ్ చేశారు. ఈ స్థలం వద్ద గొడవలు జరిగే ప్రమాదం వుండడంతో ఏడవ పట్టణ సిఐ ఉమామహేశ్వరరావు పోలీసు సిబ్బందితో గస్తీని ఏర్పాటు చేశారు.

స్టార్టప్ కంపెనీలా పనిచేస్తున్నాం

≫ మంత్రి లోకేష్ గూగుల్ టీం అంజలీ జోషి, సూరి కొడుకుల్లా, డేవిడ్ షాపిరోతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వారు ఏపితో కలిసి పనిచేయడానికి సిద్దంగా వున్నామని మంత్రికి హామీ ఇచ్చారు. ఏపి ప్రభుత్వంతో కలిసి పనిచేయడానికి సిద్దంగా వున్నామని జిస్టేషన్, క్రోమ్ బుక్స్, టెలి మెడిసిన్ లో ఫైబర్ గ్రిడ్ తో కలిసి పనిచేసేందుకు సిద్దంగా వున్నామన్నారు. త్వరలో ప్రభుత్వంతో ఒప్పందానికి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. గూగుల్ టీం అంజలీ జోషి, సూరి కొడుకులా, డేవిడ్ షాపిరోతో మంత్రి భేటీ అయ్యారు. ప్రస్తుతం బెంగుళూరులో కార్యకలాపాలు నిర్వహిస్తున్న ప్రముఖ కంపెనీ ఆరిస్తా కంపెనీ ఛీఫ్ కస్టమర్ ఆఫీసర్ అన్షుల్‌తో మంత్రి నారా లోకేష్ భేటీ అయ్యారు. ఏపిలో తమ సంస్థ ప్రారంభిస్తామన్నారు. త్వరలో రాష్ట్రంలో పర్యటించి ప్రణాళిక సిద్దం చేస్తామన్నారు. అనంతరం నారా లోకేష్ క్లౌడ్ లెండింగ్ సొల్యూషన్స్ సంస్థ స్నేహల్‌తో జరిగిన సమావేశంలో పాల్గొన్నారు. విశాఖపట్నంలో సంస్థను ప్రారంభించాలని సూచించారు. విశాఖపట్నంలో కంపెనీ అభివృద్ధికి మంచి అవకాశముందని, అక్కడి వుద్యోగులు త్వరగా ఉద్యోగాలు మరటం వుండదని, సుస్థిర అభివృద్ధి సాధించవచ్చన్నారు. విశాఖలో తమ సంస్థను త్వరలో ప్రారంభిస్తామని స్నేహల్ మంత్రికి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి ఎన్‌ఆర్‌ఐ ఇండస్ట్రియలిస్టులతో మాట్లాడుతూ అభివృద్ధి మొత్తం రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో జరిగేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అందుకే హైదరాబాద్‌లో జరిగిన తప్పును పునరావృతం కాకుండా విశాఖపట్నం, అనంతపురం, తిరుపతి, అమరా వతిల్లో ప్రముఖ సంస్థలను స్థాపించేలా, తద్వారా రాష్ట్రమంతా అభివృద్ధిచెందేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. రాష్ట్రంలో పలు ప్రపంచస్థాయి సంస్థలు పెట్టుబడులు పెట్టి తమ కార్యకలాపాలను ఇప్పటికే ప్రారంభించాయని, మరిన్ని సంస్థలు సాధించే లక్ష్యంతో అమెరికాలో పర్యటిస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్రంలో పెన్షన్లు, రేషన్, వాతా వరణం, పిడుగులు పడడం, భూగర్భజలాలు ఇలా అన్ని వ్యవస్థలను రియల్‌టైంలో తెలుసుకునేలా ఆధునిక సాంకేతిక పద్ధతులను అవలంభించి ప్రజలకు ప్రభుత్వం వెంటనే సమాచారం అందించేలా చర్యలు తీసుకున్నామన్నారు.

వార్తాఫలం

మేషం: వృత్తియందు సంతోష లాభాలను పొందుతారు. భార్యాపుత్రులతో విరోధాలకు అవకాశం. వృత్తివ్యాపారాల్లో ధనలాభాలను పొందుతారు.

వృషభం: బంధువులను దర్శించుకుంటారు. సౌఖ్యాన్ని పొందుతారు. ఉద్యోగప్రాప్తి. కొన్ని రాజభయాలకు గురయ్యే అవకాశం.

మిథునం: వృత్తివ్యాపారంలో ధనలాభాలుంటాయి. మీరు చేసే పనుల్లో విజయాన్ని పొందుతారు. వాహనయోగం, శుభకార్య ప్రాప్తి.

కర్కాటకం: భోజన సౌఖ్యాన్ని పొందుతారు. విశేష ఆరోగ్యాదాయాలతో ఆనందంగా గడుపుతారు.

సింహం: మీ మనసుకు నచ్చిన పనులను చేస్తారు. ప్రయత్నకార్యసిద్ధి. శుభకార్య ప్రాప్తి, ధనప్రాప్తికి అవకాశం. కొన్ని శారీరక సమస్యలకు అవకాశం.

కన్య: వృత్తివ్యాపారంలో ధనలాభాలను పొందుతారు. మనోల్లాసంతో ఉంటారు. శుభకార్యప్రాప్తి, కొన్ని వ్యతిరేకతలకు అవకాశం.

తుల: ఆరోగ్యం బాగుంటుంది. ధనలాభాలను పొందుతారు. దారిద్ర్య సమస్యలకు అవకాశం. చిన్ననాటి మిత్రులను కలిసి ఆనందంగా గడుపుతారు.

వృశ్చికం: వ్యాపారంలో రుణాలు చేసే అవకాశం. మనోల్లాసంతో ఉంటారు. మిత్రులతో కలహానికి అవకాశం. వృత్తివ్యాపారంలో సామాన్య ధనలాభాలను పొందుతారు.

ధనుస్సు: శుభకార్యానుకూలం. మిత్రులను దర్శించి, ఆనందంగా గడుపుతారు. వృత్తివ్యాపారంలో సామాన్య ధనలాభాలను పొందుతారు.

మకరం: వ్యాపారంలో ద్వేషాలకు అవకాశం. ధనవృద్ధిని పొందుతారు. కొన్ని వ్యతిరేకతలకు అవకాశం. బంధువులను దర్శిస్తారు.

కుంభం: బుద్ధి చాంచల్యం, వ్యాపారంలో నష్టాలకు అవకాశం. వృత్తివ్యాపారంలో లాభాలను పొందుతారు. ధర్మరక్షణ,

మీనం: పుత్రపుత్రికల విద్యాగోష్ఠియోగ్యతలు. వాహన యోగం, రుణాలు తీరుస్తారు. మృష్టాన్న భోజనం చేస్తారు.

- **పాలకుర్తి సంతోష శర్మ**, విజయపురి కాలనీ, హైదరాబాద్

SINGAM KUIL GREEN TUESDAY
Draw No:138 DrawDate on:30/01/18

SINGAM SERIES
1st Prize Rs.50,000/- 238040
2nd Prize Rs.7,000/- 29843
3rd Prize Rs.3,500/-
02712 15263 31368 42312 43219
53585 57301 63627 65553 67589
4th Prize Rs.200/-
0588 2426 2473 4234 4597 4864 4902
5358 8376 9863
5th Prize Rs.100/-
1267 1489 1614 2478 3056 4552 5667
7322 7375 7399
6th Prize Rs.50/-
0022 1511 2521 4150 5803 7235 8666
0077 1546 2811 4342 5816 7324 8939
0144 1680 2843 4561 5845 7364 9037
0298 1696 2904 4652 5847 7365 9079
0337 1701 3071 4718 5999 7472 9121
0599 1752 3186 4877 6036 7657 9169
0630 1895 3326 4892 6099 7707 9291
0833 1994 3378 5056 6287 7908 9591
0995 2109 3384 5066 6471 7972 9749
1162 2115 3387 5287 6546 8221 9872
1194 2148 3426 5445 6580 8283
1209 2150 3560 5578 7071 8289
1238 2233 3665 5666 7132 8547
1245 2290 3904 5759 7153 8559
1481 2466 3999 5790 7230 8632

KUIL SERIES
1st Prize Rs.50,000/- 959855
2nd Prize Rs.7,000/- 84226
3rd Prize Rs.3,500/-
05101 07786 19255 23113 32146
42917 43967 46556 57490 80407
4th Prize Rs.200/-
0466 1124 2031 3036 4233 4747 6777
8337 9372 9735
5th Prize Rs.100/-
0012 0457 1046 1864 3107 4202 4288
5301 6254 9959
6th Prize Rs.50/-
0159 1624 2910 5298 6656 8401 9536
0228 1784 3209 5446 6663 8480 9545
0270 1855 3361 5509 6801 8628 9557
0288 2021 3439 5589 7060 8718 9594
0338 2180 3454 5601 7189 8747 9617
0582 2240 3667 5701 7285 8823 9664
0634 2264 3675 5724 7515 8856 9686
0658 2441 3883 5944 7603 9165 9700
0729 2452 3962 5969 7642 9197 9775
1131 2490 4029 6071 7644 9248 9897
1137 2533 4330 6399 7703 9266
1156 2576 4576 6406 8127 9288
1210 2655 4700 6480 8139 9396
1397 2773 5131 6531 8333 9462
1419 2799 5270 6579 8372 9468

ROSA DEER SUPER TUESDAY
Draw No:138 DrawDate on:30/01/18

ROSA SERIES
1st Prize Rs.50,000/- 486031
2nd Prize Rs.7,000/- 11991
3rd Prize Rs.3,500/-
10603 13414 16903 31936 43182
45932 58050 69986 71957 90138
4th Prize Rs.200/-
1073 2316 2405 2453 2595 2973 3201
5113 6805 7393
5th Prize Rs.100/-
0287 1157 1362 1823 2340 3293 5467
7151 7351 8305
6th Prize Rs.50/-
0364 1657 3161 4512 6392 7284 8955
0399 1937 3172 4843 6441 7432 9044
0404 2103 3221 4987 6493 7440 9351
0597 2215 3226 5024 6555 7489 9554
0755 2245 3286 5128 6659 7575 9569
0830 2359 3329 5153 6660 7594 9630
0942 2420 3540 5321 6783 7684 9800
1037 2455 3663 5326 6871 7688 9801
1072 2541 3743 5444 6996 7790 9893
1224 2545 3881 5609 7044 8318 9983
1457 2673 3896 5904 7177 8375
1506 2709 4152 6153 7181 8489
1541 2812 4185 6243 7240 8530
1552 2988 4461 6288 7241 8738
1643 3081 4485 6366 7265 8950

DEER SERIES
1st Prize Rs.50,000/- 797229
2nd Prize Rs.7,000/- 32309
3rd Prize Rs.3,500/-
10307 34939 49370 56447 64438
67234 71074 79039 88867 97127
4th Prize Rs.200/-
1163 3461 5150 5297 6389 6462 7716
7936 9695 9867
5th Prize Rs.100/-
3405 4157 4607 4799 4856 5242 6107
7454 9576 9587
6th Prize Rs.50/-
0295 1748 3474 4891 6089 6951 8996
0306 1835 3558 4982 6129 7081 9172
0381 1842 3703 5117 6158 7088 9173
0609 1876 3822 5203 6212 7116 9273
0624 1915 3859 5259 6217 7386 9489
0644 2337 3893 5264 6386 7537 9514
0651 2354 3930 5361 6431 7658 9527
0703 2445 4083 5379 6578 7718 9643
0848 2457 4116 5432 6608 8066 9818
0886 2640 4183 5641 6624 8393 9850
0982 2725 4355 5703 6727 8515
1191 2770 4371 5729 6758 8588
1393 3264 4388 5810 6759 8610
1491 3299 4389 5821 6827 8673
1559 3470 4453 5949 6945 8784

THANGAM NALLANERAM CHANCE TUESDAY
Draw No:138 DrawDate on:30/01/18

THANGAM SERIES
1st Prize Rs.50,000/- 939449
2nd Prize Rs.7,000/- 71831
3rd Prize Rs.3,500/-
18769 34767 39963 49232 62777
65922 68877 81475 87045 93638
4th Prize Rs.200/-
1373 1802 3747 6228 6416 7114 7577
7818 7846 8516
5th Prize Rs.100/-
1563 1684 2966 4988 5152 5339 7013
7205 8096 8689
6th Prize Rs.50/-
0038 2044 3302 4735 6655 7812 8850
0126 2095 3303 4916 6688 7853 8864
0254 2121 3362 5159 6762 7882 8948
0349 2184 3498 5173 6904 7945 9056
0568 2189 3599 5676 7006 7965 9271
0701 2289 3869 5833 7059 7982 9295
0745 2307 3870 5856 7067 8166 9329
0806 2480 3931 5920 7087 8261 9561
1159 2548 4089 5948 7123 8262 9611
1193 2756 4121 6056 7140 8304 9753
1389 2823 4188 6074 7282 8347
1445 3076 4203 6218 7354 8398
1641 3135 4460 6263 7360 8438
1673 3154 4495 6330 7689 8629
1979 3258 4589 6420 7712 8793

NALLANERAM SERIES
1st Prize Rs.50,000/- 915770
2nd Prize Rs.7,000/- 72467
3rd Prize Rs.3,500/-
09660 15540 16793 21558 32458
36460 37239 47303 69814 95362
4th Prize Rs.200/-
0053 0681 2282 4566 4974 5211 5879
6645 7743 9790
5th Prize Rs.100/-
1666 3834 3912 4879 5979 6126 8124
8589 9094 9524
6th Prize Rs.50/-
0133 1287 2892 4319 5966 7331 8765
0143 1382 3068 4558 5977 7466 8988
0342 1444 3176 4730 6160 7543 9032
0400 1460 3504 4852 6163 7659 9059
0451 1470 3705 4873 6235 7671 9060
0562 1521 3712 5017 6275 7672 9127
0570 1522 3771 5060 6351 7871 9195
0732 1530 3832 5135 6407 7980 9610
0908 1771 3894 5222 6828 8184 9961
0932 1788 3958 5239 6921 8216 9974
0988 2249 4004 5330 6995 8291
1011 2298 4095 5528 7025 8340
1117 2579 4260 5587 7089 8652
1185 2676 4275 5804 7207 8706
1269 2730 4305 5805 7221 8764

KUMARAN VISHNU MOON TUESDAY
Draw No:138 DrawDate on:30/01/18

KUMARAN SERIES
1st Prize Rs.50,000/- 149787
2nd Prize Rs.7,000/- 92874
3rd Prize Rs.3,500/-
29124 43748 44154 55791 74188
80451 81453 83871 90227 97044
4th Prize Rs.200/-
0619 0803 0852 1056 1753 3763 5543
6028 6281 8364
5th Prize Rs.100/-
0212 2543 3615 7527 8494 8843 8869
9151 9337 9971
6th Prize Rs.50/-
0153 1631 3039 4664 6609 7576 8862
0386 1721 3049 4777 6630 7670 8951
0414 1874 3086 5118 6641 7680 9028
0464 1897 3237 5133 6699 7720 9142
0581 1986 3351 5399 6879 7754 9284
0766 2113 3372 5443 7031 8101 9367
0939 2261 3528 5697 7036 8121 9731
1000 2357 3646 5851 7101 8174 9858
1057 2375 3854 5997 7120 8231 9881
1077 2594 3996 6052 7145 8307 9994
1095 2662 4024 6206 7249 8349
1196 2736 4102 6373 7251 8399
1404 2781 4133 6424 7332 8440
1490 2833 4168 6467 7391 8445
1608 3022 4289 6512 7508 8713

VISHNU SERIES
1st Prize Rs.50,000/- 743339
2nd Prize Rs.7,000/- 86500
3rd Prize Rs.3,500/-
06987 25719 41314 43277 50423
54129 57143 72188 76078 79410
4th Prize Rs.200/-
1239 1562 4079 6925 7110 7389 7421
7919 8640 9614
5th Prize Rs.100/-
0546 4139 6033 6349 6691 7560 8927
9335 9871 9957
6th Prize Rs.50/-
0007 1093 2387 4798 5762 7261 8630
0125 1141 2497 4846 5779 7278 8638
0326 1166 2774 5027 5917 7396 8736
0346 1205 2989 5082 6030 7413 9013
0355 1485 3200 5090 6035 7479 9481
0383 1517 3455 5290 6169 7618 9539
0427 1613 3550 5372 6231 7631 9784
0441 1649 3686 5433 6415 7892 9819
0497 1731 3698 5546 6476 8039 9905
0652 1793 3751 5627 6504 8054 9995
0760 1990 4127 5656 6550 8306
0971 2040 4450 5693 6629 8465
1003 2177 4524 5739 6639 8526
1052 2219 4608 5748 6862 8540
1061 2360 4750 5755 7001 8572

గచ్చిబౌలిలో ఘోరం-మహిళ దారుణహత్య

ముక్కలుగా కోసి, గోనె సంచుల్లో చుట్టి రోడ్డుమీద పారేసిన దుండగులు



గోనె సంచుల్లో నుంచి మహిళ శరీర భాగాలను బయటకు తీస్తున్న పోలీసులు, డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేపట్టిన దృశ్యం -(ఇన్‌సెట్లో) స్వాధీనం చేసుకున్న వస్తువులు

గచ్చిబౌలి, జనవరి 30, ప్రభాతవార్త: హైటెక్‌సిటీ పరిధిలోని గచ్చిబౌలిలో ఓ మహిళను గుర్తు తెలియని దుండగులు అతి కిరాతకంగా హతమార్చారు. గుర్తు తెలియని మహిళను దారుణంగా హత్య చేసిన దుండగులు అనంతరం శరీరాన్ని ముక్కలుగా కోసి గోనే సంచిలో చుట్టి రోడ్డుపై పారవేశారు. గచ్చిబౌలి కొత్తగూడ బొటానికల్ గార్డెన్ రోడ్డు మీద చెత్త తొలగించే జీహెచ్ఎంసి కార్మికులు ఈ సంచులను గుర్తించడంతో ఐటి కారిడార్‌లో ఒక్కసారిగా కలకలం రేగింది. డాగ్‌స్క్వాడ్, క్లూస్ టీంలతో గాలింపు చేపట్టినా మ ృతురాలి ఆచూకీ లభించలేదు. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘ టనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. గచ్చిబౌలి పరిధిలోని కొత్త గూడ బొటానికల్ గార్డెన్ నుంచి శ్రీరాంనగర్ కాలనీకి వెళ్లే దారిలో మంగళ వారం తెల్లవారు జామున శేరిలింగంపల్లి సర్కిల్ జీహెచ్ఎంసి కార్మికులు నర్సింహులు, చెన్నయ్యలు చెత్త తొలగింపు పనులు చేపడుతున్నారు. ఈ క్రమంలో ప్రధాన రహదారిపై పారిశుద్ధ్య విధులు నిర్వహిస్తూ బొటానికల్ గార్డెన్ మలుపు వరకు వచ్చిన వీరికి రహదారి పక్కనే రెండు గోనే సంచులు కనిపించాయి. వాటి దగ్గరికి వెళ్లి చూడగా తీవ్ర దుర్గంధం రావడంతో అనుమానం వచ్చిన జీహెచ్ఎంసి కార్మికులు ఓ సంచి మూత తొలగించారు. అందులో నుంచి ఓ మనిషి చేతి బయటపడడంతో భయాందోళనలకు గురైన వారు జీహెచ్ఎంసి ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. అధికారుల సమాచారం మేరకు సంఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు గోనె సంచులను తెరిచి చూడగా అందులో నుంచి మహిళ శరీర అవయవాలు బయటపడ్డాయి. పక్క పక్కనే పడి ఉన్న రెండు గోనే సంచుల్లో ముక్కలుగా కోసిన మహిళ శరీర అవయవాలను ఉంచిన దుండగులు రోడ్డు పక్కన పారవేసి వెళ్లారు.

పాలిథిన్ కవర్లలో చుట్టి, గోనె సంచుల్లో కుక్కి...

గుర్తు తెలియని దాదాపు 30 నుంచి 35 సంవత్సరాల వయస్సు ఉన్న మహిళలను దారుణంగా హతమార్చిన దుండగులు బొటానికల్ గార్డెన్ రహదారిపై పడవేసి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. శరీర భాగాలు కుళ్లిపోయిన స్థితిలో ఉండడంతో హత్య జరిగి రెండు, మూడు రోజులు అయి ఉంటుందని భావిస్తున్నారు. శరీరాన్ని ముక్కలుగా కోసి ఒక సంచిలో కాళ్లు, చేతులు, తల ఉండగా, మరో సంచిలో మొండెంను కుక్కారు. పాలిథీన్ కవర్లలో శరీర భాగాలను చుట్టి, వాటిని ప్లాస్టిక్ సంచుల్లో పెట్టిన దుండగులు రెండు గోనే సంచుల్లో వాటిని పెట్టి రహదారిపై పడవేసి వెళ్లారు. మహిళ శరీరంపై బట్టలు లేకపోవడంతో ఎటువంటి ఆనవాళ్లు లభించలేదు. చేతికి గాజులు, కాళ్లకు మట్టెలను బట్టి హిందు మహిళగా పోలీసులు అనుమానిస్తున్నారు. సంఘటనా స్థలిని మాదాపూర్ డిసిపి విశ్వప్రసాద్ సందర్శించారు. డాగ్‌స్క్వాడ్, క్లూస్ టీంలతో దర్యాప్తు చేపట్టారు. డాగ్‌స్క్వాడ్ సైతం గోనెసంచులకు కొద్దిదూరంలో తిరిగి ఆగిపోవడంతో ఎక్కడి నుంచో తీసుకువచ్చి ఇక్కడ పారవేశారనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. స్థానికంగా ఉన్న సీసీ కెమెరా ఫుటేజీని పరిశీలిస్తామని, విచారణ వేగవంతం చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈమేరకు మ ృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించిన పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

ఆమె 8 నెలల గర్భిణీ

దారుణ హత్యకు గురైె బొటానికల్ గార్డెన్ వద్ద ముక్కలుగా లభించిన గుర్తు తెలియని మహిళ పోస్టుమార్టంలో విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చినట్లు పోలీసులు ప్రకటించారు. గుర్తు తెలియని దుండగులు మహిళలు అతి కిరాతకంగా హతమార్చి ముక్కలుగా నరికి గోనె సంచిలో మూటగట్టి బొటానికల్ గార్డెన్ రోడ్డులో వదిలేశారు. కాగా మహిళ మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించిన పోలీసులకు మృతురాలు 8నెల గర్భవతిగా పోస్టుమార్టం నివేదికలో తెలిసింది. మహిళను మొదట తీవ్రంగా కొట్టిన తరువాతే హత్య చేసి ముక్కలుగా నరికినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. మృతురాలి శరీరంలో అనేక ప్రాంతాల్లో ఎముకలు విరిగిన ఆనవాళ్లు కనిపించినట్లు సమాచారం. మహిళ నిండుగర్భిణిగా పోస్టుమార్టం నివేదికలో వెల్లడి కాగా ఆమె కడుపులో మృత మగ శిశువును గుర్తించారు. మృతురాలి వయస్సు 30 సంవత్సరాలు ఉంటుందని, ఎత్తు 5.4ఫీట్లు ఉంటుందని పోలీసులు తెలిపారు. కుళ్లిన స్థితిలో అవయవాలు లభించడంతో చనిపోయి రెండు లేదా మూడు రోజులు కావస్తుందని పేర్కొన్నారు. ఉత్తర్‌ప్రదేశ్, బీహార్, ఒరిస్సా తదితర రాష్ట్రాలకు చెందిన మహిళ అయి ఉంటుందని, గుండ్రటి మొఖంతో ఉందని తెలిపారు. పోలీసులు స్వాధీనం చేసుకున్న శరీర అవయవాల వద్ద నుంచి ఎరుపు రంగు పైజామా, మెరున్ రంగు కుర్తా, వెండి కమ్మలు, మెరున్ రంగు గాజులు లభించినట్లు తెలిపారు. ముఖ్యంగా గైనకాలజీ డాక్టర్లు ఇటువంటి ఆనవాళ్లతో ఎవరైనా మహిళ తమ వద్దకు వస్తే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఎక్కడైనా నిండు గర్భిణి కనిపించకుండా పోతే స్థానికులు, చుట్టు ప్రక్కల ప్రాంతాల వారు సమాచారం అందించాలని పోలీసులు సూచించారు.

మావోయిస్టులు, గంజాయి మాఫియాపై నిరంతర నిఘాకు ఇస్రో సహాయం

టి.పోలీసు విభాగంతో అంతరిక్ష పరిశోధనా సంస్థ సమాచార మార్పిడి

హైదరాబాద్, జనవరి 30, ప్రభాతవార్త: రాష్ట్రంలో మరోసారి బలపడేందుకు ఎత్తుగడలు వేస్తున్న మావోయిస్టులపై నిరంతర నిఘా వేసేందుకు, సర్వాదరు సవాల్‌గా మారుతున్న గంజాయి మాఫియాపై ఉక్కుపాదం మోపేందుకు తెలంగాణ పోలీసు శాఖ భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) సహాయాన్ని తీసుకోవాలని నిర్ణయించింది. ఇందుకు సంబంధించి ఇస్రోతో టి.పోలీసు ఉన్నతాధికారులు ఒక అవగాహనకు కూడా వచ్చారు. అంతరిక్షం నుంచి ఇస్రో ఉపగ్రహాలు సేకరిస్తున్న చిత్రాలలో మావోయిస్టులకు సంబంధించిన వాటిని ప్రత్యేకంగా సేకరించి వాటిని పోలీసు శాఖకు అందజేయనుంది. ఇదే సమయంలో రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాలలో గల అడవుల్లో గంజాయి సాగుతో పాటు అసాంఘీక శక్తుల కార్యకలాపాలకు సంబంధించిన వివరాలను కూడా ఇస్రో పోలీసు శాఖతో పాటు నార్కొటిక్ విభాగానికి అందజేయ నుంది. ఈ రెండు అంశాలలో ఇస్రో అందించే చిత్రాలలో కచ్చితత్వం వుంటే పోలీసు శాఖతో పాటు నార్కొటిక్ విభాగానికి చాలా వరకు మేలు జరిగే వీలుంది. దేశంలో అనేక రాష్ట్రాలకు సవాల్‌గా మారిన వామపక్ష తీవ్రవాదం, గంజాయి మాఫియాకు చెక్ పెట్టేందుకు ఇస్రో తనవంతుగా పోలీసు విభాగాలకు సహాయం అందించేందుకు ముందుకు వచ్చింది. ఈ విషయంలో తెలంగాణ పోలీసు తరఫున మొదటి అడుగు పడింది. వామపక్ష తీవ్రవాదం అంటే మావోయిస్టుల కార్యకలాపాలేనన్నది అందరికి తెలిసిందే. నక్సలైట్లలో అనేక వర్గాలు, గ్రూపులు వున్నా ఇందులో మావోయిస్టు పార్టీ మొదటి ప్రాధాన్యత కలిగిఉండడం విదితమే. తెలుగు రాష్ట్రాలతో పాటు ఒడిషా, ఛత్తీస్‌ఘడ్, బీహార్, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్, మహారాష్ట్రలలో ప్రస్తుతం మావోయిస్టుల ప్రాబల్యం ఎక్కువగా వుండగా ఈ సమస్య నుంచి గట్టెందుకు ఆ యా రాష్ట్రాలు అనేక ఇబ్బందులు పడుతున్నాయి. ఇందుకోసం డ్రోన్లను, మానవరహిత విమానాలను వాడాలని కేంద్రం పలుమార్లు నిర్ణయించినా ఆచరణలో అది సాధ్యపడలేదు. ఒకదశలో ఎటువంటి నక్సలైట్ల కట్టడికి వైజాగ్‌లో మానవరహిత విమానాల స్థావరాలను ఏర్పాటు చేసేందుకు కేంద్రం ముందుకు వచ్చినా వివిధ నిమిత్తంలో అది ఆగిపోయింది. తెలుగు రాష్ట్రాల వరకు వస్తే ఒకప్పుడు నల్లమల అడవులు నక్సలైట్లకు అతి సురక్షితమైన ప్రాంతంగా వుండేది. అయితే వై.ఎస్ రాజశేఖర్ రెడ్డి ఉమ్మడి ఏపి సిఎంగా వున్న సమయంలో జరిగిన చర్యలు, అనంతర పరిణామాల నేపథ్యంలో నక్సలైట్ల ఉనికి చాలా వరకు తగ్గింది. ఇదే సమయంలో నల్లమల అడవుల్లోని అనేక ప్రాంతాలలో జరిగిన వరుస ఎన్‌కౌంటర్లలో అనేక మంది మావోయిస్టు అగ్ర నాయకులు హతమవడంతో, ఇదే సమయంలో చాలా మంది మావోయిస్టులు లొంగిపోవడం జరిగింది. ఇలా జరగడానికి అప్పట్లో ఉమ్మడి ఏపి పోలీసు విభాగం ఉపగ్రహాల సహాయం తీసుకున్నట్లు ప్రచారం జరిగింది. ఉపగ్రహాల సహాయంతో నక్సలైట్ల కదలికలపై నిఘా వుంచి వారిని మట్టుపెట్టారని వార్తలు వచ్చాయి. ఇందులోని నిజానిజాలు మాట ఎలావున్నా తెలంగాణలో మావోయిస్టు విస్తరించేందుకు, పట్టు సాధించేందుకు ప్రయత్నాలు ప్రారంభించిన నక్సలైట్లను మొదట్లోనే దెబ్బకొట్టేందుకు పోలీసు శాఖ ఇస్రోతో అధికారికంగా చేతులు కలిపింది. ఇప్పటికే టెక్నాలజీ వాడకం ద్వారా నేరాల నివారణలో మంచి ఫలితాలను సాధించిన టి. పోలీసు విభాగం ఇదే ఊపుతో మావోయిస్టుల కట్టడికి ఇస్రో సహాయం తీసుకునేందుకు నడుం బిగించింది. ఈ క్రమంలోనే నక్సలైట్ల కదలికలపై ఎప్పటికప్పుడు వివరాలు సేకరించేందుకు ఇస్రోకు సంబంధించిన వివరాలను పొందుపర్చాలని నిర్ణయించింది. ఇస్రోకు సంబంధించిన అనేక ఉపగ్రహాలు అంతరిక్షంలో నిత్యం తిరుగుతూ వేలాది చిత్రాలు పంపుతుంటాయి. ఇందులో అనేక ఉపగ్రహాలు వాతావరణానికి సంబంధించిన వివరాలు తెలిపేవి వుండడం గమనార్హం. అయితే రెండేళ్ల క్రితం శ్రీహరికోట నుంచి ప్రయోగించిన రెండు ఉపగ్రహాలు రక్షణ శాఖకు సహాయ పడేందుకు ఉద్దేశించినవి. భారత సరిహద్దుల్లో ఉగ్రవాద చొరబాట్లు, పొరుగు దేశాల సైన్యం కదలికలను, అక్రమ నిర్మాణాలను ఎప్పటికప్పుడు రక్షణ శాఖకు అందించేందుకు ఈ రెండు ఉపగ్రహాలు ఎంత 'గానో' సహాయపడుతున్నాయి. ముఖ్యంగా సముద్ర తీర ప్రాంతాలలో చొరబాట్ల నివారణకు, పాక్, చైనా సరిహద్దుల్లో జరిగే అన్ని పరిణామాలను ఈ ఉపగ్రహాల ద్వారా రక్షణ శాఖ నిపుణులు నిరంతరం తెలుసుకుంటూ తగిన చర్యలు తీసుకుంటున్నారు. ఇలా రక్షణ శాఖకు ఎంతగానో సహాయపడుతున్న ఇస్రో తాజాగా తెలంగాణ పోలీసు శాఖకు నక్సలైట్ల కదలికలపై సమాచారం అందించేందుకు ముందుకు వచ్చింది. ఇస్రో ప్రయోగించిన అనేక ఉపగ్రహాలు ఇప్పటికే అంతరిక్షంలో తిరుగుతూ దేశ వ్యాప్తంగా అన్ని ప్రాంతాలకు చెందిన ఛాయా చిత్రాలను పంపుతోంది. అయితే ఇందులో ప్రత్యేకంగా పలానా అంశానికి సంబంధించిన చిత్రాలు వుండాలనే నిబంధన ఏమీ లేదు. అయితే ఈ విషయంలో తెలంగాణ పోలీసు విభాగం ఒక అడుగు ముందుకు వేసి, ఇస్రోతో అవగాహనకు వచ్చింది. ఈ అవగాహన ప్రకారం తెలంగాణ పోలీసు శాఖతో పాటు పొరుగున వున్న రాష్ట్రాల గ్రామాలలో మావోయిస్టుల కదలికలకు సంబంధించిన ఫోటోలను ఇస్రో పోలీసు శాఖకు అందిస్తోంది. ఈ ఫోటోల ద్వారా నక్సలైట్ల కదలికలు పై పోలీసు శాఖ ఒక స్పష్టతకు వచ్చే వీలుంది. నక్సలైట్లు సాధారణంగా అనేక ప్రాంతాలను మారుస్తుంటారు. షెల్టర్ కోసం, సురక్షిత స్థావరాల కోసం అనేక ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తారు. ఇలా మావోయిస్టులు గుంపులు గుంపులుగా ఆలివ్ గ్రీన్ దుస్తులు ధరించి, ఆయుధాలు చేతబూని, వీపున మరికొన్ని వస్తువులు మోస్తూ నడుచుకుంటూ వెళుతున్న ఫోటోలను ఇస్రో పోలీసు శాఖకు అందజేయనుంది. ఈ ఫోటోలు ఏ ప్రాంతానికి సంబంధించినవో కూడా ఇస్రో చెబుతుంది. దీనివల్ల మావోయిస్టులపై పైచేయి సాధించేందుకు వీలుంటుందని పోలీసు ఉన్నతాధికారులు భావిస్తున్నారు. ఇస్రో అందించే ఫోటోలు పోలీసు శాఖకు నిజంగానే ఉపకరిస్తే నక్సలైట్లపై పోలీసులు కచ్చితంగా పైచేయి సాధించే వీలుందనడంలో ఎలాంటి సందేహం లేదు. ఇందు కోసం పోలీసు అకాడమిలో కొత్తగా ఏర్పాటు చేయనున్న సైబర్ ల్యాబ్‌లో ప్రత్యేకంగా ఒ విభాగాన్ని ఏర్పాటు చేయనున్నారు.

గంజాయితోపాటు అసాంఘిక కార్యకలాపాల వివరాల సేకరణ మరింత సులభం

ఇదిలావుండగా ఇస్రోతో పోలీసుశాఖ చేసుకున్న అవగాహనవల్ల మరో ప్రయోజనం కూడా ఉంది. రాష్ట్రంలో సవాల్‌గా మారిన గంజాయి సాగు, అసాంఘీక కార్య కలాపాలపై ఎప్పటికప్పుడు సమాచారం సేకరించేందుకు ఇస్రో ఫోటోలు ఉపయోగపడన్నాయి. రాష్ట్రంలోని ఉమ్మడి వరంగల్, మెదక్ జిల్లాలతో పాటు మరికొన్ని ప్రాంతాలలో గల మారుమూల గ్రామాలలో గంజాయి సాగు వేల ఎకరాల్లోవుండడం తెలిసిందే. గంజాయి మాఫియా ఇందులో కీలకపాత్ర వహిస్తోంది. గంజాయి మాఫియావల్ల విద్యార్థులతోపాటు యువత తమ జీవితాలను నాశనం చేసుకుంటుండడం తెలిసిందే. ఇదే సమయంలో వేలాది కుటుంబాలు అనాథలుగా మారుతున్నాయి. పోలీసులతోపాటు నార్కోటిక్ విభాగం అధికారులు ఎన్ని ప్రయత్నాలు చేసినా గంజాయి సాగును పూర్తిగా ఆపలేక పోతున్నారు. ఇదే సమయంలో చాలా చోట్ల అసా ంఘీక కార్యకలా పాలు పోలీసులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. ఇస్రోతో కుదిరిన అవగాహనతో గంజాయి సాగుతో పాటు అసాంఘీక కార్యకలాపాలపై పోలీసులు మరింత కఠిన చర్యలు తీసుకునే వీలుంది.

యువతి తలపై బండరాయితో మోది దారుణహత్య

కట్టుకోవాల్సినవాడే కడతేర్చాడంటూ బంధువుల ఆరోపణ



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎల్‌బినగర్ డిసిపి వెంకటేశ్వర్‌రావు, అనూష (ఫైల్)

హాయత్‌నగర్, జనవరి 30, ప్రభాతవార్త: ఓ యువతిని తలపై బండరాయితో మోది దారుణంగా హత్య చేసిన సంఘటన హాయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు, బంధువుల కథనం ప్రకారం..నల్గొండ జిల్లా దేవరకొండకు చెందిన అనూష (24) నగరంలో బిటెక్ పూర్తి చేసుకుని స్వగ్రామంలో తల్లితో నివాసముంటోంది. ఇటీవల కాలంలో అనూషకు తెలిసిన యువకుడితో వివాహ నిశ్చితార్థం జరిగింది. అప్పటికే ఉద్యోగ వేటలో ఉన్న అనూషకు ఉద్యోగం ఉందని, అందుకోసం ఇంటర్వ్యూకు హాజరు కావాలంటూ పెళ్లి చేసుకోబోయే యువకుడు అనూషకు ఫోన్‌చేసి నగరానికి పిలిపించాడు. దీంతో అనూష హాయత్‌నగర్‌లోని మిథాని కాలనీలో నివసించే తన సోదరి ఇంటి వద్దకు వచ్చింది. తన సోదరి, బావ ఇద్దరూ వారి స్వగ్రామంలో పని నిమిత్తం వెళ్లగా అనూష ఒక్కతే ఇంట్లో ఉంటోంది. ఈ క్రమంలో అనూషకు తన అక్క సోమవారం ఉదయం నుంచి ఫోన్ చేసినా స్పందించకపోవడంతో కాలనీలో తెలిసిన వారికి విషయాన్ని తెలిపి ఇంట్లో తన చెల్లెలు అనూష పరిస్థితిని చూసిరావాలంటూ పేర్కొనడంతో ఈ హత్య ఉదంతం వెలుగులోకి వచ్చింది. స్థానికుల ద్వారా విషయాన్ని తెలుసుకున్న ఎల్‌బీనగర్ డిసిపి వెంకటేశ్వర్‌రావు, ఎసిపి రవీందర్‌రెడ్డి, హాయత్‌నగర్ ఇన్‌స్పెక్టర్ సతీష్‌లు సంఘటనా స్థలాన్ని పరిశీలించగా అనూష తలపై తీవ్రమైన గాయాలు ఉండడంతో పాటు రక్తపు మడుగుల వద్ద అనూష మృతిచెంది ఉంది. ఈమేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు వివిధ కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.

తాళి కట్టాల్సినవాడే కడతేర్చాడు: అనూష కుటుంబసభ్యుడు

అనూషకు మాయ మాటలు చెప్పి ప్రేమించానని నిశ్చితార్థం చేసుకున్న మోతిలాలే తమ కూతురును హత్య చేశాడంటూ కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. అనూష హత్య జరిగినప్పటి నుంచి మోతీలాల్ ఫోన్ స్విచ్ ఆఫ్ చేయడంతో పాటు అతను అందుబాటులో లేకపోవడంతో అనూష కుటుంబసభ్యుల ఆరోపణలకు మరింత బలం చేకూరుతోంది. నింధితుడిని వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని కుటుంబసభ్యులు డిమాండ్ చేస్తున్నారు.

రేషన్ డీలర్లలో వణుకు

ఇపాస్, ఎలక్ట్రానిక్ మిషన్లు, ఐరిస్ అమర్చిన అధికారులు
ఆన్‌లైన్, వాట్సాప్‌ద్వారా డీలర్లపై ఫిర్యాదులు
ప్రభుత్వ కఠిన నిర్ణయాలపై ఆందోళన
రాజీనామా చేసేందుకు సమాలోచనలు

హైదరాబాద్, జనవరి 30, ప్రభాతవార్త: ప్రభుత్వ చౌకధరల దుకాణాలను పక్కా పారదర్శకంగా నిర్వహించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం రేషన్ దుకాణాల్లో ఈపాస్,ఎలక్ట్రానిక్ వేయింగ్ మిషన్లు ,ఐరిస్ మిషన్లు అమర్చడంతొఓ రేషన్ పోర్టబులిటి ,టీ రేషన్ పేరుతో మొబైల్‌యాప్ అందుబాటులోకి తీసుకువచ్చిన ఆశాఖ అధికారులు తాజాగా అమలు చేస్తున్న ఆన్‌లైన్ ,వాట్సాప్ ఫిర్యాదులతో రేషన్ డీలర్ల వెన్నులో వణుకు పుట్టిస్తునా న్నరు.గ్రేటర్ పరిధిలోని 14సర్కిల్స్‌లో సుమారు 12లక్షల ఆహారభద్రత కార్డులకు సేవలందిస్తున్న 1545మంది రేషన్ డీలర్లు రేషన్‌సరుకుల అందజేస్తున్నారు. ప్రతి డీలరు నెలకు రూ.25వేల ఖర్చు వస్తుందని, కమీషన్ మాత్రం రూ.10వేలు దాటడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.గతంతో పోల్చితే ప్రస్తుతం రేషన్ డీలర్లలో బాధ్యత పెరిగింది. నూతన సంస్కరణలు అమలులోలేని సమయంలో ప్రతినెల మొదటి రెండు వారాల్లోనే సరుకులు పంపిణీ చేసి గడువు ముగిసిందంటూ మిగిలిన సరుకులు బ్లాక్‌మార్కెట్‌కు తరలించేవారు. రేషన్‌పై ఇన్స్ సెక్టర్లు తనిఖీలకు వచ్చినప్పుడు వారి నయానో,భయానో చేసి కీ రిజిస్టర్‌లో తప్పుడు లెక్కలతో అధికారులకు సమర్పించేవారు.కానీ రేషన్ దుకాణాల్లో ఈపాస్ యంత్రాలతో పాటు ఎలక్ట్రానిక్ వేయింగ్, ఐరిస్ మిషన్లు ఏర్పాటు చేయడం వలన ప్రతినెల 1తేదీనుంచి 26తేదీవరకు ఖచ్చితంగా సరుకులను విక్రయించిన డీలర్లు తాజాగా ప్రభుత్వం నిర్ణయంతో ఈనెల నుంచి 15వరకు సరుకులు విక్రయిస్తున్నారు.దీంతో నెలలో ప్రతికార్డుదారుడు సరుకులు తీసుకుంటుండటం ,రోజు జరిగే క్రమవిక్రయాలపై ఉన్నతాదికారులు ఆన్‌లైన్‌లో పరిశీలిస్తున్న నేపథ్యంలో రేషన్ అక్రమాలకు తావులేకుండా పోయింది.

సమయపాలన పాటిస్తున్న డీలర్లు

వాస్తవానికి ప్రతిరేషన్ దుకాణం ఉదయం 8గంట నుంచి మధ్యాహ్నాం 12గంటలవరకు ,అలాగే సాయంత్రం 4గంటల నుంచి రాత్రి 8గంటలవరకు తెరిచి ఉండాలి,కానీ గతంలో ఇది రేషన్‌దుకాణంలోనూ అమలు జరిగేదికాదు. కానీ ఈ పాస్ విధానం అమల్లోకి వచ్చిన తరువాత తప్పని పరిస్థితుల్లో డీలర్లు సమయపాలన పాటిస్తున్నారు.నగరంలో ఏరేషన్‌దుకాణం ఏసమయంలో తీశారు.ఏసమయంలో మూసివేశారు అనే విషయం పౌరసరఫరాల శాఖ కార్యాలయాల్లో ఆన్‌లైన్ ద్వారా తెలుసుకునే వీలుండటంతో డీలర్లు ఖచ్చితమైన సమయపాలన పాటిస్తున్నారు. దీనికి తోడు పోర్టబులిటి సేవలు అందుబాటులోకి రావడంతో డీలర్లు నిర్ణీత గడువుకు ముందుగానే దుకాణాలను తెరుస్తున్నారు.కార్డుదారుడు ఏరేషన్ దుకాణంలో సరుకులను తెచ్చుకునే వెసులుబాటు ఉండటంతో పక్కషాపు కంటే ముందుగానే తన దుకాణం తీసి అందుబాటులో ఉంటే క్రయవిక్రయాలను పెంచుకునేందుకు డీలర్లు పోటీపడి రేషన్‌దుకాణాలను తెరుస్తున్నారు.

'ఫుడ్ అవార్డ్స్'కు నామినేషన్ల ఆహ్వానం

నాంపల్లి, జనవరి 30 ప్రభాతవార్త : హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ బిజినెస్2బిజినెస్ కంజూమర్ పోర్టల్ ట్రేడ్‌హైదరాబాద్ తెలంగాణ రాష్ట్రానికి చెందిన హోటల్స్, రెస్టారెంట్స్, కర్రీపాయింట్లు, బేకరీల నుంచి 'ట్రేడ్‌హైదరాబాద్ ఫుడ్ అవార్డ్స్-2018'గాను నామినేషన్లు ఆహ్వానిస్తున్నట్లు సంస్థ సీఇఒ బి.వెంకట్ తెలియజేశారు. స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందిస్తున్న ఆయా ఆహారశాలలను ప్రోత స్రహించడం కోసం ఈ అవార్డులను నెలకొల్పినట్లు ఆయన పేర్కొన్నారు. సౌత్‌ఇండియన్, నార్త్‌ఇండియన్, మొఘలాయి, కాంటినెంటల్, చైనీస్, బార్బిక్యూ ఆహారాన్ని అందించే అన్నిరకాల ఆహారశాలలు ఈ ఫుడ్ అవార్డ్స్ కోసం నామినేషన్లను సమర్పించవచ్చునని తెలిపారు. ఆహార శుభ్రత, నాణ్యత, తాజాదనం, రుచి, వంటగది శుభ్రత, నాణ్యమైన వాటి వాడకం, వినియోగదారులకు అందించే అత్యుత్తమసేవ, వేగంగా అందించడం తదితర అంశా ప్రాతిపదికగా ఏర్పాటు చేసిన జ్యూరీ సభ్యులు ప్రతీ పోటీదారుడి ఆహారపుశాలలను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత అవార్డులకు ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. నామినేషన్ల స్వీకరణకు ఆఖరుతేదీ ఫిబ్రవరి 24 అని, విజేతలకు అవార్డుల ప్రదానోత్సవం మార్చి 17వ తేదీన హైదరాబాద్‌లో నిర్వహించి ప్రదానం చేయడం జరుగుతుందని వివరించారు. మరిన్ని వివరాల కోసం వెబ్‌సైట్ 'ట్రేడ్‌హైదరాబాద్.కాం'లో చూడవచ్చునని ఆయన సూచించారు.

వేదవతిప్రభాకర్ లలితసంగీతం అతిమధురం: జస్టిస్ టి.రజని

రవీంద్రభారతి, జనవరి 30 ప్రభాతవార్త : విద్వత్కవి కందుకూరి రామభద్రరావు 113వ జయంతిని పురస్కరించుకొని ఆయన పేరున సాహితీ పురస్కారాన్ని సుప్రసిద్ధ లలిత, శాస్త్రీయ సంగీత గాయని, శ్వేతకోకిల వేదవతి ప్రభాకర్‌కు ఉమ్మడి తెలుగురాష్ట్రాల హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.రజని మంగళవారం రాత్రి రవీంద్రభారతిలోని సమావేశమందిరంలో జరిగిన కార్యక్రమంలో ప్రదానం చేశారు. అనంతరం జస్టిస్ టి.రజని మాట్లాడుతూ వేదవతి ప్రభాకర్ ఆలపించిన లలితగీతాలను ఎంతో ఆసక్తితో వింటానని, ఆమె పాటలు అతిమధురమన్నారు. డా. ఆర్.అనంతపద్మనాభరావు సభాధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గౌరవ అతిథులుగా కలగా కృష్ణమోహన్, డా. ఆర్.ప్రభాకరరావు, ఆత్మీయ అతిథులుగా కందుకూరి పుండరీకాక్షుడు, నటరాజు, రామకృష్ణలు పాల్గొనగా ప్రముఖ సాహితీవేత్త డా. ఓలేటి పార్వతీశం పురస్కార పరిచయం గావించారు. సభకు ముందు దివాకర్ల సురేఖామూర్తిచే జరిగిన లలితగీత విభావరి ఆహుతులకు వీనులవిందు చేసింది. కార్యక్రమాన్ని కిన్నెర కార్యదర్శి మద్దాళి రఘురామ్ పర్యవేక్షించారు.

మందుకొట్టి యాక్సిడెంట్ చేసిన సిఐ అరెస్ట్

ప్రమాదంలో పలువురికి తీవ్రగాయాలు

జవహర్‌నగర్, జనవరి 30, ప్రభాతవార్త: మందుబాబులను పట్టుకోవాల్సిన పోలీస్ అధికారే పీకలదాక మద్యం సేవించి పలువురి ప్రమాదానికి కారణమయ్యాడు...స్థానికులు దేహశుద్ధిచేసి పోలీసులకు అప్పగించారు. ఈ సంఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది వివరాలలోకి వెళితే.. నగరంలోని అంబర్‌పేటలోని పోలీస్ శిక్షణా కేంద్రంలో ట్రైనీ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న గిరీష్‌రావు జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని యాప్రాల్ జెజెనగర్‌లో కుటుంబ సభ్యులతో కలిసి నివాసముంటున్నాడు. సోమవారం రాత్రి మద్యం సేవించిన గిరీష్‌రావు తన ఇన్నోవా వాహనం(ఏపి 10 ఎఎస్ 6678)లో కౌకూర్ నుంచి యాప్రాల్‌కు వస్తున్నాడు. మద్యం మత్తులో ఉన్న సిఐ గిరీష్‌రావు యాప్రాల్ హనుమాన్ టెంపుల్ దగ్గరకు రాగానే రాంగురూటులో వచ్చి ముందు వెలుతున్న రెండు ద్విచక్రవాహనాలను, ఓ ఆటోను ఢీకొట్టాడు. దీంతో ద్విచక్రవాహనంపై వెళుతున్న దంపతుల కాళ్లు విరిగి ప్రమాదకరంగా మారడంతో స్థానికులు వెంటనే ఆసుపత్రికి తరలించారు. మరో ముగ్గరికి గాయాలయ్యాయి. ఐతే మద్యం మత్తులో ఉన్న సీఐ నేను పోలీసునంటూ చెదిరించడంతో స్థానికులు తిరగబడి దేహశుద్ధి చేసి జవహర్‌నగర్ పోలీసులకు అప్పగించారు.

సిఐపై కేసులు నమోదు, రిమాండ్, బెయిల్‌పై విడుదల

మందుకొట్టి వాహనం నడిపి పలువురి ప్రమాదానికి కారనమైన సిఐ గిరీష్‌రావును అరెస్టుచేసి పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు జవహర్‌నగర్ సిఐ చలపతి తెలిపారు. గిరీష్‌రావుపై అండర్‌సెక్షన్ 337, 338, 279, ఐపిసి సెక్షన్ 185 ఆఫ్ ఎంవి ఆక్ట్ కింద కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. సిఐ గిరీష్‌రావు బెయిల్‌పై విడుదలైనట్లు సమాచారం. పది వేల రూపాయల పూచీకత్తుపై విడుదలైనట్లు తెలిసింది. సిఐ విడదల పట్ల స్థానిక ప్రజలు మండిపడుతున్నారు. మద్యంమత్తులో ప్రమాదానికి కారణమైన వ్యక్తిని విడుదల చేయడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నిస్తున్నారు. సామాన్యులకు ఓ న్యాయం, పోలీసులకు మరో న్యాయమా? అంటూ మండిపడ్డారు.

శ్రీహరితీర్థ స్వాముల దివ్యహస్తములచే గ్రంథాల ఆవిష్కరణ



గ్రంథాలను ఆవిష్కరిస్తున్న శ్రీహరితీర్థ స్వాములు

నాంపల్లి, జనవరి 30 ప్రభాతవార్త: శ్రీ సత్యానందాశ్రమ పీఠాధీశ్వరులు పరమహంస పరివ్రాజకాచార్యులు, పూజ్యపాదులు శ్రీశ్రీశ్రీ శ్రీహరితీర్థ స్వాముల వారి దివ్యహస్తములచే 'శ్రీరమణ సేవాధురీణి, లలితకవి' చిల్లర వెంకటరమణయ్య రచించిన శ్రీరమణ రాగసుధామాలిక, శ్రీరమణ చరితామృతము గ్రంథాలను మంగళవారం రాత్రి నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్ వద్దనున్న పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలోని డా. నందమూరి తారక రామారావు కళామందిరంలో ఆవిష్కరింపజేశారు. ఈ సందర్భంగా స్వాములవారు అనుగ్రహ భాషణము గావించారు. భగవాన్ శ్రీరమణ మహర్షి హరికథాగానామృత మహోత్సవ ఆహ్వానం మేరకు జరిగిన ఈ కార్యక్రమంలో ముందుగా జ్యోతిప్రకాసనం, కర్ణాటక సంగీత విద్యాంసురాలు ఆమంచర్ల హైమావతిచే ప్రార్థనా గీతాలాపన జరిగాయి. ప్రముఖ ఆధ్యాత్మికవేత్త బ్రహ్మశ్రీ జి.వి.రామకృష్ణ మూర్తి, రమణ భక్తవరేణ్యులు పామరాజు వెంకట లావణ్యరావులచే సందేశములివ్వబడ్డాయి. అనంతరం కంచికామకోటి పీఠాధిపతి గారిచే అభినవ మాతంగి బిరుదాంకిత హరికథా కళాకారిణి డి.ఉమామహేశ్వరి చిల్లర వెంకటరమణయ్య విరచిత తొలి తెలుగు శ్రీభగవాన్ రమణ మహర్షుల వారి హరికథాగానామృతము ఆహుతులను పంచి శ్రీభగవాన్ రమణ మహర్షుల వారి అనుగ్రహపాత్రులు కావించారు. కార్యక్రమాన్ని రమణ మహర్షి హెరిటేజ్, వాసిష్ట గణపతి మునిట్రస్ట్ అధ్యక్షుడు పరాశర ఎం.నరసింహం పర్యవేక్షణా సహకారమందించారు. సరస్వతీ ఉపాసకుడు దైవజ్ఞశర్మ తదితరులు పాల్గొన్నారు.

వార్త

ఓర్పు చేదుగానే ఉంటుంది. కాని దాని ఫలితం మాత్రం మధురంగా ఉంటుంది.

-రూసో

చేజారుతున్న శాంతిభద్రతలు

శాంతిభద్రతలేనిదే అభివృద్ధిలేదు. ఎంత అభివృద్ధి చేసినా, మరెన్నిసంక్షేమ పథకాలు చేపట్టినా శాంతిభద్రతలు లోపించిన నాడు అవన్నీ బూడిదలో పోసిన పన్నీరే. ఎందరో రాజులు శాంతి భద్రతలను కాపాడటంలో విఫలమై రాజ్యాలు కోల్పోయిన సంఘటనలు కోకొల్లలు. స్వాతంత్య్రం వచ్చినతర్వాత కూడా శాంతిభద్రతలు కాపాడేందుకు పాలకులు ఎంతో ప్రాధాన్యత ఇచ్చారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చరిత్ర చూసినా ఏదో ఒక్కసారి తప్ప శాంతిభద్రత విభాగం ముఖ్యమంత్రి స్వీయ పర్యవేక్షణలోనే ఉంది. చట్టమన్నా, చట్టాన్ని కాపాడే అధికారులన్నా ప్రజలలో విశ్వాసమే కాదు భయభక్తులుండాలి. అంతే కాని రాత్రింబవళ్లు ప్రతి ఇంటికి ప్రతి వ్యక్తికి భద్రత కల్పించడం సాధ్యమయ్యే పని కాదు. అందుకు చట్టం పట్ల అది అమలు చేసే అధికారుల పట్ల నమ్మకం ఏతప్పు చేస్తే ఎక్కడ నుండి తొంగిచూస్తారో, పట్టుకొంటారో, జైళ్లకు పంపుతారనే భయాలే శాంతిభద్రలను కాపాడడంలో కీలక పాత్ర వహిస్తాయి. అవి సన్నగిల్లితేహత్యలు, దోపిడీలు ప్రారంభమై అరాచకం ప్రబలుతుంది. ఇటీవల తెలుగు రాష్ట్రాల్లో జరుగుతున్న హత్యలు, దోపిడీలు, అత్యాచారాలు తదితర నేరాలు చూస్తుంటే చట్టాలన్నా, పోలీసులన్నా భయభక్తులు సన్నగిల్లుతున్నాయేమోననిపిస్తున్నది. అది వ్యక్తిగత తగాదాలే కావచ్చు. లేక ఇతర సమస్యల కారణంగా ఉత్పన్నమైన పగలే కావచ్చు. కానీ ఇటీవల రెండు తెలుగు రాష్ట్రాల్లో నేరప్రవృత్తి పెరిగిపోతున్నది. పెరిగిన సాంకేతిక పరిజ్ఞానంతో నిందితులను పట్టుకుంటున్నా జైళ్లకుపంపుతున్నా ఇవేమి ఆగడం లేదు. సోమవారం రాత్రి ఒక యువతిని ముక్కలుముక్కలు నరికి సంచిలోవేసి మూటకట్టి గచ్చిబౌలి ప్రాంతంలో వదిలివెళ్లిన సంఘటన బయటపడింది. అలాగే హయత్‌నగర్ ప్రాంతంలో దేవరకొండ ప్రాంతానికి చెందిన అనూష అనే యువతిని కొందరు దుండగులు బండరాళ్ల మోది హత్యచేశారు. మొన్న నల్గొండ పురపాలక ఛైర్‌పర్సన్ బొడ్డుపల్లి లక్ష్మిభర్త శ్రీనివాస్‌ను బండరాళ్లతో కొట్టి మురికికాలువలోకి నెట్టి హత్యచేశారు. ఈ హత్య సంచలనం సృష్టించింది. ఇది రాజకీయ హత్యేనని వ్యూహం ప్రకారం ఇంట్లో ఉన్న తనభర్తను అక్కడికి పిలిపించి హత్యచేశారని మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఆరోపిస్తున్నారు. ఇది రాజకీయ హత్యకాదని, కేవలం క్షణికావేశంతో జరిగిన హత్య అని పోలీసు సూపరింటెండెంట్ స్పష్టం చేస్తున్నారు. ఏదిఏమైనా ఈహత్య రాజకీయవర్గాల్లో చర్చనీయాంశం అయింది. దీన్ని సిబిఐకి అప్పగించి విచారణ చేయించాలని కాంగ్రెస్ పార్టీ నేతలు డిమాండ్ చేస్తున్నారు. ఆ మరుసటి రోజే అదే జిల్లాలో ఒక యువకుడిని హత్య చేసి తలను వేరుచేసి రోడ్డుపక్కన ఉన్న దిమ్మెపై పెట్టారు. ఇక నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునూతల మండలం మామిళ్లపల్లి గ్రామానికి చెందిన ఒక యువకుడు ఆస్తి కోసం ఇద్దరు తమ్ముళ్లను, తండ్రిని దారుణంగా బండరాళ్లతో మోది మట్టుపెట్టాడు. కేవలం ఆస్తి కోసం మానవత్వం మరిచి రక్తసంబంధాన్ని విస్మరించి కుటుంబ సభ్యులనే పొట్టనపెట్టుకున్నాడు.

ఆదివారం రాత్రి హైదరాబాద్ శివారులోని చందానగర్‌లో భర్తే ముగ్గురు కుటుంబ సభ్యులను మట్టుపెట్టాడు. ఇక్కడే కాదు ఇటు తెలంగాణా లోనూ, అటు ఆంధ్రప్రదేశ్‌లోనూ ఏదో ఒక చిన్నచిన్న కారణాలతో హత్యాపరంపర కొనసాగుతున్నది. ఇక గతఏడాది మే చివరివారంలో కడపజిల్లా పొద్దుటూరులో పట్టపగలు వందలాది ప్రజలు చూస్తుండగా ఒక వ్యక్తిని మరో వ్యక్తికదలకుండా పట్టుకోగా ఇంకొకరు వేటకొడవళ్లతో అత్యంత కిరాతంగా చనిపోయేవరకు నరికి ఆ తర్వాత తాపీగా నడిచివెళ్లిపోయారు. కొందరు ఈ కిరాతకానికి వీడియోలో కూడా చిత్రీకరించారు. ఇలా చంపిన నిందితులు నేరుగా పోలీసుస్టేషన్‌కు వెళ్లి లొంగిపోయారు. ఇది ఫ్రాక్షన్ హత్యకాదని, వ్యక్తిగత కక్షలకారణంగా జరిగిందని పోలీసులు చెబుతున్నారు. అది ఎందుకు జరిగినా హత్యహత్యే. అందులోనూ పోలీసు స్టేషన్‌కు, కోర్టుకు కూతవేటు దూరంలో వందలాది మంది ప్రజలు ప్రత్యక్షంగా వీక్షిస్తుండగా నరికిచంపారంటే శాంతిభద్రతలు ఎంత భద్రంగా ఉన్నాయో చెప్పకనే చెబుతున్నాయి. ఇదేకాదు అంతకు ముందు కర్నూలు జిల్లాలో పత్తికొండ నియోజకవర్గంలో వైస్సార్ సిపి నాయకుడు నారాయణరెడ్డిని మాటువేసి మట్టుపెట్టిన తీరు కూడా ఆవేదనే కాదు ఆందోళన కలిగిస్తున్నది. హైదరాబాద్‌లో కిడ్నాప్‌లు, మహిళలపై అత్యాచారాలు, అన్నిటి కంటే ముఖ్యంగా రకరకాల దొంగల ముఠాలు విహారం చేస్తున్నాయి. చట్టంమీద అధికారులమీద నమ్మకం సన్నగిల్లడం వల్లనే ఈ దురదృష్టపు పరిస్థితులు దాపురిస్తున్నాయి. ముఖ్యంగా శాంతిభద్రతలు కాపాడటంలో కీలక పాత్ర వహిస్తున్న అధికారులు నిజాయితీతో అంకిత భావంతో నిష్పక్ష పాతంగా వ్యవహరించాలి. సమర్థులైన అధికారులున్నా, దురదృష్టవశాత్తు రాజకీయ నాయకులను ఎదిరించి అధికారంలో ఏ పార్టీ ఉంటే వారి అభీష్టం మేరకే పనిచేసుకొని పోయే అధికారులు ఎక్కువైపోయారు. రాష్ట్ర, జిల్లాస్థాయి అధికారులే అధికారపార్టీ నేతల ఆజ్ఞకుబద్ధులై వ్యవహరి స్తున్నప్పుడు కిందిస్థాయిసర్కిల్ ఇన్‌స్పెక్టర్, సబ్ ఇన్‌స్పెక్టర్, కానిస్టేబుల్ పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోవచ్చు. వారు కూడా పరిస్థితిని గమనించి తమ తమ పరిధిలో ఉండేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇది ఇప్పటికిప్పుడు వచ్చిన సంస్కృతి కాకపోయినా, దశాబ్దాలుగా కొనసాగుతున్నా ఇటీవల పెరిగిపోయింది. అయితే గతంలో నాయకుల పరిస్థితుల పట్ల అవగాహన తాము నిర్వహిస్తున్న పదవుల పట్ల గౌరవ భావాలు ప్రజలు ఏమనుకుంటారనే జంకు, భయం ఉండేవి. కానీ మారుతున్న పరిస్థితులతో పాటు అవి కూడా మారిపోయాయి. తమవారు హత్యలుచేసి వచ్చినా కాపాడాలనే ఏకైక సిద్ధాంతాన్ని ఆదర్శంగా చేసుకొని పనిచేస్తున్నారు. మొత్తంమీద పోలీసువ్యవస్థపై నమ్మకాలు సన్నగిల్లడం తోపాటు చట్టాల్లో ఉన్న లొసుగులతో తప్పించుకోవచ్చుననే నమ్మకం పెరిగిపోతున్నది. శాంతిభద్రతలు కాపాడే విషయంలో పాలకులు ఇప్పటికైనా త్రికరణ శుద్ధిగావ్యవహరించకపోతే భారీమూల్యంచెల్లించక తప్పదు.



దేశంలో నిత్యం ఏదో ఒక చోట ఎన్నికలు జరుగుతున్నాయి. వీటివల్ల ఆర్థిక వ్యవస్థ, అభివృద్ధిపై ప్రతికూల ప్రభావం పడుతుంది. ఎన్నికల ప్రవర్తనా నియమావళి వల్ల అభివృద్ధి కార్యక్రమాలకు ఆటంకం ఏర్పడుతోంది.

రామ్‌నాథ్ కోవింద్

రాష్ట్రపతి



జీడీపీ వృద్ధిరేటు క్షీణత, వ్యవసాయం అంతంత మాత్రం, ఉద్యోగాల పెరుగుదల దాదాపుగా శూన్యం వంటి ఏవో చిన్న చిన్న సమస్యలే తప్ప వి మంచి రోజులే మరి.

రాహుల్‌గాంధీ

కాంగ్రెస్ అధ్యక్షుడు

ప్రజావాక్కు

దివ్యాంగులకు రిజర్వేషన్

ఆర్టీసీబస్సుల్లో దివ్యాంగులకు సీట్లరిజర్వేషన్ ఉండాలి. వారికి ప్రత్యేకంగా కొన్ని సీట్లను కేటాయించి, వారి సీట్లలో వారినే కూర్చునేలా చేయాలి. రద్దీగాఉండే రోజులలో ఆర్టీసీ బస్సులలో సీట్లు దొరకక దివ్యాంగులుపడే బాధలు వర్ణనాతీతం. అందుకే ఎంత రద్దీగా ఉన్నా సరే వారికి సీట్లను రిజ ర్వుచేసి, వారినే కూర్చునేలా చేస్తే బాగుంటుంది. అలాకాక వారు నిల్చొని ఉండగా వారిసీట్లలో వేరేవారు కూర్చొని ఉంటే అలా కూర్చున్న వారికి భారీగా జరిమానా విధించాలి. అలాగే వారి అంగవైకల్యంలోని శాతాన్నిబట్టి, ఛార్జీలలో తగ్గింపును పెంచితే బాగుంటుంది. ఎక్కువ వైకల్యం ఉన్నవారికి ఎక్కువ రాయితీ ఇవ్వాలి.

-సరికొండ శ్రీనివాసరాజు, వనస్థలిపురం

కూడుపెట్టని కులవృత్తులు

రాజకీయ నాయకులు మేధావులు. ప్రజల పేరు చెప్పి తమ స్వార్థప్రయోజనాల కొరకు ఎప్పటికప్పుడు చక్కటి ప్రజాకర్షక ప్రణాళికలు సిద్ధపరుస్తూనే ఉంటారు. ప్రజలు అమాయకంగా ఏమీ చేయలేక, చేసేదిలేక వారి ఉచ్చులో చిక్కుకుపోతూ ఉంటారు. నాయకులు ఎల్లప్పుడూ సమాజంలో ఐక్యత కాకుండా జాగ్రత్తపడుతూ, సమాజాన్ని విడగొడుతూ తమ ఆధిపత్యాన్ని నిలుపుకుంటూ సాగుతుంటారు. మతాలను, కులాలను అడ్డం పెట్టుకొని వాటిలోచిచ్చురగులుస్తూ అశాంతిని సృష్టిస్తూ ఉంటారు. అధిక సంఖ్యాబలం గల కులాలను (ఓటు బ్యాంకు)దరిచేర్చుకుంటూ బుజ్జగిస్తూ ఉంటారు. కులవృత్తులను తామెప్పుడూ ప్రోత్సహిస్తామని, వాటి ద్వారానే చక్కటి ఉపాధి లభిస్తుందని నమ్మబలుకుతారు. దానితో ఆయా కులాలు తమ కులవృత్తినే నమ్ముకుంటూ ఆర్థికంగా అవస్థలు పడుతుంటారు.

-బి.ఎన్.సత్యనారాయణ, హైదరాబాద్

గుట్కాపై నిషేధం విధించాలి

గుట్కామత్తు నగరాలు, పట్టణాల నుంచి పల్లెపల్లెకూ విస్తరించింది. దుకాణాల్లో వీటిని దొంగతనంగా అమ్ముతున్నారు. అధికారులు ఏం చేస్తున్నారో అర్థంకావడం లేదు. నిరక్షరాస్యులే కాకుండా ఉద్యోగులు, కార్మికులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు గుట్కానములుతూ తమ ఆరోగ్యానికి తామే చెరుపు చేసుకుంటున్నారు. నోటిక్యాన్సరు, పేగు క్యాన్సరు వంటి ప్రాణాంతక వ్యాధులకు గురి చేసే ఈ గుట్కాను నిషేధించాలి. తయారీ దశలో కూడా దీన్ని అరికట్టాలి. ప్రభుత్వం ఈవిషయంపైదృష్టి సారించాలి.

-జి.అశోక్, గోదూర్, జగిత్యాలజిల్లా

నోరు జారితే...

సినీరంగ ప్రముఖులు ఈ మధ్యకాలంలో నోటికి ఎంత మాట వస్తే అంత మాట మాట్లాడటం ఎక్కువయింది. వీరి మాటలు వివాదాస్పదమవుతున్నాయి. ఒకరిపై ఒకరు దాడులు చేసుకునే పరిస్థితిని సృష్టిస్తున్నాయి. తామేంచేసినా ఏంమాట్లాడినా చెల్లుతుందనుకుంటు అధికార పార్టీకి చెందిన నాయకులు మంత్రులు, ముఖ్యమంత్రులు కూడా ఇదే విధంగా ప్రవర్తిస్తున్నారు. సమాజంలో ప్రముఖ వ్యక్తులుగా చెలామణి అవుతున్న వారు వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం సరికాదు.

-ఎం.శ్రీనివాస్, హైదరాబాద్

ముచ్చెమటలు పట్టిస్తున్న పోలవరం

పోలవరం పనులలో అక్రమాలు చోటు చేసుకుంటున్నట్లు అందిన ఫిర్యాదు మేరకు ప్రధాని కార్యాలయం నుండి వివరణకు ఆదేశించడం రాష్ట్ర ప్రభుత్వానికి ముచ్చెమటలు పడుతున్నట్లు తెలుస్తుంది. పిఎంఒ ఆదేశాల మేరకు పోలవరం ప్రాజెక్టు ఆథారిటీ కార్యదర్శి రంగంలోకి దిగారని ఫిర్యాదులో పేర్కొన్నఅంశాలు హేతుబద్ధంగా పరిశోదన చేసి కేంద్ర జలవనరుల ఇంజినీరింగ్ ఛీఫ్‌కు రాసారు. కేంద్రానికి వివరణ ఇవ్వడంలో ప్రభుత్వం ఆలోచనలో పడింది.

-ఫణిభూషణరావు, రాజమహేంద్రవరం

ఆధార్‌తో ముప్పు

ఆధార్ కార్డు పౌరుల వ్యక్తిగత గోప్యతకు దానివల్ల కలుగుతున్న విపరీత నష్టం గురించి వస్తున్న విషపరిణామాలు తలెత్తినప్పుడల్లా కేంద్రప్రభుత్వం ఏదోఒకసాకు చెప్పి తప్పించుకుంటుంది. కాని ఇప్పుడు తప్పించుకునే పరిస్థితిలేదు. మళ్లీ తప్పించుకునేందుకు చూస్తే ఇక బిజెపికి రాంరాం చెపుతారు ప్రజలు. ఆధార్ సాఫ్ట్‌వేర్ అసాంఘికశక్తుల చేతుల్లోకి పోవడం వల్ల కోట్లాది భారతీయుల భద్రతకు ముప్పుకలుగుతుంది.

-కె.సీతారామాచార్యులు, అదులాపురం, తూ.గోజిల్లా

ప్రలోభాలకు లొంగవద్దు

ప్రతి ఎన్నికల సందర్భంగా అభ్యర్థులు ఓటర్లను ప్రలోభాలతో లొంగదీసుకోవడం పరిపాటి అయింది. ఎన్నికల ముందు ప్రజలకు డబ్బులుపంచడం, బహుమానాలు ఇవ్వడం, మద్యం తాగించడం జరుగుతుంది. ఓటర్లు ప్రలోభాలకు లొంగి, డబ్బులు పంచిన వారికే ఓటు వేయడం జరుగుతుంది. ప్రజాస్వామ్యం అమ్ముడుపోతుంది. అందుకే ప్రతి ఒక్కరూ విచక్షణ కలిగి ఉండాలి.

-ఎం.రాజేష్, వరంగల్

ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సాంఘిక, రాజకీయ పరిణామాలకు సంబంధించిన విశ్లేషణాత్మక వ్యాసాలు పంపగోరేవారు ఈ కింది ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు. e-mail : editpage@vaartha.com


న్యాయ వైరుధ్యాలు ప్రజాస్వామ్యానికే ప్రమాదం

ఎం.కె.కుమార్

భారతదేశఅత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టు తీర్పును దేశ ప్రజలందరూ గౌరవిస్తారు. అంతటి గౌరవ ప్రదమైన న్యాయమూర్తులు వ్యవస్థలోని అన్ని అవలక్షణాలకు, బలహీనతలకు అతీతంగా ఉండటం లేదని, వారు సైతం ప్రలోభాలకు, ఆశ్రితపక్షపాతానికి లోనవుతారని కొన్ని సంఘ టనలు రుజువుచేస్తున్నాయి. సామాన్యుడు తన హక్కులకు భంగం కలిగినప్పుడు ప్రభుత్వానికి మొరపెట్టుకుంటాడు. ప్రభుత్వం పట్టిం చుకోకపోతే మీడియా ముందుకు వెళతాడు. నిరసన, ఆందోళనను ప్రజాస్వామ్యపద్ధతిలో చేస్తాడు. ఇదే పద్ధతిని న్యాయమూర్తే పాటిస్తే ఎలా ఉంటుంది. భారతదేశ ఉన్నత న్యాయస్థానానికి చెందిన సీనియర్ జడ్జిలు మీడియా ముందుకు వచ్చినప్పుడు ప్రజలు ఆశ్చర్యపోయారు. ఎందుకంటే ప్రజలకేకాదు న్యాయమూర్తులకు అన్యాయంజరుగుతోందని, న్యాయస్థానాల్లోనే న్యాయంకొరవడిందనే విషయం ప్రజలకు తెలిసింది. న్యాయమూర్తులు మీడియాకు ఎక్కడం వల్ల సొంత లబ్ధి పొందలేకపోయారు. న్యాయవ్యవస్థ ప్రక్షాళన జరగలేదు. చీఫ్‌జస్టిస్‌పై చర్యలు చేపట్టలేదు. ప్రజలను రంజింపచేసే ఒక అంశంగా మాత్రమే ఈ సంఘటన చూపబడింది. జస్టిస్ గొగోయ్ చీఫ్ జస్టిస్ పదవిని పొందలేకపోవచ్చు. అలాగే మిగిలిన న్యాయమూర్తులు పదవీ విరమణ అనంతరం పొందాల్సిన సదుపాయాలు పొందలేకపోవచ్చు. ఈ సంఘటన మోడీ చేయించారని ప్రతిపక్షాలు అంటున్నాయి. నిజానికి చీఫ్ జస్టిస్ అధికార పార్టీ ఇరుకులో పడ్డ కేసులను, అధికారపార్టీకి అనుకూలంగా ఉన్న జడ్జిలకు ఇస్తున్నారని అర్థమవుతోంది. తద్వారా ప్రభుత్వానికి అండదండలు అందిస్తున్నారు. లోయా కేసు దేశంలో అత్యంత రెండవ శక్తివంతమైన వ్యక్తి అమిత్‌షాను ఇరకాటంలో పెట్టింది. చాలా కేసుల్లో కోర్టు తీర్పులను బట్టి దేశ రాజకీయాలు మారుతున్నాయి. ఉదాహరణకి అయోధ్య తీర్పులో కోర్టుఇచ్చే తీర్పునుబట్టి, బిజెపి తన దూకుడును పెంచడమో, తగ్గించడమో చేస్తుంది. కొలీజియానికి సంబంధించి ప్రస్తుత వివాదనేపథ్యంలో మోడీన్యాయవ్యవస్థపై పట్టుకోసం ప్రయత్నించవచ్చు. స్వతంత్ర న్యాయవ్యవస్థపై అధికారపార్టీ పట్టు వుండటంవల్ల న్యాయవ్యవస్థకు రాజకీయరంగు పులుముకుంటుంది. అది మరో సిబిఐగా మారిపోవచ్చు. 1958లో 14వ లా కమిషన్ నివేదికను సమర్పించింది. ఈ నివేదికలో న్యాయమూర్తులను నియమించే విషయంలో కార్యనిర్వాహక వ్యవస్థ ప్రభావం ఎక్కువగా కనిపిస్తోందని పేర్కొన్నారు. సుప్రీంకోర్టులో న్యాయం కొరవడిందని సీనియర్ న్యాయమూర్తులు జస్టిస్ జాస్తిచలమేశ్వర్, జస్టిస్, రంజన గొగోయ్, జస్టిస్ మదన్ బి.లోకూర్, జస్టిస్ కురియన్‌జోసెఫ్ మీడియా ద్వారా దేశ ప్రజలకు చెప్పేశారు. ఇదే విషయాన్ని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రాకు ఇదే విషయం లేఖరాసి మరీ చెప్పారు. అయినా ఆయనపట్టించుకోలేదని న్యాయమూర్తులు పేర్కొన్నారు. న్యాయవ్యవస్థ పనితీరును సామాన్యుడు ప్రశ్నిస్తే కోర్టుధిక్కారం కింద కేసులుపెడతారు. న్యాయవ్యవస్థ తీర్పులను ప్రశ్నించే అధికారం సామాన్యులకువుండాలి. రాజ్యాంగంలోని వాక్‌స్వాతంత్య్రపు హక్కులో భాగంగా ఈ హక్కుపౌరునికి సంక్రమించింది. న్యాయవ్యవస్థలో ఉన్నఅంతర్గత పనివిధానం, వైరుధ్యాలు, బేధాభిప్రాయలను న్యాయమూర్తులు తమఫోరంలో చర్చించుకుని పరిష్కరించుకోవచ్చు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికే తెలియచేశామని, ఆయన పట్టించుకోలేదని న్యాయమూర్తులే ప్రస్తావించారు. ఏడు పేజీల లేఖలో న్యాయమూర్తులు అనేక అంశాలను ప్రస్తావించారు. ఈ అంశాలపై దృష్టిసారించాల్సిన అవసరంఉంది. అంతేకాని న్యాయమూర్తులు కోర్టు ధిక్కారానికి పాల్పడ్డారని వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలనుకోవడం భావ్యంకాదు. నిజానికి న్యాయమూర్తుల భావ ప్రకటనా స్వేచ్ఛను వివిధ దేశాలు పొగిడాయి. పాకిస్థాన్ పత్రికలు భారత్‌లో ప్రజాస్వామ్యం మిగిలిన దేశాల్లో కన్నా ఎక్కువగా ఉందని పేర్కొంది. న్యాయమూర్తులను నియమించడంలో కేంద్ర ప్రభుత్వం జోక్యం వుండాలా, కొలీజియం ద్వారా న్యాయవ్యవస్థే నియమించుకోవాలా అనే వివాదంఅనాదిగా వస్తోంది. 1975-77 మధ్యకాలంలో న్యాయమూర్తులనియామకాల్లో కేంద్రంజోక్యం ఎక్కువగా చేసుకుంటుందనే విమర్శలువచ్చాయి. అయితే ధిక్కార న్యాయమూర్తుల్లో ఉన్నవారికి చీఫ్ జస్టిస్ పదవిఇవ్వకపోవచ్చనే లీకులు వచ్చాయి. 1976లో సుప్రీంకోర్టు అత్యవసర పరిస్థితిలో ప్రాథమిక హక్కులు ఉండవని మెజారిటీ న్యాయమూర్తులు తీర్పునిచ్చాయి. ఈ తీర్పును జస్టిస్ హెచ్ఆర్ ఖన్నా వ్యతిరేకించారు. ఆయనకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి పదవిని కేంద్రం నిరాకరించింది. న్యాయవ్యవస్థ తీరుతెన్నులను ప్రశ్నించిన వారెవ్వరికి ఉన్నత పద వులుదక్కలేదు. న్యాయమూర్తులకు దేశవ్యాప్త గుర్తింపు ఉంది. వారు అనేక ముఖ్యమైనకేసుల్లో కీలకమైన తీర్పులుఇచ్చారు. సుప్రీం కోర్టులో 31మంది న్యాయమూర్తులు తాజా ఘటన పై ఇప్పటివరకు స్పందించలేదు. సుప్రసిద్ధ న్యాయకోవిదుడు సోలీసోరాబ్జీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌కు న్యాయమూర్తులు తమ అసహనాన్ని తెలియ చేసి ఉండాల్సిఉందన్నారు. ఇంత సంక్షోభం వచ్చినప్పుడు రాష్ట్రపతి స్వయంగా న్యాయమూర్తులను పిలిచి సమస్యపరిష్కారానికి చొరవ చేయవచ్చు.

న్యాయమూర్తుల మధ్య వివాదాలను సామరస్యంగా పరిష్కరించేందుకు జస్టిస్ ఎన్.వి రమణ ఒక ప్రయత్నం చేశారు. ఇరువర్గాలు సమస్యను పరిష్కరించుకోవాలనే ఉద్దేశ్యంతోనే ఉన్నారు. న్యాయవ్యవస్థ ఇస్తున్నతీర్పుల వెలుగులోనే శాసనాలను, చట్టాలను తయారు చేయడం జరుగుతోంది. ప్రజాస్వామ్యాన్ని పటిష్టపరచాలంటే న్యాయవ్యవస్థ విశ్వసనీయంగా పనిచేయాల్సి ఉంది. తీర్పును వెలువరించడంలో ఎప్పుడూ మైనారిటీ వర్గం ఉంటుంది. అందరూ ఒకే విధమైన అభిప్రాయాన్ని కలిగివుండవలసిన అవసరంలేదు. భారత న్యాయవ్యవస్థకు రాజ్యాంగాన్ని అందులో పొందుపరచవలసిన విలువలను కాడాల్సిన గురుతర బాధ్యత ఉంది. ఇప్పటికే నలుగురు న్యాయమూర్తులతో సిజెఐ దీపక్‌మిశ్రా భేటీ అయ్యారు. మొత్తం సమస్యను జైట్లీ, రవిశంకర్, అటార్నీ జనరల్ పర్యవేక్షిస్తున్నారు. బయటివారి జోక్యం లేకుండానే సమస్యలను పరిష్కరించడానికి జస్టిస్ కురియన్ కృషి చేస్తున్నట్టు వార్తలు వచ్చాయి. న్యాయవ్యవస్థ సంక్షోభానికి ప్రధాని నరేంద్రమోడీ బాధ్యత వహించాలని కాంగ్రెస్, సీపీఐ పేర్కొన్నారు. న్యాయవ్యవస్థలో తిరుగుబాటురావడాన్ని ఆహ్వానించవలసి ఉంది. న్యాయమూర్తులు తమ ఆవేదనను ప్రజలకు తెలియచేయడం వల్ల న్యాయమూర్తుల మధ్య వైరుధ్యాలున్నాయని తెలుస్తోంది. మీడియా ద్వారా న్యాయమూర్తులు తమ ఆవేదనను వెల్లడించడం సరికాదని సీపీఐ అభిప్రాయపడింది. సోహ్రాబుద్దీన్ ఎన్‌కౌంటర్ కేసుకు సీబీఐ స్పెషల్ జడ్జి లోయా మరణానికి అమిత్ షా కారణమని వామపక్షపార్టీలు ఆరోపించాయి. న్యాయవ్యవస్థలో నిరంకుశ పద్ధతులు సంప్రదాయం, సీనియారిటీ ప్రాతిపదికన రాజ్యమేలుతున్నాయి. కొలీజియం పేరుతో న్యాయమూర్తులు ఇష్టానుసారం బెంచ్‌లను కేటాయిస్తూ వచ్చారు. మొదటి ఐదు స్థానాల్లో ఉన్న న్యాయమూర్తులు కొలీజియంగా ఉంటారు. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వానికే లేని విస్తృతాధికారాలు కొలీజియానికి ఇవ్వబడ్డాయి. న్యాయమూర్తులను నియమించే బాధ్యత కొలీజియమే చేస్తుంది. న్యాయమూర్తుల నియామకానికి ఎన్‌జేఏసీ ఏర్పాటు చేయాలని కేంద్రం భావించింది. దీన్ని సైతం సుప్రీంకోర్టు 4-1 మెజారిటీతో కొట్టేసింది. తమాషాగా కేంద్రం అభిప్రాయాన్ని సమర్థించిన వారు జస్టిస్ చలమేశ్వర్. సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ చలమేశ్వర్‌ను నియమించినప్పటి నుండి కొలీజియంతో విభేధాలున్నట్టు తెలుస్తోంది. ఒకేసారి సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా నియమితులైన జస్టిస్ చలమేశ్వర్, జస్టిస్ దీపక్ మిశ్రాలలో మొదటగా జస్టిస్ దీపక్ మిశ్రాతో ప్రమాణం చేయించడం వల్ల ఆయన సీనియర్ అయ్యారు. అందువల్ల దీపక్ మిశ్రా ప్రధాన న్యాయమూర్తి అయ్యారు. న్యాయమూర్తులకు కేసులు కేటాయించే విషయాల్లో సీనియర్లకు ముఖ్యమైన కేసులు ఇవ్వడంలేదు. తాజాగా వీరిద్దరి మధ్యఘర్షణ తీవ్రమైంది. డిసెంబరు 2017లో మెడికల్‌కళాశాల అవినీతికేసులో కొంత మంది సుప్రీంకోర్టు న్యాయమూర్తులు ఉన్నారు. ఈవిషయంపై ఓ స్వచ్ఛంద సంస్థ సుప్రీంకోర్టులో పిల్ వేస్తే, చీఫ్ జస్టిస్ దాన్ని జస్టిస్ సిక్రీ బెంచ్‌కు కేటాయించారు. ఈ పిల్ ప్రకారం చీఫ్‌జస్టిస్ దీపక్ మిశ్రా కూడా వివాదంలో ఉన్నారు. స్వచ్ఛంద సంస్థకు జస్టిస్ సిక్రీ బెంచ్‌కు కేసు ఇవ్వడం ఇష్టం లేదు. అందుకే మరో పిల్ జస్టిస్ చలమేశ్వర్ సమక్షంలోవేసింది. ప్రధానన్యాయమూర్తి పేరు ఉన్నందువల్ల బెంచ్ నుండి ఆయన తప్పుకోవాల్సి వస్తుంది. అప్పుడు రెండో స్థానంలో ఉన్న జస్టిస్‌చలమేశ్వర్ నేతృత్వం వహించాల్సి ఉంటుంది. అయితే ఆ కేసును 8,10,17 స్థానాల్లో ఉన్న న్యాయమూర్తులకే చీఫ్ జస్టిస్ కేటాయించడంతో వివాదం ముదిరింది. ముఖ్యంగా ఆరు నెలల నుండి సీనియర్లకు ప్రాధాన్యత ఉన్నకేసులను అప్పగించడం లేదు. మహారాష్ట్ర న్యాయమూర్తి మరణిస్తే, ఆ కేసు జూనియర్లకే కేటాయించారు. చీఫ్ జస్టిస్ దీనికి సమాధానం ఇస్తూ రోస్టర్ మాస్టరే సుప్రీం అని ఆయనకిష్టమైన వారికే కేసులుఇవ్వడం హెచ్‌ఎల్ దత్తు ప్రధాన న్యాయమూర్తిగా ఉన్నప్పటి నుండి నడుస్తోందని చెప్పారు. ప్రధాన న్యాయమూర్తి నిజానికి న్యాయమూ ర్తుల్లో మొదటి వ్యక్తి మాత్రమే. ముఖ్యమైన కేసులను ఆయనకు ఇష్టమొచ్చిన వారికి కేటాయించడం సరికాదు. న్యాయవ్యవస్థ పరిపాలన సరిగాలేదని వారు భావించారు. అందుకే వారు ప్రజలదృష్టికి విషయాన్ని తీసుకువచ్చారు. సోహ్రాబుద్దీన్ ఎన్‌కౌంటర్ కేసును విచారిస్తున్న న్యాయమూర్తి జస్టిస్ బీహెచ్ లోయా అనుమానాస్పదంగా మరణించారు. డిసెంబరు 1, 2014లోజస్టిస్ బీహెచ్‌లోయా తనసహచరుడి కూతురి వివాహానికి నాగపూర్ వెళ్లాడు. అక్కడే అతను మరణించాడు. లోయా మృతిపై ఆయన సోదరి నవంబరు 2017లో అనుమానాలు వ్యక్తం చేసింది. ఈ మేరకు సుప్రీం కోర్టు స్వతంత్ర విచారణ జరిపించాలని రెండు పిటిషన్లు సుప్రీంకోర్టులో దాఖలయ్యాయి. మహారాష్ట్ర ప్రభుత్వాన్ని కోర్టు ఆదేశిస్తూ, కేసు వివరాలను పోస్టుమార్టమ్ రిపోర్టును సమర్పించమంది. బాంబే హై కోర్టులోనుఈ కేసు విచారణలో ఉంది. న్యాయమూర్తులు లేవనెత్తిన అంశాలు ప్రజాస్వామికమైనవి. వాటిని పరిష్కరించాల్సిన బాధ్యత చీఫ్ జస్టిస్‌పైన ఉంది. లేనిపక్షంలో ప్రజలు న్యాయవ్యవస్థపై విశ్వాసం కోల్పోయే ప్రమాదముంది. ఇది ప్రజాస్వామ్యవ్యవస్థకు ఇబ్బందికరమైన ప్రమాదం. చీఫ్ జస్టిస్ తనకు అనుకూలమైన జడ్జీలకే ముఖ్యమైన కేసులు ఇవ్వడం సరికాదు. న్యాయవ్యవస్థను సమాచార హక్కు చట్టానికి అతీతం చేయడం సరికాదు. కొలీజియం జడ్జీల నియామకం చేపట్టేటప్పుడు కులం, మతం, ప్రాంతీయత, రాజకీయా నికి, ఆశ్రితపక్షపాతానికి పాల్పడుతుందనే ఆరోపణలు తీవ్రమైనవి. కేంద్రప్రభుత్వం వేసిన నేషనల్ జుడిషియల్ అపాయింట్‌మెంట్ కమి షన్‌ను సుప్రీంకోర్టు రద్దు చేసి కొలీజియం ఉండాలని చెపుతోంది. ప్రభుత్వం కొలీజియం ఉండకూడదని అంటోంది. కేంద్రం, సుప్రీం కోర్టు రెండూ ఆధిపత్య వ్యవస్థలే. ఈ రెండిటి మధ్య ఉన్న వైరుధ్యాలు తీవ్రమైనప్పుడు వాటి ప్రభావం తీర్పులపైన ఉంటోంది. రాజకీయ, న్యాయవైరుధ్యాలు ప్రజాస్వామ్యపటిష్టతకు భంగం కలిగిస్తాయి. ఈ వైరుధ్యాలను పరిష్కరించడంలో ఇరువర్గాలు తగిన చొరవ చూపి ప్రజాస్వామ్య, పౌరహక్కులను కాపాడేవిధంగా పనిచేయాల్సి ఉంది.

వర్తమాన వరవడిలో సామాన్యుని సణుగుడు



జోస్యుల వేణుగోపాల్

చాలా విషయాలలో ఖచ్చితమైన సరిహద్దు గీతలుండాల్సిన చోట లేకుండాపోవడంవల్ల అస్తవ్యస్థమై అభివృద్ధి కుంటుపడుతోంది. ఇంతకుముందు కేంద్రంఒకేపార్టీ పాలనలో ఉన్నప్పుడు అభివృద్ధి, అవినీతి అనేది సమాంతర రైలు పట్టాల్లా సాగిపోయినా ఖచ్చితమైన తేడాతో ఏది అభివృద్ధో, ఏది అవినీతో సామాన్యుడు సైతం గ్రహించగలిగేవాడు. తర్వాత వివిధ పార్టీల సంకలనం అనేక రంగులు కలసిన జనతా వస్త్రాల్లాంటి జనతా పార్టీ మూణ్నాళ్లకల్లా చిరిగి పీలికలై పార్టీల ఐక్యమత్యానికి సరిహద్దులు చెరిపివేసింది. తర్వాత వచ్చిన యూ.పి.ఏ, ఎన్.డి.ఏ లాంటి కిచిడీ ప్రభుత్వాలు కూడా సరైన విధానంలో నడవడం లేదు. అందుకే పార్టీలకు ప్రభుత్వానికి కచ్చితమైన తేడాఉండాలి. పార్టీలు ప్రభుత్వాలను డామినేట్ చేస్తే 'డామిట్' కథ అడ్డం తిరుగుతుంది. గెలిచేంతవరకే పార్టీ కానీ తర్వాత ప్రభుత్వం, ప్రజలు ఇవి రెండేకనపడాలి. దురదృష్టవశాత్తూ ఓడిపోయిన వారు ఇన్‌ఛార్జీలుగాను, పదవులూడి పోయిన రాజకీయ నిరుద్యోగులు పెత్తందార్లుగాను, పార్టీల కమిటీలు, కులసంఘాలు, కలగలవు కార్పొరేషన్లు, ఏ విషయం మీద పూర్తి అవగాహన లేకున్నా అన్నిశాఖల గురించి మాట్లాడే కొందరు మంత్రులు, ఎవరి మీదా కంట్రోల్ లేని ప్రభుత్వ పెద్దలు! అసలు అర్థమే కాని సందిగ్ధంలో అమాయకప్రజలు. కేంద్రం, రాష్ట్రాలలో ప్రస్తుతం కలిసి ఉన్న పార్టీల వల్ల ఎవ్వరికీ ప్రయోజనం లేదు. పూర్తి మెజారిటీ ఉన్న కేంద్రానికి అవసరం లేకపోయినా మేమున్నామంటూ అంశాలవారి మద్దతు ప్రకటించి అందులో మంత్రిపదవులు పొంది రాష్ట్రానికి రావలసినవి అడిగే హక్కును కోల్పోతున్నారు.

అలాగే రాష్ట్ర ప్రభుత్వంలో మంత్రి పదవులు తీసుకున్న కేంద్రం కూడా వారి పథకాలు స్వయంగా ప్రకటించుకునే అవకాశం లేక వాటిని నీరుగార్చి నిధుల విడుదల ఆపేస్తున్నారు. ఏది కేంద్ర పథకమో, ఏది రాష్ట్ర ప్రభుత్వ పథకమో తెలీకజనం జుట్టు పీక్కుంటున్నారు. ప్రత్యేకహోదాకు, ప్యాకేజీకి తేడా లేని విషయాన్ని రెండు ప్రభుత్వాలు కలిసి మనకు కళ్లకు కట్టినట్లు చూపించాయి. మొహమాటానికి పోయి కేంద్రం చేయాల్సిన పనులు రాష్ట్రాలు నెత్తిన వేసుకొని ఆ భారాన్ని మోయలేక జనం నెత్తిన వేయడం జరుగుతోంది. ఇదిగో అంటూఇవ్వలేని వ్యవస్థలు, మాకు కావాలంటూ అడగ లేని అవస్థలు. కేవలం ఇదంతా కలగాపులగం కావడం వల్ల వచ్చే అనర్థం. దేశ సరిహద్దుల్లో పాకిస్థాన్, చైనాలు హద్దులు చెరిపి మనలోకి జొరబడి అంతా మాదేనంటారు. ఏది హద్దో తెలియని సందేహంలో ఇవన్నీ గతపాలకుల నిర్వాకాలని ప్రస్తుతాన్ని నీరు గారుస్తుంటారు నేటి పాలకులు. వారికి వీరికి తేడా కనపడని ప్రజలు మరొక కొత్తశక్తి ఏదైనా రావాలని కోరుకుంటుంటారు. పని విధానంలోకానీ, జనం జేబులు గుల్ల చేయడంలో కానీ ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలకు తేడాలేకుండాపోయింది. ప్రభుత్వ బ్యాంకింగ్‌రంగం కూడా ప్రైవేట్‌వ్యాపారుల అవతారమెత్తి డిపాజిట్లకు గ్యారంటీ లేకుండా చేస్తోంది. ప్రతిరంగంలోనూ తేడాలేని నిర్లక్ష్యం. సంఘవిద్రోహశక్తులుగా మారడానికి కూడా చదువుకున్నవారు, నిరక్షరాస్యులు అనే తేడా లేదు. పాలక పక్షం పథకాలకురంగులు మారుస్తుంది. ప్రతిపక్షం వాటి హంగులుమార్చి ప్రచారం చేస్తుంది. న్యాయానికి, అన్యాయానికి సరిహద్దులు ఏనాడో చెరిగిపోయాయి. ఇక పండుగలు కూడా దీపావళి లాంటివి సౌండ్ పొల్యూషన అని కొంత మంది, సాంప్రదాయమని మరి కొంత మంది టి.విలో చర్చిస్తారు. పండుగ చేసుకోవడానికి సామాన్యుడి జేబులో లేని డబ్బు గురించి ఎవరికీ పట్టదు. నేరస్థుల తరపున కూడా వాదించడానికి న్యాయం ముందుకు వస్తుంది. సామాన్య ప్రజలంతా అర్థంకాని భాషలో 'ఏతావాతా ఏ చెట్టు కింద పడుకున్నా పీడకలలే' అని సణుక్కుంటూ దేవుడికి దణ్ణం పెట్టుకొని ఆయనమీదే భారం వేస్తున్నారు.

ఉపాధి పథకానికి కొత్త హంగులు

చెన్నుపాటి రామారావు

రాష్ట్ర విభజన అనంతరం ఆర్థిక సమస్యలతో ఇబ్బంది పడుతూ వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు నిధుల కొరత సమస్యతో ఆంధ్రప్రదేశ్ సతమతమవుతోంది. ఈ తరుణంలో గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు అనుసంధాన ప్రక్రియను అమలులోకితెచ్చారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులను 22కుపైగా ప్రభుత్వ శాఖలతో అనుసంధానించారు. గ్రామీణ ప్రాంతాల్లో గతంలో ఎన్నడూలేని విధంగా వివిధ అభివృద్ధి కార్యక్రమాలనుచేపట్టారు. పట్టణాలకు ధీటుగా మౌలికవసతులనూ ఆంధ్రప్రదేశ్‌ప్రభుత్వం కల్పిస్తోంది. సిమెంట్ రహదారులు, పక్కాగా మురుగు కాలువలు, గ్రామపంచాయితీ లాంటి ప్రభుత్వ సంస్థలకు పక్కాభవనాలు, అంతర్గత భూగర్భ మురుగు నీటి వ్యవస్థ, ఎల్ఈడీ వీధి దీపాలు లాంటి మౌలిక సదుపాయాలను కల్పిస్తూ గత మూడున్నర ఏళ్లుగా గ్రామాలను అభివృద్ధి కేంద్రాలుగా తీర్చిదిద్దుతున్నారు. అనుసంధాన ప్రక్రియ ద్వారా వసతుల ఏర్పాటులో ఏపీ తలమానికంగా నిలుస్తోంది. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా నైపుణ్యం అవసరం లేని పని చేయడానికి ముందుకొచ్చిన ప్రతి గ్రామీణ కుటుంబంలోని వయోజనులు ఒక ఆర్థిక సంవత్సరంలో 100 రోజులు పనిచేయవచ్చు. గ్రామీణ నిరుపేదలకు చట్టమే ఈ హక్కును ఇచ్చింది. వేతనదారులకు పని ఇవ్వడమే కాకుండా వారి కుటుంబాలకు సుస్థిర ఆదాయాన్ని ఇచ్చే ఆస్తులు లభించేలా చేయాలని చట్టం చెబుతోంది. ఖర్చుచేసే ప్రతి 100 రూపాయల్లో 60 రూపాయలు వేతనాలకు, 40 రూపాయలు మెటీరియల్‌కు ఖర్చు చేసే వెసులుబాటును చట్టమే కల్పిస్తోంది. ఈ నేపథ్యంలోనే పండ్ల తోటల పెంపకం, ఇంకుడు గుంతలు ఏర్పాటు, వ్యక్తిగత మరుగుదొడ్లు చేపట్టారు. ఇవేగాక మరికొన్ని అభివృద్ధి కార్యక్రమాలకు రాష్ట్రం ఆదర్శవంతమైనది. గతమూడేళ్ల ప్రగతిని నిశితంగా పరిశీలిద్దాం. పదివేలకి.మీ పొడవైన సిమెంటు రోడ్లను నిర్మించి దేశంలోనే ఆంధ్రప్రదేశ్ ముందంజ వేసింది. అలాగే అత్యధిక సంఖ్యలో 6,25,000 మరుగుదొడ్లు నిర్మించి దేశంలోనే అగ్రగామిగా నిలిచింది. 31వేల చెరువులను పునరుద్ధరించారు. 33వేల చెక్ డ్యామ్‌లు, ఊట చెరువులకు మరమ్మతులు పూర్తి చేశారు. 321 మండల స్త్రీ భవనాలను నెలకొల్పారు. మహాత్మాగాంధీ 150వజయంతి సందర్భంగా అక్టోబరు 2, 2019 నాటికి దేశవ్యాప్తంగా 50వేల గ్రామపంచాయితీల్లోని కోటి కుటుంబాలను పేదరికం నుంచి బయటకు తేవడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం నిర్దేశించింది. ఇందులో భాగంగానే ఏపీలో 3వేల గ్రామాల్లో ఈ లక్ష్యాన్ని నిర్దేశించి ప్రణాళికలు రూపొందిస్తున్నారు. 2015-16లో 1920లక్షల పనిదినాలను కల్పించగా 2016-17లో 2083 పనిదినాలు సాధ్యమయ్యాయి. ఇక 2017-2018లో ఈ పాటికే 1,761 పనిదినాలు కల్పన జరిగింది. నిర్ణీత సమయంలో వేతన చెల్లింపులు 83.41శాతం జరిగాయి. దేశవ్యాప్తంగా సగటున 84.98 శాతం జరగడం గమనార్హం. ఈ ప్రక్రియలో రాష్ట్రం 8వ స్థానంలో నిలిచింది. కొత్త ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పథకంలో రెండుపూటలు కూలీలు హాజరయ్యేలా 25 కోట్ల పనిదినాలు లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ ప్రణాళికను రచించింది. ప్రతి కార్మికుడు కనీస వేతనం పొందేలా పనులు గుర్తించే ప్రక్రియ చివరిదశకు చేరుకుంది. కేంద్రానికి సమగ్రంగా నివేదించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. వాస్తవానికి ఉపాధి హామీ పథకం కింద తొలుత ఈ ఏడాదికి 16కోట్ల పనిదినాలకే కేంద్ర ప్రభుత్వ గ్రామీణాభివృద్ధి శాఖ నుంచి ఏపీ అనుమతి తీసుకొంది. అయితే పెరిగిన డిమాండ్‌అనుగుణంగా దీన్ని20కోట్ల పనిదినాలుగా నిర్దేశించుకుంది. ఉపాధి పనుల కోసం కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన కనీస వేతనం తప్పనిసరిగా కూలీలు పొందేలా ఈసారి ప్రణాళికలు రూపొందుతున్నాయి. నిజానికి ఈ పథకం ప్రారంభమయ్యాక ఇప్పటి దాకా కనీస వేతనం పొందిన దాఖలాల్లేవు. ఈ ఏడాది కనీస వేతనం రూ.197గా ప్రకటించగా, రాష్ట్రంలో గరిష్టంగారూ.150 వరకు పొందగలిగినట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఉపాధి పథకంలో చేపట్టే పనుల్లో కొత్తఏడాదినుంచి పారదర్శకతకు అత్యంత ప్రాధాన్యమివ్వాలని రాష్ట్ర ప్రభుత్వం తలపోస్తోంది. ప్రతిపనిపై పంచాయితీ కార్యాలయాల్లో కేంద్రం నిర్దేశించిన 7రకాల దస్త్రాలు ఖచ్చితంగా అమలు చేయాల్సిఉంటుంది. కార్మికుల కోసం నిర్దేశించిన పనుల్లో ఎక్కడా, ఎట్టిపరిస్థితుల్లోనూ యంత్రాలను వాడకూడదు. విచారణలు, ఆడిట్‌లకు ఆస్కారమివ్వకుండా నిబంధనలకు లోబడి ఉపాధి పనులు చేయించాలని ప్రభుత్వం గట్టిగా ఆదేశాలిచ్చింది.

ఉపాధి హామీ పనులు అనగానే అవినీతి, అక్రమాలు అన్నదే నానుడి. ఎక్కడచూసినా వెతికినాఈవెలితిపైనే విమర్శలొస్తుంటాయి. పెచ్చుమీరినబిల్లులు, అరకొర పనులు, నిర్లక్ష్యం, ఎంతోకొంత వెనకేసుకోవడం మామూలేనని మనం వింటుంటాం. ఈ విమర్శలు వ్యాఖ్యలకు అడ్డుకట్ట వేసేందుకే పారదర్శక విధానానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నడుం బిగించింది. పథకం అమలులో సమూల మార్పులకు శ్రీకారంచుట్టింది. జరుగుతున్న అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఆయత్తమైంది. భువన్ పేరిట కొత్త సాఫ్ట్‌వేర్‌ను అందుబాటులోకి తీసుకొస్తోంది. ఆధునిక సాంకతిక పరిజ్ఞానంతో అవకతవకలను అరికట్టేవిధంగా ఈసాఫ్ట్‌వేర్ త్వరలో పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తుందంటున్నారు. బిల్లులు స్వాహా, తప్పుడు కొలతలు, లెక్కలు, పనులు ఇష్టానుసారం చేయడం లేదా మధ్యలో వదిలివేయడం లాంటివి మనం వింటూనేఉంటాం. దీన్ని దృష్టిలో ఉంచుకునే ఈ సాఫ్ట్‌వేర్‌ను తీసుకొస్తున్నారు. ప్రతి పనిని మొదలు పెట్టేందుకు ముందస్తు అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. అనుమతించిన పనులకే బిల్లులు ముడతాయి. పనులు పూర్తికాకుండా బిల్లులు మంజూరుకు అవకాశం లేదు. ఏదైనాసందర్భంలో పనిని మధ్యలో వదిలేసినట్లయితే అప్పటి దాకా చెల్లించిన మొత్తాన్ని సంబంధిత అధికారుల నుంచి రికవరీ చేస్తారు. ఇలా కొత్త నిబంధనలతో ఉపాధిహామీ పథకానికి కొత్త హంగులు సమకూర్చుతున్నారు. ఉపాధి కూలీలు కనీస వేతనాలు పొందేందుకు, పనిదినాలు పెరిగేందుకు కేంద్రం తీసుకొస్తున్న ఈ సరికొత్త ప్రయోగం సత్ఫలితాలిస్తుందని అధికారులు పేర్కొంటున్నారు. మరోవైపు ఉపాధిహామీలో రెండు పూటల పనివిధానాల వల్ల ప్రయోజనం ఉండదని వ్యవసాయ కార్మిక సంఘం పేర్కొంటోంది. పాత పద్ధతినే కొనసాగించి కనీస వేతనాలు సక్రమంగా లభించేలా చూడాలని కోరుతోంది. జాతీయ గ్రామీణ ఉపాధి పథకంలో ప్రారంభంనుంచి వ్యవసాయ కూలీలకు రోజువారీ కూలీకాకుండా క్యూబిక్ మీటర్ల కొలతలప్రకారం వేతనాలిస్తున్నారు. దీంతో కార్మికులకురోజుకురూ.197వేతనం నిర్ణయించినా, సగటున రూ.130నుంచి రావడం లేదన్నది కార్మికసంఘం వాదన.

అసాంఘిక నేరాలపై ఉక్కుపాదం

- చోరీలకు అడ్డుకట్ట వేసేందుకు గస్తీ ముమ్మరం - రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు: బాబూజీ



క్రైం సమావేశంలో పాల్గొన్న పోలీసు అధికారులనుద్దేశించి మాట్లాడుతున్న ఎస్పీ బాబూజీ

కడప క్రైం, జనవరి 30, ప్రభాతవార్త: అసాంఘిక నేరాలైన మట్కా, క్రికెట్ బెట్టింగ్, గ్యాంబ్లింగ్‌పై ఉక్కుపాదం మోపాలని జిల్లా ఎస్పీ అట్టాడ బాబూజీ పోలీసు అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మట్కాపై ప్రత్యేక దృష్టి సారించాలని, గతంలో మట్కా నిర్వాహకులుగా ఉన్న వారిపై నిఘా ఉంచాలన్నారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాలను నియంత్రించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. మిస్సింగ్ కేసులకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి త్వరితగతిన కేసులను ఛేదించాలన్నారు. చోరీలు జరగకుండా గస్తీని పెంచాలన్నారు. లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్ (ఎల్‌హెచ్‌ఎంఎస్) సత్ఫలితానిస్తోందని, కడప నగరంలో చోరీలు బాగా తగ్గేందుకు ఎల్‌హెచ్‌ఎంఎస్ వినియోగంతో పాటు బ్లూకోర్ట్స్ సిబ్బంది తాళాలు వేసిన ఇళ్లపై నిరంతరం నిఘా ఉంచడం కూడా ప్రధాన కారణమన్నారు. ఎర్రచందనం విషయంలో స్మగ్లర్లకు ఏ మాత్రం సహకరించినట్లు తేలినా అధికారులు, సిబ్బందిపై కఠిన చర్యలు తీప్పవని ఎస్పీ హెచ్చరించారు. ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధించేందుకు చెక్ పోస్టుల ఏర్పాటుపై సమావేశంలో చర్చించారు. పెండింగ్ కేసులను త్వరతిగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. జాతీయ, రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ సంబంధిత కేసులకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి త్వరితగతిన స్పందించాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానం వినియోగంలో కడప జిల్లా పోలీసు శాఖ రాష్ట్రంలో ముందంజలో ఉందని ఎస్పీ అభినందించారు. సాంకేతికతను అందిపుచ్చుకుని నేరాలు కట్టడికి, నేరాల పరిశోధనకు వినియోగించుకుని జిల్లా పోలీసు శాఖ సత్ఫలితాలు సాధిస్తోందని ఐటికోర్ టీం సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. నేర సమీక్షా సమావేశంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ జయలక్ష్మి ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరై పోలీసు అధికారుల న్యాయపరమైన సందేహాలకు సమాధానలిచారు. పలు కీలక కేసుల్లో సుప్రీం కోర్టు, హైకోర్టు తీర్పులను పోలీసు అధికారులకు వివరించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (ఆపరేషన్స్) అధ్నాన్ నయీం అస్మి, అదనపు ఎస్పీ (పాలన) ఎ. శ్రీనివాసరెడ్డి, ట్రైనీ ఎఎస్పీ వకుల్ జిందాల్, ఎస్.బి. డిఎస్పీలు చంద్రశేఖర్, రాజగోపాల్‌రెడ్డి, కడప డిఎస్పీ షేక్ మాసుంబాషా, జమ్మలమడుగు డిఎస్పీ కృష్ణన్, ప్రొద్దుటూరు డిఎస్పీ శ్రీనివాసరావు, రాజంపేట డిఎస్పీ లక్ష్మీనారాయణ, ఎఆర్ డిఎస్పీ మురళీధర్, జిల్లాలోని సిఐలు పాల్గొన్నారు.

దేశానికి రాష్ట్ర క్రీడా పాలసీ రోల్‌మోడల్

- ప్రతీ నియోజకవర్గంలో క్రీడా వేదిక
- పిపిపి పద్ధతిలో క్రీడల అభివృద్ధి: మంత్రి రవీంద్ర



క్రీడావందనం స్వీకరిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర, చిత్రంలో వీసి రాజేంద్రప్రసాద్, శాప్ విసిఎండి బంగార్రాజు, ప్రిన్సిపల్ సెక్రటరి గోపాలకృష్ణ ద్వివేది

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,జనవరి 30, ప్రభాతవార్త: ఏపిలో క్రీడల అభివృద్ధికి పబ్లిక్, ప్రయివేట్, పార్టనర్‌షిప్(పిపిపి) పద్ధతిలో ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు క్రీడా, న్యాయశాఖా మంత్రి కొల్లు రవీంద్ర వెల్లడించారు. ఏఎన్‌యులో ఆలిండియా సివిల్ సర్వీసెస్ ఉద్యోగుల అథ్లెటిక్స్ పోటీలను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన క్రీడల అభివృద్ధికి తీసుకున్న నిర్ణయాలను వెల్లడించారు. దేశంలో ఏపి క్రీడా పాలసీకి ప్రత్యేక స్థానం ఉంటుందన్నారు. ఈపాలసీ ద్వారా రాష్ట్రంలో ఉన్న ప్రతీ నియోజకవర్గంలో రూ.2కోట్లతో ఇండోర్, ఔట్‌డోర్ క్రీడా స్టేడియాలు నిర్మిస్తున్నట్లు వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో క్రీడా సదుపాలయాలను పెంచి క్రీడాకారులను తయారు చేస్తామన్నారు. ప్రతీ రోజు ఏదో ఒక క్రీడ ఆడటం వల్ల ఉద్యోగులుమానసిక ఒత్తిడిని తగ్గించుకోవచ్చునన్నారు. క్రీడా స్ఫూర్తి నింపేలా ఏపిలో క్రీడలకు ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. అమరావతిలో నిర్మిస్తున్న క్రీడా కాంప్లెక్స్ యునిక్‌గా ఉంటుందని, నిష్ణాతులైన శిక్షకులతో చిన్న వయస్సు నుండే క్రీడల్లో శిక్షణ ఏర్పాటు చేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. బ్యాడ్మింటన్‌కు ఏపి నెంబర్ -1 గా ఉందని ఆయన పేర్కొన్నారు. పుల్లెల గోపీచంద్, పివి.సింధు, కిదాంబి శ్రీకాంత్‌లు ఏపి వారు కావడం గర్వకారణంగా పేర్కొన్నారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ వైస్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ బంగార్రాజు మాట్లాడుతూ రెండేళ్ళ నుండి ఏపిలో క్రీడల అభివృద్ధి వేగంగా జరిగిందన్నారు. ఆధునిక క్రీడా సౌకర్యాలు కల్పించి క్రీడాకారులను తీర్చిదిద్దుతున్నామన్నారు. క్రీడాకారులకు ప్రోత్సాహకాలు ఇస్తున్నామని, ప్రత్యేక శిక్షణల ద్వారా క్రీడల్లో రాణించేలా క్రీడాకారులను తీర్చిదిద్దుతున్నామన్నారు. దేశ విదేశాల్లో పాల్గొనే క్రీడాకారులకు ప్రత్యేక నిధులు కేటాయిస్తున్నామని వివరించారు. ప్రిన్సిపల్ సెక్రటరి గోపాలకృష్ణ ద్వివేది మాట్లాడుతూ ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహిస్తుందని అందులో భాగంగా ప్రత్యేక క్రీడా పాఠశాలలు, అకాడమీలు, స్టేడియాలు నిర్మించి క్రీడా వసతులను పెంచుతున్నామని పేర్కొన్నారు. క్రీడల్లో నేరుగా 2శాతం రిజర్వేషన్‌తో ఉపాధి పొందవచ్చునన్నారు. ఏఎన్‌యు వీసి ఆచార్య రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఏఎన్‌యులో క్రీడా సౌకర్యాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.27 కోట్లు కేటాయించిందన్నారు. అనంతరం మంత్రి కొల్లు రవీంద్ర క్రీడలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో శాప్ ఓఎస్‌డి రామకృష్ణ, ఏఎన్‌యు వ్యాయామ విద్య డైరెక్టర్ ఆచార్య వై. కిషోర్, కళాశాల ప్రిన్సిపాల్ పాల్‌కుమార్, ఏపి అథ్లెటిక్ అసోసియేషన్ కార్యదర్శి రాఘవేంద్రరావు, ఏపి ఉద్యోగుల సంఘం సచివాలయ విభాగం అధ్యక్షుడు మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన మార్చ్‌ఫాస్ట్

సివిల్ సర్వీసెస్ ఉద్యోగులు చేసిన మార్చ్‌ఫాస్ట్ అలరించింది. రంగు రంగుల క్రీడా దుస్తులతో క్రీడా ప్రాంగణం అంతా త్రివర్ణ పతాకాలను చేబూని కలియ తిరుగుతూ ఆకట్టుకున్నారు. అన్ని రాష్ట్రా నుండి, 15 రీజనల్ స్పోర్ట్స్ బోర్డుల నుండి 1000మంది పురుషులు, 600మంది మహిళలు ఈ అథ్లెటిక్స్‌లో పాల్గొన్నారు.

సీమలో హైకోర్టు ఏర్పాటు ఉద్యమానికి ప్రజల్లో పెరుగుతున్న మద్దతు

- ప్రారంభమైన న్యాయవాదుల రిలే నిరాహార దీక్షలు
- మద్దతు తెలిపిన వివిధ రాజకీయ పార్టీలు

అనంతపురం, జనవరి 30, ప్రభాతవార్త: హైకోర్టును రాయలసీమలోనే ఏర్పాటు చేయాలని కోరుతూ న్యాయవాదులు చేస్తున్న ఉద్యమానికి ప్రజల నుండి మద్దతు లభిస్తున్నది. హైకోర్టు రాయలసీమలో ఏర్పాటు చేస్తేనే అభివృద్ధి సాధ్యమనే విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంతో న్యాయవాదులు సఫలీకృతులు అవుతున్నారు. న్యాయవాదులు తమ ఆందోళనను తీవ్ర తరం చేయడానికి ప్రయత్నాలు ముమ్మరం చేశారు. మంగళవారం నుండి రిలే నిరాహారదీక్షలు కోర్టు ఎదుట ప్రారంభమయ్యాయి. హైకోర్టు సాధనసమితి ఆధ్వర్యంలో అనంత బార్ అసోసియేషన్ సభ్యులు ఏర్పాటు చేసిన రిలే నిరాహార దీక్షను సీనియర్ న్యాయవాది గురుప్రసాద్, పౌరహక్కుల సంఘం కన్వీనర్ ప్రొఫెసర్ శేషయ్య ప్రారంభించారు. ఈ దీక్షలో న్యాయవాదులు హరనాథ్‌రెడ్డి, రవిప్రసాద్, లక్ష్మి నరసింహ వరప్రసాద్, ధరమ్‌సింగ్ నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ శేషయ్య మాట్లాడుతూ శ్రీబాగ్ ఒడంబడికకు కట్టుబడి ప్రభుత్వం సీమలోనే హైకోర్టు ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కోస్తా తరహాలో అభివృద్ధి సాధించాలంటే హైకోర్టు ఏర్పాటే శరణ్యమన్నారు. రాజధాని ఉన్నచోటే హైకోర్టు ఉండాల్సిన అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు. రాజస్థాన్ రాజధాని జైపూర్ అయితే, హైకోర్టు మాత్రం జోధ్‌పూర్‌లో ఉంది. ఈ జోధ్‌పూర్, జైపూర్‌కు 355 కిలోమీటర్ల దూరంలో ఉందనే విషయాన్ని పాలకులు గుర్తుంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కేరళ రాజధాని తిరువనంతపురం అయితే హైకోర్టు కొచ్చిలో ఉంది. ఒరిస్సా రాజధాని భువనేశ్వర్ అయితే కటక్‌లో, మధ్యప్రదేశ్ రాజధాని భోఫాల్ అయితే ఝుబల్‌పూర్ పెట్టి ప్రజలకు అనుకూలంగా హైకోర్టు బెంచీని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఉత్తర ప్రదేశ్ రాజధాని లక్నో అయితే హైకోర్టు అలహాబాద్ పెట్టారని ఆయన గుర్తు చేశారు. ప్రముఖ న్యాయవాది గురు ప్రసాద్ మాట్లాడుతూ రాయలసీమ అభివృద్ధి హైకోర్టు ఏర్పాటు ఒక్కటే మార్గమన్నారు. వెనుకబడిన సీమ జిల్లాలపై ప్రతినిధులు కూడా చిన్నచూపు చూస్తుండడం ఎంతో బాధ కల్గిస్తున్నదన్నారు. న్యాయవాదులు చేస్తున్న ఈ ఉద్యమం, ప్రజా ఉద్యమంగా ఆయన అభివర్ణించారు. రాయలసీమ అభివృద్ధి చెందాలనే ఉద్ధేశంతో చేస్తున్న ఈ న్యాయవాదుల ఉద్యమానికి ప్రజల నుండి సంపూర్ణ మద్దతు లభించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ రిలే నిరాహార దీక్షలలో అబ్దుల్ రసూల్, నారాయణ, గంగాధర్, సాకే నరేష్, రంగనాయకులు తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల ఉద్యమానికి వివిధ రాజకీయ పార్టీల మద్దతు

న్యాయవాదులు చేస్తున్న హైకోర్టు ఏర్పాటు ఉద్యమానికి పలు రాజకీయ పార్టీలు, మహిళా, ప్రజా సంఘాలు మద్దతు పలికాయి. న్యాయవాదుల ఆందోళనలో ప్రత్యక్షంగా పాల్గొంటామన్నారు. మద్దతు పలికిన వారిలో వైసిపి సమన్వయకర్త నదీమ్ ఆహ్మమద్, వైటి శివారెడ్డి, రాగేపరుశురాం, చవ్వా రాజశేఖర్ రెడ్డి, సోమశేఖర్ రెడ్డి, సిఐటియు నాయకులు వెంకటేష్, దిల్షాన్, ఐద్వా నాయకురాళ్లు సావిత్రి, యమున, సిపిఐ నాయకులు జగదీష్, సిపిఐఎంఎల్ నాయకులు పెద్దన్న తదితరులు తమ సంపూర్ణ మద్దతు తెలిపారు.

సిఎం చంద్రబాబుకు కళ్యాణదుర్గం ప్రజలు జీవితాంతం రుణపడి ఉంటారు: మంత్రి కాలవ



మంత్రి కాల్వ శ్రీనివాసులకు స్వీట్లు తినిపిస్తున్న సిఎం చంద్రబాబు

అమరావతి, జనవరి 30, ప్రభాతవార్త: అనంతపురం జిల్లా గుమ్మఘట్ల మండలంలో గగ భైరవాని తిప్ప ప్రాజెక్టుకు కృష్ణా జలాలు తీసుకురాడానికి అవసరమైన రూ.969కోట్లు విడుదల చేసినందుకు సీఎం చంద్రబాబునాయుడుకు తనతో పాటు కళ్యాణదుర్గం శాసనసభ నియోజకవర్గ ప్రజలు జీవితాంతం రుణపడి ఉంటారని రాష్ట్ర సమాచారశాఖ మంత్రి కాలవ శ్రీనివాసులు కృతజ్ఞతులు తెలియజేశారు. సచివాలయంలోని ముఖ్యమంత్రి కార్యాలయంలో సీఎం చంద్రబాబును మంత్రి మర్యాదపూర్వకంగా మంగళవారం కలిశారు. జీడిపల్లి రిజర్వాయర్ నుంచి కృష్ణా జలాలను ఎత్తిపోతల ద్వారా భైరవానితిప్ప ప్రాజెక్టుకు తరలింపునకు రూ.969కోట్లు మంజూరు చేయడం ఆనందకర విషయమన్నారు. భైరవానితిప్ప ప్రాజెక్టు ద్వారా 22,323ఎకరాలకు సాగునీటితో పాటు నియోజక వర్గ ప్రజలకు తాగునీటి సౌకర్యం కూడా కలుగుతుందన్నారు. సాగునీటితో కళ్యాణదుర్గం సస్యశ్యామలం అవుతుందని కళ్యాణదుర్గం నియోజకవర్గ ప్రజలు, రైతులు జీవితాంతం రుణపడి ఉంటామని సీఎం చంద్రబాబుకు మంత్రి కాలవ శ్రీనివాసులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రి వెంట తెలుగు యువత రాష్ట్ర నాయకులు మారుతి చౌదరి అన్నారు.

6న ఏపిలోని అన్ని జిల్లాల కలెక్టర్ కార్యాలయాల ఎదుట సామూహికంగా దీక్షలు, ధర్నాలు: ఆర్.కృష్ణయ్య పిలుపు

సైఫాబాద్, జనవరి 30, ప్రభాతవార్త: అసెంబ్లీ-పార్లమెంట్ ఎన్నికల్లో బిసిలకు 50 శాతం రిజర్వేషన్‌ల సాధనకై ఫిబ్రవరి 6వ తేదీన నవ్యాంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాల కలెక్టరేట్‌ల ఎదుట సామూహిక దీక్షలు, ధర్నాలు చేపట్టాలని జాతీయ బిసి సంక్షేమ సంఘం బిసి సామాజిక వర్గానికి పిలుపునిచ్చింది. అలాగే ఇంజనీరింగ్, ఇతర కోర్సులు చదువుతున్న విద్యార్థులకు పూర్తి ఫీజులను మంజూరు చేయాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు, మెస్‌చార్జీలు పెంచాలని సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆర్.కృష్ణయ్య, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు కె.శంకర్‌రావు డిమాండ్ చేశారు. మంగళవారం నాడిక్కడ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 70 సంవత్సరాలు గడిచినా మేజారిటి ప్రజలైన బిసిలకు రాజ్యాధికారంలో వాటా ఇవ్వకుండా పాలకులు అన్యాయం చేశారని ఆరోపించారు. ఎస్సీ,ఎస్టీలకు రాజకీయ రిజర్వేషన్‌లు కల్పించారని, మహిళలకు కూడా కల్పించేందుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయని, కాని దేశ జనాభాలో అత్యధికంగా ఉన్న బిసిలకు మాత్రం వాటా ఇవ్వకుండా మాయ మాటలతో మోసం చేస్తున్నారని, ఇది ప్రజాస్వామ్య దేశం అయితే బిసిలకు ఎందుకు న్యాయం చేయడం లేదని వారు పాలకులను ప్రశ్నించారు. బిసిలకు ఓట్లలో భాగస్వామ్యం ఉందని కాని అధికారంలో వాటా ఎదని?, అప్పుల్లో వాటా ఉంది కాని ఆస్తుల్లో వాటా లేదని, బిసిలు దేశసంపదను సృష్టిస్తున్నారని ఆ సంపదలో వాటా ఎక్కడ ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు.

నాయీ బ్రాహ్మణులకు రిజర్వేషన్ల కల్పనలో అన్యాయం

బిసి రిజర్వేషన్‌లను ఎబిసిడిఇలుగా వర్గీకరించాలి: యానాదయ్య

విజయవాడ, జనవరి 30, ప్రభాతవార్త: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న నాయి బ్రాహ్మణులకు బిసి రిజర్వేషన్‌లో తీవ్ర అన్యాయం జరుగుతోందని, ఎబిసిడిఇలుగా వర్గీకరించి తమ జాతికి న్యాయం జరిగేలా ప్రభుత్వం చొరవ తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ నాయీ బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సిద్దపటం యానాదయ్య విజ్ఞప్తి చేశారు. విజయవాడలోని మేరి స్టెల్లా ఇండోర్ స్టేడియంలో మంగళవారం రాష్ట్రస్థాయి నాయి బ్రాహ్మణ మహాసభ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి అధ్యక్షతన వహించిన యానాదయ్య మాట్లాడుతూ కులవృత్తులకు స్వస్తి పలుకుతున్న నేటి కాలంలో తరతరాలుగా తమ జాతి కులవృత్తినే నమ్ముకుని జీవనం సాగిస్తూన్న విషయం అందికి తెలిసిందేనన్నారు. ఆర్థికపరమైన ఇబ్బందులు ఎన్ని ఉన్న వృత్తిని కాపాడుకుంటు సమాజానికి ఆదర్శంగా నిలిచారని అన్నారు. అలాంటి తమ జాతికి అన్ని రంగాల్లో అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. సామాజిక పరంగా రిజర్వేషన్లు కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆరోపించారు. నాయి బ్రాహ్మణులు ఆర్థికంగా బలోపేతానికి ప్రభుత్వం సహాయసహకారాలు అందించాలని కోరారు. నాయిబ్రాహ్మణ ఫెడరేషన్ రద్దుచేసి, కార్పొరేషన్ ఏర్పాటు చేసి సంవత్సరానికి రూ.500కోట్ల నిధులు కేటాయించి బ్యాంకులతో సంబంధం లేకుండా ఆర్థిక సహకారం అందించాలని డిమాండ్ చేశారు. బార్బర్ షాపుల విద్యుత్ ఛార్జీలను 250యూనిట్ల వరకు ఉచితంగా, ఆ పైన కమర్షియల్ నుండి డొమెస్టిక్‌గా మార్చాలని కోరారు. నాయిబ్రాహ్మణులకు చట్టసభల్లో అవకాశం కల్పించాలని, అలాగే నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యత కల్పించాలని తెలిపారు. రాష్ట్రంలో గుర్తింపు పొందిన దేవాలయాల్లో క్షురకులు, వాయిద్య కళాకారులను శాశ్వత ఉద్యోగులుగా నియమించాలని, దేవాలయాల ధర్మకర్తల మండలిలో నాయిబ్రాహ్మణులను కోఆప్షన్ సభ్యులుగా నియమించి తలనీలాల ఆదాయంలో 20శాతం నిధులను సంక్షేమానికి కేటాయించాలని కోరారు. రాష్ట్రంలోని ప్రతిజిల్లాల్లో ఎకరం స్థలం కేటాయించి కమ్యూనిటీ హాలు, సంగీత కళాశాల ఏర్పాటు చేయాలని అన్నారు. నాయిబ్రాహ్మణ మహిళలకు బ్యూటీపార్లర్ శిక్షణ కల్పించి, పార్లర్ ఏర్పాటుకు 50శాతంతో రూ.5లక్షల ఆర్థిక సహకారం అందించాలని యానాదయ్య ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం ఆర్‌వి నాయుడు ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవ సలహాదారు ఎన్‌వి రాఘవులు, రిటైర్డ్ ఎస్పీ డి. ఆశోక్, ఆయూష్ కేంద్ర మంత్రిత్వశాఖ వైస్ ఛైర్మన్ డాక్టర్ ఎస్ సారంగపాణి, తెలంగాణ నాయిబ్రహ్మణ ఐక్యవేదిక కన్వీనర్ యం లింగం, ఉద్యోగ సాంస్కృతిక సంఘం అధ్యక్షులు పివి రమణయ్య తదితరులతో పాటు రాష్ట్ర నలుమూలల నుండి పెద్దఎత్తున నాయిబ్రాహ్మణులు తరలివచ్చారు.



మహాసభలో మాట్లాడుతున్న ఏపి నాయి బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్రఅధ్యక్షుడు యానాదయ్య

మార్చి 9, 10 తేదీల్లో లేపాక్షి ఉత్సవాలు

సమష్టి కృషితో ఘనంగా నిర్వహిద్దాం: కలెక్టర్



మంగళవారం లేపాక్షి అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ వీరపాండ్యన్

లేపాక్షి, జనవరి 30, ప్రభాతవార్త: లేపాక్షి ఉత్సవాలను ఘనంగా నిర్వహిద్దామని కలెక్టర్ వీరపాండ్యన్ తెలిపారు. మంగళవారం ఉదయం 11 గంటలకు లేపాక్షిని సందర్శించారు. అభివృద్ధి పనులను పరిశీలించారు. జఠాయువు పక్షి కొండపై ఏర్పాటు, టిటిడి కళ్యాణ మండపానికి కేటాయించిన స్థలాన్ని, లేపాక్షి ఎంపోరియం, పర్యాటకుల కోసం బాత్‌రూములు, ఆలయంలో ఉన్న తూర్పు ద్వారం, కోనేరు, ఎపిఆర్ఎస్ పాఠశాలలో ఉత్సవాలు నిర్వహించే సభా స్థలిని పరిశీలించారు. అనంతరం స్థానిక మహాత్మ జ్యోతిరావుపూలే పాఠశాలలో జిల్లా స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. మార్చి 9, 10 తేదీల్లో ఉత్సవాలు నిర్వహించాలని ఈ సందర్భంగా అన్నిశాఖల అధికారులు సమిష్టిగా కృషి చేయాలని అన్నారు. ఎండోమెంటు, ఆర్కియాలాజికల్ ఆధ్వర్యంలో జఠాయువు పక్షి ఏర్పాటు చేసే కొండ రాయి చుట్టూ గ్రీనరి, హెర్బల్ గార్డెన్ ఏర్పాటు చేయాలని దీంతోపాటు కోనేరును సుందరంగా తీర్చిదిద్దాలని అన్నారు. జిల్లా స్థాయిలో విద్యార్థులకు పోటీలు నిర్వహించాలని చెప్పారు. గతంలో కంటే ఈసారి ఉత్సవాలు వైభవంగా నిర్వహించాలన్నారు. అనంతరం పర్యాటకశాఖ రీజనల్ డైరెక్టర్ మాట్లాడుతూ ప్రతిఒక్క అధికారుల కృషితోనే ఉత్సవాలు ముందుకు సాగుతాయని, ప్రతిఒక్కరు సమిష్టిగా పనిచేయాలని తెలిపారు. పెనుకొండ ఆర్డీఓ రామ్మూర్తి మాట్లాడుతూ మొదట మూడురోజులలో జరగబోయే కార్యక్రమాలను ముందుగానే అధికారులకు తెలియజేయాలని, మార్చి నెలలో ఎండలు ఎక్కువగా ఉంటాయని ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో మొబైల్ టీంలు నిర్వహించాలన్నారు. స్థానిక ఎపిఆర్ఎస్ పాఠశాలలో సభా స్థలి, జఠాయువు విగ్రహం, నంది విగ్రహం, ఆర్టీసి బస్టాండు వద్ద కూడా ప్రతిఒక్కరికి అందుబాటులో ఉండేలా చూడాలని అన్నారు. మొదటిరోజు మంత్రులు, అధికారులు పెద్ద సంఖ్యలో హాజరవుతారన్నారు. రెండోరోజు సిఎం చంద్రబాబునాయుడు హాజరవుతారని చెప్పారు. రెండు వారాల తరువాత లేపాక్షికి మరలా వస్తానన్నారు. ఈ కార్యక్రమంలో టూరిజం రీజనల్ డైరెక్టర్ గోపాల్, డిఆర్‌డిఎ పిడి రామారావు, ట్రైనీ కలెక్టర్ వెంకటేశ్వర్లు, డిపిఆర్ఓ జయమ్మ, జిల్లాలోని ఎండోమెంటు, విద్యుత్, ఆర్టీసి, అగ్రికల్చర్ తదితర అధికారులు ఉన్నారు. ఆర్టీసి డిపో మేనేజర్‌తో ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా బస్సులను ఏర్పాటు చేయాలని హిందూపురం, కొడికొండ చెక్‌పోస్టులో ప్రతి రెండు నిమిషాలకో బస్సు ఏర్పాటు చేయాలని అన్నారు. ఇందుకు స్పందించిన డిఎం మాట్లాడుతూ ప్రతి రెండు నిమిషాలకో బస్సులు అందుబాటులో ఉండేలా గత ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేశామని, జిల్లాలో ఉన్న అన్ని డిపోల నుంచి 3 బస్సులు ఆ ప్రాంతాల నుండి లేపాక్షి వచ్చివెళ్లేలా చేశామని ఈసారి కూడా అదేవిధంగా ఏర్పాటు చేస్తామని డిఎం తెలిపారు.

మీ సమస్యలను పరిష్కరిస్తా: మంత్రి దేవినేని హామీ



మంగళవారం విజయవాడలో మాట్లాడుతున్న మంత్రి దేవినేని

విజయవాడ సిటీ, జనవరి 30, ప్రభాతవార్త: ఇది మీ ప్రభుత్వం మీకండగా వుంటాం, మీకేం కావాలన్నా, మీకే సమస్య వచ్చిన వెంటనే నన్ను సంప్రదించండి, మీ సమస్యను వెంటనే పరిష్కరిస్తా నని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి దేవినేని ఉమా మహేశ్వరరావు విభిన్న ప్రతిభావంతులకు హామీ ఇచ్చారు. మంగళవారం విజయవాడ హనుమంతరాయ గ్రంథాలయంలో లూయీ బ్రెయిలీ 209వ జన్మదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురికి మంత్రి చేతుల మీదుగా కళ్ళజోళ్ళు, తదితర పరికరాలను విభిన్న ప్రతిభావంతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులందరికి పెన్షన్ అందుతుందా అని ఆరా తీశారు. ఇంకా మీకేం కావాలంటూ ప్రశ్నించారు. పలువురు తమకు కావాల్సిన సహాయాన్ని మంత్రికి విన్నవించగా ఆయన వెంటనే స్పందిస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మీకు అండగా వున్నారు. మీకు ఏ సహాయం కావాలన్నా రాష్ట్ర విభిన్న ప్రతిభావంతులు మరియు వయోవృద్ధుల సహాయ సంస్థ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావును లేదా తనను అడగమని, ఎప్పుడు ఎవరు వచ్చి సహాయం అర్థించినా వెంటనే వారికి కావాల్సిన రీతిలో సహాయం అందించడానికి సిద్ధంగా వున్నామన్నారు. వారందరు అందించిన వినతులను గోనుగుంట్ల కోటేశ్వరరావుకు అందించారు. గోనుగుంట్ల కోటేశ్వరరావు కార్పొరేషన్ ఛైర్మన్‌గా అందిస్తున్న సేవలను ప్రశంసించారు. అందరికి అందుబాటులో వుంటూ సకలాంగులకన్నా తానే ఎక్కువ కష్టపడుతూ అందరి మెప్పు పొందుతున్నాడంటూ అభినందించారు. విభిన్న ప్రతిభావంతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం రు.103కోట్లను కేటాయించిందని తెలిపారు. అందరితో సమానంగా జీవించడానికి వీలుగా వారికి ఇళ్ళస్థలాలు కేటాయించిన వారికి ఇళ్ళు నిర్మించి ఇస్తున్నామని, వారికి బ్యాంకు రుణాలు, పెన్షన్‌లు, స్కాలర్‌షిప్పులు, వివిధ ఉపకరణాలు ఇస్తున్నామని వివరించారు. ఉన్నత విద్య అభ్యసించేవారికి అవసరమైతే ఆర్థికంగా ప్రోత్సాహకాలందిస్తామన్నారు. సకలాంగులు ఎవరైనా దివ్యాంగులను వివాహం చేసుకుంటే వివాహ ప్రోత్సాహక బహుమతి కింద లక్షరూపాయలు అందజేస్తున్నామని మంత్రి తెలిపారు. రాష్ట్ర విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధులు సహాయ సంస్థ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు మాట్లాడుతూ దివ్యాంగులందరూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడకు రుణపడి వుంటరన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విభిన్న ప్రతిభావంతులను అన్ని రకాలుగా ఆదుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగుల సంక్షేమశాఖ ఎడి నారాయణరావు, రిటైర్డ్ అధికారి వేమూరి బాబూరావు, స్వామి దుర్గారావు, కార్పొరేషన్‌కు చెందిన అధికారులు, పలువురు విభిన్న ప్రతిభావంతులు పాల్గొన్నారు. లూయీ బ్రెయిలీ జన్మదినోత్సవం సందర్భంగా మంత్రి కేకు కట్ చేసి పిల్లలతో తినిపించారు.

సిబిఐతో పాటు నార్కో ఎనాలసిస్ పరీక్షలకు కూడా సిద్ధం

నకిరేకల్ శాసన సభ్యులు వేముల వీరేశం సంచలన వ్యాఖ్యలు

నల్లగొండలో రగులుతున్న రాజకీయం...

బొడ్డుపల్లి శ్రీనివాస్ హత్యపై టిఆర్ఎస్ కాంగ్రెస్‌ల మధ్య మాటల యుద్ధం...


మాట్లాడుతున్న వేముల వీరేశం

నల్లగొండ, జనవరి 30,ప్రభాతవార్త ప్రతినిధి: ఇటీవల దారుణ హత్యకు గురైన నల్లగొండ మున్సిపల్ చైర్మన భర్త బొడ్డుపల్లి శ్రీనివాస్ ఉదంతంపై అధికార టిఆర్ఎస్, ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీల మధ్య రాజకీయం రగులుతోంది. మొదటి నుంచి ఈ హత్య వెనుకాల టిఆర్ఎస్ నేతల హస్తం ఉందని నకిరేకల్ ఎంఎల్ఏ వేముల వీరేశం ప్రోద్బలంతోనే జరిగిందని స్థానిక శాసన సభ్యులు, సిఎల్‌పి ఉపనేత కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆరోపణలు చేస్తూ వస్తున్నారు. దీనిపై ఆరోపణలు ఎదుర్కొంటున్న నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం పెదవి విప్పారు. సంచలన వ్యాఖ్యలు చేశారు. తనపై వచ్చిన ఆరోపణల విషయంలో సిబిఐతో పాటు నార్కో ఎనాలసిస్ పరీక్షలకు కూడా తాను సిద్ధమన్నారు. తాను శాసన సభ్యుడినయ్యాక మొత్తం కాల్‌డేటా తీసినా పర్యాలేదని దానికి కోమటిరెడ్డి కూడా సిద్ధం కావాలన్నారు.

నల్లగొండలో రగులుతున్న రాజకీయం: బొడ్డుపల్లి శ్రీనివాస్ హత్యపై కాంగ్రెస్, టిఆర్ఎస్‌ల మధ్య మాటల యుద్ధం జరుగుతుంది. దీంతో నల్లగొండ రాజకీయాలు రగులుతున్నాయి. బొడ్డుపల్లి శ్రీనివాస్ కుటుంబాన్ని పరామర్శించేందుకు వచ్చినటువంటి కాంగ్రెస్ పార్టీ నేతలు టిపిసిసి చీఫ్ ఉత్తమ్, సిఎల్‌పి నేత జానా, సీనియర్ నేత హన్మంతరావు, షబ్బీర్ అలీలు కూడా వెంటనే బాధ్యులను అరెస్టు చేయాలని వీరేశంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. శ్రీనివాస్ హత్య కేసులో నిందితులు కొందరు వీరేశంతో కలిసి ఉన్న ఫోటోలను విడుదల చేశారు. అంతటితో ఆగక మరుసటి రోజు హైదరాబాద్‌లో డిజిపిని కలిసి ఈకేసును లోతుగా విచారించాలని డిమాండ్ చేశారు. వారి పరిస్థితి అలా ఉంటే టిఆర్ఎస్ కూడా ప్రతి దాడికి దిగింది. కాంగ్రెస్ పార్టీ కావాలని రాజకీయం చేస్తుందని, ఇందులో టిఆర్ఎస్ ప్రమేయం లేదని యువ శాసనసభ్యునిగా ఒక కాలేజీ వద్ద దిగిన ఫోటోలని అవే ప్రామాణికమైతే ఈ హత్యలో నిందితులుగా భావిస్తున్నవారు కోమటిరెడ్డితో ఉన్న ఫోటోలు ఉన్నాయని వారు ఫోటోలను మీడియాకు విడుదల చేశారు. ఆదివారం పోలీసులు ఇది రాజకీయ హత్య కాదని క్షణికావేశంలో జరిగిందని విలేకర్ల సమావేశంలో తేలా ్చరు. ఆదివారం పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ భట్టి విక్రమార్క బొడ్డుపల్లి లక్ష్మీ కుటుంబాన్ని పరామర్శించారు. తాజాగా సోమవారం కాంగ్రెస్ పార్టీ ఫైర్ బ్రాండ్, శాసన సభ్యురాలు, పిసిసి ఉపాధ్యక్షురాలు డికె అరుణ నల్లగొండకు వచ్చి శ్రీనివాస్ కుటుంబాన్ని పరామర్శించి మీడియాతో మాట్లాడారు. శ్రీనివాస్ హత్య తీరు చూస్తుంటే టిఆర్ఎస్ పెద్ద తలకాయల హస్తమున్నట్లు తెలుస్తోందన్నారు. కేసు పూర్తి ధర్యాప్తు కాకుండానే పోలీసులు ప్రెస్ మీట్ పెట్టి క్షణికావేశంలో జరిగిందని చెప్పడం అవమానంగా ఉందన్నారు. ఈకేసును సిబిఐకి అప్పగించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి అద్దంకి ధయాకర్ మాట్లాడుతూ సిబిఐ విచారణ చేపట్టకపోతే తమ పార్టీ ఆధ్వర్యంలో ఆమరణ నిరాహార దీక్షను కొనసాగిస్తామని హెచ్చరించారు. ఇక టిఆర్ఎస్ పార్టీ శాసన మండలి విప్ పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఎంఎల్ఏలు కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, భాస్కర్ రావులు ఈ అంశంపై విలేకర్ల సమావేశం నిర్వహించారు. బొడ్డుపల్లి శ్రీనివాస్ హత్య రాజకీయ పరమైంది కాదని పోలీసులు ఆధారాలతో బయిటపెట్టినా కాంగ్రెస్ నేతలు అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారన్నారు. బొడ్డుపల్లి శ్రీనివాస్‌కు టిఆర్ఎస్‌కు ఎటువంటి వివాదం లేదన్నారు. వీధి పంచాయితీని రాష్ట్ర పంచాయితీగా మార్చాలని కోమటిరెడ్డి చూస్తున్నారని ఆరోపించారు. యువ శాసనసభ్యుడు వేముల వీరేశం ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలోనే కోమటిరెడ్డి సొంత ఊరు బ్రాహ్మణ వెల్లెంల ఉందని, తన గ్రామానికి రావద్దని వీరేశంపై కోమటిరెడ్డి ఆంక్ష విధించాడని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ దిగజారుడు రాజకీయాలు చేస్తుందన్నారు. ఇక కోమటిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ ఈకేసులో పోలీసులది కట్టుకథగా అభివర్ణించారు. నింధితుల కాల్ డేటాను విడుదల చేయాలన్నారు. ఈకేసులో పెద్దలను అరెస్టు చేసేవరకు ఉద్యమిస్తామని చెప్పారు. మొత్తంమీద ఇరుపార్టీల మధ్య బొడ్డుపల్లి శ్రీను హత్య ఉదంతం రాష్ట్ర వ్యాప్త పంచాయితీగా రగులుతోంది.

కాంగ్రెస్ నేతల వ్యాఖ్యలపై పెదవి విప్పిన వేముల వీరేశం

ఇదిలా ఉంటే బొడ్డుపల్లి శ్రీనివాస్ హత్యపై నకిరేకల్ శాసన సభ్యులు వేముల వీరేశం నోరువిప్పారు. శ్రీనివాస్ హత్య అత్యంత బాధాకరమన్నారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కోమటిరెడ్డి వెంకటరెడ్డి వ్యాఖ్యలపై ఏ విచారణకైనా సిద్ధమన్నారు. చిట్యాల ఎంపిపి ఎన్నికల సందర్భంగా జరిగిన ఘర్షణకు కూడా కోమటిరెడ్డే కారణమన్నారు. తనను రాజకీయంగా ఎదుర్కోలేకనే ఇటువంటి ఆరోపణలను కోమటిరెడ్డి చేస్తున్నారని తాను శాసన సభ్యుడిని అయ్యాక తనపై ఎన్ని కేసులు నమోదయ్యాయో కోమటిరెడ్డి చెప్పాలన్నారు. నయీం అడ్డాగ నల్లగొండను మార్చింది కోమటిరెడ్డి వెంకటరెడ్డే నంటూ ఆరోపించారు. రాజకీయ భవిష్యత్తు కోసం మృతుడు శ్రీనివాస్ గతంలో తనను కలిసిన మాట వాస్తవమన్నారు. తాను సుపారీ ఇచ్చినట్లు విహెచ్ మాట్లాడిన తీరు ఆధారంగా న్యాయస్థానంలో కాంగ్రెస్ నాయకులను ఎదురొ ్కంటానన్నారు. సిబిఐతో పాటు నార్కో ఎనాలసిస్ పరీక్షలకు కూడా తాను సిద్ధమన్నారు. తాను శాసన సభ్యుడినయ్యాక మొత్తం కాల్‌డేటా తీసినా పర్యాలేదని దానికి కోమటిరెడ్డి కూడా సిద్ధం కావాలన్నారు. ఇదిలా ఉంటే నకిరేకల్ మాజీ ఎంఎల్ఏ చిరుమర్తి లింగయ్య కూడా ఈ అంశంపై స్పందించారు. మంత్రి జగదీశ్ రెడ్డి అండతో వీరేశం అరాచకాలు సృష్టిస్తున్నాడని ఆరోపించారు. నియోజకవర్గంలో తాను తిరుగుతున్నప్పుడు కూడా బెదిరించే ప్రయత్నం చేశాడని నకిరేకల్ సర్పంచ్ ఎన్నికల సందర్భంలోనూ వేర్వేరు నంబర్లతో బెదిరింపు కాల్స్ వచ్చాయని చేరతీసిన వ్యక్తులనే హతమార్చిన ఘనత వేరేశానిదని ఆరేపించారు. వీరిదిలా ఉంటే ఈ కేసు విషయంలో పోలీసుల రిమాండ్‌పై అనుమానాలను వ్యక్తం చేస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసినట్లు నల్లగొండ శాసనసభ్యులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు.


మాట్లాడుతున్న కోమటిరెడ్డి వెంకటరెడ్డి


మంగళవారం బాపూఘాట్‌లోని గాంధీజీ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న గవర్నర్ నరసింహన్, శాసన మండలి చైర్మన్ స్వామిగౌడ్, డిప్యూటీ సిఎంలు కడియం శ్రీహరి, మహమూద్ అలీలు

జాతిపితకు ఘన నివాళులు అర్పించిన గవర్నర్ నరసింహన్

- హాజరైన పిసిసి చీఫ్ ఉత్తమ్ కుమార్‌రెడ్డి తదితరులు

- గాంధీ వర్ధంతి వేడుకలకు గైర్హాజరైన ముఖ్యమంత్రి

హైదరాబాద్ (నార్సింగి), జనవరి 30 ప్రభాతవార్త: జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరిం చుకొని రాష్ట్ర గవర్నర్ నర్సిహ్మాన్, ఉప ముఖ్య మంత్రులు కడియం శ్రీహరి, మహ్మూద్‌అలీలు మంగళవారం ఉదయం లంగర్‌హౌస్‌లోని బాపూ ఘాట్‌ను సందర్శించారు. బాపూఘాట్‌లోని గాంధీ సమాధిపై పుష్పగుచ్చాన్ని ఉంచి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సర్వమత ప్రార్థనల కార్యక్రమంలో పాల్గొని హిందూ, ముస్లీం, క్రిస్టియన్, సిక్కు, బౌద్ధ మత గురువులు తెలిపిన అమృత వాక్కులను ఆలకించారు. ఈ సందర్భంగా మహాత్ముడికి అత్యంత ప్రీతిపాత్రమైన "రఘుపతి రాఘవ రాజారాం... పతీత పావన సీతారాం..." అనే పాటను ముఖ్యమంత్రితో పాటు గాంధేయ వాదులు, టీఆర్ఎస్ నాయకులు, కాంగ్రెస్ నాయ కులు, విద్యార్థినీ, విద్యార్థులు రాగయుక్తంగా ఆలపించారు. జాతిపిత మహాత్మాగాంధీ సూచించిన అహింసా మార్గంలో దేశ ప్రజలంతా పయనిస్తే ఎలాంటి భేదాభిపాయా లు, మత ఘర్షణలు రావని అన్ని మతాల మత గురువులు సూచించారు. గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్య స్థాపనకు ప్రభుత్వాధినేతలు, ప్రజా ప్రతినిధులు అంకిత భావంతో పని చేసి, ఆర్థిక అసమానతలను తొలగిం చాలని మత గురువులు ఉద్బోదించారు. సరిగ్గా 11.గంటలకు సైరన్ మోగగాని అందరూ 2.నిమి షాలు మౌనం పాటించి అమరవీరులను స్మరించు కున్నారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి చైర్మన్ స్వామిగౌడ్, మంత్రులు నాయిని నర్సిహ్మారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, పద్మారావ్‌గౌడ్, రాష్ట్ర పౌర సరఫరాల కార్పోరేషన్ చైర్మన్ పెద్దిరెడ్డి సుదర్శన్‌రెడ్డి, ఎమ్మెల్సీ లు ప్రభాకర్, సుధాకర్‌రెడ్డి, ఎంపిలు మల్లారెడ్డి, సీతారాంనాయక్, హైదరాబాద్ మేయర్ బొంతు రామ్మోహన్, పీసీసీ అధ్యక్షులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీసింగ్, అదనపు కార్యదర్శి అరవింద్‌సింగ్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ యోగితారాణా, సిటీ కమీషనర్ శ్రీనివాస్, ఇంచార్జి జేసీ నిఖిల, ఆర్డీఓ చంద్రకళ, టూరిజం జీఎం విజయేందర్, ప్రవీణ్ జోయెల్, రాజశేఖర్, గోల్కొండ తహసీల్దార్ అయ్యప్ప, ప్రోటోకాల్ అదనపు డైరెక్టర్ శశిధర్‌రెడ్డి, డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ పద్మజ, డిప్యూటీ డీఈఓ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు. ర

తిరస్కరించిన ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు

మున్సిపల్ పరిపాలన శాఖకు దరఖాస్తు చేసుకోవాలి

హెచ్ఎండిఎ కమిషనర్ టి.చిరంజీవులు

హైదరాబాద్, జనవరి 30 ప్రభాతవార్త: తిరస్కరించబడిన ఎల్ఆర్ఎస్ క్రమబద్ధీకరణ దరఖాస్తులను హెచ్ఎండిఎ కార్యాలయంలో ఫిబ్రవరి 1వ తేది నుంచి తిరిగి పరిష్కరించబడవని, అటి దరఖాస్తులు మున్సిపల్ పరిపాలన శాఖకు దరఖాస్తు చేసుకోవాల్సిన ఉంటుందని హెచ్ఎండిఎ కమిషనర్ టి.చిరంజీవులు స్పష్టం చేశారు. హైదరాబాద్ నగరాభివృద్ధి సంస్థ భూక్రమబద్ధీకరణ పథకం(ఎల్ఆర్ఎస్) కింద దరఖాస్తుదారులు తమ ఎల్ఆర్ఎస్, నాలా తదితర చెల్లింపులకు తుది గడువు నేటితో ముగియనుంది.

మంత్రి లక్ష్మారెడ్డితో ఎంపి కవిత భేటీ

నిజామాబాద్ పార్లమెంటు పరిధిలో వైద్య సదుపాయాలపై సమీక్ష

హైదరాబాద్, జనవరి 30, ప్రభాతవార్త: నిజామాబాద్ నియోజకవర్గం పరిధిలో వైద్య సదుపాయాల పెంపు మెరుగుదల కోసం పార్లమెంటు సభ్యురాలు కల్వకుంట్ల కవిత రాష్ట్ర వైద్య,ఆరోగ్య శాఖ మంత్రి సి.లక్ష్మారెడ్డితో భేటీ అయ్యారు. మెరుగైన సదుపాయాల కోసం ఈ బడ్జెట్‌లో అవసరమైన నిధుల కేటాయింపు ప్రతిపాదనలను మంత్రికి అందజేశారు. మంగళవారం సచివాలయంలోని మంత్రి చాంబర్‌లో నిజామాబాద్ పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని వైద్య,ఆరోగ్య, వైద్యవిద్య కుటుంబ సంక్షేమంపై సుదీర్ఘంగా సమీక్ష నిర్వహించారు. కాగా, ఎంపీ కవిత ప్రతిపాదనలపై మంత్రి సానుకూలంగా స్పందించారు. నిజామాబాద్ జిల్లా ప్రధాన వైద్యశాలను 500 పడకల నుంచి 700 పడకలకు పెంచాలనీ, జగిత్యాలలో మెడికల్ కళాశాల, వెల్‌నెస్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలనీ, కోరుట్లలో 100 పడకల వైద్యశాలను ఏర్పాటు చేయాలనీ కోరారు. జగిత్యాలలో మాతాశిశు ఆరోగ్య కేంద్రం భవనాన్ని త్వరగా పూర్తి చేయాలనీ, జగిత్యాలకు అదనంగా మరో రెండు అంబులెన్సులు ఇవ్వాలనీ, నందిపేటలో 30 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. నిజామాబాద్, జగిత్యాల, బోధన్‌లలో సిద్ధంగా ఉన్న డయాలసిస్ కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని కోరారు. బోధన్‌లో నర్సింగ్ కళాశాల సొంత భవనంకు స్టాఫ్ లేనందున ప్రస్తుతం క్లాసులు నిజామాబాద్‌లో నిర్వహిస్తున్నామనీ, వెంటనే నర్సింగ్ కళాశాలకు భవనాన్ని నిర్మించడంతో పాటు అవసరమైన సిబ్బందిని నియమించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే, లేబర్ రూమ్స్‌లో విద్యుత్ సమస్యలు తలెత్తినప్పుడు ఇబ్బందులు రాకుండా ఉండటానికి ఇన్వర్టర్‌ను ఏర్పాటు చేయాలనీ, నిజామాబాద్‌లో ఎంఆర్ఐ ఉందనీ, టెక్నీషియన్లు లేని విషయాన్ని ఆమె మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. అయితే, టెక్నీషియన్ల భర్తీ టీఎస్‌పీఎస్సీ ద్వారా చేస్తున్నామనీ, త్వరలోనే పూర్తవుతుందని చెప్పారు. కాగా, జగిత్యాలలో మాతాశిశు వైద్యశాలను ఇప్పటికే మంజూరు చేశామనీ, స్థల సేకరణ కోసం కలెక్టర్‌ను ఆదేశించామని తెలిపారు. కొత్తగా వైద్యశాఖ సానిటేషన్ సెక్యూరిటీకి తోడుగా పేషెంట్ కేర్‌ను జోడించి కొత్త విధానాన్ని తీసుకొచ్చిందనీ, దీంతో బోధన, బోధనేతర వైద్యశాలల సిబ్బంది కొరత తీరుతుందని చెప్పారు. అలాగే, ఫిబ్రవరి రెండో వారంలో బోధన్ జగిత్యాల డయాలసిస్ కేంద్రాలను ప్రారంభించాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. ఈలోగా ఆయా డయాలసిస్ కేంద్రాలను సంసిద్ధం చేయాలనీ సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు. ఈ సమావేశంలో వైద్యశాఖ ముఖ్య కార్యదర్శి శాంతికుమారి, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వాకాటి కరుణ, డీఎంఈ డా.రమేష్‌రెడ్డి, టీఎస్ఎంఎస్ఐడీసీ ఎండీ వేణుగోపాలరావు, చీఫ్ ఇంజనీర్ లక్ష్మణ్‌రెడ్డి పాల్గొన్నారు.

శ్రీచైతన్య విద్యా సంస్థలకు ఏషియాన్ గ్రేటెస్ట్ బ్రాండ్స్-2018 అవార్డ్




హైదరాబాద్, జనవరి 30 ప్రభాతవార్త: భారత విద్యారంగ దిగ్గజం, ఐఐటి, నీట్, ఒలింపి యాడ్స్ ఫలితాల్లో తెలుగువారి కీర్తి పతా కం శ్రీచైతన్య మరో ప్రతిష్టాత్మకమైన అవార్డ్ కైవసం చేసుకొంది. విద్యారంగంలో అత్యుత్తమ సేవలనుగాను, సంస్థ నిర్వహణలో విశేష ప్రతిభ చూపినందుకుగాను శ్రీచైతన్యను ప్రదానం చేసిన 'ఏషియాన్ గ్రేటెస్ట్ బ్రాండ్స్-2017 అవార్డ్‌'ను ఆ సంస్థ వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ బిఎస్.రావు తరుపున ఆ సంస్థ అకడమిక్ డైరెక్టర్ సుష్మ స్వీకరించారు. ఈకార్యక్రమం ఈనెల 29న సింగపూర్‌లో ఏషియావన్ మేగజైన్ సంస్థ ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించింది. అవార్డ్ ఎంపిక విధానం ప్రపంచ మేటి సంస్థ ప్రైస్‌వాటర్‌హౌస్‌కూపర్స్ ఆధ్వర్యంలో జరగటం విశేషం. ఈ సందర్భంగా అవార్డ్ గ్రహీత డాక్టర్ బిఎస్.రావు మాట్లాడుతూ ఈ అవార్డ్ తమ విద్యా సంస్థ అత్యుత్తమ ప్రతిభను దక్కిన గౌరవంగా భావిస్తున్నట్లు తెలిపారు. సంస్థ వ్యవస్థాపకులుగా తాము నెలకొల్పిన విలువలను, క్రమశిక్షణను తమ పిల్లలు కొనసాగిస్తూ ప్రతిక్షణం ఎంతో అప్రమత్తతతో శిక్షణను అందించటంవల్లే శ్రీచైతన్య ఇంతటి ఘన విజయాలు సాధిస్తూ సర్వోన్నత స్థాయికి దూసుకెళ్లిందని వివరించారు. వారు డైరెక్టర్లుగా ఎంతో స్ఫూర్తిమంతంగా విద్యారంగానికి సేవలందిస్తున్నందుకు గర్వకారణంగా ఉందని కొనియాడారు. ఈ పరంపర ఇదే మాదిరిగా భవిష్యత్తులోనూ కొనసాగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇందుకు సహకరిస్తున్న ప్రతి ఒక్కరికీ ముఖ్యంగా విద్యార్థుల తల్లిదండ్రులకు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

సినీ నటుడు సామ్రాట్‌పై పోలీసులకు భార్య ఫిర్యాదు

భర్తకు దురలవాట్లు, అత్తామామలకు వరకట్న కాంక్ష..

పెళ్లయిన పక్షం రోజులనుంచే హింస మొదలైందన్న హార్షిత

సామ్రాట్‌ను అరెస్టు చేసి రిమాండుకు తరలించిన మాదాపూర్ పోలీసులు


సామ్రాట్, హర్షిత పెళ్లినాటి ఫోటో (ఫైల్)

సైబరాబాద్ ప్రతినిధి, జనవరి 30 ప్రభాత వార్త: పంచాక్షరి, తకిటతకిట వంటి పలు చిత్రాలలో నటించిన సామ్రా టట్‌పై అతని భార్య హర్షిత రెడ్డి ఫిర్యాదుతో గతంలో వరకట్న వేదింపుల కేసు నమోదు కాగా తాజాగా మాదాపూర్ పోలీస స్టేషన్‌లో అక్రమ ప్రవేశం, దొంగతనం నేరాలపై కేసు నమోదైంది. సామ్రాట్ సిసి కెమెరాలతోపాటు ఇంట్లోని సమానును ఇతర ప్రాంతానికి తరలించాడని అతని భార్య హర్షితరెడ్డి ఫిర్యాదు మేరకు మాదాపూర్ పోలీసులు సామ్రాట్‌పై వివిధ సెక్షన్లకింద కేసు నమోదు చేసి మంగళవారం రిమాండుకు తరలించారు. పెళ్లయి పక్షం రోజులు కూడా గడవకముందే తన భర్త సామ్రాట్ తనను వేదించడం మొదలుపెట్టాడని, అతనికి లేని దురలవాటంటూ లేదంటూ హర్షిత మీడియాముందు వాపోయింది. కోట్లాది రూపాయలు కట్నంగా ఇవ్వాలంటూ తన అత్తింటివారు ప్రతిక్షణం తనను వేధించేవారని తెలిపింది. తన అల్లుడు సైకో అని, అతని తల్లిదండ్రులు మోసపూరితంగా వ్యవహరించి తన బిడ్డ గొంతు కోశారని హర్షిత తండ్రి ఆవేదన వ్యక్తం చేశాడు. అడ్వకేటుగా విధులు నిర్వహిస్తున్న డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్‌రెడ్డి భర్త దేవేందర్‌రెడ్డి వారి అక్రమాలకు వంతపాడుతూ అధికార బలంతో తమకు తీరని అన్యాయం చేసేందుకు యత్నిస్తు న్నాడని వాపోయాడు. నగరంలో సంచలనం కలిగించిన ఈ ఘటన వివరాలు మాదాపూర్ పోలీ సులు తెలిపిన ప్రకారం ఇలావున్నాయి. మాదాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని నెక్టర్ గార్డెన్‌లోగల లిల్లి బ్లాక్ ఫ్లాట్ నెంబరు 303లో నివాసముండే జివిఎస్ కృష్ణరెడ్డి అలియాస్ సామ్రాట్ నవంబరు 29,2015లో అత్తాపూర్‌కు చెందిన హర్షితరెడ్డిని వివాహం చేసుకున్నాడు. సినీ నటుడైన సామ్రాట్‌కు అతని భార్యతో పెళ్లయిన 15 రోజుల నుంచే వివా దాలు మొదలయ్యాయి. ఈ నేపథ్యంలో సామ్రాట్ తల్లిదండ్రులు భార్యాభర్తలను వేరు కాపురం పెట్టించేందుకు మాదాపూర్ నెక్టెర్‌గార్డెన్‌లోని తమ కుమార్తె సాహిత్యరెడ్డికి చెందిన ఇంటికి పంపించారు. గతేడాది అక్టోబరు నెల నుంచి సామ్రాట్, హర్షిత అదే ఇంట్లో నివాసముంటుండగా వారిద్దరి మధ్య గొడవలు మరింత పెరిగాయి. ఈమేరకు నవంబరు 30, 2017న హర్షిత తనను భర్త వరకట్న వేదింపులకు గురిచేస్తున్నాడని రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో సామ్రాట్‌పై కేసు నమోదైంది. ఈమేరకు ముందస్తు బెయిలు పొందిన సామ్రాట్ అప్పటి నుంచి తన భార్యవద్దకు వెళ్లడంలేదు. దీంతో హర్షిత నెక్టర్‌గార్డెన్‌లోనే తన తల్లితో కలిసి నివాసముంటోంది. కాగా సంక్రాంతి పండుగ సందర్భంగా ఈనెల 13వ తేదీన హర్షిత తన పుట్టిల్లయిన అత్తాపూర్‌కు వెళ్లి ఈనెల 25వ తేదీన తిరిగొచ్చింది. ఆమె తిరిగివచ్చేసరికి ఫ్లాట్ తాళం విరుగగొట్ట బడివుండగా అందులోని సిసిటివి కెమెరాలు, డివిఆర్, ఫ్లాటులోని ఇతర సమాను కనిపించలేదు. ఈవిషయమై ఆమె మాదాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదుచేసుకున్న పోలీసులు సామ్రాట్‌ను అదుపులోకి తీసుకొని ప్రశ్నించగా తానే సదరు సమానును ఇతర ప్రాంతానికి తీసుకువెళ్లానని తెలిపాడు. ఈమేరకు సదరు వస్తువులను స్వాధీనం చేసుకున్న పోలీసులు సామ్రాట్‌పై ఐపిసి 380, 427ఆర్/డబ్ల్యూ, 201 సెక్షన్ల ప్రకారం కేసు నమోదుచేసి మియాపూర్ కోర్టుకు తరలించారు. ఇతనికి కోర్టు 14రోజుల జ్యుడిషియల్ కస్టడీ విధించింది. అయితే సమ్రాట్ తరుపు న్యాయవాదులు బెయిల్ కోసం పిటిషన్ వేయగా దీనిపై మియాపూర్ కోర్టు రేపు విచారించనుంది.

కట్నం కోసం వేదించారు:హార్షిత

తనకు పెళ్లయిన 15రోజుల నుంచి కట్నం ఎన్ని కోట్లిస్తారని అత్తింటివారు తనను వత్తిడి చేయడం మొదలుపెట్టారని సామ్రాట్ భార్య హర్షిత మీడియా ముందు వాపోయింది. వరకట్నమిచ్చే వరకు తన భర్తను తనతో కలవకుండా అతని కుటుంబసభ్యులు దూరముంచారని తెలిపింది. అతను సైతం తన అమ్మానాన్నల మాటలు విని తనకు దూరంగా వుంటూ ఇతరులతో తిరిగేవాడని తెలిపింది. ఇతనికి అన్ని చెడు అలవాట్లు ఉన్నాయని, ఎక్కువగా హుక్కా సెంటర్‌లో ఉండేవాడని, తన స్నేహితులతో ఎప్పుడూ తిరుగుతుండేవాడని తెలిపింది. ఇతర అమ్మాయిలతో చనువుగా ఉంటున్న విషయాన్ని ప్రశ్నిస్తే తనను కొట్టేవాడని వాపోయింది. ఈవిషయాన్ని వారి తల్లిదండ్రులకు చెప్తే వాళ్లు సైతం అతన్నే వెనకేసుకొచ్చేవారని తెలిపింది. అతను ఆలానే ఉంటాడని అతని తల్లిదండ్రులతోపాటు అతని అక్కకూడా వెనకేసుకొచ్చేదని చెప్పింది. తనను మానసికంగా వేదించాడని, తనముందు ఒకలాగ ఇంట్లో మరో లాగ ప్రవర్తించేవాడని తెలిపింది. అయితే కొన్నిరోజులు గడిస్తే అతనే మారతాడని తాను ఓపికపట్టానని, అదే అదునుగా తీసుకొని ఇంకా తనను వేదించాడంది. అతని తల్లిదండ్రులపై ఎలాంటి కేసు కాకుండావుండేందుకు తనను మరో ఇంటికి మార్చారని వాపోయింది.

విద్యార్థుల పూర్తి ఫీజు మంజూరుకోసం

3న హైదరాబాద్‌లో బిసి విద్యార్థుల భారీ బహిరంగ సభ

హైదరాబాద్, జనవరి 30 ప్రభాతవార్త: కాలేజీ కోర్సులు చదివే బిసి విద్యార్థులకు పూర్తి ఫీజులు మంజూరు చేయాలని బిసి విద్యార్థులకు జనాభా ప్రకారం 500 బిసి రెసిడెన్షియల్ పాఠశాలలు మంజూరు చేయాలని, బిసిల విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థల రిజర్వేషన్లను 50%కు పెంచాలని, చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని రాష్ట్ర బిసి విద్యార్థి సంఘం కార్యవర్గ సమావేశం డిమాండ్ చేసింది. ఫిబ్రవరి 3వ తేదీన 50 వేల మంది విద్యార్థులతో రాష్ట్రస్థాయి విద్యార్థుల భారీ బహిరంగ సభ హైదరాబాద్‌లో జరుపాలని ఈ సమావేశం నిర్ణయించింది. ఈ సమావేశానికి రాష్ట్ర బిసి విద్యార్థి సంఘం అధ్యక్షుడు జి.అంజి, ప్రధాన కార్యదర్శి రామకృష్ణ అధ్యక్షత వహించారు. ఈసమావేశంలో ఆర్.కృష్ణయ్య, ర్యాగ అరుణ్, గుజ్జకృష్ణ, నీల వెంకటేష్, రామలింగం, కోట్ల శ్రీనివాస్, జి. కృష్ణ, నర్సింహాగౌడ్, అనంతయ్య, పగిళ్ల సతీష్ తదితరులు ప్రసంగించారు. విద్యార్థులనుద్దేశించి ఆర్. కృష్ణయ్య ప్రసంగిస్తూ ముఖ్యమంత్రి కేసిఆర్ బిసి డిక్లరేషన్ ప్రకటించాలని కోరారు. డిసెంబర్‌లో మూడు రోజులు అనీన రాజకీయ పార్టీలకు చెందిన బిసి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, రాజ్య సభ సభ్యులు 37 మందితో చర్చలు జరిపి దాదాపు 190 తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారని ఆయన గుర్తు చేశారు. పార్టీలకతీతంగా బిసి సభ్యులు చర్చలు జరిపి ఏకగ్రీవంగా ఇచ్చిన వాటిని బిసి డిక్లరేషన్ చేస్తామని ముఖ్య మంత్రి కేసిఆర్ ప్రకటించడం చారాత్రాత్మకమన్నారు. అన్ని పార్టీలకు, ప్రభుత్వాలకు ఇది ఆదర్శవంతమని ఆర్.కృష్ణయ్య అభివర్ణిం చారు. బిసిలకు చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు పెట్టాలని, బిసిల చిరకాల డిమాండ్ కార్యరూప దాల్చలంటే రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్య మంత్రులు కేసిఆర్, చంద్రబాబుల నాయకత్వంలో అఖిల పక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి ప్రధానమంత్రితో చర్చలు జరుపాలని ఆయన సూచించారు. అలాగే లోక్‌సభ సభ్యులు ద్వారా ఒత్తిడి తెచ్చి పార్లమెంటులో బిసి బిల్లు పెట్టడానికి కృషి చేయాలని ఆయన కోరారు.

రౌండ్‌టేబుల్ సమావేశాల పేరుతో రాజకీయ డ్రామాలు: కర్నె ప్రభాకర్

హైదరాబాద్, జనవరి 30 ప్రభాతవార్త: అధికారంలో ఉన్నప్పుడు ఏఒక్క వర్గం ప్రజల బాగోగులను పట్టించుకున్న పాపానపోని కాంగ్రెస్ నాయకులు ఇప్పుడు రాజకీయ స్వార్థంతో రౌండ్‌టేబుల్ సమావేశాల పేరుతో వివిధ వర్గాలపై మొసలి కన్నీరు కారుస్తున్నారన, రాజకీయ ప్రసంగాలు చేస్తూ ప్రభుత్వంపై విషం కక్కుతున్నారని, డ్రామాలాడుతున్నారని టిఆర్ఎస్ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ మండిపడ్డారు. మంగళవారం టిఆర్ఎస్ఎల్పీలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హైదరాబాద్‌లో జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఓ కాంగ్రెస్, బిజెపి నేతలు మాట్లాడిన తీరు నవ్విపోదురుగాక నాంకేటి సిగ్గు అన్న విధంగా ఉందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ హయాంలో 2004 డిసెంబర్‌లోనే ఎస్సీ వర్గీకరణపై అసెంబ్లీ తీరా ్మనం చేసిందని ఆయన పేర్కొంటూ 10 ఏళ్ల యూపిఏ ప్రభుత్వం అధికారంలో ఉండి కూడా ఎందుకు వర్గీకరణ చేయలేదని నిలదీశారు. ఎమ్మార్పీఎస్ ఉద్యమం సందర్భంగా గాంధీభవన్ఓల ముగ్గురు దళిత యువకులు ప్రాణాలు కోల్పోతే వారి కుటుంబాలను ఆదుకోవాలన్న సోయి కూడా కాంగ్రెస్ పార్టీకి లేకపోయిందన్నారు. వర్గీకరణ ఉద్యమంలో ప్రాణాలు కోల్పోయిన 11 మంది కుటుంబాలను ఆదుకున్నది టిఆర్ఎస్ ప్రభుత్వమన్న విషయాన్ని గుర్తు పెట్టుకోవాలని ప్రభాకర్ గుర్తు చేశారు. కాంగ్రెస్, బిజెపిలు ఏకతాటిపై రావాల్సింది హైదరాబాద్‌లో కాదని, ఢిల్లీలో ఆరెండు పార్టీలు కలిసి వర్గీకరణ అఃలపక్ష సమావేశం నిర్వహిస్తే తగిన ఫలితం ఉంటుందన్నారు. ఎస్సీ వర్గీకరణపై టిఆర్ఎస్‌కు చిత్తశుద్ధి ఉంది కాబట్టే ఉభయసభల్లో తీర్మానం చేసిందన్నారు. ఈ అంశంపై ప్రధాన్ని అఖిలపక్ష బృందం కలిసేందుకు ఆయన అపాయింట్‌మెంట్ కూడా దొరకడం లేదని ఆయన విచారం వ్యక్తం చేశారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ చేతనైతే అఃలపక్ష బృందానికి ప్రధాని అపాయింట్‌మెంట్ ఇప్పించాలని ఆయన సూచించారు. మంద కృష్ణమాదిగ కొన్ని రాజకీయ పార్టీల మాయలో పడవ్వదని ప్రభాకర్ కోరుతూ భారతి అనే కార్యకర్త మృతి రాజకీయం చేయడానికి ప్రయత్నించినపుడు ఆమె కుటుంబ సభ్యులే వ్యతిరేకించారన్నారు. ఎస్సీ వర్గీకరణ కోసం అఃలపక్షబృందాన్ని ఢిల్లీకి తీసుకెళ్లడానికి తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.


మంగళవారం అసెంబ్లీ అవరణలోని మహాత్మాగాంధీ విగ్రహం వద్ద నివాళులు ఆర్పిస్తున్న స్పీకర్ మధుసూదనాచారి తదితరులు

మహాత్ముని ఆశయాలు ప్రపంచానికి ఆదర్శం

గాంధీభవన్‌లో నివాళులు అర్పించిన ఉత్తమ్

హైదరాబాద్, జనవరి 30 ప్రభాతవార్త: మహాత్మా గాంధీ ఆశయాలు ప్రపంచానికి ఆదర్శమని, అహింస, శాంతి, సహనం, మహాత్ముని సిద్ధాం తాలను ప్రపంచానికి ఆదర్శంగా నిలిచాయని పిసిసి అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం మహాత్మాగాంధీ 90వ వర్ధంతి సందర్భంగా తెలంగాణ కాంగ్రెస్ నేతలు గాంధీభవన్‌లోలోని గాంధీ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర్య సాధనలో మహాత్మాగాంధీ కృషి దేశ ప్రజలు మరువలేనిదని అన్నారు.నేడు దేశం మహాత్ముడు చూపిన మార్గం నడవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రపంచ వ్యాప్తంగా మహాత్మగాంధీ సిద్ధాంతాలను ఆశయాలను ఆచరిస్తున్న సమయంలో దేశంలో గాంధీ సిద్ధాంతాలను మరుగున పడేసేం దుకు కుట్రలు చేస్తున్నారని ఆయన విమర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిలు వి.హను మంతరావు, అంజన్‌కుమార్ యాదవ్, టిపిసిసి కోశాధికారి గూడురు నారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి నిరంజన్, అధికార ప్రతినిధులు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

సర్పంచ్ ఎన్నికలు ప్రత్యక్షంగా నిర్వహించాలి

కలెక్టర్లకు జిల్లాకాంగ్రెస్ వినతి

హైదరాబాద్, జనవరి 30 ప్రభాతవార్త: గ్రామపంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్‌ను ప్రత్యక్షంగా నిర్వహించాలనే ప్రధాన డిమాండ్‌తో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో కాంగ్రెస్ నేతలు కలెక్టర్లకు కలిసి విజ్ఞప్తులు చేశాయి. తెలంగాణలో పాత జిల్లా కేంద్రా లలో డిసిసి అధ్యక్షల నేతృత్వంలో కలెక్టర్లకు వినతిపత్రాలు అందజేశారు. సంగారెడ్డి జిల్లా కేంద్రంలో డిసిసి అధ్యక్షురాలు సునీతా లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో గీతారెడ్డి, మాజీ ఎంపి సురేష్ షెట్కార్ తదితరులు పాల్గొన్నారు. కరీంనగర్ జిల్లాలలో జిల్లా కేంద్రంలో డిసిసి అధ్యక్షులు మృత్యుంజయం, రంగారెడ్డి జిల్లా కేంద్రంలో డిసిసి అధ్యక్షులు క్యామ మల్లేషం, ఖమ్మం జిల్లా కేంద్రంలో అయితా సత్యం ఆధ్వర్యంలో, మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ఉబేదుల్లా కొత్వాల్, నిజామాబాద్ జిల్లా కేంద్రంలో తాహెర్ బిన్ అహ్మద్, నల్గొండ జిల్లాలో డిసిసి అధ్యక్షుడు బిక్షమయ్యగౌడ్, వరంగల్ జిల్లా కేంద్రంలో నాయిని రాజేందర్‌రెడ్డి నేతృత్వంలో, ఆదిలాబాద్‌లో డిసిసి నాయకులు కలెక్టర్లకు వినతిపత్రాలు అందజేశారు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసే విధంగా టిఆర్ఎస్ ప్రభుత్వం గ్రామ పంచాయితీ ఎన్నికలు పరోక్ష పద్ధతిలో నిర్వహించాలని ఆలోచిస్తుందన్నారు. రాజకీయాల్లో అవినీతి ప్రోత్సహించే విధంగా రాజకీయ ఫిరాయిం పులను ప్రోత్సహించే విధంగా ఉంటుందని అందుకే ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహించాలని వారు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలోని తండాలను గ్రామ పంచా యతీలు చేయడం, కొత్త పంచాయితీలకు 50లక్షల రూపాయల ప్రత్యేక నిధులను ఏర్పాటు చేయడం, షెడ్యూల్డ్ ప్రకారం ఎన్నికలను ఆగస్టులో నిర్వ హించడం లాంటి ప్రధాన డిమాండ్లను కలెక్టర్లకు ఇచ్చిన వినతిపత్రాల్లో పేర్కొన్నారు. ఈ సందర్భంగా అన్ని జిల్లాల్లో మాజీ మంత్రులు, మాజీ ఎంపిలు, ఎమ్మెల్యేలు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

సంఘర్షణల్లో నలుగుతున్న మహిళ



శృంగవరపు రచన

దేశానికి మొదటి మహిళా ప్రధాని ఎవరు? మొదటి మహిళా వ్యోమగామి ఎవరు? మొదటి మహిళా న్యాయమూర్తి ఎవరు? ఇలాంటి ప్రశ్నలు చాలా క్విజ్ పోటీల్లో మనం వింటూనే ఉంటాం. కానీ ఏనాడు దేశానికి మొదటి మగప్రధాని ఎవరు? మొదటి మగవ్యోమగామి ఎవరు? మొదటి మగ న్యాయమూర్తి ఎవరు? ఈ తరహా ప్రశ్నలు ఎన్నడూ వినం. అలా 'మహిళ' అనే పదం తగిలించబడటం ఆ స్త్రీ సమానత్వం లేదా విజయం సాధించింది అనడానికి సంకేతమా? స్త్రీకి రిజర్వేషన్ శాతం పెరగడం సమానత్వమా? ఏదైనా అత్యాచారమో, అఘాయిత్యమో జరిగినప్పుడు పలు మహిళా సంఘాలు మీడియాలో గగ్గోలు పెట్టి, కొన్ని రోజుల తర్వాత ఆ ఉదంతాలు మరుగునపడటం సమానత్వమా? 'మహిళ'ను ఓ వివాదాస్పద వస్తువుగా మారుస్తూ, దానికి స్త్రీ ఉద్ధరణ అనే పేరు పెట్టడం ఇవన్నీ పబ్లిసిటీ కోసం పరోక్షంగా చేసే స్టంట్లేనేమో! ఈ మధ్య రెండు తెలుగు రాష్ట్రాలను ఊపేసిన అంశం రామ్‌గోపాల్‌వర్మ 'గాడ్, సెక్స్ అండ్ ట్రూత్' ఈ ఫిల్మ్‌లో అమెరికన్ పోర్న్‌స్టార్ నటించడం, అన్నది సంచలనాన్ని రేపింది. అది స్త్రీ ఆత్మాభిమానాన్ని, గౌరవాన్ని కించపరచడమే కాకుండా, ఇటువంటి స్త్రీపై అత్యాచారాలు పెరిగేలా పురిగొల్పుతాయని మహిళా సంఘాలు మీడియా సాక్షిగా ఉద్యమాలు చేసాయి. పోర్న్ అనేది మనకు కొత్త అంశం కాదు. భారతదేశం పోర్న్ చూడటంలో మూడవస్థానంలో ఉంది. ఎన్నో పోర్న్ వీడియోలు హల్‌చల్ చేస్తూనే ఉంటాయి ప్రతిరోజు. కానీ వాటి వేటి మీద ధ్వజమెత్తని వీరంతా ఒక్క ఈ 'జిఎస్‌టి' మీదే ఎందుకు దండెత్తారు? సినిమలు, షార్ట్‌ఫిల్మ్‌లు ఏ మనిషిని ప్రత్యక్షంగా ప్రభావితం చేయవు. అవి పరోక్ష మాధ్యమాలే. మరి రాష్ట్రంలో జనవరి నెలలో ప్రేమోన్మోదానికి బలైన యువతులు ఉన్నారు. అలాగే ఒడిషాలో ఓ మైనర్ బాలికపై గ్యాంగ్‌రేప్ జరిగిన తర్వాత ఆ పాప సూసైడ్ చేసుకున్న ఉదంతం ఆ రాష్ట్రాన్నే కాదు దేశాన్నే అట్టుడుకించింది. ఈ ఉదంతాలు పక్కన పెడితే 'పద్మావత్' సినిమా విషయంలో దీపికాపదుకొనె లాంటి స్త్రీ ఆత్మగౌరవం నిలబెట్టడానికై ఎవరూ ఇంతగా ఉద్యమించలేదే? జరుగుతున్న ఉదంతాలు, పరిష్కారానికై ఉద్యమిస్తాం అనే ముసుగుతో కొనసాగే కుహనావాదులను నిశితంగా పరిశీలిస్తే ఇవన్నీ కేవలం పబ్లిసిటీ స్టంట్‌లు అని అర్థమవుతాయి. సమస్య (లేదా) చర్చలు వచ్చినప్పుడు మాత్రమే మొహాలు తెరలపై చూపించుకునే వీరు ఆ తర్వాత ఆ సమస్య చివరికి ఏమైందో మాత్రం చెప్పడానికి నోరు విప్పరు. వాస్తవిక కోణంలో గమనిస్తే అసలు సమానత్వం అన్న అంశాన్ని ఏ ప్రమాణాల ఆధారంగా నిర్ధారించాలి అన్న స్పష్టత దాదాపు ఎవరికీ లేనట్టే కనిపిస్తూ ఉంటుంది. అభిరుచి, ఆత్మాభిమానం కలయిక సమానత్వం అని కొంతమేరకు నిర్వచించవచ్చు. అసలు సమానత్వం అన్న అంశం



మగువ మనసు

కేవలం యవ్వనంలో, ప్రౌఢ దేశంలో ఉన్న స్త్రీలకు మాత్రమే చెందిన అంశంగా ఎందుకు చిత్రీకరించబడుతుంది? మనం పెరిగిన వాతావరణం, ఆ వాతావరణం మనపై చూపే ప్రభావం గాఢంగా ఉంటుంది. బాల్యంలో ఓ ఆడపిల్ల తనకు ఇష్టమైన పనులు చేస్తానన్నప్పుడో లేక యవ్వనదశలో తనకు నచ్చిన చదువు చదువుతానని అన్నప్పుడో వచ్చే కుటుంబ వ్యతిరేకతతో సమానత్వాన్ని ప్రశ్నించే బీజం మొలకెత్తుతుంది. అక్కడి స్థితిగతుల్లో రాజీపడిపోయిన ఆ బాలిక లేదా యువత తర్వాత జీవితంలో అటువంటి పరిస్థితులు పునరావృతం అయిన సాధ్యమైన మేరకు రాజీపడి సర్దుకుపోవాలనే మనస్తత్వాన్నే అలవరచుకుంటుంది. బాల్యం నుంచే స్వఅభిరుచుల్ని, ఆత్మగౌరవాన్ని నిలబెట్టుకొగలిగే ధైర్యాన్ని బాలికల్లో నింపగలిగే వాతావరణం నిర్మించగలిగితే నిజమైన సమానత్వం సజీవంగా వర్థిల్లుతుంది. ఇది ఓ కోణం. ఇంకో కోణాన్ని పరిశీలిద్దాం.

మానవుని మనుగడకు, భవిష్యత్తుకు కేంద్రబిందువు 'బాలిక' యావత్ ప్రపంచం 'సేవ్ గర్ల్ ఛైల్డ్' అంటూ గొంతెత్తి నినదిస్తున్నది. రోజురోజుకు ప్రపంచవ్యాప్తంగా ఆడశిశువుల జననమరణాల లెక్కలు చూసి ఆందోళన చెందుతున్నది. క్షణక్షణం 'ఆడపిల్ల'ను రక్షించుకోడానికి తపనపడుతున్నది నేటి సమాజం. ఇంతగా ఆరాటపడే ఈ సమాజంలోని బాలిక పుట్టగానే చెత్తకుప్పలలో, మురిక గుంటలలో పారేసేవారు, ఆర్థికంగా కుంగిపోయి అమ్మాయిలను అమ్ము'కొంటున్న'వారు ఉండడం శోచనీయం. అదేవిధంగా బాలికలను యువతులను, ఆడవారిని చులకనగా చూస్తూ మనోవేదనకు గురి చేస్తూ, చిత్రహింసలు పెడుతూ, చివరికి దుర్మార్గమైన పనులకు పూనుకుంటూ వారి జీవితాలకు అర్థాంతరంగా ముగింపు పలుకుతున్న దాష్టికదుష్టలు కూడా మనం జీవిస్తున్న ఈ సమాజంలోనే బతుకుతుండడం అత్యంత బాధాకరం. 2008వ సంవత్సరం నుండి మనదేశంలో ప్రతి సంవత్సరం జనవరి 24వ తేదీన జాతీయ బాలికల దినోత్సవం నిర్వహిస్తున్నది. సేకరించిన జనాభా లెక్కలలో బాలబాలికల నిష్పత్తిని పరిశీలిస్తే చాలా ఆందోళనకరంగా ఉన్నది. ఆరు సంవత్సరాలలోపు ప్రతి వెయ్యిమంది బాలురకు ఆడపిల్లలు 914 మంది మాత్రమే అందుబాటులో ఉన్నారు. ఈ పరిస్థితే ఆందోళన కలిగించేలా ఉందంటే మనదేశంలో ఆడపిల్లను బతకనిచ్చే



పరిస్థితి చాలా దయనీయంగా ఉన్నది. ఒక దగ్గర చదువు చెప్పవలసిన అధ్యాపకుడే విద్యార్థిని వేధిస్తాడు. దేశ రాజధాని అయిన ఢిల్లీలో ఇద్దరు అభంశుభం తెలియని చిన్నారులపై సామూహిక లైంగికదాడి (17-10-2015), మరో దగ్గర కంటికి రెప్పలా కాపాడుకోవలసిన తల్లిదండ్రులే కూతురిని వ్యభిచారం రొంపిలోకి తోయడం, ప్రభుత్వ ఉద్యోగాల పేరు చెప్పి యువతులకు గాలం వేసి బ్లాక్‌మెయిల్ చేయడం..ఇవన్నీ నాణెనికి రెండోవైపు! తమ ఉనికిని, ఆత్మగౌరవాన్ని నిలబెట్టుకునే సంఘర్షణ ఓ వైపు సమాజంలో వెల్లువత్తే దాష్టీకాల బారి నపడకుండా తమను తాము కాపాడుకోవడం ఇంకో వైపు స్త్రీ ఈ రెండు సంఘర్షణల మధ్య కొట్టుమిట్టాడుతుంటే అరచేతిలో వైకుంఠం చూపిస్తూ తమ పబ్లిసిటీ పబ్బం గడుపుకునేవారు ఇంకొందరు. సమానత్వం, వ్యక్తిగత అభిరుచులు, ఆలోచనలతో మేళవించబడిన నిలువెత్తు స్త్రీ ఆత్మగౌరవ కోణమే తప్ప ఇదో పరుగు పందెమో, పోటీనో కానేకాదు. ❐

గోరంత దీపాలు

మీ గోళ్లను చూస్తేచాలు చెప్పవచ్చు మీరెంత ఆరోగ్యవంతులో! మీ గోళ్లరంగు బట్టి, వాటి అందమైన ఆకృతిని బట్టి మీ అందాన్ని ఊహించవచ్చు. మీ గోళ్లను చూసి మీ చేతి అందాన్ని ఆకళింపు చేసుకోవచ్చు. మీరు ఏవిధమయిన శ్రద్ధను గోళ్ల విషయంలో తీసుకోదలచారో తెలుసుకుంటే వాటి జాగ్రత్తలను ఏవిధంగా తీసుకోవాలో కూడా తెలుస్తుంది. మీ ఇంట్లో వారే మీకు అన్ని విషయాలు చెబుతారు.

◆ మీ గోళ్లు అందంగా ఆరోగ్యంగా పెరగాలనుకుంటే మీరు చేపలను, గ్రుడ్లను, తోడుపెట్టిన పెరుగును తినండి, పచ్చని ఆకుకూరలని సమృద్ధిగా తినండి పాలు బాగా త్రాగండి. గోళ్ల పెరగాలంటే శరీరంలో ప్రొటీను, అయిరన్, విటమిన్ బి, కాల్షియం బాగా ఉండే పదార్థాలను తినాలి.

◆ మంచి ప్రొటీన్ ఆహారంతో పాటు మీరు మీ గోళ్ల విషయంలో చక్కటి జాగ్రత్తలు కూడా తీసుకోవాలి. మీరు వారానికి వొక 30 నిమిషాల పాటు గోళ్ల విషయంలో శ్రద్ధ తీసుకొని జాగ్రత్తగా వాటిని గురించి తగు చర్యలు తీసుకోలేరా? మీరు జాగ్రత్తగా ఈ క్రింద ఉదహరించిన విషయాలని గమనించండి.

◆ మీ చేతివ్రేళ్ల గోళ్లకున్న పాలిష్‌ను ఆయిల్ రాసిన గుడ్డ బంతితో పాలిష్‌ను తీసివేయండి. ఆయిల్‌ను గోరుపై రాసి గుడ్డబంతితో వత్తి మెల్లిగా రంగును తీసివేయండి. మీరు అనేక గుడ్డ బంతులను వాడాల్సి ఉంటుంది. పూర్తిగా గోళ్లరంగును తుడిచి వేసిన తరువాత,

◆ మీరు ఎమరీ పేపరును తీసుకుని మీ గోళ్లను గోళాకారంగా రుద్దండి. జాగ్రత్తగా షేపు చెడకుండా ఫైలు చేయండి. మీ గోళ్లు పొట్టిగా ఉంటే చిగురులు, ప్రక్కలు తిన్నగానే ఉంచండి. పెరిగిన కొద్ది బలంగా ఉంటాయి. మీకు నచ్చిన రీతిలో గోళ్లను పెంచండి.

◆ ప్రతిగోరు మొదట్లో కొంచెం క్రీంను మసాజ్ చేయండి. పొడిచర్మం సున్నితంగా తయారవుతుంది.

◆ మీరు గోళ్లను గోరువెచ్చని సబ్బు నీళ్లల్లో 5నిమిషాలు బాగా కడగండి. ఇంకా ఏదయినా మట్టి ఉంటే తుడిచేయండి. నూనెను క్యూటికిల్సుకు రాయండి.

◆ చిన్నపుల్లకి దూదిని కట్టి ఆయిల్‌లో ముంచి వ్రేలిపై భాగాలకు రాయండి.

◆ చిన్నపుల్లకి దూదిని కట్టి సోపువాటర్‌లో ముంచి వ్రేళ్లపై భాగాలను శుభ్రపరచండి.

◆ చేతిలోషన్‌లో చేతులు, వ్రేళ్లు, గోళ్లు శుభ్రంగా కడగండి. ప్రతి వ్రేలు సంపూర్ణంగా కడగాలి. గోరు చివరిభాగం నుండి వ్రేలు మొదలు వరకు బాగా శుభ్రపరచండి. చిట్లిన గోళ్లను గోళ్లగమ్ముతో అంటించవచ్చు. దానిని నెయిల్ గ్లూయింగ్ అంటారు. రంగు గోళ్ల నుండి పోయిన తరువాత చిట్లిన గోళ్లను గమ్ముతో గ్లూ చేయాలి అంటే అంటించాలి. తరువాత గ్లూను దూరంగా ఉంచాలి. మిగతా వ్రేళ్లకు గాని, గోళ్లకు గాని గ్లూ తాకకూడదు. గోళ్లు కొరకకూడదు. గోళ్లు కొరికితే అవి చూడడానికి అసహ్యంగా ఉంటుంది.



◆ గోళ్లకు రంగు వేయండి మంచిదే అందదండా ఉంటుంది. కాని అతిగా మాత్రం రంగు వేయకూడదు. మీ శరీరానికి తగిన రంగును మీ గోళ్లకు వేయాలి. మీ గోళ్లకు కూడా గాలి సోకాలి కదా! అందుకని రంగును తరచు పూయకూడదు. రంగు గోరుమీద ఒక పూతగా యేర్పడి గాలి గోరుకు సోకకుండా ఒక పూతగా ఉండిపోతుంది. మీరు జాగ్రత్త వహించాల్సింది ఒక్క చేతిగోళ్లకే కాదు. కాలివ్రేలి గోళ్లు కూడా శుభ్రపరుచుకుని రంగు వేసుకోవాలి. మీరు మీ గోళ్లను ఎంత శుభ్రంగా ఉంచుకుంటే మీ అందం అంత హెచ్చుగా ద్విగుణీకృతమవుతుంది.

కాళ్లు-పాదరక్షలు

◆ చూసే వారికి మనలోకి హుందాతనాన్ని కన్పింపచేయడానికై ముఖము, చేతులు ఎంత ప్రధానపాత్ర వహిస్తాయో వాటితో పాటు కాళ్లు, పాదాలు కూడా ప్రముఖపాత్ర వహించాల్సి ఉంటుంది. పాదాల విషయంలో చాలామంది ఎక్కువ పట్టించుకోరు. ముఖం చూస్తే ముద్దొచ్చేలా ఉంటుంది. కాళ్లు చూస్తే పిచ్చేక్కెలా ఉంటుంది. పాదాలను గురించి సరైన శ్రద్ధ తీసుకోకపోతే చాలా ఇబ్బందులు ఎదుర్కొనవలసి ఉంటుంది.

◆ పాశ్చాత్యదేశాల్లో పాదాల అందాలకు ఎక్కువ ప్రాధాన్యతను ఇస్తారు. అక్కడ 'బ్యూటీలెగ్స్' కాంపిటీషన్స్ కూడా నిర్వహిస్తుం టారు. పగిలిన వంటి పాదాలు, మడమలు చూడటానికి అసహ్యం కలిగేలా ఉండి, నడవటానికి భరించలేనంత బాధను కలిగిస్తూ పగుళ్లలోంచి రక్తం కారుతూ, చీరెల పీచులు పడుతూ చాలా ఇబ్బందికరంగా, బాధాకరంగా ఉంటాయి.

◆ మనదేశంలో కొంతకాలం వరకు సాంప్రదాయం పాటించే రోజుల్లో చక్కగా రోజూ పూజ చేసుకుని ఇంతింత పసుపుకాలంతా రాసుకుని చూసేవాళ్లకు గౌరవం ఉట్టిపడేలా ఉండేవారు. పూజ చేసుకొని పసుపు రాసుకోవటమనేది ఒక ఆచారం అలాంటి ఆచారాల వల్ల పాదాల సౌందర్యం కాపాడుకోగలిగేవారు అని క్రమంగా తగ్గిపోయాయి. పాదాలకు కావలసిన పోషణ పట్ల మనం చూపే అశ్రద్ధ లోపం మొదటిది. తరువాత వ్యాయామలోపం, తగు పరిశుభ్రం కూడా లోపించడం, మన శరీర బరువునంతా మోయగలిగేది పాదాలే కనుక వాటి నుంచి షేప్‌ని చక్కగా ఎక్సర్‌సైజులతో మెయిన్‌టెయిన్ చేయాలి. ఎత్తు మడమలు గల చెప్పులు వాడటం మంచిది కాదు. శరీరం మొత్తం బరువు పాదాలపైనే ఉంటుంది. కనుక దాని ద్వారా వెన్నునొప్పి రావటానికి అవకాశముంటుంది. తరువాత ఆడవారికి ఈ హీల్స్ వాడటం వలన పిరుదులు బాగా పెరిగే అవకాశముంది. ఈ హీల్స్ వేసుకుని హడావుడిగా నడిస్తే కాలు స్లిప్ అయి బెణికే ప్రమాదం కూడా ఉంది. కలిగించకూడదు. ❐

మునగాకు పప్పు

కావలసినవి

మునగాకు-రెండు కప్పులు, శనగపప్పు-కప్పు
కందిపప్పు-కప్పు, ఉల్లిపాయ-ఒకటి
పసుపు-అర టేబుల్‌స్పూన్
కారం-రెండు టేబుల్‌స్పూన్లు, ఉప్పు-తగినంత
జీలకర్ర-అర టేబుల్‌స్పూన్
వెల్లుల్లి-నాలుగు రెబ్బలు, ఆవాలు-ఒక టేబుల్‌స్పూన్
ఎండుమిర్చి-రెండు, కరివేపాకు-రెండు రెబ్బలు
చింతపండు-కొద్దిగా
నూనె-ఒక టేబుల్‌స్పూన్

తయారుచేసే విధానం

పప్పుల్నీ ఆకునీ శుభ్రంగా కడిగి కుక్కర్‌లో వేయాలి. అందులోనే పసుపు, కారం, రెండు చుక్కల నూనె వేసి మూడు విజిల్స్ వచ్చే వరకూ ఉడికించి ఉంచాలి. చింతపండును ముందుగానే నానబెట్టి గుజ్జులా చేసి, ఇప్పుడు పప్పులో కలపాలి. తరువాత బాణలిలో నూనె వేసి వెల్లుల్లి జీలకర్ర, ఆవాలు, ఎండుమిర్చి, కరివేపాకు వేసి వేయించాలి. తరువాత ఉల్లిముక్కలు వేసి వేయించాలి. ఇప్పుడు ఉడికించిన పప్పులు ఆకు వేసి దగ్గరగా ఉడికించి దించాలి. ❐



ఆచరణాత్మకం

ఇవి చేయాలి

♦ కచ్చితమైన ఆహార సమయాన్ని పాటించాలి.

♦ భోజనానికి, భోజనానికి మధ్యలో మూడుసార్లు స్నాక్స్ తీసుకోవాలి.

♦ సరిపడ నీరు తాగడం ఎట్టి పరిస్థితులలోనూ మరచిపోకూడదు. నీరు శరీరంలోని టాక్సిన్స్‌ను బయటకు పంపడానికి దోహదం చేస్తుంది.

♦ భోజనానికీ, భోజనానికీ మధ్యలో ఎక్కువ సమయం ఉండకూడదు. అదేవిధంగా తీసుకునే ఆహారాన్ని నాలుగైదుసార్లు కొద్ది కొద్దిగా తీసుకోవాలి.

♦ 20 నుండి 25గ్రాముల పచ్చి ఉల్లిపాయముక్కలను ఆహారంలో చేర్చుకోవాలి.

♦ తాజా కూరగాయలు, సలాడ్స్ తీసుకునే ఆహారంలో తప్పనిసరిగా చేర్చుకోవాలి.

ఇవి చేయకూడదు

♦ ఆహారం తీసుకున్న తరువాత వ్యాయామం అన్నది చేయకూడదు.

♦ వ్యాయామం చేసే ముందు నిపుణుల సలహా తీసుకోవడం తప్పనిసరి.



♦ పాదరక్షలు, బూట్లు లేకుండా పరిగెత్తడం, నడవడం వంటివి చేయకూడదు.

♦ ఎక్కువ ఎక్కువ ఆహారాన్ని ఎప్పుడూ తీసుకోకూడదు. తీసుకునే ఆహారాన్ని కూడా గబగబా కాకుండా నెమ్మదిగా బాగా నమిలి మాత్రమే తీసుకోవాలి. నూనెలో బాగా వేయించిన పదార్థాల జోలికి అస్సలు పోకూడదు.

♦ తీపి పదార్థాలకు దూరంగా ఉండాలి. తినాలి అనిపించినప్పుడు చిటికెడు మాత్రమే తీసుకోవాలి. ❐

వ్యాయామానికీ చిట్కాలు

వ్యాయామం రక్తంలో ఉండే విఎల్‌డిఎల్, ఎల్‌డిఎల్ కొవ్వు పదార్థాలను, ట్రైగ్లిజరైడ్స్ కొవ్వును తగ్గిస్తుంది. హెచ్‌డిఎల్ కొలెస్ట్రాల్ పరిమాణాన్ని పెంచుతుంది. ఈ రెండు ప్రక్రియలు గుండెకు మంచిది. వ్యాయామం వలన గుండె వేగం, రక్తపోటు తగ్గుతాయి. గుండె పనిచేసే తీరు మెరుగుపడుతుంది.

మానసిక లాభాలు

★ వ్యాయామం వలన శరీరంలో సామాన్యంగా విడుదలయ్యే ఎండార్ఫిన్స్ అధిక పరిమాణంలో విడుదలవుతాయి. ఇవి హార్మోన్లు.

ఇవి మెదడుపై పనిచేసి మనిషికి మానసిక తృప్తి, ఆత్మవిశ్వాసం, ఆరోగ్యంగా ఉన్నామనే అనుభూతిని కలిగిస్తాయి. వ్యాయామం వలన కలిగే కదలికలు, కండలు పెరగడం మొదలైన వాటి వలన జీవన సరళి ఉత్తమంగా మారి, టైప్-2 మధుమేహ వ్యాధి గ్రస్తులకు చక్కెర నియంత్రణలో ఎంతో తోడ్పడుతుంది. వీరికి ఆందోళన తగ్గి, మానసిక, శారీరక ఒత్తిళ్లను తట్టుకునే శక్తి వస్తుంది.



ముందు జాగ్రత్తలు

★ ఏ విధమైన వ్యాయామమైనా లేదా ఏదో ఒక రకమైన వ్యాయామమైనా టైప్-2 వారికి సురక్షితమే. కాని, కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం అవసరం. ఎందుకంటే టైప్-2 వ్యాధిగ్రస్తులు సంవత్సరాల తరబడి దేహ పరిశ్రమలేని కూర్చుని చేసే పనులు చేస్తుంటారు.

★ అందువలన వారి దేహ పరిస్థితి సవ్యంగా ఉండదు. 35సంవత్సరాలు పైబడినవారు గట్టి వ్యాయామ ప్రక్రియలు మొదలెట్టాలంటే వైద్యపరీక్షలు. కార్డియాక్ స్ట్రెస్ టెస్ట్ చేయించు కోవాలి.

★ షుగర్ నియంత్రణ తెలుసుకోవడం

★ వర్కింగ్ కెపాసిటీని నిర్ణయించడం. దీనిలో ఒక పద్ధతిలో వ్యాయామాలు పెంచుకుంటూ, దానికి అనుగుణంగా నాడి, ప్రాణవాయువు వినియోగాన్ని తెలుసుకుంటారు. ఆఫ్థాల్మాస్కోపిక్ పరీక్ష. దీనిలో కంటి రెటీనా తెరలో రక్తనాళాల వ్యాధులు ఉన్నా, వ్యాధులు ఉండవచ్చుననే అనుమానం ఉన్నా పరీక్ష చేస్తారు. చాలామంది టైప్-2 షుగర్ వ్యాధిగ్రస్తుల్లో వ్యాధి నిర్ధారణకు ముందు చాలాకాలం నుంచి జబ్బు ఉంటుంది. అందుకే కొత్తగా వీరిని కనుగొన్నా వారికి బిపి, న్యూరోపతి, రెటీనోపతి, నెఫ్రోపతి, ఉన్నాయేమో పరీక్షించాలి. మరో ముఖ్య విషయం వీరికి ఛాతీలో నొప్పి లేకుండానే సైలెంట్ హార్ట్ ఎటాక్ ఉండటం సాధారణం. చక్కెర స్థాయి నియంత్రణలో లేని వారికి, చక్కెర కాంప్లికేషన్లు ఉన్నవారికి గట్టి వ్యాయామాలు పనికిరావు. పాదాల్లో స్పర్శ, రక్తప్రసరణ ఎలా ఉంది? అని గమనించాలి. అటువంటి లోపాలు ఉన్నవారికి పాదాలకు ఒత్తిడి, గాయాలు కలిగించని వ్యాయామాలు సిఫార్సు చేయాలి. వీరికి సురక్షితమైన, సరైన పాదరక్షలు కావాలి.

★ బిపి, రెటీనా పొర వ్యాధులున్న వారు బరువులు లేపటం, స్విమ్మింగ్, సైకిలింగ్, జాగింగ్ మొదలైనవి చేయకూడదు. ❐

ఉపకారం

ఆధ్యాత్మికం

భగవంతుడి సృష్టితో మనిషి ఒక అద్భుతమైతే, మానవతతో ఆ జన్మను సార్థకం చేసుకునే విధానాలతో, జీవయాత్ర సాగించడం, మానవ ధర్మం. కలియుగంలో మసలే మనుషులు, చిత్ర విచిత్ర స్వభావాలతో ఎవరికి వారే, అన్నట్లు బ్రతుకుతూ ఎదుటి వారి గురించిన ఆలోచనలకు దూరమవడం వల్ల, ఎన్నో అనర్థాలు ఎదురవుతున్నాయి. ఒకే కుటుంబంలో నివసించేవారు సైతం ఎవరు, ఏమిటి తమ నుండి ఆశిస్తారో అనే భయాలతో బాంధవ్యాలను విస్మరించడం విస్మయం కలిగించే విషయం. కష్టసుఖాలతో, ఒకరినొకరు, ఉపకారాలతో తోడ్పాటుతో, ఐకమత్యంతో మెలగడం అరుదుగా మారింది. మానవ సంబంధాలు అడుగంటడంతో ఆత్మీయతలు లేవు. అసూయాద్వేషాలు, స్వార్థం ప్రకోపించి, మనుషుల మధ్య మాటలే కరువయినాయి. పలకరిస్తే పాపం అన్నట్లు ఎవరికి వారు ఒంటరితనమే భాగ్యం అన్నట్లు ప్రవర్తిస్తూ ఉండటం వల్ల, మానసిక ప్రశాంతతను కోల్పోతూ, నిరుత్సాహం కొని తెచ్చుకుంటున్నారు. ఎదుటివారి పట్ల కుతూహలమే తప్ప, ఎవరికి ఎలా ఉపయోగపడాలి! సహాయం అందించాలి అనే ఉపకార బుద్ధిని కలిగి ఉండకుండా, తమ వరకే అనేలా సంపదలను పెంచుకుంటూ, వాటి సాధన కోసం ఎంత చెడుపనికైనా సిద్ధమవడం వల్ల ప్రయోజనాలు శూన్యం.

భగవంతుడి సృష్టిలో పేద, ధనిక వర్గాలు లోకంలో సంచరిస్తూ ఉండటంతో, దేవుడు స్వయంగా తానే వచ్చి మనుషులకు సాయం చేయడు. దైవత్వం కలిగిన ఉదార హృదయులు, సాటిజీవుల పట్ల దయ, కరుణ, ప్రేమ కలిగి తనతో పాటు ఇతరులు కూడా సుఖజీవనం గడిపేలా సహకరించడమే ఉపకారగుణం. ధనాన్ని తన తరానికీ అన్నట్లు వ్యవహరిస్తూ దానధర్మాలు మానుకుని, నిరంతరం ధనధ్యాసకే జీవితకాలం కేటాయించకూడదు. అపకారికి కూడా ఉపకారం చేయాలనుకునే వారి జన్మధన్యం. పరోపకారమే శరీరధర్మంగా భావిస్తూ బంధువులను, స్నేహితులను, అవసరకాలంలో ఆదుకోవాలి. డబ్బుతో ప్రాణాలకి లంకె పెట్టరాదు. అది అందరికీ లభ్యమయ్యేలా వితరణలు అందించాలి. ఏదీ శాశ్వతం కాదు. మరుజన్మ మంచిది కావాలనుకుంటే, మనం పెట్టుకునే పెట్టుబడే ఉపకారం అని గ్రహిస్తే పదిమందికి సహాయం చేయగలం. బాల్యస్నేహితులైన కృష్ణుడు కుచేలుడి కథ వింటే మనకు సహాయం అర్థం తెలుస్తుంది.

లేమిలో తనని అర్థించవచ్చిన కుచేలుడి ఆంతర్యం గ్రహించి, అటుకులు స్వీకరించి, ఆయన అడగకుండానే అన్ని భాగ్యాలు ప్రసాదించిన శ్రీకృష్ణుడి ఔదార్యం యుగయుగాలకే ఆదర్శం కావాలి. ఇప్పుడైతే బ్రతికి చెడ్డవారిని దరిదాపులకు కూడా రానివ్వరు. వారిని నిర్లక్ష్య ధోరణులతో బాధపెడతారే కాని, ఉపకారం చేయరు. ఇవ్వడంలో ఉండే ఆనందం పుచ్చుకోవడంలో ఉండదని, తెలిసేవారు బహుకొద్ది మంది భాగ్యవంతులకే చెల్లు. పేదవారు పెరగకుండా ఉండేలా సహాయచర్యలు చేపట్టాలి. ఉపకారానికి, ప్రత్యుపకారం మాట ఎలా ఉన్నా ప్రత్యపకారం, జరగకుండా ఉండేలా మానవలోకంలో మనుషులు జాగ్రత్త పడాలి. **"సర్వేజనాసుఖినోభవంతు"** అనే మనోభావంతో భాసిస్తే భగవంతుడి కృపకు పాత్రులవుతారు.

- యం.వి. రమణకుమారి

ఆమె నాకు రోల్ మోడల్



యంగ్ హీరో నాగశౌర్య నటించిన తాజా చిత్రం 'ఛలో'.. ఈచిత్రంతో కన్నడ నటి రష్మిక మందన్న తెలుగు తెరకు పరిచయం అవుతోంది.. ఈచిత్రం ఫిబ్రవరి 2న విడుదల కాబోతోంది.. ఈసందర్భంగా హీరోయిన్ రష్మిక మందన్న మీడియాతో మాట్లాడారు.

మీ బ్యాక్‌గ్రౌండ్?
నేను కూర్‌లో 10వ తరగతి వరకు, బెంగళూరులో డిగ్రీ చేశాను.. అప్పుడే కిరిక్ పార్టీ ఆఫర్ వచ్చింది. ఫ్రెష్ ఫేస్ అని ఆఫర్ వచ్చింది.. అది సక్సెస్ కావటంతో హీరోయిన్‌గా నిలదొక్కుకున్నాను.

ఛలో సినిమాలో మీకు బాగా నచ్చిన అంశం?
ఏ సినిమాకైనా కథ ముఖ్యం.. నాకు ఇందులో అదే నచ్చింది.. ఈసినిమాతో లాంచ్ అయితే బాగుంటుందని చేశాను.. టీమ్ మొత్తం కూడ నాకు బాగా నచ్చింది. సినిమా మొత్తం పిక్నిక్‌లా జరిగింది.

ఈసినిమాలో మీ పాత్ర?
రెగ్యులర్ పాత్ర.. ఒక సంప్రదాయ కుటుంబ నుంచి వచ్చిన కాలేజ్ అమ్మాయి క్యారెక్టర్. అది అందరికీ కనెక్ట్ అవుతుంది.. అందుకే ఈసినిమాను చేయటానికి ఒప్పుకున్నాను.

ఈసినిమాను ఒప్పుకో వటానికి ప్రధాన కారణం?
ఈసినిమా కథ బాగా నచ్చింది. డైరెక్టర్ వచ్చి కథ చెప్పినపుడు థ్రిల్ అయ్యి ఒకే చేశాను.. ఈసినిమాలో నా పాత్ర బాగుంటుంది..

తెలుగులో మొదటి సినిమా చేస్తున్నారు దానిపై మీ అభిప్రాయం?
అదృష్టంగా భావిస్తున్నాను. మంచి కథ, కథనాలు ఉన్న సినిమాతో తెలుగులో లాంచ్ అవ్వటం ఆనందంగా ఉంది.. ముఖ్యంగా ఐరా క్రియేషన్స్ వంటి సంస్థలో పనిచేయటం మర్చిపోలేను.

ఈ సినిమాకు ఛలో టైటిల్ పెట్టటానికి కారణం?
సినిమాకు ఛలో టైటిల్ కరెక్టు అనేది నా అభిప్రాయం.. నాకు నాగశౌర్య సినిమాకు మధ్య వచ్చే సన్నివేశాలు చూస్తే మీకే అర్థం అవుతుంది.. ఈసినిమాకు ఛలో టైటిల్ కరెక్టు జస్టిఫికేషన్ అన్పించింది..



సినిమాలో మీ రోల్ మోడల్ ఎవరు?
సినిమాను ప్రేమించి చేస్తాను.. అందరినీ ఆదరిస్తాను.. అందరిసినిమాలు చూస్తాను. కానీ ఎక్కువగా అనుష్కశెట్టిని ఫాలో అవుతాను.. ఆమె నాకు రోల్ మోడల్.

మీ తదుపరి చిత్రాలు?
ప్రస్తుతం విజయ్ దేవరకొండ సినిమాలో నటిస్తున్నానున.. ఈసినిమా తర్వాత కన్నడలో కొన్నిసినిమాలు చేస్తున్నాను.

న్యూ ఫొటోలుక్

• రాశిఖన్నా



ఫ్యాన్స్‌కు తెలియని కిక్



అందాల రాక్షసి.. సినిమాతో టాలీవుడ్‌కి పరిచయమైన కూల్ బ్యూటీ లావణ్య త్రిపాఠి సినిమా సినిమాకు గ్లామర్ డోస్‌ను కాసత ఎక్కువగా పెంచుతోందని అంటూన్నరు.. తన సోషల్ మీడియాలో ఫాలోవర్స్‌కి లావణ్య అప్పుడపుడు కొత్తఫొటోలతో తెలియని కిక్ ఇస్తోంది.. ఇకపోతే రీసెంట్‌గా అలాంటి ఫొటోనే ఒకటి షేర్ చేసింది.. బ్లాక్ ఫ్యాషన్ డ్రెస్‌లో హాట్ చూపులను యాడ్ చేస్తూ క్లీమేజ్ షోను లైట్‌గా టచ్ చేసింది.. దీంతో కుర్రకారు లావణ్య సొగసులకు ఫిదా అయిపోతున్నారు.. ఎవరి స్టైల్‌లో వారు స్పైసీగా కామెంట్ చేస్తన్నారు.. అమ్మడు తాజా సినిమా ఇంటిలిజెంట్ ఫొటోస్ కూడ కొన్ని హాట్‌గా ఉండటంతో నెటిజన్లు వాటినకి కూడ చాలా ఇష్టపడుతున్నారు. మొత్తానికి ఫొటోలతో అమ్మడు సినిమా ప్రమోషన్స్‌కి సీక్రెట్‌గా బూస్ట్ ఇస్తోందని అంటున్నారు.



మరిన్ని సినిమా వార్తలకు
vaartha.com
క్లిక్ చేయండి

సుడి తిరిగినట్టే


అదృష్టం పడిశంపట్టిన్ట్టు పడితే ఎలా ఉంటుందో చెప్పటానికి ఉదాహరణగా హీరోయిన్ కైరా అద్వానిని చెప్పుకోవచ్చు.. భరత్ అనునేను.. తోమహేష్‌బాబు సరసనబాలీవుడ్, కు పరిచయమవుతున్న ఈ భామ ఇంకా దాని షూటింగ్ సగంలోనే ఉండగానే రామ్‌చరణ్,. బోయపాటి కాంబోలో చాన్స్ కొట్టేసింది.. ప్రేక్షకులు ఇంకా తనను తెరపై ఇంకా చూడకముందే క్రేజీ మూవీస్‌లోఆఫర్లు దక్కించు కుంటోంది.. ఎంఎస్ ధోనీ సినిమాతోనే మనోళ్లకు పరిచయమైనా అది మాస్ ప్రేక్షకులకు రీచ్ కాని మూవీ కావటంతో తను ఎక్కువశాతం ప్రేక్షకులకు రీచ్ కాలేకపోయింది. ధోనీ తర్వాత మెషిన్ అనే సినిమాచేసింది.. తాజా అప్‌డేట్ ప్రకారం మహేష్‌బాబు, రామ్‌చరణ్ సినిమాలతోపాటు కృష్ణార్జునయుద్ధం తర్వాత నాని చేయబోయే మల్టీస్టార్ మూవీకోసం ఈ భామను సంప్రదించారట.. కాగా నితిన్ కొత్తసినిమా కోసం కూడ ఆమెనే అడుగు తున్నట్టు తెలుస్తోంది.

ప్రేక్షకులు మారారు

మాస్ మహారాజా రవితేజ నటించిన తాజా చిత్రం 'టచ్‌చేసి చూడు'. కొత్త దర్శకుడు విక్రమ్ సిరికొండ డైరెక్టు చేసిన ఈచిత్రం త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది.. ఈ సందర్భంగా మీడియాతో ఆయన ..

మీరు ఇదివరకు చాలా పోలీస్ పాత్రలు చేశారు.. వాటికి ఈ సినిమాలో పాత్రకు తేడా ఏంటి?
ఇంతకు ముందు నేను చేసిన పోలీస్ పాత్రలన్నీ చాలా సీరియస్‌గా ఉంటాయి.. కానీ ఇందులో మాత్రం సిన్సియారిటీ తోపాటు కొంత నా స్టైల్‌ల్లో ఫన్ ఉంటుంది..

దర్శకుడు కొత్త వ్యక్తి కదా చేయగలడో లేదో అనే సందేహం రాలేదా?
దర్శకత్వం అతనికి కొత్తకాదు.. చాలా సినిమాలకు డైరెక్షన్ డిపార్ట్‌మెంట్‌లో వర్క్‌చేశాడు.. మొదటి నుంచి అతని మీద నాకు నమ్మకం ఉంది.. అందుకే ఎలాంటి ఇబ్బంది పడలేదు.. అతను కూడ నా నమ్మకాన్ని నిలబెట్టాడు.



మీ హీరోయిన్ల గురించి చెప్పండి?
ఇందులో సీరత్‌కపూర్ మోడరన్ అమ్మాయిలా ఉంటుంది.. ఆమె పాత్ర నన్ను కొద్దిగా డామినేట్ చేస్తుంది. అలాగే రాశీఖన్నా క్యారెక్టర్‌లో మంచి ఫన్ ఉంటుంది.

మీ మ్యూజిక్ డైరెక్టర్ విషయంలో కొంత కన్ఫ్యూజన్ నడుస్తోంది.. కొంచెం క్లారిటీ?
దీనికి ప్రీతమ్ చక్రవర్తి సంగీతం అందించాడు.. ఆయనకు జామ్ 8 అనే కంపెనీ ఉంది.. దాని నుండి సంగీతాన్ని తీసుకున్నాం.. పాటలన్నీ బాగా క్లిక్ అయ్యాయి.. ఇక మణిశర్మగారి బ్యాక్‌గ్రౌండ్ సంగీతం గురించి చెప్పాల్సిన పనిలేదు.. చాలా బాగా కుదిరింది.

ముున్ముందు కొత్త సబ్జెక్టులు ఏమైనా చేస్తారా?
ఇదివరకు నేను చేసిన నా ఆటోగ్రాఫ్.. నేనింతే,,శంబో శివ శంభో లాంటివి భిన్నమైన సినిమాలే.. కానీ పెద్దగా చూడలేదు.. అవి కమర్షియల్ గా వర్కవుట్‌కాలేదు.. అందుకే ప్రస్తుతం నా స్టైల్‌లోనే ఎంటర్‌టైన్‌మెంట్ సినిమాలు చేస్తున్నాను.. కానీ ఇపుడు ప్రేక్షకులు మారారు.కొత్త సబ్జెక్టులు తప్పకుండా చేస్తాను..

ఇతర భాషల్లో సినిమాలు చేయాలనే ఆలోచన ఏమైనా ఉందా?
ఉంది కానీ సరైన అవకాశం దొరకట్లేదు.. దొరికితే చేయటానికి నాకెలాంటి అభ్యంతరం లేదు.

పూరితో సినిమా అన్నారు. అదెప్పుడు?
ప్రస్తుతం నేను, ఆయన ఇద్దరం బిజీగా ఉన్నాం.. ఈ ఏడాది ఉండకపోవచ్చు.. వచ్చే ఏడాది తప్పకుండా చేస్తాం.

మీ తదుపరి చిత్రాలు?
కల్యాణ్‌కృష్ణతో ఒకసినిమా చేస్తున్నాను.. ఇప్పటికే 25శాతం పూర్తయింది.. సినిమా చాలా బాగా వస్తోంది.. శ్రీను వైట్లతో కూడ ఒక సినిమాకు సైన్ చేశాను..

మీకిష్టమైన డైరెక్షన్ ఎప్పుడు చేస్తారు?
ప్రస్తుతానికి లేదు.ఎప్పటికైనా చేస్తాను కానీ నేను డైరెక్టుచేయబోయే సినిమాలో నేను మాత్రం నటించను. వేరేవాళ్లతో చేస్తాను.

బంగారి బాలరాజు గ్లిట్టర్

నంది క్రియేషన్స్ బ్యానర్‌పై కెంఎడి రఫీ , రెడ్డం రాఘవేంద్రరెడ్డి నిర్మాతలుగా, కోటేంద్ర దుద్యాల దర్శకుడిగా బంగారి బాలరాజు చిత్రంతో పరిచయం అవుతున్నసంగతి తెలిసిందే.. ఈచిత్రం గ్లిట్టర్‌ను ప్రముఖ దర్శకుడు సురేందర్‌రెడ్డి విడుదల చేశారు.రాఘవ్, కరాణ్య కత్రీన్, మీనాకుమారి, దూకుడు శ్రవణ్ , ఎస్‌వి చౌదరి, సారిక రామచంద్రరావు, కిరాక్ ఆర్‌పి తదితరుల ప్రధాన తారాగణం.



విషపురం ట్రైలర్



లింకన్‌మెథడ్ ప్రొడక్షన్స్ పతాకంపై షఫీ, శ్రావణి, యాదవ్, ప్రధానపాత్రలో జాంబి జానర్‌లో శ్రీనివాస్ నందిరి దర్శకత్వంలో బోగారి లక్ష్మీనారాయణ , పాతూరి బుచ్చిరెడ్డి , భోగారి రాజు, పాతూరి మాధవరెడ్డి సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం విషపురం.లో ఒక రోజు .ఈచిత్రం ట్రైలర్‌ను ప్రసాద్‌ల్యాబ్స్‌లో విడుదలచేశారు. ముఖ్యఅతిథిగా తమ్మారెడ్డి భరధ్వాజ హాజరయ్యారు. ట్రైలర్ చాలా భయపెట్టే విధంగా ఉందని, ఓ కొత్తప్రయాఎగం చేస్తున్న టీమ్‌కు శుభాకాంక్షలు అని చెప్పారు..

సంపన్నదేశాల్లో భారత్‌కు ఆరవర్యాంకు



న్యూఢిల్లీ,జనవరి 30: సంపన్నదేశాల జాబితాలో భారత్ ఆరోర్యాంకుతో నిలిచింది. దేశంలోమొత్తం సంపద 8230 బిలియన్ డాలర్లుగా ఉంటుందని అంచనావేసింది. అమెరికా సంయుక్తరాష్ట్రాలు ఈ జాబితాలో అగ్రస్థానంలో నిలిచిందని న్యూవరల్డ్ వెల్త్ నివేదిక సూచించింది. యుఎస్ఎ ప్రపంచంలోనే అత్యంత సంపన్నదేశంగా నిలిచింది. మొత్తం సంపద 64,584 బిలియన్ డాలర్లుగా నిలిచింది. ఆతర్వాత స్థానంలో చైనారెండోస్థానంలో 24,803 బిలియన్ డాలర్ల సంపదున్నట్లు తేలింది. జపాన్ మూడోస్థానంలో 19,522 బిలియన్ డాలర్లతో నిలిచింది. మొత్తం సంపదపరంగా వివిధ రంగాల వ్యక్తుల వద్ద ఉన్నప్రైవేటు సంపదగా సంస్థ అంచనా వేసింది. ప్రభుత్వ నిధులను వీటిలో మినహాయించింది. ఇక జాబితాలో మిగిలిన దేశాల్లో బ్రిటన్ నాలుగోస్థానంలో 9919 బిలియన్ డాలర్లతోను, జర్మనీ ఐదోస్థానంలో 9660 బిలియన్ డాలర్లు, ఫ్రాన్స్ ఏడోస్థానంలో 6649 డాలర్లు, కెనడా ఎనిమిదోస్థానంలో 6393 బిలియన్ డాలర్లు, ఆస్ట్రేలియా 9వ స్థానంలో 6142 బిలియన్ డాలర్ల సంపదలతో ఉన్నాయి. ఇక ఇటలీ పదోర్యాంకుతో 4276 బిలియన్ డాలర్లతో నమోదయింది. ఇక ప్రపంచవ్యాప్తంగా భారత్ సంపదమార్కెట్లలో అద్వితీయంగా వృద్ధిచెందుతోందని, 2016లో 6584 బిలియన్ డాలర్లున్న సంపద 2017కల్లా 25శాతం వృదిధతో 8230 బిలియన్ డాలర్లకు పెరిగింది. ఇకచైనా సంపద 22శాతం వృద్ధిని సాధించింది. ఇక ప్రపంచమొత్తం సంపద కూడా 12శాతంపెరిగి 192 లక్షల కోట్ల డాలర్ల నుంచి 215 లక్షల కోట్లకు పెరిగింది. గడచిన దశాబ్దకాలంగా భారత్ మొత్తం సంపద 3165 బిలియన్ డాలర్లు పెరిగింది. 2007 నుంచి 2017 నాటికి 8230 డాలర్ల వరకూ వృద్ధిని సాధించినట్లు వరల్డ్ వెల్త్‌నివేదిక ఉటంకించింది. 16-0శాతం వృద్ధి నమోదుచేసింది. భారత్‌లో పది లక్షల డాలర్లకుమించి సంపద ఉన్న సిరమంతుల జాబితాలో 3,30,400 మంది ఉన్నట్లు అంచనా వేసింది. ఈ విభాగంలోప్రపంచ వ్యాప్తంగా భారత్ తొమ్మిదోస్థానంలోనిలిచింది.అమెరికా 50,47,400 మందితో అగ్రస్థానంలో నిలిచింది. భారత్‌ఒక్కదేశంలోనే 20,730మంది మల్టీమిలియనీర్లు ఉన్నారు. ప్రపంచంలోనే ఏడో అతిపెద్ద దేశంగా నిలిచింది. ఇక నివాసిత బిలియనీర్లపరంగా భారత్‌లో 119 మంది ఉన్నట్లు తేల్చింది. ప్రపంచ వ్యాప్తంగా అమెరికా, చైనాల తర్వాత మూడోస్థానంలో నిలిచింది. ఎవరికైతే 100కోట్లడాలర్లు అంతకుపైబడిన ఆస్తులున్నట్లయితే వారిని బిలియనీర్‌గా పరిగణిస్తున్నారు. ప్రపంచంలోని సంపన్నమైనపది మార్కెట్లలో ఈ ఏడాది మంచి వృద్ధిని సాధించింది. గ్లోబల్ స్టాక్ మార్కెట్లు కూడా లాభాల్లోనే నడిచాయి. మోర్గాన్ స్టేన్లీ కేపిటల్ ఇంటర్నేషనల్ సూచి 23శాతం పెరిగింది. డౌజోన్స్ సూచి 26శాతం వృద్ధిని సాధించింది. చైనా, భారత్, అమెరికా, జపాన్, ఆస్ట్రేలియా దేశాల్లో గత ఏడాది పటిష్టమైన సంపద వృద్ధిని సాధించిందని న్యూవరల్డ్‌వెల్త్ వెల్లడించింది.

పెట్టుబడుల ఉపసంహారణ లక్ష్యం రూ.1.20 లక్షల కోట్లు

న్యూఢిల్లీ,జనవరి 30: కేంద్ర బడ్జెట్‌ప్రవేశపెట్టిన తర్వాత దేశంలో మూడు అతిపెద్ద వాటా విక్రయాలద్వారా కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ విధించిన లక్ష కోట్ల పెట్టుబడుల ఉపసంహారణ లక్ష్యం సులువుగా చేరుకోగలరన్న ధీమా వ్యక్తం అవుతోంది. స్టాక్ మార్కెట్లలో బంపర్ అమ్మకాలతో ఆటోమొబైల్‌రంగం భారీ ఎత్తున నిలిచింది. అయితే భారత్ స్టాక్‌మార్కెట్లకు వస్తున్నమూడు అతి పెద్ద ఐపిఒలతో పెట్టుబడుల ఉపసంహారణ లక్ష్యంనెర వేరుతుందని అంచనా. జైట్లీ వాటా విక్రయాల లక్ష్యం రూ.60వేల కోట్ల నుంచి రూ.1.2లక్షలకోట్లకు పెంచారు. వచ్చేనెల ఒకటవ తేదీ ఆవిష్కరించనున్న కొత్త బడ్జెట్‌లో మూడు అతిపెద్ద సంస్థలు ఐపిఒకు వస్తాయి. ఎయిర్ ఇండియా, ఐఆర్ సిటిసి, బీమా కంపెనీలు వాటాల విక్రయం చోటుచేసుకుంటుంది. ప్రస్తుతసంవత్సరంలో పెట్టుబడుల ఉపసంహారణ రాబడుల లక్ష్యం రూ.72,500 కోట్లుగా నిర్ణయించారు. జనవరిలో 55,560.73 కోట్లు లక్ష్యాన్ని సాధించింది. ఒఎన్‌జిసి,హెచ్‌పిసిఎల్ 36,91 కోట్లు భారీవిక్రయం నమోదయింది. హెచ్‌పిసిఎల్ వాటా విక్రయంతో ప్రభుత్వ పెట్టుబడుల ఉపసంహారణ ద్వారా రాబడులు కనీసం 91,252.6 కోట్లవరకూ ఉంటుందని అంచనా. ఎయిర్‌ఇండియా, ఐఆర్‌సిటిసి, అనేక బీమా కంపెనీలు ఐపిఒలు అంటే వాటా విక్రయానికి వస్తుండటంతో వచ్చే ఆర్థికసంవత్సరంలో లక్ష్యంసులువుగా చేరుకుంటుందని అంచనా. ఈ ఏడాది అనేక ప్రభుత్వరంగ సంస్థల్లో వాటా విక్రయంఉంది. వాటిలోహడ్కో, ఇఐఎల్, ఎన్‌టిపిసి, నాల్కో, ఆయిల్ సంస్థల వాటా విక్రయాలు న్నాయి. మరో రెండు బీమా కంపెనీలు జిఐసి,న్యూ ఇండియా అస్యూరెన్స్ వంటివి స్టాక్‌ఎక్ఛేంజిల్లో జాబితా అయ్యాయి. మరికొన్ని కంపెనీలు ఎక్ఛేంజిల్లో జాబితా అవుతున్నాయి. దీనితో పెట్టుబడుల ఉపసంహారణ రాబడుల లక్ష్యం సులువుగా లక్షకోట్లకు చేరుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇంకా రెండునెలలు మిగిలి ఉన్నాయి. ఈ ఏడాది మార్చిలోపు భారీ ఐపిఒలు రాకపోవచ్చని అంచనా, ఈమొత్తం కసరత్తు వచ్చేసంవత్సరానికే మారుతుందని, అందువల్ల వచ్చే ఏడాది రాబడులు లక్షక ఒట్లకుపైబడి ఉంటుందని ఒకబ్యాంకర్ వెల్లడించారు. దేశంలో మూడు డజన్లకుపైగా ప్రభుత్వరంగ సంస్థలున్నాయి. 2018-19 ఆర్థికసంవత్సరంలో వీటిని స్టాక్ ఎక్ఛేంజీల్లో జాబితా చేస్తారు. వాటిలో ఎయిర్ ఇండియా, డ్రెడ్జింగ్ కార్పొరేషన్ వంటివి కూడా ఉన్నాయి. రైల్వే పిఎస్‌యు సంస్థలు ఐఆర్‌సిటిసి, ఇర్కాన్, మిశ్రధాతు నిగమ్ మజగాన్ డాక్ వంటిసంస్థలు ఉన్నాయి. ఐపిఒలకు అవి ముందుకు వస్తున్నాయి. వచ్చేఏడాది రైల్వే సంస్థలు ఇర్కాన్, ఐఆర్‌ఎఫ్‌సి, ఐఆర్‌సిటిసి వంటివి జాబితా అవుతాయి. మరో రెండు కంపెనీలు రైట్స్ లిమిటెడ్, మిశ్రధాతునిగమ్ వంటివి ఇప్పటికే సెబివద్ద ముసాయిదా దరఖాస్తులు చేసాయి. అలాగే ఇరెడా ఐపిఒజారీకి జె బీకి దరఖాస్తు చేసింది కూడా. మొత్తంమీద కొత్త ఐపిఒలతో వచ్చే ఏడాది ప్రభుత్వ పెట్టుబడుల ఉపసంహారణ లక్ష్యం సులువుగా చేరుకోగలదని నిపుణులు అంచనా వేస్తున్నారు.

లాభాలు / నష్టాలు

రూ.లలో రూ.లలో

కంపెనీ పేరు	ప్రస్తుత ధర రూ.లలో	మార్పు శాతం
జిందాల్‌స్టీల్	268.35	0.85
సన్‌ఫార్మా	591.30	0.72
టాటాపవర్	90.60	0.67
జెట్‌ఎయిర్‌వేస్	762.40	1.75
కోల్‌ఇండియా	305.70	1.71
జెఅండ్‌కెబ్యాంకు	74.15	0.41
ఐడియా	94.00	0.43
అపోలోటైర్స్	260.40	1.17
ఇక్రా	3971.00	0.23
ప్రెస్టీజ్	316.25	0.17
ఇండిగో	1213.25	1.07

మార్కెట్ నష్టాలు (బిఎస్ఇ)

క్రిసిల్	1940.05	-2.76
హాత్‌వే	39.95	-4.31
ఏసియన్‌పెయింట్స్	1128.90	-2.22
ఆంధ్రాబ్యాంకు	53.15	-2.03
మదర్‌సన్‌సుమి	362.15	-2.03
ఐడిబిఐ	60.95	-3.10
ఇన్‌ఫ్రాటెల్	343.25	-3.06
హావెల్స్	553.15	-383
నీల్‌కమల్	1832.00	-2.25
జిడిఎల్	228.70	-2.39
జిఎమ్‌ఆర్ ఇన్‌ఫ్రా	22.10	-2.64

వెన్‌కాబ్ ధరలు

Mobile No. 9849219870

(రూ. కిలోకు)	(Rs. Per Kg)	
ఫామ్‌గేట్	(Farmgate)	74
డ్రెస్స్‌డ్	(Dressed)	96
విత్ స్కిన్	(with skin)	139
స్కిన్‌లెస్	(Skinless)	158

గుడ్ల ధరలు

Ph:040-23234068

నెక్ రేట్లు (31 - 1 - 2018) NECC RATES

వందకు, రూ.లలో		Rs.per 100 eggs
హైదరాబాద్	402	Hyderabad
(రిటైల్ ధర రూ.4.60		(Retail Price Rs.4.60)
విజయవాడ	412	Vijayawada
గోదావరి	412	Godavari
విశాఖపట్నం	412	Visakha
వరంగల్	404	Warangal
చిత్తూరు	398	Chittoor
చెన్నై	405	Chennai
ముంబయి	447	Mumbai
న్యూఢిల్లీ	425	New Delhi
కోల్‌కతా	464	Kolkata
బెంగళూరు	408	Bangalore
నమక్కల్	390	Namakkal

బులియన్ ధరలు

	30 న ముగింపు	క్రితం ముగింపు
ఢిల్లీ		
24 క్యారెట్లు (10గ్రా)99.9	30820	30690
22 క్యారెట్లు (10గ్రా)99.5	28940	28810
వెండి .999 (కేజి)	42645	41977
ముంబయి		
24 క్యారెట్లు (10గ్రా)99.9	30810	30670
22 క్యారెట్లు (10గ్రా)99.5	28930	28790
వెండి .999 (కేజి)	42626	41969
చెన్నయ్		
24 క్యారెట్లు10(గ్రా)	30830	30700
22 క్యారెట్లు	28950	28820
వెండి బార్ (కేజి)	42655	41985
హైదరాబాద్		
24 క్యారెట్లు (10గ్రా)	30870	30750
22 క్యారెట్లు (10గ్రా)	28990	28870
వెండి (కేజి)	42669	41992
విజయవాడ		
24 క్యారెట్లు (10గ్రా)99.9	30830	30700
22 క్యారెట్లు (10గ్రా)99.5	28950	28820
వెండి .999 (కేజి)	42645	41911
విశాఖపట్నం		
24 క్యారెట్లు10(గ్రా)	30830	30700
22 క్యారెట్లు	28950	28820
వెండి బార్ (కేజి)	42645	41977

పసిడిరంగంపై తగ్గుతున్న పన్నులు!

ముంబై, జనవరి 30: ప్రపంచంలో రెండో అతిపెద్ద బంగారం కొనుగోలుదారుగా ఉన్న భారత్‌లో రోజు రోజుకి ధరలు పైపైకి ఎగుస్తున్నాయి. మరోరెండు రోజుల్లో కేంద్ర వార్షిక బడ్జెట్‌ను కూడా ప్రవేశ పెట్టబోతుంది. దీంతో పెరుగుతున్న ధరలకు చెక్ పెట్టడానికి, అక్రమ వ్యాపారాలకు అడ్డుకట్ట వేసేందుకు కేంద్ర ప్రభుత్వం గురువారం సమర్పించనున్న బడ్జెట్‌లో దిగుమతి పన్నును తగ్గించే అవకాశాలున్నాయని అంచనాలు వెలువడుతున్నాయి. అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు కూడా పన్ను తగ్గింపు అవసరమని బంగారం పరిశ్రమ వర్గాలు తెలిపాయి. తక్కువ దిగుమతి పన్నుతో దేశీయంగా బంగారం డిమాండ్‌ను పెంచవచ్చునీ పేర్కొంటున్నాయి. కరెంట్ అకౌంట్ లోటును తగ్గించేందుకు 2013 ఆగస్టులో దిగుమతి డ్యూటీని భారత్ 10శాతం పెంచిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం బంగారంపై దిగుమతి పన్నును రెండు నుంచి నాలుగు శాతం తగ్గించే అవకాశముందని తాము అంచనావేస్తున్నట్లు ఇండియన్ బులియన్ జ్యుయెలర్స్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ సౌరభ్ గాడ్గిల్ తెలిపారు. ఎక్కువ దిగుమతి డ్యూటీతో గ్రే ఛానల్స్ ఎక్కువవుతాయని, అక్రమ రవాణాకు, అనధికారిక విక్రయాలకు అడ్డుకట్ట వేసేందుకు ఈ తగ్గింపు అవసరమని పేర్కొన్నారు. వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ అంచనాల ప్రకారం 2016లో భారత్‌కు దాదాపు 120 టన్నుల బంగారాన్ని స్మగ్లర్లు రవాణా చేసినట్లు తెలిసింది. 10శాతం దిగుమతి పన్నును ఆదా చేసుకునేందుకు స్మగ్లర్లు ఒకశాతం, రెండు శాతం డిస్కౌంట్‌ను ఆఫర్ చేస్తారని, కానీ తాము ఎలాంటి డిస్కౌంట్లు ఇవ్వకుండా, డ్యూటీలను చెల్లిస్తామని కోల్‌కతాకు చెందిన హోల్‌సేల్, జేజే గోల్డ్ హౌజ్ ప్రొప్రైటర్ హర్షద్ అజ్మిరా చెప్పారు. పన్ను ఎగవేతదారులు ఎక్కువగా అక్రమ బంగారాన్ని



కొనుగోలుచేసేందుకు ఇష్టపడతారని, వారు మూడు శాతం జిఎస్‌టిని కూడా చెల్లించరని చెన్నైకి చెందిన హోల్‌సేల్ ఎంఎన్‌సి బంగారం డైరెక్టర్ ప్రకాశ్ రాథోడ్ అన్నారు. మొదట ప్రభుత్వం 10శాతం దిగుమతి పన్నును, అనంతరం జిఎస్‌టిని కోల్పోతుందని చెప్పారు. ఈ నేపథ్యంలో పన్ను తగ్గింపు చేపట్టాలని బంగారం పరిశ్రమ పట్టుబడుతోంది.

ఆటోమొబైల్ రంగంలో అమ్మకాల జోష్

న్యూఢిల్లీ, జనవరి 30: వాహన అమ్మకాలు గణనీయంగా పెరుగుతున్నాయి. రోజుకో కొత్త గరిష్టాన్ని నమోదు చేస్తూ పెరుగుతున్న మారుతి సుజుకి షేర్ ధరను ఇందుకు ఉదాహరణగా చెప్పుకోవచ్చు. నిజానికి గతేడాది వాహన రంగం విపరీతమైన ఎదురు దెబ్బలు ఎదర్కొనాల్సి వచ్చింది. పెద్దనోట్లరద్దు, జిఎస్-4కు మారడం వంటి ప్రభుత్వనిబంధనలు, జిఎస్‌టి అమలుతో పాటు మరిన్ని షాక్‌లు తగిలాయి. వ్యవసాయ రంగం, గ్రామీణ ప్రాంతాలకు ప్రోత్సాహించేలా చర్యలు తీసుకుంటున్న ప్రభుత్వ విధానాలు ఆటోమొబైల్ రంగానికి సానుకూలంగా చెప్పవచ్చు. ముఖ్యంగా టూవీలర్ కంపెనీలకు, ఫామ్ ఎక్విప్‌మెంట్ తయారీ సంస్థలకు ఇవి మరింతగా హెల్ప్ అవుతాయి. కమర్షియల్‌వాహనాల అమ్మకాలు పెరిగేందుకు ఈ బడ్జెట్‌లో కొన్ని చర్యలు తీసుకోవచ్చని ఆశిస్తున్నారు. ఇది అశోక్ లేలాండ్, ఐషర్ మోటార్స్ వంటి కంపెనీలకు ప్రయోజనం చేకూర్చనుంది. మరోవైపు ఎలక్ట్రిక్ వాహన తయారీ కంపెనీలకు అనుకూలమైన చర్యలు చేపట్టడం ఖాయమే. ఇప్పటికే ఈ కార్యకలాపాలలో ఉన్న టాటామోటార్స్, ఎంఅండ్ఎం వంటి కంపెనీలు లబ్ధి పొందనున్నాయి. ఓ ఏడాది సమయంలో బిఎస్ఇ ఆటో సూచీలు 22శాతం పెరిగింది. ఇదే సమయంలో బిఎస్ఇ సెన్సెక్స 32శాతం పెరగడం జరిగింది. అంటే, ఇంకా మార్కెట్లు పెరిగిన స్థాయిలో ఆటోమొబైల్ పెరగలేదు. బడ్జెట్‌లో ఆటోమొబైల్ పరిశ్రమకు అనుకూలంగా చర్యలు తీసుకుంటే, వాహన రంగానికి చెందిన షేర్లు ఈ ఏడాది బెంచ్‌మార్క్ సూచీలు ఔట్ పెర్ఫామ్ చేసేయొచ్చు. అయితే పరోక్ష పన్నులలో ఎలాంటి మార్పులు ఉండకపోవచ్చనే అంచనాలు వినిపిస్తున్నాయి. కానీ గ్రామీణ ప్రాంతాలకు ప్రయోజనం కల్పించే పథకాలకు మాత్రమే ప్రాధాన్యత దక్కవచ్చని మోతీలాల్ ఓస్వాల్ ఇనిస్టిట్యూషనల్ ఈక్విటీస్ చెబుతోంది. పల్లె ప్రాంతాలపై దృష్టి పెట్టడంతో టూ



వీలర్ పరిశ్రమ మళ్లీ అభివృద్ధి బాట పట్టే అవకాశాలున్నాయి. ఇది హీరోమోటోకార్ప్, టివిఎస్ మోటార్స్, ఎంఅండ్ఎం కంపెనీలు షేర్లకు లాభదాయకం. 10ఏళ్లకు మించిన వాహనాలను స్క్రాప్‌గా మార్చేసేందుకు కొత్త పథకం పరిచయం చేసే అవకాశాలు ఉన్నాయి. ఇది తప్పనిసరిచేస్తారా, లేక ఐచ్ఛికం అవుతుందా అనే అంశం ఆధారంగా కమర్షియల్ వాహన పరిశ్రమ అభివృద్ధి తీరు ఆధారపడి ఉంటుంది. ప్రస్తుతం 12శాతం వృద్ధిరేటు సాధిస్తున్న ఈ రంగం, 15-18శాతం క్రమానుగత వృద్ధిరేటుకు పెరగవచ్చు. అశోక్‌లేలాండ్, బాష్ కంపెనీలు ఈ థీమ్ కారణంగా ప్రయోజనం పొందునున్నాయి. ఎలక్ట్రిక్ వాహనాల ప్రోత్సాహానికి చర్యలు తీసుకోవడం ఖాయంగా కనిపిస్తోంది. ప్రస్తుతం 12 శాతంగా ఉన్న జిఎస్‌టిని, బడ్జెట్ తర్వాత 5 శాతానికి తగ్గిస్తారని అంచనా వేస్తున్నారు. అలాగే ఈ విద్యుత్ ఆధారిత వాహనాలకు రోడ్ టాక్స్ వంటి వాటిలో కూడా రాయితీ ప్రకటించే అవకాశం ఉంది. వ్యవసాయ ఆదాయం పెంపొందించేందుకు చేపడుతున్న చర్యలు, గ్రామీణ ప్రాంతాలకు పెరిగే కేటాయింపుల కారణంగా, ఎంఅండ్ఎం వంటి ట్రాక్టర్ కంపెనీలకు లబ్ధి చేకూరుస్తాయి. అలాగే హీరో మోటోకార్ప్ కూడా లాభపడనుంది, ఎలక్ట్రిక్ వాహనాలకు, అదనపు ప్రధాన విడిభాగాలకు కస్టమ్స్ డ్యూటీ రాయితీలను కొనసాగించే అవకాశాలున్నాయని ఐఐఎఫ్‌ఎల్ వెల్త్ మేనేజ్‌మెంట్ చెబుతోంది. హైబ్రిట్ వాహనాలపై సెస్‌ను పూర్తిగా తొలగించవచ్చని అంటున్నారు. ఇది సాధ్యమైతే మారుతి సుజుకి, ఎంఅండ్ఎం షేర్లు లాభపడతాయి. 10-13సీట్లు గత అంబులెన్స్‌లను కాంపెన్సేషన్ సెస్ నుంచి తొలగించే అవకాశాలు కలిపిస్తున్నాయి. రవాణా ఆధారిత కంపెనీలకు ఇంధన ఖర్చులపై ఇన్‌పుట్ ట్యాక్స్‌క్రెడిట్ అందించేందుకు ఓ వ్యవస్థను ఏర్పాటు చేయవచ్చని అంటున్నారు.

జియోఫోన్‌కు అందరికీ రూ.49ప్లాన్

ముంబై, జనవరి 30: అపరిమిత వాయిస్‌కాల్స్, ఉచితంగా 4జి డేటా ప్రకటనతో రెండేళ్ల క్రితం రిలయన్స్ జియో టెలికాం మార్కెట్‌లో సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. ఇప్పటికే చౌకైన టారిఫ్ ప్లాన్లతో టెల్కోలను ముప్పుతిప్పలు పెడుతోంది. అచ్చం అలాంటి సంచలన ప్రకటన మాదిరిగానే జియో ఇటీవల టెల్కోలకు మరో షాకిచ్చింది. అదే రూ.49ప్లాన్. ఈ ప్లాన్‌తో 28రోజల పాటు అపరిమిత వాయిస్ కాల్స్‌ను, 1జిబి డేటాను వాడుకోవచ్చని పేర్కొంది. ఇంత చౌకైన రెంటల్ ప్లాన్‌ను మరే ఇతర కంపెనీ కూడా ఆఫర్ చేయడం లేదు. కానీ ఇది కేవలం జియోఫోన్ యూజర్లకేనని అధికారికంగా ప్రకటిచడంతో, జియో వినియోగదారుల్లో కాస్త నిరాశవ్యక్తమైంది. ఆ నిరాశను పారదోలుతూ, మరో గుడ్‌న్యూస్ వెలువడింది. ఈ ప్లాన్‌ను జియో సిమ్ వాడే ప్రతి ఒక్కరూ తమ ఫోన్లలో ఈ ప్లాన్‌ను వినియోగించుకోవచ్చని తెలిసింది. అయితే అద



ెలా అంటే? జియోఫోన్ కస్టమర్లకు ఎక్సక్లూజివ్‌గా రిలయన్స్ రెండు ప్లాన్లను అందుబాటులోకి తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. అవి రూ.153ప్లాన్, రూ49ప్లాన్. ఈ ప్లాన్లను ఇతర ఫోన్లలో కూడా వాడుకోవడానికి మొదట మీ జియోసిమ్‌ను జియో ఫోన్‌లో వేసుకోవాల్సి ఉంటుంది. అనంతరం జియో ఫోన్ ద్వారా ఈ ప్లాన్లను కొనుగోలు చేసి, యాక్టివేట్ చేసుకోవాలి. జియోఫోన్‌పై ఈఆఫర్లను యాక్టివేట్ చేసుకున్న అనంతరం, సిమ్‌ను బయటికి తీసి, మీకుఇష్టమైన స్మార్ట్‌ఫోన్‌లో వేసుకోవాలి. కేవలం జియోఫోన్‌లో మాత్రమే ఈప్లాన్లను వాడుకోవాలనే నిబంధలననేమీలేదు. దీంతో ఈరెండు ప్లాన్లకు ఇది వాలిడ్‌ల ఉంటుంది. అంటే జియో తీసుకొచ్చిన సంచలన ఆఫర్ రూ.49ను ప్రతి ఒక్క జియోసిమ్ వినియోగదారులు వాడుకోవచ్చన్నమాట. కానీముందుగా ఈ ప్లాన్‌ను జియోఫోన్‌లో యాక్టివేట్‌చేసుకోవడం మాత్రమేచేయాలి. అనంతరం ఏ ఫోన్‌లోనైనా దీన్ని ఉపయోగించుకోవచ్చు.

పేటీఎం ఉద్యోగుల్లో 100 మంది మిలియనీర్లు

ముంబై, జనవరి 30: డిజిటల్ లావాదేవీల్లో శరవేగంగా దూసుకెళ్తున్న పేటీఎం ఇటీవల ప్రకటించిన రెండో స్టాక్ విక్రయంతో, 100కుపైగా ఆ కంపెనీ ఉద్యోగులు మిలీనియర్లుగా మారిన సంగతి తెలిసిందే. దాదాపు రూ.500కోట్ల విలువైన స్టాక్‌సేల్‌ను ఈ కంపెనీ చేపట్టింది. ఈ విక్రయంలో కంపెనీ లో పనిచేసే, పనిచేసిన ఉద్యోగులు వారికున్న వాటాను విక్రయించుకున్నారని పేటీఎం తెలిపింది. అయితే ఈ విక్రయం ద్వారా పేటీఎం చీఫ్ ఎగ్జిక్యూటివ్ హారిందర్ థాకర్ దాదాపు రూ.40కోట్లను ఆర్జించారు. పెద్ద పెద్ద స్థాయిల్లో ఉన్నవారు మాత్రమే కాక, ఆ కంపెనీలో పనిచేసే ఆఫీసు బాయ్ కూడా లక్షాధికారి అయిపోయాడు. ఈస్టాక్ విక్రయంతో తమ కంపెనీకి చెందిన ఆఫీసు బాయ్, రూ.20లక్షలకుపైగా ఆర్జించినట్లు వన్97 కమ్యూనికేషన్ లిమిటెడ్ సోమవారం రిపోర్టు చేసింది. ఇతర ఉద్యోగుల వివరాలను బహిర్గతం చేయనప్పటికీ, కెనడా చీఫ్ ఎగ్జిక్యూటివ్, ఆఫీసు బాయ్ వివరాలను మాత్రం బయటికి వెల్లడించింది. 2017 మార్చిలో లెక్కించిన విలువ కంటే పేటీఎం ప్రస్తుత విలువ 3 బిలియన్ డాలర్లు అధికంగా ఉంది. కంపెనీ ప్రస్తుత ఇన్వెస్టర్లుగా స్టాఫ్‌బ్యాంకు, ఎస్ఎఐఎఫ్ పార్టనర్స్, అలీబాబా గ్రూప్ హోల్డింగ్ లిమిటెడ్, యాంట్ ఫైనాన్సియల్ సర్వీసెస్ గ్రూప్‌లు ఉన్నాయి. కంపెనీ ఈ సాప్స్ కేవలం టాప్, మిడ్ లెవల్ ఎగ్జిక్యూటివ్‌లకు మాత్రమే కాకుండా, ముందు నుంచి కంపెనీ పనిచేసిన ఉద్యోగులకు, ఆఫీసు సాఫ్‌కు కూడా కంపెనీ అందించింది. ఉద్యోగులు సొంతంగా షేర్లను కలిగి ఉండటానికి అనుమతించే ఆర్థిక సాధనమే ఈ సాప్స్. కొంతకాలం తర్వాత ఈషేర్లను అమ్మి,నగదుగా మార్చుకోవచ్చు.

10జిబి ర్యామ్‌తో వివో స్మార్ట్‌ఫోన్

హైదరాబాద్, జనవరి 30: ఆకట్టుకునే ఫీచర్లతో ఎప్పడికప్పుడూ కొత్త కొత్త స్మార్ట్‌ఫోన్‌లను విడుదలచేసే చైనీస్ మొబైల్స్ తయారీదారి వివో, మరో కొత్త స్మార్ట్‌ఫోన్‌ను త్వరలోనే తీసుకురాబోతుంది. 10జిబి ర్యామ్‌తో కొత్త స్మార్ట్‌ఫోన్‌ను మార్కెట్లోకి విడుదల చేయబోతుందని లీకేజీలు వెల్లడిస్తున్నాయి. ఒకవేళ ఈ లీక్‌లు కనుక నిజమైతే, ఎప్పటి వరకు వచ్చిన స్మార్ట్‌ఫోన్లలో ఇదే ప్రత్యేక ఆకర్షణ. వివో ఎక్స్‌ప్లే 7 పేరుతో దీన్ని లాంచ్ చేస్తుందని, ఇది 4కే ఒలెడ్ డిస్‌ప్లే, స్నాప్‌డ్రాగన్ 845ఎస్ ఒసి, 512జిబి స్టోరేజ్, అండర్-డిస్‌ప్లే ఫింగర్ ప్రింట్ సెన్సార్ వంటి అద్భుత ఫీచర్లతో రూపొందిందని తెలుస్తోంది. 4 ఎక్స్ ఆప్టికల్ జూమ్‌తో డ్యూయల్ రియర్ కెమెరాను ఇది కలిగి ఉందని లీకేజీలు చెబుతున్నాయి. 10 జిబి ర్యామ్ కలిగిన ఈ ఫోన్ 256జిబి, 512జిబి రెండు స్టోరేజ్ వేరి యంట్లలో రాబోతుందని తెలుస్తోంది. అయితే ధర, అందుబాటులో ఉండే వివరాలపై ఎలాంటి అప్‌డేట్ లేదు. కానీ వచ్చే కొన్నివారాల్లో, ప్రారంభ ధర 500 డాలర్లకు అంటే రూ.31,800కు దీన్ని లాంచ్ చేస్తారనిటాక్. 2016లో లాంచ్ చేసిన వివో ఎక్స్‌ప్లే 6కు సక్సెసర్‌గా దీన్ని తీసుకురాబోతుంది. స్పెషిఫికేషన్ల విషయంలోనూ 2018 బెస్ట్ స్మార్ట్‌ఫోన్లలో ఇదీ ఒకటిగా నిలువనుంది. 10జిబి ర్యామ్ కలిగి, అండర్-డిస్‌ప్లే ఫింగర్ ప్రింట్ సెన్సార్‌తో వస్తున్న తొలి స్మార్ట్‌ఫోన్ కూడా ఇదే కావడం విశేషం. అండర్-డిస్‌ప్లే ఫింగర్ ప్రింట్ సెన్సార్‌తో వివో ఇటీవలే ఎక్స 20ప్లస్ యూడీ స్మార్ట్‌ఫోన్‌ను లాంచ్ చేసిన విషయం తెలిసిందే.



మార్కెట్‌కు రానున్న హీరో ఎక్స్‌ట్రీమ్ 200సిసి



హైదరాబాద్, జనవరి 30: దేశీయ మోటార్ సైకిల్ రంగ దిగ్గజం హీరో 200సిసి విభాగంలో కొత్తబైక్‌ను ప్రవేశపెట్టేందుకు రంగం సిద్ధంచేసింది. ఇప్పటికే 150 సిసి విభాగంలో విజయవంతమైన ఎక్స్‌ట్రీమ్ మోడల్‌ను 200సిసి విభాగంలో కూడా ప్రవేశపెట్టనుంది. దీనికి సంబంధించినధర, ఇతర వివరాలను ఏప్రిల్‌లో వెల్లడించనుంది. కొత్త ఎక్స్‌ట్రీమ్ 200ఆర్‌లో సింగిల్ సిలిండర్ ఇంజిన్‌ను అమర్చారు. ఈ ఇంజిన్ 8500ఆర్‌పిఎం వద్ద 18.4 బిహెచ్‌పి శక్తిని విడుదల చేస్తుంది. ఈ బైక్‌లో ఉన్న బ్యాలెన్సర్ షిఫ్ట్ కారణంగా వైబ్రేషన్స్ చాలా తక్కువగా ఉంటాయి. ట్రాఫిక్‌లో కూడా సులభంగా నడపటానికి వీలుగా ఈ ఇంజిన్‌ను తయారు చేసినట్లు హీరో పేర్కొంది. ఈ బైకుకు సింగిల్ ఛానల్ ఏబిఎస్‌ను ఆప్షనల్‌గా అందజేశారు. హీరో మోటార్ సైకిళ్లలో తొలిసారిగా ఈ బైకుకు రేడియల్ టైర్లను అమర్చారు.

నష్టాల్లో ఇ-క్లర్క్స్ సర్వీసెస్ ఫలితాలు

ముంబై, జనవరి 30: సాఫ్ట్‌వేర్ ప్రొడక్టులు, సర్వీసుల దిగ్గజం ఇ-క్లర్క్స్ సర్వీసెస్ ఈ ఏడాది మూడో త్రైమాసికంలో సాధించిన ఫలితాలు నిరాశ పరచడంతో ఇన్వెస్టర్లు ఈ కౌంటర్లో అమ్మకాలకు తెరతీశారు. ప్రస్తుతం ఎన్ఎస్ఇలో ఈ షేరు 4శాతం పతనమైంది. రూ.1525వద్ద ట్రేడవుతోంది. మొదట ఒక దశలో రూ.1521 వరకూ దిగజారింది. త్రైమాసిక ప్రాతిపదికన మూడవ త్రైమాసికం అక్టోబరు- డిసెంబరులో ఇ-క్లర్క్ నికర లాభం 33శాతంక్షీణించి రూ.57కోట్లకు పరిమితమైంది. నిర్వహణలాభం సైతం రూ.96కోట్ల నుంచి రూ.90 కోట్లకు తగ్గింది. మొత్తం ఆదాయం నామమాత్రంగా రూ.331 కోట్ల నుంచి రూ.340 కోట్లకు పుంజుకుంది.

కేంద్ర బడ్జెట్‌పైనే ఇన్వెస్టర్ల ఉత్కంఠ

నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

ముంబయి,జనవరి 30: కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టనున్న తరుణంలో ఇన్వెస్టర్లు అప్రమత్తంగా వ్యవహరిస్తూ కొనుగోళ్లు జరిపారు. బిఎస్ఇ సెన్సెక్స్ 250పాయింట్లు దిగజారి 36,033.78 పాయింట్ల వద్ద స్థిరపడితే ఎన్ఎస్ఇ నిఫ్టీ కూడా11వేల మార్కు వద్దనే నిలిచిపోయింది. ఇన్వెస్టర్లు లాభాలస్వీకరణకే ఎక్కువ ఆసక్తిచూపించారు.కనిష్టంగా 35,993.41 పాయింట్లు నుంచి ప్రారంభం అయి చివరకు 36,033.73 పాయింట్ల వద్ద నిలిచిపోయింది. 249.52 పాయింట్లు నష్టపోయింది. నిఫ్టీ కూడా 80.75 పాయింట్లు క్షీణించింది. 11,049.65 పాయింట్ల వద్ద నిలిచింది. కనిష్టంగా 11,033.90 పాయింట్లవద్ద ప్రారంభించింది. ముందురోజు జీవితకాల గరిష్టస్థాయికి అంటే 11,130.40 పాయింట్లను నమోదుచేసింది. కేంద్ర బడ్జెట్ ఒకటవ తేదీ ప్రవేశపెడుతుండటంతో ఇన్వెస్టర్లు ఎంతో అప్రమత్తంగా కొనుగోళ్లు జరిపినట్లు తెలుస్తోంది. అలాగే అమెరికా ఫెడ్‌రిజర్వు రెండురోజుల మానిటరీ పాలసీ సమావేశంపై కూడా ఎక్కువ ఆసక్తి చూపించారు. ఇక విదేశీ పోర్టుఫోలియో ఇన్వెస్టర్లు ముందురోజు మార్కెట్లలో 291.86 కోట్ల విలువైన వాటాలు కొనుగోలుచేస్తే దేశీయ సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.90.08 కోట్ల విలువైన షేర్లను కొనుగోలు చేసారు. ఆసియామార్కెట్లు రికార్డుస్థాయి నుంచి కొత్త తగ్గాయి. యాపిల్‌షేర్లలో అమ్మకాలు పెరిగాయి. ఆసియా పసిఫిక్‌షేర్లుజపాన్ బైటప్రాంతంలో 0.5శాతం క్షీణించాయి. ఇటీవలికాలంలో భారత్‌మార్కెట్లు కూడా భారీస్థాయిలో పెకరిగాయి. కార్పొరేట్ ఫలితాలు, ప్రభుత్వ కార్యాచరణ,



జిఎస్‌టి ఉత్పత్తులపై తగ్గింపు, ఆర్థికవృద్ధి అంచనాలే ఇందుకుకీలకంగా నడిచాయి. మార్కెట్ విలువలపరంగా యాపిల్ 14 బిలియన్ డాలర్లు నష్టపోయింది. ఐఫోన్‌ఎక్స్ అమ్మకాలు నీరసించడమే ఇందుకు కారణమనితేల్చింది. చమురు మార్కెటింగ్ కంపెనీల షేర్లు పెరిగితే బ్యాంకింగ్‌రంగషేర్లు దిగజారాయి. నిఫ్టీ బ్యాంక్, నిఫ్టీ ఆర్థికసేవలు, నిఫ్టీ ఐటి, నిఫ్టీ మీడియా, నిఫ్టీ ప్రైవేటు బ్యాంకు, నిఫ్టీ రియాల్టీసూచీలు 0.8 నుంచి 1.1శాతం వరకూ నష్టపోయాయి. ఇండియన్ ఆయిల్, హెచ్‌పిసిఎల్, భారత్ పెట్రోలియం షేర్లు 2-5శాతంపెరిగాయి. ఇక బ్యాంకులు కోటక్‌మహీంద్ర బ్యాంకు, యాక్సిస్ బ్యాంకు, ఎస్‌బ్యాంకు, ఐసిఐసిఐబ్యాంకు, పంజాబ్ నేషనల్‌బ్యాంకు, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకులు 0.2 నుంచి 3శాతం వరకూ మంగళవారం ట్రేడ్‌లో నష్టపోయాయి. ఏసియన్‌పెయింట్స్, రిలయన్స్ ఇండస్ట్రీస్, కోటక్ మహీంద్రబ్యాంకు, ఇన్ఫోసిస్, యాక్సిస్‌బ్యాంకు,టిసిఎస్,హెచ్‌డిఎఫ్‌సి, ఐసిఐసిఐ బ్యాంకు,డా.రెడ్డిస్‌ఆదాని పోర్టులు, ఎస్‌బ్యాంకు, విప్రోలు సైతం 1-2.3శాతం చొప్పున నష్టపోయాయి. ఇక హీరోమోటోకార్ప్, కోల్ ఇండియా,భారతి ఎయిర్‌టెల్, సన్‌ఫార్మా,ఎస్‌బిఐ, పవర్‌గ్రిడ్‌కంపెనీల షేర్లు భారీగా పెరిగాయి. ఇక ఇండియన్ ఆయిల్ షేర్లు ఒక్కసారిగా 5.81శాతంపెరిగి రూ.421.95కు పెరిగాయి. 97శాతం వృద్ధితో నికరలాభం 7883.22కోట్లుగాఐఒసి ప్రకటించింది. స్థూల రిఫైనింగ్ మార్జిన్లు బ్యారెల్‌కు 8.28డాలర్లుగా ఉన్నాయి.

టివిఎస్ మోటార్స్‌కు పెరిగిన లాభం

న్యూఢిల్లీ, జనవరి 30: చెన్నైకేంద్రంగా ఉన్న టివిఎస్ మోటార్‌కంపెనీ మూడోత్రైమాసికంలో 16.34 శాతం నికరలాభాలను ప్రకటించింది. 154.25కోట్ల రూపాయలుగా వెల్లడించింది. అమ్మకాలు వృద్ధి చెందడమే లాభాల పెరుగుదలకు కారణం. కంపెనీ అంతకు ముందు ఏడాది ఇదేకాలంలో 132.67 కోట్ల నికర లాభం ప్రకటించింది. ఇక రాబడులు పరంగాచూస్తే 3684.95 కోట్లుగా ఉంది. గత ఏడాది ఇదేకాలంలో 3239.55 కోట్లుగా లాభాలు ఆర్జించింది. ఈ త్రైమా



సికంలో టూవీలర్ విక్రయాలు ఎగుమతులతో సహా 13.8శాతం పెరిగి 7.99 లక్షలకు చేరినట్లు వెల్లడించింది. మోటారు సైకిళ్ల విక్రయాలు 26.7శాతం పెరిగి 2.48 లక్షల యూనిట్ల నుంచి 3.14లక్షల యూనిట్లకు పెరిగినట్లు వెల్లడించింది. స్కూటర్ల విక్రయాలు సైతం 2.21లక్షల నుంచి 2.69 లక్షలకు పెరిగాయి. త్రీవీలర్ విక్రయాలపరంగా 67.7శాతం వృద్ధిని నమోదుచేసింది. 26,968 యూనిట్లు విక్రయించింది. మొత్తం ఎగుమతులు పరంగాచూస్తే 1.40 లక్షల యూనిట్లుగా ఉన్నాయి. 41.4శాతం వృద్ధిని నమోదు చేసింది. టివిఎస్‌మోటార్ కంపెనీ షేర్లు 0.81శాతం క్షీణించి రూ.713.90గా బిఎస్ఇలో కొనసాగాయి.

ఎన్నికల నిర్వహణ రాజ్యాంగ ప్రక్రియ

నాగా సమస్యపై కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు



మీడియాతో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి కిరెణ్ రిజిజు

న్యూఢిల్లీ, జనవరి 30: ఎన్నికల నిర్వహణ అనేది రాజ్యాంగబద్ధమైన కార్యాచరణ అని కేంద్ర ప్రభుత్వం అందుకు బద్ధులై ఉండాలని కేంద్ర మంత్రి కిరెన్ రిజిజు అన్నారు. నాగాలాండ్‌లో అన్ని పార్టీలు ఎన్నికల్లో పోటీ చేయకూడదన్న నిర్ణయంపై ఆయన స్పందించారు. ఫిబ్రవరి 27న నాగాలాండ్‌లో ఎన్నికలు జరగాల్సి ఉంది. కేంద్ర హోం మంత్రి రిజిజు మాట్లాడుతూ సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న నాగా సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యతనిస్తోందన్నారు. కాలపరిమితికి అనుగుణంగా ఎన్నికలు నిర్వహించడం రాజ్యాంగ విధానమని కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ నిర్ణయాన్ని అనుసరించడమేనని రిజిజు వెల్లడించారు. నాగాలాండ్‌కు బిజెపి ఎన్నికల ఇన్‌ఛార్జిగా కూడా వ్యవహరిస్తున్నారు. అధికారంలోని నాగా పీపుల్స్ ఫ్రంట్‌తోసహా అన్ని పార్టీలు కూడా నాగా సమస్యను ఎన్నికలలోపే పరిష్కరించాలని లేనిపక్షంలో ఎన్నికల్లో పోటీ చేయకూడదని నిర్ణయించాయి. నాగా రాజకీయ సమస్యను సత్వరమే పరిష్కరించాలని కోరారు. నాగాలాండ్ ట్రైబల్ హౌస్ సివిల్ ఆర్గనైజేషన్స్ ఆందోళనను పూర్తిగా అర్థం చేసుకున్నదని, అయితే ఎన్నికల బహిష్కరణ ఇందుకు పరిష్కారం కాదని అన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ హామీపై నమ్మకం ఉంచాలని, ప్రభుత్వం నాగా సమస్యకు అత్యంత ప్రాధాన్యతనిస్తోందన్నారు. ప్రస్తుతం జరుగుతున్న శాంతి చర్చలు మరింత సత్వర పరిష్కారానికి దోహదం చేస్తాయన్నారు. నాగా పీపుల్స్ ఫ్రంట్, కాంగ్రెస్, బిజెపి, నేషనలిస్టు డెమొక్రటిక్ పీపుల్స్ పార్టీ, నాగాలాండ్ కాంగ్రెస్, యునైటెడ్ నాగాలాండ్ డెమొక్రటిక్ పార్టీ, ఆమ్ ఆద్మీ పార్టీ, నేషనల్ కాంగ్రెస్ పార్టీ, లోక్‌జన్ పార్టీ, జనతాదళ్ యు, నేషనల్ పీపుల్స్ పార్టీవంటి మొత్తం పార్టీలు ఎన్నికల్లో పోటీ చేయకూడదని నిర్ణయించాయి. నేషనల్ సోషలిస్టు కౌన్సిల్ ఆఫ్ నాగాలాండ్ (ఇసాక్-ముయివా) మరో ఆరు నాగా నేషనలలిస్టు రాజకీయ గ్రూప్‌లు సమావేశానికి హాజరయ్యారు. బిజెపి పార్టీపరంగా ఇద్దరు నాయకులను ఈ సంయుక్త సమావేశానికి హాజరైనందుకుగాను సస్పెండ్ చేసింది. ఇతర నాయకులను పార్టీ హైకమాండ్ ఆదేశం లేకుండా ఎలాంటి ప్రకటనలు చేయవద్దని ఆదేశించింది. ఫిబ్రవరి ఒకటిన నామినేషన్ల ప్రారంభం అవుతున్న దృష్ట్యా కోర్ కమిటీ మొత్తం బంద్ పాటించాలని నిర్ణయించింది. నాగా గిరిజన సంఘాల కీలక సంస్థనాగా హోహో అంతకుముందు ప్రధాని ఎన్నికలు వాయిదా వేయడంలో సహకరించాలని కోరింది. ముందు నాగా సమస్యను పరిష్కరించాలని దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉందని విజ్ఞప్తి చేసింది. ఎన్నికలకు ముందే పరిష్కారం అన్న నినాదంతో పౌరహక్కుల సంఘాలు కూడా విస్తృత ప్రచారం చేపట్టాయి. దశాబ్దాల తరబడి కల్లోలిత ప్రాంతంగా ఉన్న నాగాలాండ్‌లో శాంతి అనేదే కరవైంది. కేంద్రం ఎన్ఎస్‌సిఎన్-ఐఎం పార్టీలు 2015లో ఒక ఒప్పందానికి రావడం జరిగింది. 1997 నుంచి ప్రభుత్వం నియమించిన ఇంటర్ లాక్యుటర్‌తో చర్చలు జరుపుతూ వస్తోంది. కాల్పుల విరమణ ఒప్పందం ప్రకటించిన తర్వాత నాగాలాండ్‌లో ఇపుడిపుడే ప్రభుత్వాలు ఏర్పడుతున్నాయి. 2017 నవంబరులో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ మాట్లాడుతూ నాగా రాజకీయ సమస్యకు సత్వరమే పరిష్కారం లభిస్తున్నదని, రాష్ట్రంలో శాంతియుత వాతావరణం నెలకొంటుందని అన్నారు.

విరాళాల్లో బిజెపికే ఎక్కువ

పార్టీల విరాళాలపై ఎడిఆర్ నివేదిక



న్యూఢిల్లీ, జనవరి 30: కార్పొరేట్ విరాళాల్లో అధికారంలోని బిజెపికి ఎక్కువ మొత్తంలో అందాయి. మొత్తం పది రాజకీయ పార్టీలకు రూ.325.27 కోట్ల విరాళాలు అందితే ఈ మొత్తంలో రూ.290 కోట్లు బిజెపికే వచ్చాయి. 2016-17 సంవత్సరంలో రాజకీయ పార్టీలు ఎలక్టోరల్ ట్రస్టులద్వారా ఈ విరాళాలు అందచేసాయని అసోసియేషన్ ఫర్ డెమొక్రాటిక్ రిఫామ్స్(ఎడిఆర్) సోమవారం వెల్లడించింది. బిజెపి 89.22శాతం విరాళాలు సేకరిస్తే మిగిలినమొత్తం కాంగ్రెస్, శిరోమణి అకాలిదళ్, సమాజ్ వాదిపార్టీలు 35.05 కోట్లు రాబట్టుకున్నట్లు వెల్లడించింది. ఢిల్లీ కేంద్రంగా ఉన్న లాభాపేక్షలేని ఎన్‌జిఒ సంస్థ ఈ నివేదికలు రూపొందించింది. ఎన్నికల ట్రస్టులు లాభాపేక్షలేని కంపెనీలుగా ఉన్నాయి. రాజకీయ పార్టీలకు విరాళాలిచ్చేందుకు మాత్రమే వీటిని సృష్టించారని కార్పొరేట్లు, ప్రముఖులు ఈట్రస్టులద్వారా విరాళాలు అందిస్తున్నట్లు తెలిపింది. నాలుగేళ్లలో 637.54కోట్లు వివిధ రాజకీయ పార్టీలకు విరాళాలు ఈట్రస్టులనుంచే అందాయి. వీటిలో బిజెపి ఏకమొత్తంగా 488.94 కోట్లరూపాయలు సాధించింది. కాంగ్రెస్ 86.65 కోట్ల రూపాయలు రాబట్టినట్లు ఎడిఆర్ వెల్లడించింది. ఐదురాజకీయ పార్టీలు మొత్తం విరాళాలు 92.30శాతం మొత్తం విరాళాల్లోఅంటే 588.44 కోట్లు రాబట్టాయి. 16 ప్రాంతీయ పార్టీలు 7.70 శాతం అంటే 49.09 కోట్లు రాబట్టాయి. ఎన్నికల సంఘానికి సైతం ఇవి వార్షిక రిటర్నులు దాఖలు చేయాల్సి ఉంది. ఎడిఆర్ తన నివేదికలో మొత్తం 21 ఎన్నికల ట్రస్టులు ప్రత్యక్షపన్నులబోర్డువద్ద రిజిష్టరు అయి ఉన్నట్లు వెల్లడించింది. 2014లో అధికారంలోనికి వచ్చినప్పటినుంచి బిజెపి అత్యధికమొత్తం విరాళాలు అందుకున్న పార్టీల్లో నిలిచింది. 2015-16లో 47.50 కోట్లు సాధించింది. సత్య ఎన్నికలట్రస్ట్, సమాజ్ ఎన్నికల ట్రస్టుల ద్వారానే ఈ విరాళాలు వచ్చాయి. దేశంలోని 19 రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న బిజెపి 2012-13, 2016-17 మధ్యకాలంలో మొత్తంగాచూస్తే 488.94 కోట్ల రూపాయలు రాబట్టింది. 2015-16లో మాత్రం కేవలం రూ.46 కోట్లు మాత్రమే సాధించింది. ఆతర్వాత మళ్లీ విరాళాలు ఊపందుకున్నాయి. ఎడిఆర్ నివేదికల ప్రకారం 14ట్రస్టులు ఎన్నికల సంఘానికి రిటర్నులు దాఖలుచేయగా ఆరు ట్రస్టులు మాత్రం తమకు విరాళాలు వచ్చినట్లుమాత్రమే తెలిపాయి. ఈ ఆరింటిలో ప్రైడెంట్ ఎన్నికల ట్రస్టు అంతకుముందు సత్యా ఎలక్టోరల్ ట్రస్టుగా పిలతిచేవారు. 283.73 కోట్లరూపాయలను ఆరు పార్టీలకు విరాళాలుగా అందచేసింది. బిజెపికి 88.90 కోట్లు, జనతా నిర్వాచక్ ఎలక్టోరల్ ట్రస్టు 100శాతం లేదా రూ. 25 కోట్లు బిజెపికి విరాళాలుగా ఇచ్చింది. డిఎల్ఎఫ్ రూ.28 కోట్లు యుపిఎల్ జెఎస్‌డబ్ల్యు ఎనర్జీ. 25 కోట్లు చొప్పున భారీ మొత్తాల్లో విరాళాలిచ్చాయి. ఈ విరాళాలను ప్రూడెంట్‌ట్రస్టు ద్వారానే ఇచ్చాయి. కేవలం ఇద్దరుమాత్రమే వ్యక్తిగతంగా విరాళాలలిచ్చారు. కోటక్‌మహీంద్ర ఫైనాన్స్ ప్రమోటర్ సురేష్ కోటక్ రూ.18 కోట్లు విరాళం ఇస్తే మాక్స్‌గ్రూప్ వ్యవస్థాపకులు అనల్‌జిత్‌సింగ్ రూ. కోటి విరాళం ఇచ్చారు. మూడు ఎన్నికలట్రస్టులు ఒక్కొక్కపార్టీకిచొప్పున విరాళాలిచ్చాయి. వీటిలో బిజెపి, ఎఐటిసి, ఐఎన్‌సి లున్నట్లు ఎడిఆర్‌నివేదిక వెల్లడించింది. అయితే మిగిలిన ఆరుట్రస్టులకు విరాళాలిచ్చిన దాతల పేర్లు వివరాలు కూడా అందలేదని ఎడిఆర్ వెల్లడించింది. అయితే ఈ విరాళాలు నల్లధనాన్ని వైట్‌గా మార్చుకునేందుకు చేస్తున్నవా లేక వాస్తవంగా ఇచ్చినవా అన్న అంశాలు నిర్ధారణకాలేదు.

బడ్జెట్ సమావేశాల్లో ఉమ్మడి ప్రతిపక్ష వ్యూహం

పవార్ నివాసంలో నేతల సమావేశం



న్యూఢిల్లీ, జనవరి 30: దేశంలోని ప్రధాన ప్రతిపక్షాలన్నీ ఉమ్మడి వ్యూహంతో సమష్టి కార్యాచరణతో ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వాన్ని పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లో ప్రతిఘటించాలని నిర్ణయించాయి. ఎన్‌సిపి అధినేత శరద్‌పవార్ నివాసంలో జరిగిన సమావేశంలో నాయకులందరూ ప్రభుత్వ కార్యాచరణను ప్రతిఘటించాలని నిర్ణయించాయి. ముఖ్యంగా లోక్‌సభ, అసెంబ్లీలకు ఒకేసారి ఎన్నికలు, సింగిల్ బ్రాండ్ రిటైల్‌రంగంలో నూరుశాతం విదేశీ ప్రత్యక్షపెట్టుబడులు, కార్మిక చట్టాల్లో మార్పులు చేయడంవంటి వాటిని వ్యతిరేకించాలని నిర్ణయించారు. ప్రధాని ప్రతిపాదించిన లోక్‌సభ, అసెంబ్లీలకు ఒకేసారి ఎన్నికల విధానం అభివృద్ధి పనులకు విఘాతం కలిగిస్తుందని, ఎన్నికల నియమావళి కారణంగా వీటిని నిలిపివేయడంవల్ల ప్రభుత్వ ఖజానాపై భారం పెరుగుతుందని వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీ నుంచి గులామ్ నబీ ఆజాద్, ఆనంద్‌శర్మ, రెబెల్ జనతాదళ్‌య నాయకుడు శరద్‌యాదవ్, సిపిఐ డి.రాజా, నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా, ఎన్‌సిపి నుంచి తారిఖ్ అన్వర్, ప్రఫుల్ పటేల్‌వంటి నాయకులు ఈ సమావేశానికి హాజరయ్యారు. మోడీకి అనుగుణంగా బిజెపి ఎన్నికల విధానాలను మార్చాలని ప్రతిపాదిస్తోందని, ఆయన ప్రాచుర్యానికి మరింత ప్రాధాన్యతనిచ్చేందుకే ఒకేసారి ఎన్నికల నిర్వహణకు ప్రాధాన్యతనిస్తోందని అన్నారు. ఎంత మాత్రం ఈ ప్రతిపాదనను ఆమోదించకూడదని వారు నిర్ణయించారు. సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారామ్ ఏచూరి సుప్రీంకోర్టు ఛీఫ్ జస్టిస్ దీపక్ మిశ్రా పదవీచ్యుతి ప్రతిపాదనసుమాత్రం ఈ సమావేశంలో చర్చించలేదని డి.రాజా వెల్లడించారు. అయితే కాంగ్రెస్‌మాత్రం తన వైఖరిని స్పష్టంచేయలేదు. యుపిఎ ఛైర్‌పర్సన్ సోనియా గాంధీ ఫిబ్రవరి ఒకటవ తేదీ అన్ని ప్రతిపక్ష పార్టీలతో మళ్లీ సమావేశం అవుతారు. బడ్జెట్ పార్లమెంటు సమావేశాల్లో మూకుమ్మడి వ్యూహం, ఐక్య కార్యాచరణ నిమిత్తం సోనియా అన్ని పార్టీలనేతలతో చర్చించనున్నారు. ఎన్‌సిపికి చెందిన పటేల్ మాట్లాడుతూ న్యాయవ్యవస్థలో సంక్షోభం నెలకొన్నదని, రాజ్యాంగంపైనా, రాజ్యాంగబద్ధ సంస్థలపైనా విమర్శలు, దాడులు జరుగుతున్నాయని, ట్రిపుల్ తలాక్‌బిల్లు, నిరుద్యోగం పెరుగుదల, దేశ ఆర్థికవ్యవస్థ తిరోగమనం వంటి అంశాలను ఫిబ్రవరి ఒకటవ తేదీ సమావేశంలో చర్చిస్తామన్నారు. దేశంలోని కొన్నిప్రాంతాల్లో ఇటీవల వెలుగు చూసిన మతపరమైన హింసాత్మక సంఘర్షణలు మహిళలపై అత్యాచారాలు, దాడులు వంటివాటిని కూడా పార్లమెంటు సమావేశాల్లో ప్రస్తావిస్తామని అన్నారు. ఫరూక్ అబ్దుల్లా మాట్లాడుతూ ప్రతిపక్ష నాయకులందరూ తరచూ ఇలా సమావేశం అయి సంయుక్త కార్యాచరణను నిర్వహించాలని, పార్లమెంటు ఇంటా బయటా కూడా తరచూ భేటీ కావాలని కోరారు. పార్లమెంటు సెంట్రల్ హాలులో సోనియా గాంధీ శరద్‌పవార్‌తో చర్చలు జరిపారు. రాష్ట్ర పతి రామ్‌నాద్‌కోవింద్ ఉభయ సభలనుద్దేశించి చేసిన ప్రసంగం పైనే ఈ చర్చ జరిగిందని అంచనా. రాహుల్ గాంధీ కూడా పవార్‌తో కొన్ని అంశాలపై చర్చలు జరిపినట్లు తెలిపారు. పార్టీ రాజ్యసభ సభ్యులువ ఇవేక్ ఠంకాతో కూడా వేరువేరుగా చర్చలుజరిపారు. వీరితోపాటు కమ్యూనిస్టు ఎంపి డి.రాజాకూడాకలిసారు. కేంద్ర న్యాయ శాఖ మంత్రి రవిశంకర్‌ప్రసాద్, ఆర్థికశాఖ మంత్రి అరుణ్ జైట్లీతో ఎంపి ఠంకా, జైట్లీ కాంగ్రెస్‌నేత ఆనంద్‌శర్మతో చర్చించడం కనిపించింది.

అనర్హత వెనుక వాస్తవాలతో అఫిడవిట్ దాఖలుచేయండి

ఎన్నికల సంఘానికి ఢిల్లీ హైకోర్టు ఆదేశం



న్యూఢిల్లీ, జనవరి 30: దేశ రాజధాని ఢిల్లీ అసెంబ్లీలో 20 మంది ఆప్‌ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వెనుక ఉన్న వాస్తవ అంశాలపై నివేదిక ఇవ్వాలని ఢిల్లీహైకోర్టు ఎన్నికల సంఘాన్ని కోరింది. లాభదాయక పోస్టుల్లో కొనసాగుతున్నారన్న అభియోగాలపై అనర్హత వేటువేసిన సంగతి తెలిసిందే. ఐతే వీటివెనుక వాస్తవాలను వివరిస్తూ అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశించింది. జస్టిస్ సంజీవ్‌ఖన్నా, చంద్రశేఖర్‌లు ఆధ్వర్యంలోని బెంచ్ ప్రత్యేక అఫిడవిట్ దాఖలు చేయాలని కోరింది. ఎన్నికల సంఘం తమపై వచ్చిన ఆరోపణలపై స్పందించాలని నిర్ణయించినందున, ఎమ్మెల్యేలుసైతం తమఅనర్హతను హైకోర్టులో సవాల్‌చేయడంవంటి అంశాలపై తాము వివరణ ఇస్తామనికోరింది. అందుకు వ్యవధినిసైతం కోరడంతో తాజాగా ఢిల్లీ హైకోర్టు సమగ్ర వివరాలతో అఫిడవిట్ దాఖలుచేయాలని ఆదేశించింది. ఎన్నికల సంఘం మాత్రం రాష్ట్రపతి నిర్ణయంపైనే తాము కొనసాగుతామని, 20మంది ఆప్ ఎమ్మెల్యేలను పార్లమెంటరీ కార్యదర్శులుగా నియమించినందున లాభదాయకపోస్టుల్లో కొనసాగారని అందువల్ల అనర్హత వేటు సిఫారసుచేసినట్లు వివరించింది. స్వల్పవ్యవధి విచారణ తర్వాత హైకోర్టు విచారణను ఫిబ్రవరి 7వ తేదీకి వాయిదావేసింది. అంతేకాకుండా ఎమ్మెల్యేలుసైతం ఇసి అఫిడవిట్‌కు స్పందించాలని ఆదేశించింది. ఈనెల 24వ తేదీ ఎలాంటి ఉప ఎన్నికలు నోటిఫికేషన్ చేయకూడదని ఢిల్లీ హైకోర్టు సింగిల్‌బెంచ్ స్పష్టంచేసిన సంగతి తెలిసిందే. అలాగే ఈ గడువునుసైతం పొడిగించింది. సింగిల్ బెంచ్‌నుంచి డివిజన్ బెంచ్‌కు ఈ విచారణను మార్చారు. న్యాయవాది ప్రశాంత్ పటేల్ అభ్యర్థనపైనే ఎన్నికల సంఘం ఎమ్మెల్యేలపై అనర్హత వేటు సిఫారసులను రాష్ట్రపతికి పంపించింది. ఈ కేసు విచారణను డివిజన్ బెంచ్‌కు సైతం మార్చాలని వచ్చిన ప్రతిపాదనతో హైకోర్టు డివిజన్ బెంచ్‌కు ఆప్ ఎమ్మెల్యేల అనర్హత విచారణ కేసును బదలాయించారు.

ఫిబ్రవరి ఒకటి, రెండు తేదీల్లో సుష్మా స్వరాజ్ నేపాల్ పర్యటన



న్యూఢిల్లీ, జనవరి 30: నేపాల్‌తో భారత్ సంబంధాలను మరింత పటిష్టంచేసుకునే దిశగా విదేశాంగ మంత్రి సుష్మా స్వరాజ్ ఫిబ్రవరి ఒకటి రెండు తేదీల్లో నేపాల్‌లో పర్యటించనున్నారు. నేపాల్‌లో కొత్తగా ఏర్పడిన వామపక్ష కూటమి ప్రభుత్వంతో చర్చలు జరిపేందుకు ఆమె నేపాల్ పర్యటనకు వెళుతున్నారు. నేపాల్‌లో కొత్త రాజ్యాంగం వచ్చిన తర్వాత జరిగిన చారిత్రిక ఎన్నికల్లో వామపక్ష కూటమి భారీ మెజార్టీతో విజయం సాధించింది. భారత్ నేపాల్‌మధ్య ఉన్నతస్థాయి రాజకీయ భావనల మార్పిడి, పరస్పర అవగాహన, అన్నిరంగాల్లో సత్సంబంధాలు పెంచుకునే దిశగా చర్చలు జరుగుతాయి. నేపాల్ భారత్‌మధ్య ద్వైపాక్షిక భాగస్వామ్యం ఈ చర్చల్లో కీలకం అవుతుంది. విభిన్న రంగాల్లో రెండు దేశాలమధ్య ఉన్న సంబంధాలు మరింత పటిష్టం కావాలన్న ధ్యేయంతో భారత్ ముందుకు సాగుతోంది. ఖాట్మండులో కొత్త ప్రభుత్వం ఏర్పడినతర్వాత సుష్మస్వరాజ్ జరుపుతున్న మొదటి నేపాల్ పర్యటనగా విదేశాంగశాఖ వెల్లడించింది. గతవారంలోనే ప్రధానమంత్రి మోడీ కొత్తగా ఎన్నికైన ప్రధాన మంత్రి కెపి శర్మ ఓలిని భారత్ పర్యటనకు ఆహ్వానించడం ఆపై ఓలి కూడా మోడీని నేపాల్ పర్యటనకు ఆహ్వానించడం జరిగాయి. నేపాల్‌లో జరిగిన ఆర్థిక స్తంభన తర్వాత మోడీ, ఓలిలమధ్య బంధం మందగమనంతోనే నడిచింది. నెలలతరబడి ఆర్థిక స్తంభన ఎదురవడంతో రెండుదేశాలమధ్య మైత్రీబంధం కూడా సన్నగిల్లింది. అయితే తాజా ఎన్నికల్లో ప్రస్తుతం ప్రధానిగా ఎన్నికైన ఓలి మాజీ ప్రధాన మంత్రి పుష్పా కమల్ దహాల్ ప్రచండతో గట్టిపోటీ ఎదుర్కొని చివరకు వామపక్ష కూటమిపరంగా నెగ్గారు. సుష్మస్వరాజ్ ప్రస్తుత పర్యటన నేపాల్‌భారత్‌ల మధ్య అంతర్గతంగా ఉన్న అనేక అంశాలపైచర్చకు నాంది పలుకుతుందని భారత్-నేపాల్‌మధ్య చిరకాలంగా కొనసాగుతున్న మైత్రీబంధాన్ని మరింత పటిష్టం చేస్తుందని విదేశాంగశాఖ ప్రకటించింది.

150 మంది ఎఐఎడిఎంకె కార్యకర్తల బహిష్కరణ

చెన్నై, జనవరి 30: అమ్మ పోటీచేసిన ఆర్‌కెనగర్ నియోజకవర్గంలో పార్టీని ఉల్లంఘించి టిటివి దినకరన్‌కు మద్దతునిచ్చారన్న అభియోగాలపై ఎఐఎడిఎంకె పార్టీనాయకులు, కార్యకర్తలను బహిష్కరణ పర్వం మరింతగా కొనసాగిస్తోంది. మంగళవారం కాంచీపురం జిల్లాకు చెందిన సుమారు 150 మంది పార్టీ క్రియాశీలక కార్యకర్తలను బహిష్కరిస్తున్నట్లు పళనిస్వామి, పన్నీర్‌సెల్వం వర్గం స్పష్టంచేసింది. ఎఐఎడిఎంకె కోఆర్డినేటర్ ఒపిఎస్, మరొక సమన్వయకులు ముఖ్యమంత్రి కెపిఎస్‌లుఇరువుకూడా ఈ సస్పెన్షన్లు బహిష్కరణలుమరింతగా ఉంటాయని వెల్లడించారు. పార్టీ కోయంబత్తూరు అర్బన యూనిట్ నుంచి ఎపినాగరాజన్‌ను ప్రిసీడియం ఛైర్మన్ పదవినుంచి తొలగించినట్లు వెల్లడించారు. అంతేకాకుండా 155 మంది కార్యవర్గ ప్రతి నిధులనుసైతం బహిష్కరించారు. వీరిలో 137 మంది కాంచీపురంవెస్ట్, ఇరుగు పొరుగు ప్రాంతాలకు చెందిన వారై ఉన్నారు. వీరిలో18 మంది కోయంబత్తూరుఅర్బన్‌ప్రాంతానికి చెందినవారు కూడా ఉన్నారు. గతేడాది డిసెంబరు 21వ తేదీ జరిగిన ఆర్‌కెనగర్ ఉప ఎన్నికలో పార్టీ తొలగించిన టిటివి దినకరన్‌కు మద్దతునిచ్చి పార్టీ నిబంధనలు ఉల్లంఘించి ప్రతిష్టను దిగజార్చారన్న అభియోగాలు వీరిపై ఉన్నాయి. గతంలోకూడా లెక్కకుమించిన సంఖ్యలో ఉన్నవారిని బహిష్కరించిన పార్టీ మరికొందరిపైకూడా వేటు వేస్తుందని అంచనా. ఎఐఎడిఎంకెనుంచి వీరినిపార్టీ ప్రాథమిక సూత్రాలను సైతం ఉల్లంఘించినందున బహిష్కరిస్తున్నట్లుఒపిఎస్; కెపిఎస్ నేతలు వెల్లడించారు. అంతకుముందురోజు కూడా 117మంది శివగంగజిల్లాకు చెందిన పార్టీప్రతినిదులునాయకులను బహిష్కరించారు. ప్రస్తుతం పార్టీకివిధేయులుగా పనిచేస్తున్న వారెవ్వరూ ఈ సస్పెండ్, బహిష్కృత కార్యకర్తలు,నేతలతో ఎలాంటి సంబంధాలు పెట్టుకోరాదని వెల్లడించారు.



ఐదేళ్లకు పైబడిన ఖాళీ పోస్టులు రద్దు

ఎన్‌డిఎ ప్రభుత్వం తాజా నిర్ణయం



న్యూఢిల్లీ, జనవరి 30: కేంద్ర ప్రభుత్వం ఐదేళ్లకు పైబడి ఖాళీగా ఉన్న అన్ని పోస్టులను రద్దుచేయాలని నిర్ణయించింది. అన్ని మంత్రిత్వశాఖలకు ఈ మేరకు లేఖరాస్తూ ఖాళీల వివరాలివ్వాలని సూచించింది. ఆర్థికశాఖ నుంచి వెలువడిన ఈ సర్క్యులర్ ప్రకారం చూస్తే అన్ని మంత్రిత్వశాఖలు, అన్ని ప్రభుత్వశాఖల అధికారులు ముందుగానే ప్రగతి నివేదికలు ఇవ్వాలని, ఐదేళ్లకుపైబడి ఖాళీ పోస్టులను రద్దు విషయమై తమ తమ వివరణలు పంపించాలనిసైతం ఆదేశించింది. కొన్ని మంత్రిత్వ శాఖలు, ప్రభుత్వశాఖల అధికారులు ఈ విషయమై స్పందించాయి. సమగ్ర నివేదిక ఇవ్వడం అటుంచి పోస్టులరద్దుపైకేవలం అరకొర సమాచారం మాత్రమే ఇచ్చినట్లు తేలింది. దీనితో ఆర్థికశాఖ మళ్లీ జాయింట్ కార్యదర్శులు, ఆర్థిక సలహాదారులు అందరినీ మళ్లీ ఈ ఖాళీలు, పోస్టుల రద్దుపై సమగ్ర నివేదికలు ఇవ్వాలని కోరింది. అలాగే సాధ్యమైనంత సత్వరమే ఆర్థికశాఖకు నివేదికలు అందించాలని, ప్రధాన మంత్రిత్వశాఖతోపాటు అనుబంధ శాఖల్లో కూడా ఈ ఖాళీల వివరాలివ్వాలని వాటిని రద్దుచేయకతప్పదని వెల్లడించింది. హోంమంత్రిత్వశాఖ ఈ సర్క్యులర్‌ను అనుసరించి తన శాఖపరిధిలోని అందరు అదనపు కార్యదర్శులు, జాయింట్ కార్యదర్శులు, పారామిలిటరీ దళాల అధిపతులు, ఇతర అనుబంధ సంస్థలను తక్షణమే సమగ్ర నివేదికలు ఇవ్వాలని ఆదేశించింది. ప్రాథమిక అంచనాలను చూస్తే కొన్ని వేలకు పైగా పోస్టులు కేంద్ర ప్రభుత్వంలో ఐదేళ్లకు పైబడి ఖాళీగా ఉన్నట్లుతేలింది.

రూ.100 స్టాంపు పేపర్‌పై ట్రిపుల్ తలాక్

థాణె, జనవరి 30: మహారాష్ట్రలోని థాణెజిల్లాకు చెందిన భివాండినగరంలో ఒక ముస్లింమహిళకు తమె భర్త రూ.100 స్టాంప్‌పేపర్‌పైట్రిపుల్ తలాక్ రాసిచ్చినవైనం ఇది. ముస్లిం మహిళ షబ్నం సోమవారం మాట్లాడుతూ తనకు రూ.100 స్టాంప్‌పేపర్‌పైవిడాకులు ఇస్తున్న పత్రం అందుకుని ఆశ్చర్యపోయానని వెల్లడించింది. అదనపు కట్నం కోసం తన భర్త తనను తరచూకొడుతుండేవాడని, అయితే ఆతడు అడిగిన మొత్తం తానిచ్చేస్థితిలో లేనని ఆమె వెల్లడించింది. రూ.100 స్టాంపు పేపర్‌పై విడాకుల పత్రం పోస్టులో వచ్చినపుడు తాను ఇంటిలోనే ఉన్నానని చెప్పింది. ఈకేసుకు సంబంధించి భివాండిపోలీసులు ఐదుగురిపై కేసు నమోదుచేసారు. తనభర్తలాంటివారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తాను అధికార యంత్రాంగాన్ని కోరతానని ఆమె వెల్లడించింది. పార్లమెంటులో ఓపక్క ట్రిపుల్ తలాక్ బిల్లుకు మద్దతివ్వాలని అన్ని రాజకీయపక్షాలను ప్రధాని మోడీ కోరుతూ ఈ బిల్లునలు ఆమోదింపచేసే లక్ష్యంతో పనిచేస్తున్నతరుణంలో దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో ముస్లిం మహిళలకు ఈ ట్రిపుల్ తలాక్ కేసులు ఎక్కువ ఎదురవుతున్నాయి. లోక్‌సభలో ఆమోదం పొందిన ఈట్రిపుల్ తలాక్‌బిల్లు రాజ్యసభలో కొన్ని షరతుల వల్ల పెండింగ్‌లో పడింది. ప్రతిపక్షాలన్నీ ఈ బిల్లును జాయింట సెలెక్ట్ కమిటీకి నివేదించాలని పట్టుబట్టాయి. దీనితో రాజ్యసభలో ఈ బిల్లు ఆగిన సంగతి తెలిసిందే.



శేషాచలం కొండల్లో పేలుడు పరికరాలు

తిరుమలకు వెళ్లే శ్రీవారిమెట్టు మార్గంలో కనుగొన్న టాస్క్ ఫోర్సు

వివిపిలను టార్గెట్ చేసినట్లు అనుమానాలు


మంగళవారం శేషాచలం కొండల్లో లభ్యమైన ఎలక్ట్రానిక్ పరికరాలను పరిశీలిస్తున్న ఐజి కాంతారావు

తిరుపతి,ప్రభాతవార్త ప్రతినిధి: శేషాచలం కొండల్లో మరోసారి ఎర్రచందనం కలకలం చెలరేగింది. ఎర్ర చందనం నిరోధక టాస్క్ ఫోర్సు సిబ్బంది శేషాచలం కొండల్లో కూంబింగ్ నిర్వహిస్తుండగా, పేలుళ్లకు ఉపయోగించే ఎలక్ట్రానిక్ పరికరాలు లభ్యమయ్యాయి. వీటితో బాంబులు తయారు చేసుకునేందుకు కావలసిన పరికరాలు ఉన్నాయి. వీటిని అక్కడ ఎవరు ఉంచారనే విషయంపై టాస్క్ ఫోర్సు పోలీసులు ఆరా తీస్తున్నారు. సోమవారం అర్ధరాత్రి యధావిధిగా ఎర్ర చందనస్మగ్లర్ల కోసం కూంబింగ్ నిర్వహించేందుకు ఆర్ఎస్ఐ వాసు బృందం శేషాచలం అడవుల్లోకి వెళ్లింది. తిరుమలకు నడక దారిన వెళ్లే శ్రీవారిమెట్టు మార్గం సమీపంలోని అడవిలో కూంబింగ్ చేస్తుండగా, వీరికి ఒక తెల్లటి ప్లాస్టిక్ గోనె సంచి లభించింది. వీటిని తెరిచి చూడగా, వీటిలో ఎలక్ట్రానిక్ పరికరాలు కనిపించాయి. ఆయన టాస్క్ ఫోర్సు ఐజి కాంతారావుకు సమాచారం అందజేయగా,ఆయన వాటిని పరిశీలించి, వాటిని పేలుడు పదార్ధాలకు ఉపయోగించేవిగా నిర్ధారించారు. వీటితో బలమైన పేలుడు పదార్థాలను తయారు చేయవచ్చునని ఐజి కాంతారావు ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలిపారు. ఇవి ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్ తయారు చేసే పరికరాలని తెలిపారు. వీటిని బ్లాసింగ్ మెటీరియల్ ఇగ్నిషన్‌కు ఉపయోగించవచ్చునని తెలిపారు. వీటిలో కండక్టర్లు, కండెన్సర్లు, సర్క్యూట్ బోర్డులు, మదర్ బోర్డు, ఒక సెల్‌ఫోన్, వాక్‌మెన్ లాంటి వస్తువులతో పాటు వైర్లు లభించాయని తెలిపారు. వీటిని కలిపి పేలుడు పదార్ధాలకు ఉపయోగించే ఇగ్నిషన్‌ను తయారు చేయవచ్చునని తెలిపారు. ఇదిలా ఉండగా, వీటిని ఇక్కడకు పెట్టడానికి కారణాలు ఏమిటని పోలీసులు విచారిస్తున్నారు. గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై అలిపిరి బ్లాస్ట్ జరిగిన విషయం తెలిసిందే. ఈసారి కూడా అదే విధంగా పేలుళ్లకు చేపట్టేందుకు పథకం పన్నారా అనే అనుమానాలకు తావిస్తోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇటీవల సంక్రాంతికి స్వగ్రామానికి వచ్చి,మూడు రోజులు గడిపారు. ఎలక్ట్రానిక్ డివైజ్‌లు లభించిన చోటు, ముఖ్యమంత్రి స్వగ్రామానికి అతి దగ్గరలోనే ఉండటం గమనార్హం. ఈ మూడు రోజుల పాటు ఏదైనా పథకం పన్ని ఉండవచ్చునని, అయితే భద్రతా కారణాల వల్ల సాధ్యం కాక, వీటిని అక్కడే వదిలేసి వెళ్లి పోయి ఉండవచ్చునని పోలీసులు భావిస్తున్నారు. లేదా తిరుమలకు వెళ్లే వివిఐపిలను టార్గెట్ చేసి, ఇక్కడ నుంచి సెల్‌ఫోన్ ద్వారా పేలుళ్లకు పథకం సిద్ధం చేసి ఉండ వచ్చునని భావిస్తున్నారు. అయితే తెల్లటి ప్లాస్టిక్ బ్యాగు పైన తమిళనాడుకు చెందిన తిరుచ్చి నగరం పేరు ఉండగా, అటువైపు నుంచి సంఘ విద్రోహ శక్తులు ఎవరైనా వచ్చి ఉండే అవకాశం ఉందని అనుమానిస్తున్నారు. కాగా సెల్‌ఫోన్‌లో ఉన్న ఇఎంఐ నెంబరు ద్వారా నిందితులను ట్రేస్ చేసేందుకు టాస్క్ ఫోర్సు ప్రయత్నిస్తోంది. లభించిన వస్తువులను ఫోరెన్సిక్ లాబ్‌కు పంపి, వాటిని కూడా పరిశీలిస్తున్నారు. కేసును టాస్క్‌ఫోర్సు పోలీసు స్టేషన్‌లో రిజిస్టరు చేశారు. క్రైమ్‌నెంబరు 03/18 యు/ఎస్ 102 క్రైంపిసి నెంబరులో రిజిస్టరు చేయగా, ఇనస్పెక్టర్ మధుబాబు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విమానాశ్రయంలో భద్రత పటిష్టం

పేలుడు పదార్ధాలకు ఉపయోగించే ఎలక్ట్రానిక్ పరికరాలు లభ్యం కావడంతో, తిరుపతి విమానాశ్రయంలో భద్రత ఏర్పాట్లను పటిష్టం చేశారు. ఆకస్మిక తనిఖీలు నిర్వహించడంతో పాటు ప్రయాణీకుల క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. దీంతో పాటు మాక్ డ్రిల్ నిర్వహించారు. ప్రయాణీకులను, సిబ్బందిని విమానాశ్రయం వెలుపలకు పంపించి, డాగ్ స్క్వాడ్, బాంబుస్క్వాడ్‌లతో తనిఖీలు నిర్వహించారు. దాదాపు గంటకు పైగా కేంద్ర బలగాలు ఈ తనిఖీలను చేపట్టారు. తరువాత మాక్‌డ్రిల్ అని తెలియజేసి, ప్రయాణీకులను లోపలకు పంపించారు.


మంగళవారం సిఎంకు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న శ్రీకాళహస్తి ఇఒ

శ్రీకాళహస్తి ఉత్సవాలకు రండి

ముఖ్యమంత్రిని ఆహ్వానించిన ఆలయ ఇఒ

శ్రీకాళహస్తి,జనవరి 30 ప్రభాతవార్త: చిత్తూరుజిల్లా శ్రీకాళహస్తీశ్వరాలయంలో వచ్చేనెల 8 నుంచి 20 వరకు నిర్వహించే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు విచ్చేసి స్వామి అమ్మవార్ల సేవలో తరించాలని ఆలయ కార్యనిర్వహణాధికారి డి.భ్రమరాంబ రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడును ఆహ్వానించారు. సాధారణంగా శివాలయాల్లో నాలుగైదు రోజులు శివరాత్రి మహోత్సవాల్ని నిర్వహించటం ఆనవాయితీ. అయితే శ్రీకాళహస్తీశ్వరాలయంలో 13 రోజులపాటునిర్వహిస్తారనిఈమహోత్సవాలకు విచ్చేయాలంటూ ఆహ్వాన పత్రికను ఇఒ సిఎం చంద్రబాబునాయుడును ఆహ్వానించారు.

నేడు గ్రహణ కాల శాంతి అభిషేకాలు

శ్రీకాళహస్తి,జనవరి 30 ప్రభాతవార్త: 'సాధారణంగా సూర్య, చంద్ర గ్రహణాల సందర్భంగా ఆలయాల్ని మూసి వేసి గ్రహణం వదలిన తరువాత శుద్ధి చేసి తెరవటం ఆనవాయితీ. ఈ సంప్రదాయమే ప్రపంచ ప్రసిద్ధి చెందిన తిరుమలేశుని ఆలయంలో కూడా ఇదే సంప్రదాయం సాగుతుంది. అయితే పంచభూత లింగాలల్లో వాయులింగేశ్వరుడు స్వయంభువుగా వెలసిన దివ్యక్షేత్రం శ్రీకాళహస్తీశ్వరాలయం. ఇక్కడ గ్రహణ కాలంలో శాంతి అభిషేకాలునిర్వహించటం ఆనవాయితీ. ఈ నేపథ్యంలో ఈ నెల 31న సంపూర్ణ చంద్రగ్రహణం ఉందని ఈ సమయంలో ఇక్కడ జ్ఞాన ప్రసూనాంబ దేవేరి స్వామి వాయులింగేశ్వరునికి శాంతి అభిషేకాలు నిర్వహించబడుతుందని ఆలయాధికారులు తెలిపారు. గ్రహణం అంటే ఆపద అని ఈ సమయంలో ఆలయాల్ని మూసివేయటం తగదని స్వామికి వచ్చిన ఆపదల్ని తొలగించుటకు శాంతి అభిషేకాలు నిర్వహించాలని ఇక్కడి ప్రధానార్చకులు చెబుతున్నారు.బుధవారం గ్రహణం సాయంత్రం 5.18గంటల నుంచి రాత్రి 8.41 గంటల వరకు ఉంటుందని ఈ సందర్భంగా సాయంత్రం 6.59గంటలకు స్వామి అమ్మవార్లకు శాంతి అభిషేకాలు నిర్వహించబడుతుందని దేవస్థానం ఓ ప్రకటనలోతెలిపింది.ఈసమయంలో భక్తులు స్వామి అమ్మవార్లనుదర్శించుకొనికృపకు పాత్రులు కావాలని దేవస్థానం ఓ ప్రకటనలో తెలిపారు.

దేశంలో అక్కరలేని ఆడపిల్లలు 2.10కోట్లు?

అబ్బాయిల కోసం పరుగెడుతున్న భారత జంటలు

మగశిశువు పుట్టేవరకు నో ఫ్యామిలీ ప్లానింగ్

ఏటా 20లక్షల ఆడపిల్లలు స్కానింగ్ తర్వాత బలి

ఆర్థిక సర్వే వెల్లడి



న్యూఢిల్లీ,జనవరి30,ప్రభాతవార్త: గత 25 ఏళ్లలో మగపిల్లలను కనటం కోసం 21మిలియన్ల (2.10 కోట్లు) మంది అక్కరలేని ఆడపిల్లలు భారతలో ఉన్నట్లు మంగళవారం పార్లమెంటులో ప్రవేశపెట్టిన ఆర్థికసర్వే తెలిపింది. మగపిల్లలు పుట్టేవరకూ కుటుంబ నియంత్రణ పాటించకుండా ఉండటం వల్ల వద్దనుకునేవారే గత 25ఏళ్లలో భారతీయులు రెండు కోట్ల ఆడపిల్లలను కన్నారని సర్వే తెలిపింది. దీనికి తోడు ఏటా 20 లక్షల మంది ఆడపిల్లలు భ్రూణ హత్యల రూపంలో బలి అవుతున్నారు. 1970లలో ప్రతి 1060 మంది మగపిల్లలకు 1000మంది ఆడపిల్లలున్నారు. ఇది 2011 నాటికి 1000 మంది మగపిల్లలకు 943 మందే ఆడపిల్లలకు పడిపోయింది. 2014నాటికి ప్రతి 1108 మగపిల్లలు 1000 మంది ఆడపిల్లలు ఉన్నారు. ప్రతి పదేళ్ల జనాభా లెక్కల ప్రాతిపదిక మీద తయారయ్యే సర్వేలో వివిధ అంశాలను సోమవారం పార్లమెంటుకు సమర్పించిన నివేదికలో వివరించారు. సెక్స్‌రేషియోను వివిధ కోణాలలోనుండి సర్వే విశ్లేషిస్తూ....గత 25 ఏళ్లలో చాలా జంటలు ఆడపిల్లను ఇష్టంతో కాక మగపిల్లలు పుట్టటం కోసం కంటున్నారన్న కఠోర వాస్తవాన్ని తెలిపింది. ఉత్తరాది, దక్షిణాది అన్న భేదం లేకుండా మగపిల్లలంటేనే మోజట. సమాజంలో ఉన్న వివిధ ఆచార వ్యవహారాలలో నమ్మకాలలో సంస్కృతులలో మగపిల్లలకు ప్రాధాన్యత ఎక్కువ ఉండటం వల్ల మగపిల్లలు పుట్టేంత వరకూ ఆడపిల్లలను వద్దనుకుంటూనే కంటున్నారట. పంజాబ్, హర్యానాలలో మగపిల్లలకోసం ఎంతమంది సంతానానికైనా సిద్ధంగా ఉంటున్నారు. ఆదే మేఘాలయలో ఆడపిల్లలకు ప్రాధాన్యత చాలా ఎక్కువగా ఉంది. 1960ల నుండి నేటివరకూ కుటుంబ నియంత్రణ పద్ధతులు, స్కానింగ్‌లు అందుబాటులోకి వచ్చిన తర్వాత భ్రూణ హత్యలు పెరిగి సెక్స్‌రేషియోలో ఆడపిల్లల సంఖ్య క్రమంగా తగ్గుముఖం పట్టింది. అయితే 1994లో స్కానింగులను అబార్షన్లను నియంత్రించే చట్టాలు బలోపేతం అవటంతో ఆడపిల్లల సంఖ్య పెరగటం మొదలైంది. ఇద్దరు చాలు అనుకొనే కుటుంబాలలో చివరి సంతానం మగపిల్లవాడు అయితే అక్కడితో కుటుంబ నియంత్రణ చేసుకుంటున్నారట. మగ పిల్లవాడు పుట్టేంత వరకూ పిల్లలను కనాలని పట్టుదలతో ఉండే జంటలు సగటున ఐదుగురును కంటున్నారట. మొదట మగ సంతానం కలిగి అక్కడితో ఆపిన జంటలలో ప్రతి 1000 మంది ఆడపిల్లలకు 1820 మగ పిల్లలున్నారు. రెడవ సంతానం మగ పిల్లవాడు అయినపుడు కుటుంబాన్ని పరిమితం చేసుకున్న జంటలలో ప్రతి 1000ఆడపిల్లకు 1550మగపిల్లలున్నారు. అదే మూడు అయితే 1510,అదే నాలుగు అయితే 1450గా ఉంది. దీన్ని బట్టి చాలా జంటలు మగశిశువు జననంతో పిల్లలు కనటాన్ని ఆపేస్తున్నారు. ఇది దీర్ఘకాలలో తీవ్ర పరిణామాలకు దారితీసే ప్రమాదం ఉంది అని రిపోర్టు వివరించింది. ఒకవేళ మొదటే ఎక్కువ మందికి పుత్ర సంతానం కలిగితే వారు ఇక పిల్లలు కనటం ఆపివేయటం వల్ల భవిష్యత్తులో ఆడపిల్లలకు కొరత ఏర్పడే ప్రమాదం ఉంది. ఇష్టంలేకుండా మగపిల్లలకోసం ఆడపిల్లలను కనే వారి సంఖ్య పెరగటం వల్ల మహిళల అభివృద్ధిని నిర్లక్ష్యం చేస్తున్నారని రిపోర్టు పేర్కొనంది ఈ పరిస్థితి మారాలంటే మహిళా శిశు సంక్షేమం, ఆడపిల్లల సంఖ్య పెంచేలా ప్రజలలో అవగాహన పెంచటం, సెక్ రేషియో దాని ప్రాధాన్యతను ప్రజలకు వివరించటం, భ్రూణ హత్యలను కఠినంగా నియంత్రించటం వంటి చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఎండోమెంట్ ఉద్యోగ సంఘానికి నూతన కమిటీ ఎన్నిక


ఎండోమెంట్ ఉద్యోగ సంఘానికి ఎన్నికైన నూతన కమిటీ

విజయవాడ (ఇంద్రకీలాద్రి), జనవరి 30, ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్ దేవాదాయ ధర్మాదాయ శాఖ పరిపాలన ఉద్యోగుల రాష్ట్రస్థాయి సమావేశం విజయాడలో పాతబస్తీలోని ఒక హోటల్‌లో మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా 13 జిల్లాల్లోని ఆర్‌జెసి, డిసి, ఏసి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీరింగ్, తదితర శాఖలకు చెందిన సిబ్బంది నూతన కమిటీని ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షునిగా టివిఎస్ సుబ్రహ్మణ్యం (సహాయ కమీషనర్, ఏలూరు), ప్రధాన కార్యదర్శిగా కె మల్లిఖార్జునరెడ్డి (ఆర్‌జెసి కార్యాలయం, తిరుపతి), ఉపాధ్యక్షులుగా ఎం ప్రసాద్ (సహాయ కమీషనర్ కార్యాలయం, విశాఖపట్నం), జె వెంకట సుబ్బయ్య (సహాయ కమీషనర్ కార్యాలయం, కడప), జాయింట్ సెక్రటరీలుగా సిఎస్ తిరుమలరెడ్డి, (సహాయ కమీషనర్ కార్యాలయం, కర్నూలు), వివిఎన్ నరసింహారెడ్డి (సహాయ కమీషనర్ కార్యాలయం, రాజమండ్రి), ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా ఏ సుజన్ కుమార్ (సహాయ కమీషర్ కార్యాలయం, విజయవాడ), రామ తులసి (సహాయ కమీషనర్ కార్యాలయం, అనంతపురం), కోశాధికారిగా శేషు సుబ్రహ్మణ్యం (సహాయ కమీషనర్ కార్యాలయం, గుంటూరు), రాష్ట్ర కార్యవర్గసభ్యులుగా కెవి అనురాధ, ప్రసన్నలక్ష్మి, ఫణిరాజు శయన, ఎన్ వెంకట రమణ, కెవిల్ సుధారాణి, వైవి రమణిలు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఈ నూతన కమిటీకి పలువురు అభినందనలు తెలిపారు.


మంగళవారం డిజిపి కార్యాలయంలో గాంధీకి నివాళులర్పిస్తున్న డిజిపి, పోలీసు ఉన్నతాధికారులు

డిజిపి కార్యాలయంలో గాంధీకి ఘన నివాళి

విజయవాడ క్రైం, జనవరి 30, ప్రభాతవార్త: మహాత్మాగాంధీకి రాష్ట్ర డిజిపి కార్యాలయంలో ఘనంగా నివాళులర్పించారు. మంగళవారం గాంది వర్ధంతి సందర్భంగా డిజిపి ఎం మాలకొండయ్య మహాత్మా గాంధీ చిత్రపటానికి పూల మాల వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనం సమాజంలో స్వేచ్ఛగా జీవించడానికి గాంధీ, ఇతర స్వాతంత్ర్య సమరయోధులు చేసిన త్యాగాలు కారణమని వారి సేవలను కొనియాడారు. దేశంకోసం ఎన్నో త్యాగాలు చేసి, జైలు జీవితాన్ని గడిపి మనకు స్వాతంత్ర్యాన్ని ప్రసాదించి శాంతియుత సమాజాన్ని సాధించి ఇచ్చారని దీంతో మనమంతా స్వేచ్ఛా వాయువులు పీల్చుకుంటున్నామన్నారు. ఆనాడు స్వాతంత్ర్యం సాధించటానికి తమ జీవితాలను త్యాగం చేసిన మహాత్మా గాంధీ, తదితర సమరయోధులకు మనం జీవితాంతం రుణపడివుంటామన్నారు. ఈ సందర్భంగా రెండు నిముషాలు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అడిషనల్ సిబిసిఐడి డిజి ద్వారకా తిరుమలరావు, లా అండ్ ఆర్డర్ ఏడిజి హరీష్ కుమార్ గుప్త, రైల్వేస్ అడిషనల్ డిజి కెఆర్ఎం ఇతర ఉన్నతాధికారులు ఉన్నారు.

ఎపిని కబ్జాలప్రదేశ్‌గా మార్చేశారు

వైఎస్సార్సీ అధికార ప్రతినిధి వాసిరెడ్డి పద్మ

హైదరాబాద్, జనవరి 30, ప్రభాతవార్త: విజయవాడలో టిడిపి భూ కబ్జాలకు అంతులేకుండాపోయిందని, రాజధాని నగరం భూకబ్జాలకు అడ్డాగా మారిందని వరుస సంఘటనలు నిరూపిస్తున్నాయని వైఎస్సార్సీ అధికార ప్రతినిధి వాసిరెడ్డి పద్మ అన్నారు. విజయవాడ ఎస్ఆర్ఆర్ అండ్ సివిఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల భూముల కబ్జాలపై ఆ కళాశాల పూర్వ విద్యార్థులు మంగళవారం సమరశంఖం పూరించి వీధుల్లోకి వచ్చి పోరాటాలు చేసిందంటే ప్రభుత్వ వైఫల్యం నిదర్శమన్నారు. రైతులు, సామాన్యుల భూకబ్జాలను దౌర్జన్యంగా లాక్కున్నారన్నారు. చివరకు స్వాతంత్ర్య సమరయోధుడికి భూమిని వదలేదన్నారు. ఏపిని కబ్జాల ప్రదేశ్‌గామార్చారని ఆమె ధ్వజమెత్తారు.

రైల్వేస్టేషన్‌లను తనిఖీలు చేసిన సదరన్ వెస్టన్ రైల్వే జిఎం


మగళవారం రైల్వేస్టేషన్లను తనిఖీలు చేస్తున్న సదర్ వెస్ట్రన్ రైల్వే హుబ్లీ డివిజన్ జిఎం

హిందూపురం, అనంతపురం జిల్లా జనవరి 30 ప్రభాతవార్త: సదర్ వెస్ట్రన్ రైల్వే హుబ్లీ డివిజన్ జనరల్ మేనేజర్ అశోక్ కుమార్ గుప్త మంగళవారం వివిధ రైల్వేస్టేషన్లను తనిఖీలు చేశారు. అనంతపురం జిల్లాలో ఉదయం 8 గంటల నుంచి ధర్మవరం, పెనుకొండ, హిందూపురం, గౌరిబిదనూరు, యలహంక మొదలగు ప్రధాన స్టేషన్లతోపాటు మార్గమధ్యంలోని చిన్న స్టేషన్లను కూడా పరిశీలించారు. హిందూపురంలో ఎక్కువ సేపు ఆయన గడిపారు. స్థానికరైల్వేస్టేషన్‌లో జరుగుతున్న పనులను పరిశీలించిన తరువాత రైల్వే ఆస్పత్రి, రైల్వే స్కూల్, పాయింట్లను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఉద్యోగులకు పలు అంశాలపై ఆదేశాలు ఇచ్చారు. అనంతరం జిఎంను ఎస్ డబ్ల్యుఆర్ఎంయు యూనియన్ కార్యదర్శి శేఖర్ కలిసి జ్ఞాపికను అందించి సత్కరించారు. వివిధ సమస్యలపై వినతి పత్రం అందించారు. రైల్వే కార్మికుల కోసం బెంగళూరు ఆస్పత్రిని వంద పడకల స్థాయికి పెంచాలని, కార్మికులకు రైల్వే క్వార్టర్స్ తగినన్ని లేనందున అదనంగా నిర్మించాలని కోరారు. హిందూపురం సెక్షన్‌లో పనిచేస్తున్న పాయింట్‌మెన్స్ రోస్టర్‌ను 8 గంటలకు మార్చాలని, ధర్మవరం స్టేషన్‌కు సమీపంలోని ఎన్ఎస్ గేటు, మక్కాజిలిపల్లి స్టేషన్లలో పని చేసే సిబ్బందికి ధర్మవరం రైల్వే ఆస్పత్రిలో చికిత్సలు పొందేలా సదుపాయం కల్పించేలా కోరారు. పుట్టపర్తి రైల్వేస్టేషన్‌లో ట్రాక్‌మెన్ పోస్టులను భర్తీ చేసి అక్కడి సిబ్బంది పని బారం తగ్గించాలని కోరారు.


సమస్యలపై జిఎంకు వినతి

రైల్వేస్టేషన్ తనిఖీ కోసం వచ్చిన జిఎం గుప్తాకు లైఫ్ వరల్డ్ సంస్థ కార్యదర్శి ఉదయ్‌కుమార్, శివకుమార్, ఫారుఖ్ తదితరులు సమస్యలపై వినతి పత్రం ఇచ్చారు. వృద్ధులు, వికలాంగుల కోసం స్టేషన్‌లో ప్రత్యేక టికెట్ కౌంటర్ ఏర్పాటు చేయాలని, పుట్టపర్తి నుంచి చెన్నైకు వెళ్లే రైలుకు హిందూపురంలో స్టాపింగ్ చేయాలని కోరారు. గుడ్డం, కొటిపి ప్రాంతాల్లో నిర్మించిన అండర్ బ్రిడ్జిలలో వర్షపు నీరు చేరి బయటకు వెళ్లే అవకాశం లేక పలువురి ప్రాణిలను బలిగొందని చెప్పారు.

ప్రశ్నిస్తానని చెప్పి తోకముడిచిన పవన్

మాజీ ఎంఎల్ఏ వెంకటరామిరెడ్డి ఎద్దేవా

ధర్మవరం, జనవరి 30 ప్రభాతవార్త: ఇంకా పార్టీకి ఎన్నికల గుర్తురాకనే జనసేన పార్టీని టిడిపిలో విలీనం చేసేందుకు ఆ పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ యత్నిస్తున్నారని ధర్మవరం మాజీ ఎంఎల్ఏ, వైకాపా నేత కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ఎద్దేవా చేశారు. ఓ ప్రాంతీయ పార్టీ మరో ప్రాంతీయ పార్టీలో విలీనం చేయాలనుకోవడం సిగ్గుచేటన్నారు. ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తానని, హామీలను నెరవేర్చని ప్రభుత్వాలను నిలదీస్తానని బీరాలు పలికిన పవన్ కళ్యాణ్ రాజకీయ పార్టీని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందేనన్నారు. నేతలను ప్రశ్నించే సైనికులను తయారుచేస్తానని పవన్ కళ్యాణ్ చెప్పారని గుర్తుచేశారు. మంగళవారం ఆయన తన నివాసంలో విలేకర్లతో మాట్లాడారు. ఇటీవల అనంతపురం జిల్లాలో పర్యటించిన పవన్ కళ్యాణ్ ప్రవర్తన, ప్రసంగాల తీరు, సభల నిర్వహణ, మంత్రులను, అధికార పార్టీ ఎంఎల్ఏలను కలవడం చూస్తుంటే ఆయన టిడిపి దూతగా వచ్చినట్లు అనుమానం కలుగుతోందన్నారు. ఇంటింటికీ టిడిపి కార్యక్రమంలో భాగంగా ఆయన అనంతపురం జిల్లాకు వచ్చినట్లు ఉందన్నారు. రైతుల సమస్యలను తెలుసుకునేందుకు పొలాల్లోకి వెళ్ళాలేకాని అధికార పార్టీ మంత్రులు, ఎంఎల్ఏల వద్దకు కాదన్నారు. అలాగే చేనేతల బతుకులను చూసేందుకు మగ్గం గుంతలోకి దిగాలన్నారు. పేరుకే రైతు-చేనేత సదస్సులు ఏర్పాటు చేశారని, అక్కడకు వచ్చింది మాత్రం అందరూ ఆయన అభిమానులేనన్నారు. ధర్మవరం పట్టుచీరకు ధర్మవరం బ్రాండ్ తెచ్చేందుకు పాటుపడతానని చెప్పడం హాస్యాస్పదమన్నారు. తమ హాయాంలోనే ధర్మవరం పట్టుచీరకు పేటెంట్ తెచ్చామని, అయితే అది అమలుకాలేదన్నారు. రాష్ట్రంలోని రాజకీయ పార్టీలకు ప్రత్యమ్నాయంగా ఎదగకపోవడం పవన్ కళ్యాణ్ చేతకానితనమన్నారు. పాలకులను ప్రశ్నించకుండా సిద్ధాంతాలను తుంగలో తొక్కి ప్యాకేజీలకు లొంగడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. టిడిపి అధినాయకత్వం చెప్పినట్లుగా పవన్ కళ్యాణ్ నడుచుకుంటున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పవన్‌ను ఆయుధంలా వాడుకుంటున్నారని మాజీ ఎంఎల్ఏ అన్నారు. ప్రజల నమ్మకాన్ని కోల్పోయిన పవన్ కళ్యాణ్ ఇక ప్రజల్లోకి రాలేరన్నారు. ఒక శక్తిగా ఎదగాల్సిన పార్టీని నిర్వీర్యం చేయడం బాదాకరమని, పవన్ కళ్యాణ్ అభిమానులు కూడా మదనపడుతున్నారన్నారు. పవన్ కళ్యాణ్ కంటే చిరంజీవి మేలని, సిద్ధాంతాల మేరకు పార్టీని నడిపించి 18 శాతం ఓట్లను కైవసం చేసుకున్నారని తెలిపారు. అప్పటి పరిస్థితులలో పార్టీని నడపలేక కాంగ్రెస్‌లో విలీనం చేశారని కేతిరెడ్డి అన్నారు. మహానటులు ఎన్టి రామారావు, అక్కినేని నాగేశ్వరరావు, ఎస్వి రంగారావు, చిరంజీవి లాగా పవన్ కళ్యాణ్ పెద్ద నటుడేమీ కాదని, తన మేనరిజంతో మాత్రమే అభిమానులను సంపాదించుకున్నారన్నారు. తానుకూడా పవన్ కళ్యాణ్ అభిమానినేనని కేతిరెడ్డి అనడం గమనార్హం.


మంగళవారం భామిని మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో మట్లాడుతున్న గిడ్డంగుల సంస్థ చైర్మన్ ప్రసద్

గిడ్డంగుల సంస్థ ఆధ్వర్యంలోనే కోల్డ్ స్టోరేజ్‌లు

రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ ప్రసాద్

శ్రీకాకుళం ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఆధ్వర్యంలో కోల్డ్ స్టోరేజ్‌లు నిర్వహిస్తున్నామని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ ఎల్.వి.ఎస్.ఆర్.కె.ప్రసాద్ తెలిపారు. భామిని మండల కేంద్రంలో 5.20 కోట్లుతో నిర్మించిన 10 వేలు మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో ఉన్న గిడ్డంగులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ధాన్యం దిగుబడి బాగుందన్నారు. వంశధార ప్రాజెక్టు త్వరలో పూర్తవుతుందన్నారు. తద్వారా లక్ష ఎకరాలకు నీరు అందుతుందని, దీనితో సస్యశ్యామలమవుతుందన్నారు. రెండు పంటలు పండించడం జరుగుతున్న దృష్ట్యా గిడ్డంగుల సామర్థ్యం పెంచాల్సిన అవసరముంది. ఇప్పటికే 70 నుండి 80 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గిడ్డంగులు అవసరమని సూచించామన్నారు. భామినిలో మరో 5 వేల సామర్థ్యం గల గిడ్డంగులు నిర్మిస్తామన్నారు. రాష్ట్రంలో 6 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గిడ్డంగులను ప్రభుత్వం ఆధ్వర్యంలోను, మరో 6 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల ప్రైవేట్ ఆధ్వర్యంలోను నిర్మిస్తామన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో కొత్తగా 4 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గిడ్డంగుల నిర్మాణానికి ముఖ్యమంత్రి మంజూరు చేసారని ఆయన పేర్కొన్నారు. గిడ్డంగుల సంస్థ ఆధ్వర్యంలో కోల్డ్ స్టోరేజ్‌లను నిర్మించుటకు చర్యలు చేపడతున్నామన్నారు. ఇందుకు 80 కోట్లు అవసరమని, కేంద్రప్రభుత్వం 20 కోట్లు నిధులను నాబార్డు ద్వారా అందిస్తున్నామని చెప్పారు. తమ సంస్థ ఆధ్వర్యంలో ఫుడ్ ప్రోసెసింగ్ యూనిట్లను నెలకొల్పుటకు యోచిస్తున్నామని అన్నారు. ఇందుకు తగిన ప్రణాళికలను సిద్ధంచేస్తున్నామన్నారు. శ్రీకాకుళం జిల్లానుండి గుంటూరు జిల్లా వరకు గోదాంల నిర్మాణాలను నిర్మిస్తామన్నారు. రాయలసీమ ప్రాంతంలో వేరుశెనగ పంట అధికంగా ఉందని అన్నారు. ఈ ఉత్పత్తులను గిడ్డంగుల్లో నిల్వ చేసుకోవాల్సిన అవసరముందన్నారు.

బిడ్డలకు ఉరి వేసి ఆత్మహత్యకు పాల్పడిన తల్లి


కల్పన(ఫైల్‌ఫొటో)

లేపాక్షి, జనవరి 30 ప్రభాతవార్త: నీకు పుట్టిన ఇద్దరూ ఆడపిల్లలే.. మగ పిల్లలు కాలేదు.. అంతేకాకుండా అదనపు కట్నం కింద బంగారం తేకపోతివి.. నీవు ఛస్తే పీడ విరగడ అయితుందంటూ నిత్యం కట్టుకున్న భర్త, అత్త వేధింపులు తాళలేక జీవితంపై విరక్తి చెంది తన ఇద్దరి ఆడబిడ్డలకు తానే ఒకే తాడుతో ఉరి వేసి ఆపై తాను కూడా ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన దారుణ సంఘటన అనంతపురం జిల్లా లేపాక్షి పోలీస్‌స్టేషన్ పరిధిలోని నాయనపల్లి గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్ఐ ఆంజనేయులు, గ్రామస్తులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. తల్లి తన ఇద్దరి కుమార్తెలతో సహా ఆత్మహత్య చేసుకున్న సంఘటన కలకలం రేపింది. మృతురాలు కల్పన(29), తన ఇద్దరు కుమార్తెలు మేఘన(6), భవ్య(4)లతో కలిసి ఇంటిలోనే ఉరి వేసుకున్న సంఘటన చోటు చేసుకోవడంతో గ్రామంలో విషాద ఛాయలు నెలకొన్నాయి. సోమందేపల్లి మండలం తుంగోడు గ్రామానికి చెందిన శివాచారి కుమార్తె కల్పనతో వీరభద్రాచారికి తొమ్మిదేళ్ల క్రితం వివాహం జరిగింది. మృతురాలి కల్పన భర్త వీరభద్రాచారి తరచూ గొడవపడు తుం డేవాడని, అదనపు కట్నం కిం ద బంగారం తే వాలని భర్తతో కలిసి ఆమె అత్త కూడా వేధిస్తుండేదని అన్నారు. రెండురోజుల క్రితం పుట్టినింటి నుంచి తల్లిదండ్రులు వచ్చి సర్దిచెప్పి వెళ్లారు. ఇంతలోనే ఈ విషాద సంఘటన జరిగింది. స్థానికులు ఈ విషయాన్ని ఎస్ఐ ఆంజనేయులుకు సమాచారం అందించగా ఆయన హుటాహుటిన అక్కడికి చేరుకుని సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

వింత ఆచారంతో గ్రామం ఖాళీ

తాడిపత్రి, జనవరి 30 ప్రభాతవార్త : వింత ఆచారంతో 24 గంటలు గ్రామం ఖాళీ చేసి వేరొక చోట వంటావార్పు చేసుకుని గడిపిన వింతైన సంఘటన అనంతపురం జిల్లా తాడిపత్రి మండలంలోని తలారిచెరువు గ్రామంలో మంగళవారం అర్ధరాత్రి నుండి బుధవారం అర్ధరాత్రి వరకు చోటు చేసుకుంటుంది. వివరాలు ఇలా వున్నాయి. తాడిపత్రి పట్టణానికి 12 కిలోమీటర్ల దూరంలో పెన్నాసిమెంట్స్ ఫ్యాక్టరీ పక్కనే ఊరుచింతల పంచాయతీలోని మజారాలో వున్న తలారిచెరువు. ఈ వింత ఆచారం వెనుక ఓ కథ వుంది. ఆ గ్రామంలో 400 సంవత్సరాల క్రితం పిల్లలు పుట్టి వెంటనే మృతి చెందడం జరుగుతుండేది. గ్రామంలో అన్ని సమస్యలు ఉత్పన్నమవుతుండడంతో పాటు పంటలు పండక, ఆర్థికంగా గ్రామస్తులు తీవ్ర ఇబ్బందుల పాలయ్యేవారు. ఇది గమనించిన కొంతమంది గ్రామస్తులు చిత్తూరు జిల్లాలోని చంద్రగిరి గ్రామంలోని జ్యోతిష్యుని వద్దకు వెళ్లారు. జ్యోతిష్యుడు వారు చెబుతున్న మాటలు ఆలకించి మీ గ్రామంలో మాఘమాసం నెల చతుర్దశి రోజు అర్ధరాత్రి నుండి పౌర్ణమి రోజు అర్ధరాత్రి వరకు గ్రామంలో ఎలాంటి అగ్గి వెలిగించకుండా ఊరు విడిచి దక్షిణవైపు వెళితే మీ సమస్యలు పరిష్కారమవుతాయని చెప్పారు. జ్యోతిష్యుని మాటలు విన్న గ్రామస్తులు అప్పటి నుండి ప్రతి ఏటా మాఘమాసం చతుర్థశి రోజు అర్ధరాత్రి 12గంటల సమయంలో ఇళ్లకు తాళాలు వేసి గ్రామస్తులతో పాటు పశుసంపదతో ఊరికి దక్షిణం వైపు వున్న హాజివలి దర్గాలో బసచేయడం ప్రారంభించారు. మరుసటి రోజు భోజనం చేసిన తరువాత సాయంత్రం గ్రామానికి వెళ్లి అర్ధరాత్రి వరకు విద్యుత్‌బల్బులుగాని, అగ్గిగాని, కనీసం వాహనాలు లైట్లు వేసుకోకుండా నిషేధించారు.

దాయాదులను చిత్తు చేసిన యువ భారత్

69పరుగులకే కుప్పకూలిన పాకిస్థాన్
203 పరుగుల తేడాతో ఘన విజయం
శనివారం ఆస్ట్రేలియాతో ఫైనల్‌లో పోరు

ప్రభాతవార్త స్పోర్ట్స్ ప్రతినిధి: అండర్ 19 ప్రపంచకప్‌లో యువభారత్ మరోమారు అదరగొట్టింది. లీగ్ దశలో చూపించిన జోరును సెమీస్‌లోనూ కొనసాగించింది. న్యూజిలాండ్ వేదికగా జరుగుతోన్న ఐసిసి అండర్ 19 ప్రపంచ కప్‌లో చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్‌ను ఘోరంగా ఓడించి టైటిల్‌కు భారత జట్టు అడుగు దూరంలో నిలిచింది. భారత బౌలర్ల దాటికి 69 పరుగులకే పాక్ చాప చుట్టేసింది. పాకిస్తాన్‌తో జరిగిన రెండ సెమీఫైనల్లో భారత్ 203 పరుగుల తేడాతో భారీ విజయం సాధించింది. దీంతో చిరకాల ప్రత్యర్థిని చిత్తుగా ఓడించి ఫైనల్‌కు అర్హత సాధించింది. ఈ టోర్నీలో ఒక్క మ్యాచ్ కూడా ఓడిపోకుండా ఫైనల్‌కు దూసుకెళ్లిన భారత్ శనివారం ...ఫైనల్‌లో ఆస్ట్రేలియాతో అమీతుమీ తేల్చుకోనుంది. భారత్ ప్రపంచకప్ ఫైనల్‌కు చేరడం ఇది ఆరోసారి కాగా... అండర్ 19 ప్రపంచకప్‌లో వరుసగా రెండో సారి భారత్ ఫైనల్‌కు చేరినట్లైంది. ప్రపంచ కప్‌ను చెరో మూడు సార్లు గెలుచుకుని సమ ఉజ్జీలుగా ఉన్న భారత్, ఆస్ట్రేలియా జట్ల మధ్య ఫైనల్ జరగనుండటంతో తుదిపోరు మరింత ఆసక్తిగా మారింది. ఫిబ్రవరి 3న భారత్ ఫైనల్లో ఆస్ట్రేలియాతో తలపడనుంది.

దాయాదుల పోరు సాగిందిలా....

అండర్ 19 ప్రపంచ కప్‌లో భాగంగా భారత్, పాకిస్తాన్ దాయాది జట్ల మధ్య న్యూజిలాండ్‌లోని క్రిస్ట్‌చర్చ్‌లో మంగళవారం సెమీఫైనల్ పోరు జరిగింది. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన భారత ఓపెనర్లు చక్కటి శుభారంభం ఇచ్చారు. కెప్టెన్ పృథ్వీషా, మన్‌జోత్ కల్రాతో కలిసి తొలి వికెట్‌కు 89 పరుగులు జోడించారు. దూకుడుగా ఆడే క్రమంలో పృథ్వీషా 41 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద రనౌట్‌గా వెనుదిరిగాడు. ఆ తర్వాత మరో ఓపెనర్ కల్రా అర్ధ సెంచరీకి చేరవయ్యే క్రమంలో 47 పరుగుల వద్ద పెవిలియన్‌కు చేరాడు. దీంతో 94 పరుగులకు టీమిండియా రెండు వికెట్లు కోల్పోయింది. అనంతరం క్రీజులోకి వచ్చిన శుభమాన్ గిల్ ఇన్నింగ్స్ మ్యాచ్‌కే హైలెట్‌గా నిలిచింది. వన్‌డౌన్‌లో బ్యాటింగ్‌కు దిగిన శుభ్‌మన్ గిల్ మొదటి నుంచి దూకుడుగా ఆడటం ప్రారంభించాడు. 94 బంతుల్లో 102 పరుగులతో సెంచరీని నమోదు చేసి నాటౌట్‌గా నిలిచాడు. ఇందులో 7ఫోర్లు ఉన్నాయి. గిల్‌తో కలిసి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దిన దేశాయ్(20) జట్టు స్కోరు 148 పరుగుల వద్ద పెవిలియన్‌కు చేరాడు. ఆ తర్వాత బ్యాటింగ్‌కు దిగిన రాయ్ 45 బంతుల్లో 33 పరుగులు చేశాడు. అర్థశతకం దిశగా అడుగులు వేస్తోన్న క్రమంలో మహ్మద్ ముసా చేతికి చిక్కాడు. 45ఓవర్‌లో రాయ్ అవుట్ కావడం ఆ తర్వాత బ్యాట్స్‌మెన్ నుంచి సరైన సహకారం లేకపోవడంతో టీమిండియా నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 272 పరుగులు చేసింది. గిల్ సెంచరీ సాధించిన భారత్ భారీ స్కోరు సాధించే అవకాశాలు కోల్పోయింది. పాకిస్తాన్ బౌలర్లలో మహమ్మద్ ముసా నాలుగు, అర్షద్ ఇక్బాల్ మూడు వికెట్లు తీశారు. అనంతరం 273 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన పాకిస్తాన్‌కు ఆరంభం నుంచే కష్టాలు మొదలయ్యాయి. భారత బౌలర్ల పదునైన బంతులకు పాక్ బ్యాట్స్‌మెన్ తలవంచారు. జట్టు మొత్తం వంద పరుగులు కూడా దాటలేకపోయిందంటే భారత బౌలర్లు ఏ విధంగా చెలరేగిపోయారో అర్థం చేసుకోవచ్చు. యువ బౌలర్ పోరెల్ దాటికి పాక్ బ్యాట్స్‌మెన్ అల్లాడిపోయారు. నిప్పుల చెరిగే బంతులతో పాక్ బ్యాట్స్‌మెన్‌ను వణించించాడు. మొత్తం నాలుగు వికెట్లు పడగొట్టి పాక్ పతనాన్ని శాసించాడు. ఆట ఆరంభంలోనే నాలుగో ఓవర్‌లోనే ఓపెనర్ మహమ్మద్ జైద్ అలమ్ (7) ఔటయ్యాడు. చక్కని బంతితో ఇషాన్ పోరెల్...అలమ్‌ను పెవిలియన్‌కు పంపాడు. ఆతర్వాత ఇషాన్ చెలరేగిపోయాడు. 10 పరుగుల వద్ద తొలి వికెట్ కోల్పోయిన పాక్



తర్వాత ఏదశలోనూ కోలుకోలేకపోయింది. ఇషాన్ పోరెల్ వరుసగా మరో మూడు వికెట్లు తీసి పాక్‌ను కోలుకోనివ్వకుండా చేశాడు. ఆరు ఓవర్లకు 17 పరుగులిచ్చి నాలుగు వికెట్లు తీశాడు. ఓపెనర్లు ఇమ్రాన్ షా (2), మహ్మద్ జైద్ (7)లతో పాటు అలీ జర్యబ్ ఆసిఫ్(1) పోరెట్ ధాటికి ఐదు ఓవర్లకే పెవిలియన్ బాట పట్టారు. దీంతో 12 ఓవర్లలో 28 పరుగులకే పాక్ 4 కీలకమైన వికెట్లు కోల్పోయింది. ఆ తర్వాత పరాగ్ కూడా చెలరేగి రోహైల్ నజీర్ (18), హసన్ ఖాన్ (1)ను వెంటవెంటనే పెవిలియన్‌కు పంపాడు. 25 ఓవర్లు ముగిసేసరికి 8 వికెట్లు కోల్పోయి 48 పరుగుల మాత్రమే చేసింది. దీంతో కనీసం 50 పరుగులైనా సాధిస్తుందాఅన్న అనుమానం కలిగిం ది. ఆ తర్వాత షాద్ ఖాన్ (15) కాసేపు నిలబడే ప్రయత్నం చేసినా వికెట్ కీపర్ దేశాయ్ అతడిని స్టంపౌట్ చేశాడు. దీంతో దాదాపు పాక్ ఓటమిని ఖాయం చేశాడు. చివర్లో అర్షద్ ఇక్బాల్‌ను అభిషేక్ శర్మ ఔట్ చేయడంతో పాక్ 69 పరుగులకే ఆలౌటైంది. భారత బౌలర్లలో ఇషాన్ పోరెల్ అత్యధికంగా నాలుగు వికెట్లు పడగొట్టాడు. స్పిన్నర్లు శివ సింగ్, రియాన్ పరాగ్ తలో రెండేసి వికెట్లు తీశారు. ఆల్‌రౌండర్ సుధాకర్ శర్మకు ఒక వికెట్ దక్కింది. పేసర్ కమలేష్ నాగర్‌కోటిపై భారీ అంచనాలు ఉన్నప్పటికీ అతనికి ఒక వికెట్ కూడా దక్కలేదు. అయితే అద్భుతమైన స్పెల్‌తో ఆకట్టుకున్నాడు. మొత్తం 5 ఓవర్లు వేసిన నాగర్‌కోటి కేవలం 7 పరుగులు మాత్రమే ఇవ్వడం విశేషం. సెంచరీ చేసిన శుభ్‌మన్ గిల్‌కు ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు దక్కింది.

బౌలర్లు చెలరేగారు....

మ్యాచ్ మొదట్లో పాక్ బౌలర్లు కూడా కట్టుదిట్టంగా బౌలింగ్ చేశారు. ఓ వైపు శుభ్‌మన్ గిల్ చెలరేగి ఆడుతున్నా...అవతలి ఎండ్ బ్యాట్స్‌మెన్‌లను వరుసపెట్టి పెట్టి పెవిలియన్ పంపి భారత్ భారీ స్కోరు సాధించకుండా అడ్డుకున్నారు. అయితే పాక్ బ్యాట్స్‌మెన్ మాత్రం అవకాశాన్ని సద్వినియోగించుకోలేకపోయారు. మహ్మద్ ముసా ఏకంగా 4 వికెట్లు, అర్షద్ ఇక్బాల్ 3 వికెట్లు చేజిక్కించుకున్నారు.

స్కోరు బోర్డు:

అండర్-19 భారత్ ఇన్నింగ్స్: పృథ్వీషా (42బంతుల్లో 3ఫోర్లు, ఒక సిక్సర్‌తో 41 పరుగులు), మన్‌జోత్ కల్రా (59 బంతుల్లో 7ఫోర్లతో 47 పరుగులు), శుభ్‌మన్ గిల్ (94 బంతుల్లో 7ఫోర్లతో 102 పరుగులు నాటౌట్), దేశాయ్ (34 బంతుల్లో ఒక ఫోర్‌తో 20 పరుగులు), పరాగ్ (5బంతుల్లో 2 పరుగులు), అభిషేక్ శర్మ (9బంతుల్లో 5 పరుగులు), ఏఎస్ రాయ్ (45 బంతుల్లో 4ఫోర్లతో 33 పరుగులు), నాగర్ కోటి (6బంతుల్లో 1 పరుగు), పోరెల్ నాటౌట్ (1పరుగు) : మొత్తం 50 ఓవర్లలో 272/9

పాక్ బౌలింగ్: మహ్మద్ ముసా (10-0-67-4), అర్షద్ ఇక్బాల్ (10-0-51-3), షాహిన్ షా అఫ్రిది (10-0-62-1), హసన్ ఖాన్ (10-0-46-0), మొహమ్మద్ తాహా (7-0-35-0), అలీ జరియబ్ ఆసిఫ్ (3-0-11-0)

అండర్ 19 పాకిస్తాన్ ఇన్నింగ్స్: ఇమ్రాన్ షా (14 బంతుల్లో 2 పరుగులు), మహమ్మద్ జైద్ ఆలమ్ (10బంతుల్లో ఒక ఫోర్‌తో 7 పరుగులు), రోహాలీ నజీర్ (39 బంతుల్లో 18 పరుగులు), అలీ జరియబ్ ఆసిఫ్ (9బంతుల్లో 1 పరుగు), అహ్మద్ అలమ్ (15బంతుల్లో ఒక ఫోర్‌తో 4 పరుగులు), మహ్మద్ తాహా (23 బంతుల్లో 4 పరుగులు), షాద్ ఖాన్ (33బంతుల్లో ఒక ఫోర్‌తో 15 పరుగులు), హసన్ ఖాన్ (5బంతుల్లో ఒక పరుగు), షాహీన్ షా అఫ్రిధి (0), మహ్మద్ ముసా (14బంతుల్లో ఒక ఫోర్, ఒక సిక్సర్‌తో 11 పరుగులు నాటౌట్), అర్షద్ ఇక్బాల (4బంతుల్లో ఒక పరుగు), ఎక్స్‌ట్రాలు 5(నోబాల్ 2, వైడ్ 3) : మొత్తం 29.3ఓవర్లలో 69 ఆలౌట్.

భారత్ బౌలింగ్: పోరెల్ (6-2-17-4), శివ సింగ్ (8-0-20-2), పరాగ్ (4-1-6-2), శివమ్ మావి (4-3-6-0), నాగర్ కోటి (5-1-7-0), రాయ్ (2-0-11-1), అభిషేక్ శర్మ (0.3-0-0-1)

ఫిబ్రవరి 3న ఫైనల్...

చిరకాల ప్రత్యర్థిని చిత్తుగా ఓడించి ఫైనల్‌కు అర్హత సాధించింది. ఫిబ్రవరి 3న జరిగే ఫైనల్లో ఆస్ట్రేలియాతో భారత్ తలపడనుంది. ఇప్పటివరకు భారత్ ఆస్ట్రేలియా జట్టు చెర మూడు సార్లు ప్రపంచ కప్‌లను గెలుచుకోవడం ఈ ఫైనల్ మ్యాచ్ అభిమానులకు మరింత కనువిందు చేయనుంది.

వెల్లివిరిసిన క్రీడాస్ఫూర్తి



మంగళవారా మ్యాచ్ జరుగుతున్న సమయంలో ఇరుజట్ల ఆటగల్లు ఒకరికి ఒకరు సహాకరించుకుంటున్న దృశ్యం

క్రైస్ట్‌చర్చ్: అండర్ 19 వన్డే ప్రపంచకప్‌లో భాగంగా భారత్-పాకిస్తాన్ జట్ల మధ్య జరిగిన సెమీఫైనల్ మ్యాచ్‌లో క్రీడాస్ఫూర్తి వెల్లివి రిసింది. మైదానంలో ఇరు దేశాల యువ ఆట గాళ్లు పరస్పరం సహకరించుకున్న తీరు క్రీడాభిమానులను ఆకట్టుకుంది. భారత బ్యాట్స్‌మెన్ శుభ్‌మాన్ గిల్ సెంచరీకి చేరువైన సమయంలో అతడి షూ లేసు ఊడిపోవడంతో పాకిస్తాన్ ఫీల్డర్ కట్టాడు. అలాతే తమ ప్రత్యర్థి షూ లేసు ఊడిపోయినప్పుడు భారత ఫీల్డర్ సహాయం చేశాడు. సెంచరీ పూర్తి చేసిన శుభ్‌మాన్ గిల్ దగ్గరకు వచ్చి పాకిస్తాన్ ఆటగాళ్లలో చాలా మంది అతడిని అభినందించారు. కీలక మ్యాచ్‌లో ఎంత ఒత్తిడి ఉన్నప్పటికీ ఇరు జట్ల ఆటగాళ్ల ప్రదర్శించిన క్రీడస్ఫూర్తి అభిమానుల మనసు గెలుచుకుంది. ఈ ఫోటోలను అభిమానులు సామాజిక మాధ్యమాల్లో షేర్ చేసి ప్రశంసలు కురిపించారు. మ్యాచ్ ఫలితం ఎలా ఉన్నా యువ ఆటగాళ్ల తమ ప్రవర్తనతో మంచి సందేశం ఇచ్చారని పేర్కొన్నారు. భారత్-పాక్ క్రికెటర్లు ప్రత్యర్థులు మాత్రమే, శత్రువులు కాదంటూ కామెంట్లు పెట్టారు. మరోవైపు పాకిస్తాన్‌పై ఘన విజయం సాధించి ఫైనల్లోకి దూసుకెళ్లిన యువ టీమిండియాపై సోషల్ మీడియాలో అభినందల వర్షం కురుస్తోంది.

భారత్ కుర్రాళ్లు శభాష్

ద్రవిడ్‌కు ధన్యవాదాలు తెలిపిన బిసిసిఐ తాత్కాలిక అధ్యక్షుడు సికె ఖన్నా

న్యూఢిల్లీ: అండర్ 19 ప్రపంచకప్‌లో పాకిస్తాన్‌ని మట్టికరిపించిన భారత జట్టుని భారత క్రికెట్ నియంత్రణ మండలి (బిసిసిఐ) తాత్కాలిక అధ్యక్షుడు సికె ఖన్నా అభినందించారు. పాక్‌పై భారత్ 203 పరుగుల తేడాతో ఘన విజయం సాధించిన ఫైనల్లో భారత జట్టు ఆస్ట్రేలియాను ఢీకొట్టనుంది. ప్రపంచకప్ ఫైనల్‌కి చేరిన భారత్ అండర్ 19 జట్టుకి, కోచ్ రాహుల్ ద్రావిడ్‌కి అభినందనలు. భావి క్రికెటర్లని రాహుల్ ద్రావిడ్ అద్భుతంగా తయారు చేస్తున్నాడు. అతను కోచ్‌గా ఉండటంతో అండర్ 19 ప్రపంచకప్‌లో ప్రతిభావంతమైన క్రికెటర్లు ఉన్న భారత జట్టుగా భారత్ నిలిచింది. ఫైనల్‌కు చేరిన భారత జట్టుకి నజరానాతో పాటు సన్మానం ఏర్పాటు చేస్తామని సికె ఖన్నా వెల్లడించారు.

కపిల్‌దేవ్‌ని ఎవరితోనూ పోల్చవద్దు అజారుద్దీన్

న్యూఢిల్లీ: భారత దిగ్గజ ఆల్‌రౌండర్ కపిల్‌దేవ్ ఎవరితోనూ పోల్చవద్దని మాజీ కెప్టెన్ మహ్మద్ అజారుద్దీన్ సూచించారు. గత ఏడాది కాలంగా టీమిండియా నయా ఆల్‌రౌండర్ హార్థిక్ పాండ్యాను కపిల్‌తో పోలుస్తూ మాజీ క్రికెటర్లు ప్రశంసలు కురిపిస్తున్న విషయం తెలిసిందే. ముఖ్యంగా దక్షిణాఫ్రికా పర్యటనలో కఠినమైన కేప్‌టౌన్ పిచ్‌పై సఫారీ బౌలర్లకి ఎదురునిలిచి...హార్థిక్ పాండ్యా చేసిన 93 పరుగుల ఇన్నింగ్స్‌కి అంతా ఫిదా అయ్యారు. కపిల్‌దేవ్ స్వయంగా ఆ టెస్టులో హార్థిక్ పాండ్యా ప్రదర్శన గురించి మీడియతో ప్రత్యేకంగా మాట్లాడారు. కానీ...మరో కపిల్ దేవ్ వచ్చే అవకాశమే లేదని అజారుద్దీన్ స్పష్టం చేశారు. హార్థిక్ పాండ్యాని కపిల్‌దేవ్‌తో పోల్చడం సమంజసం కాదు. ప్రస్తుత పరిస్థితుల్లో మరో కిపిల్ వచ్చే అవకాశం కూడా లేదు. ఎందుకంటే అప్పట్ల అతను జట్టు కోసం పడిన కష్టం...మోసిన బాధ్యతలు అలాంటివి మరి. రోజులో కపిల్ 20-25 ఓవర్లు బౌలింగ్ చేసేవాడు. ఇప్పుడు ఎంత మంది బౌలర్లు అన్ని ఓవర్లు బౌలింగ్ చేయగలరు..? అని అజారుద్దీన్ ప్రశ్నించారు. వారు లయ తప్పకుండా బౌలింగ్ చేస్తూ సఫారీ బ్యాట్స్‌మెన్‌ని ఒత్తిడిలోకి నెట్టగలిగారు. తొలి రెండు టెస్టుల్లో టీమిండియాకి టైమ్ కలిసిరాలేదు. అందుకే సిరీస్‌ను చేజార్చుకుందని ఈ మాజీకెప్టెన్ వివరించారు.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act. Regd.: No.HSD/337/18-20 **Air Surcharge:** Delhi : 40 Ps.